భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

★

జూన్ 1965

★

సంపుటము 42 : : సంచిక 6

విడిప్రతిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

జూన్ 1965


వస్తున్నది
యస్.ఆర్. మూవీస్ వారి
ప్రమీలార్జునీయము
దర్శకుడు:
యం. మల్లిఖార్జునరావు
నిర్మాతలు
ఆదిబాబు · నాగమణి
రచన·పింగళినాగేంద్రరావు · సంగీతం·పెండ్యాల · ఛాయ·రవికాంత్, రహిమాన్
కళ·గోఖలే · నృత్యం·పసుమర్తి, హీరాలాల్

భక్తినీరగ ప్రణమిల్లి ప్రస్తుతించి,
మంత్రివర్యుల వైపుగా మరలి, "దేవ
దేవుడ-బికాధవుడ యీతీరు జూపె
అనయమును తన్ను గొల్వుమన్నట్లు గాదె?"

అని పలికి లింగమును గొని, యలతిభక్తి
మంత్రివర్యులు, నితరసామంతజనులు
భజనమొనరింపుచుండ సద్భక్తినీర,
కాలినడకల పురి జేరగనియె నతడు.

చేరి వాస్తుశాస్త్రజ్ఞుల, శిల్పివరుల,
కవుల, భక్తుల, గాయకాగ్రగణుల, జనుల
నెల్లవారల తోడ చర్చించి మించి,
ఆలయము వెలయజేసె నత్యద్భుతముగ.

విరుప డరీతి కార్యతత్పరత నుండ,
ఖర్చువెచ్చాలు పెరిగె బొక్కసము తరిగె;
ఆలయము దివ్యవైభవ శ్రీల దనరె;
యాత్రికులు భక్తజనులు తుష్టాత్ములైరి.

ఓర్వలేనివారు, ఉన్నతపదవుల
నున్నవారు, ఇంచు రున్నమాట
నుగుగు రుచిలేని మాయమాటలు
నాకేటుక జేసి రట్టిమెడల.

రాయలు పుత్రశోకమున రాపిడి నొందినవాడు, పెద్ద య
న్యాయమటంచు, రాజ్యపుధనమ్ములు దుర్వ్యయ మాయెనంచు కో
పాయతమూర్తియై, కరులపల్కులు నెమ్మదినుంచి, "ఇట్టివా
డ ? యిటు జేసెనా విరుప?" డంచును శిక్షవిధించె నీగతిన్:

"బొక్కసపు ధనముల మాదు ముద్ర గొనక,
వ్యయమొనర్పుట దండనపాత్రమైన

విరుపడు

విరుపసామంతునకు తగు విధము కాన,
కనులు పీకించుటగును శాసనపు తీరు."

అకలంక హృదయుడగుచున్
సుకవి జనామరతరు వగుచుం దనరెడు వా
డకటా! వితరణ మొనరిం
పక నిలుచునె? యని విరూప వల్లభుడు వెసన్.

తిరిగమూర్తిని జేరి సాష్టాంగముగను
ప్రణుతి యొనరించి పలికెను బాధమీర;
"ఎప్పు డేజన్మ తప్పొనరించినానొ?
ఇట్టి దండన మీరావు విధించినావు!
రాజుపేరున నాజ్ఞలు వ్రాసినావు!
కాక మారాయ డింతటి కఠిను డగునె?"

అని పలుమారు పల్కి "యిదియంతయు నీవ విధించి"తంచు, "నీ
గనగల భాగ్యమె"ల్లనుచు, "కర్మను దాటగ రాద"టంచు, కి
మ్మన కొక రెప్పపాటున తటాలున కన్నులు రెండు పీకి "చే
కొని నను వద్ద చేర్పుము ప్రభూ"యను చూపిరి వీడె నోడకన్.

విరూపవల్లభు డానాడు నిరుపమాన
లీల లేపాక్షి విభునిపాదాల చెంత
వదలిపోయిన కన్నులు వెదకుచుండు
నేటికిని ధర్మపథము నిర్నిద్రములయి.

వచనపద్యం: దాని స్వరూపం

సంపత్కుమార్

అన్నిటికన్నా మొదట 'వచన పద్యం' అనేది ఆధునిక ఛ్ఛందస్సు అని నిరూపించుకొని ముందుకు సాగటం మంచిది. పూర్వకవులు ప్రయోగించిన గీత్యాది పద్యాల్లో, గేయాలన బడే మాత్రా ఛందస్సుల్లో ఆధునికులు చూపిన రీతులూ, గమనాలూ నిజంగా చూస్తే, ఒక పరిధిలోకి లొంగిఉన్నవే. ఎవరెన్ని చమత్కారాలు చేసినా, ఎన్ని క్రొత్తగా భాసించే త్రోవలు త్రొక్కినా ఆ ఛందఃపరిధినిమాత్రం దాటిపోలేదు. పరిధిని దాటామనికానీ, దాటారనికానీ అనుకోవడం భ్రాంతి మాత్రమే. అదెల్లా భ్రాంతి అవుతుందో, నా 'తెలుగు ఛందో వికాసం'లో మాత్రా ఛందస్సులకు సంబంధించిన భాగం చూస్తే స్పష్టమవుతుంది. అందుకని ప్రస్తుతం చెప్పవలసిందేమిటంటే ఒకవిధంగా—ఒకవిధంగానేం?—నిజంగా, చెప్పుకుంటే ఆధునిక ఛ్ఛందస్సనేది 'వచన పద్యం' అవుతుందిగాని, అంతకుముందు మాత్రా ఛ్ఛందస్సుల్లో వచ్చిన మార్పులు కావు.

ఉదాహరణకు ఒక విషయం చూపిస్తాను. కంద పద్యం ఉంది. దానికి వరుసగా ఒకటి మూడు పాదాల్లో మూడూ, రెండు నాల్గు గణాలు కూడా గగ—భ—జ—స—నల అనే అయిదింటిలోనే కావాలి. ఇంకా చాలా నియమాలున్నా మొత్తం మీద చతుర్మాత్రాగణాలు ఉండాలనేది నిశ్చితమైన విషయం. ఉదా:—

'తేరా పలకా బలపము
ఈరా అయుగా రివేరి కింపల రంగా'—

ఇందులో నాలుగు మాత్రల గణాలు స్పష్టంగా విరువబడ్డాయి (ఈ పద్యం స్పష్టోదాహరణంకోసమేగాని కవిత్వంకోసం కాదు:) కాని ఈ క్రింది భాగం చూడండి—

"......మగువ పొలుపు తెలుపు సొక్క మారుత మొలిచెనో"

ఇది నాల్గవపాదం. అయిదు చతుర్మాత్రాగణా లుండాలి. కాని నాలుగు త్రిమాత్రాగణాలూ రెండు చతుర్మాత్రాగణాలూ మొత్తం ఆరు గణాలు ఉన్నాయి. ఇది ఒకవిధమైన మార్పేగదా! కాని ఈ మార్పు చేసినా పద్య లక్షణం చెడలేదు. స్పష్టంగా కన్పించే ఈ నాల్గు త్రిమాత్రా గణాలు మూడు చతుర్మాత్రా గణాలు (మగువపొ—లుపు తెలు—పు సొక్క) అవుతాయి. అనగా నడకలో మార్పు వచ్చినా, లక్షణం మారలేదు. ఇదే విధంగా మరికొన్ని మార్పులు—అంటే చెప్పబడని వేరే చతుర్మాత్రా గణాల నుపయోగించడం, గణాలకు బదులు మాత్రా సంఖ్యనే ప్రధానం చేయడం మొదలయినవి—చేసినా మరి కొంచెం ముందుకుపోయి ఆధునికులు చేశారు. అందువల్ల ఆధునికులు చేసిన ఈ మార్పులూ, చమత్కారాలూ అన్నీ 'ఆధునికులు చేశారని' చెప్పడానికే పనికివస్తాయిగాని ఆధునిక ఛ్ఛందస్సులుగా రూపొందలేవు. 'ముత్యాలసరం' అనే మారు పేరు పెట్టుకొన్న గురజాడ వ్రాసిన భామినీ షట్పదిగానీ, శ్రీ శ్రీ వ్రాసిన (శర) షట్పదీ భేదమైన 'మరో ప్రపంచం' గేయ ఛ్ఛందస్సుగానీ ఆధునిక ఛ్ఛందస్సులు కావు. శక్తిమంతుడైన కవి చేతిలో ఛందస్సు కూడా శక్తిమంతమవుతుంది. వాళ్ళు ప్రయోగించిన ఛందస్సులు ఆధునిక ఛ్ఛందస్సులు కావన్నంతలో ఆ కవుల శక్తిని శంకించడంకానీ, ఆ కవుల రచనలకు క్షతి కానీ ఏమీ లేదు. ఈవిధంగా పరిశీలిస్తే—ఒకానొక విధంగా 'స్వతంత్ర' రూపంతో వచ్చిన వచన పద్యమే 'ఆధునిక ఛ్ఛందస్సు' అవుతున్నది.

అయితే ఈ వచన పద్యం ఎల్లా రూపొందింది? ఒక్కసారిగా ఆకాశంలోం చూడిపడిందా? అదికాదు. దీనికి ఒక విధమైన పరిణామం ఉన్నది. అది అచ్చంగా ఛందో రూప

మైన పరిణామమే కానక్కరలేదు. భావ రూపమైన పరిణామం ద్వారా కూడా జరుగవచ్చు. ఇక్కడ ఒక విషయం ప్రస్తావించవలసిఉంది. పాల్కురికి సోమనాథుడు 'ద్విపద'ను స్వీకరించాడు. పాటలుగా జానపదుల్లో ఈ ద్విపద ఉంది. అయితే గ్రహించడానికి అతన్ని ప్రేరేపించిందేమిటి? ఒకవిధంగా ఆలోచిస్తే అక్షరగణబద్ధాలయిన ఉత్పల మాలాదులకన్నా దానికి గాన యోగ్యత అధికంగా ఉండడం ఒక కారణం. అంతేకాకుండా నాల్గు పాదాలుగల పద్యం కన్నా, రెండు పాదాలుగల ద్విపద చిన్న భావాన్ని గూడా చెప్పడాని కనువైంది. భావం పెద్దదయిన కొద్దీ పాదాలు పెంచుకోవచ్చు. తన కాలాన్ననుసరించి సోమనాథుడు ప్రాస నియమం పెట్టుకున్నాడు కాబట్టి ఆ పాదాల పెంపుదల పరిసంఖ్యలోనే చేయవలసి వచ్చింది. కాని ఆ తరువాత ద్విపదకు ప్రాస నియతిపోయి ఏర్పడ్డ మంజరీ ద్విపదలో ఈ పరిసంఖ్య కూడా నిశ్చితం కాకుండా పోయింది. ఒకటినుండి ఎన్ని పాదాలైనా వ్రాయవచ్చు. ఏదేమయినా పద్యంకన్న అధికంగా భావ వ్యక్తీకరణకు ద్విపద అనుకూలంగా ఉంటుందన్న ఉద్దేశ్యమే పాల్కురికిచేత దాన్ని స్వీకరింపజేసిందనవచ్చు. పాటల్లో స్వీకరించడం—అది దీర్ఘకాలంగా పాటింపబడడం—ఈ కారణాలుగా అది కూడా ఒక పద్యమేనన్న భావం నిర్ధారితమైంది.

ఇదిల్లా ఉండగా 'సింహగిరి వచనాలు', 'తాళ్లపాక వారి వచనాలు' అని కొన్ని ఉన్నవి. వాటి స్వరూపం ఏమిటి? అందులోఉన్న వచన పద్ధతి ఆనాటి వ్యావహారిక వచన పద్ధతి కాదని 'రాయువాచకం'వంటివాటిని చూచినా, గ్రాంథిక వచన పద్ధతి కూడా కాదని సముఖం వెంకటకృష్ణప్ప మొదలగు వారి వచన గ్రంథాలు చూచినా తెలుస్తుంది. పై వచనాలను పాడే వారట. కాని ఆ పాటల పద్ధతికీ, కీర్తనలు పాడే పద్ధతికీ తేడా ఉంది. ఇంతకూ ప్రధానాంశం ఏమిటంటే తాళ్లపాకవారూ, ఇతరులూ పద్యాలు రచించడం చేతకాక ఈవిధమైన వచనాలు రచించా రనడానికి వీల్లేదు. వారి పద్య రచనలు చాలా ఉన్నవి. అయితే వారు ఒకానొక నవీన రీతిలో తమ భావ వ్యక్తీకరణకు ప్రయోగం చేసినారు. కేవల పద్య బద్ధ మనస్కులయితే వారిలాగా చేసి ఉండేవారు కారు. పద్యేతర–కేవల వచనేతర మార్గంలో నడవడానికి చేసిన ప్రయత్నమే ఇది.

ఈవిధంగా చూస్తే భావానుసారంగా పద్యేతరమూ, వచనేతరమూ అయిన విధానం కొరకు ఒకానొక రీతిలో ప్రయత్నం సాగడం అనేది ఉన్నదని స్పష్టమవుతుంది. అయితే ఈ రీతి ఎంతవరకు ఫలించింది? ఎంతవరకు సాగింది? ఈనాడు దాని కున్న పరిస్థితులేమిటి?—అనేవి వివిధ చర్చనీయాంశాలే అయినా అప్రస్తుతాలు. కాగా పద్యేతర వచనేతర రీతికై ప్రయత్నం సాగిందనేదే ప్రధానాంశం.

ఈరకమైన ప్రయత్నమే ఆధునికంగా కూడా జరిగింది. భావకవులు పద్యాలు వ్రాసినా, పద్యాలకన్నా తక్కువ నియమాలు గల్గి ఆకర్షణీయంగా భాసించిన కారణాన గేయ స్వరూపాన్ని అధికంగా స్వీకరించారు. ఆ గేయంలో జన సామాన్యంలో ప్రచురమైన గేయ పద్ధతికి భిన్నమైన యతి ప్రాసాదుల నియత సంయోజనం, వివిధ యతిప్రాస భేదాల ప్రయోగం, పద్యంలోఉండే పాదాంత రాహిత్యం మొదలైన పద్య లక్షణాల నాపాదించి చాలావరకు సాగించారు. కొందరు స్వేచ్ఛాగేయాన్ని సంపూర్ణంగా స్వీకరించారు.

అదే పద్ధతిలో మరికొంత ముందుకుపోతే ఆ గేయత్వం కూడా వదిలివేయాలనే ఊహ కలుగడం ఒక క్రమమైన ఊహా పరిణామానికి చిహ్నమే. గ్రాంథిక భాషను వదిలి గ్రాంథిక వ్యావహారికాల కలగాపులగాన్నీ, వ్యావహారికాన్నీ విపులంగా ప్రయోగించడం స్పష్టమే కదా! ఈ విధమైన పరిణామాన్ని దృష్టిలో ఉంచుకొనే శ్రీ శ్రీ "గ్రాంథిక భాషను విసర్జించినట్లే ఈ గేయాలను కూడా మన కవులు ఎప్పుడు పరిత్యజిస్తారో! సాహిత్య పరిణామం గుర్తిస్తే ఇందుకు ఎంతోకాలం పట్టదనవచ్చు" అని అన్నారు. అట్లాంటి పరిణామంలోనే 'గేయాన్నికూడా వదిలిపెట్టా'లనే ఊహ సక్రమంగానే వచ్చింది.

అయితే గేయాన్ని వదలడం కేవల వచనాన్ని స్వీకరించడానికి గాదు. గేయంలోని నిబంధనలు పద్యంలోకన్నా తక్కువే అయినా ఆ నిబంధనలను గూడా వదిలివేయాలని చెప్పడం కోసమే. కేవల వచనాన్ని స్వీకరించడానికి గేయాన్ని వదలవలసిన అవసరం లేదు. మరి ఆ నిబంధనలన్నీ వదిలితే కేవల వచనం కాక మరే మవుతుంది అనవచ్చు. కాని వచనం కాకుండా స్వీకరిస్తేనే వచనంకన్నా అధిక గుణాలుకల ఒక స్వరూపం ఏర్పడుతుంది. పద్య గేయాల్లోఉన్న నియమాలు ప్రధానంగా గణాల నాధారంగా చేసుకొని, మాత్రల సంఖ్య నాధారం చేసుకొని, నియతంగా పాదాలు విభజించడం, పాదసంఖ్యను నియతం చేయడం, యతిప్రాసల్ని నియతంగా ఉపయోగించడం మొదలైనవి. వీటిలో 'నియతంగా' అనే పదం ఒకటి ఉన్నది. దాన్ని మాత్రం తొలగించాలి. అంటే, నియత గణా లక్కరలేదు గాని, గణాలుండడంవల్ల వచ్చే నడక ఉండాలి. నియత పాద విచ్ఛేదం అక్కరలేదుగాని, పాదాలుమాత్రం ఉండాలి. పాదసంఖ్య మాత్రం నియతం కారాదు. ఎన్నయినా పాదా లుండవచ్చు. యతిప్రాసలు నియతంగా ఉండనక్కరలేదు. అవసరాన్నిబట్టి, ఉపయోగించేవారి దృష్టినిబట్టి ఉండవచ్చు, ఉండకపోవచ్చు.

ఈవిధమైనదాన్నిబట్టి కేవలం వచనం కానట్టిదీ, కేవలం పద్యం కానట్టిదీ; అయినా కూడా రెండింటిలోని గుణా

అను వంతరించుకొన్నట్టిదీ అయిన ఒకానొక ఛందోరీతి ఏర్పడ్డది. దీనికి బాహ్యమైన కొన్ని కారణాలు కాకతాళీయంగా భాసించవచ్చు. కాని ఒక ఊహా పరిణామానికి మాత్రం ఇది చిహ్నంగా చెప్పవలసి ఉంటుంది.

ఈ 'ఆధునిక ఛ్ఛందస్సు' పేరు విషయంలో దీన్ని ఉపయోగించే, దీన్ని గూర్చి వ్రాసే వారిలో ఏకాభిప్రాయం కన్పించడంలేదు. 'వచన కవిత్వం', 'వచన గేయం', 'ముక్త ఛ్ఛందం', 'వచన పద్యం' అనే వేరు వేరు పేర్లతో వ్యవహరించడం జరుగుతున్నది. అయితే దీని అసలు సార్థక నామం ఏదో తెల్సుకోవడం అవసరం.

'వచన కవిత్వం' అనేపేరు ఏవిధంగానూ సరిపోదు. కవిత్వం అనేది ఒక గుణం. అది కేవలం పద్యంలోనూ ఉండవచ్చు. కేవలం వచనంలోనూ ఉండవచ్చు. వచన కవిత్వంఅంటే వచనంలోఉన్న కవిత్వం అనే అర్థమే వస్తుంది. కాని ఛందస్సుకు సంబంధించిన అర్థం రాదు. ఇదేవిధంగా 'వచనగేయం' అనే పేరు కూడా కుదురదు. గేయం అంటే పాడడానికి వీలయింది అని అర్థం. పాడడానికి వీలయిందనేప్పటికి సంగీతశాస్త్ర మర్యాదలు వచ్చిపడతాయి. కాదనుకుంటే ఏదోవిధంగా పద్యాన్ని పాడుతూనే ఉన్నారు. కేవలం వచనం కూడా పాడవచ్చు. పద్యేతర వచనేతరాలయినవాటి నన్నిటిని సామాన్యంగా గేయం అని పిలువడం జరుగుతున్నది. అలా అనడంలో మాత్రాఛ్ఛందస్సులమీదే, ప్రధానంగా రగడా స్వరూప తద్భేదాల దృష్టితో ఉంటున్నాయి. ఈ ఆధునిక ఛ్ఛందస్సు దానికన్నా భిన్నమైంది. అందువల్ల వచన గేయం అనే పేరు సరిపోదు. ఇక 'ముక్త ఛ్ఛందం' కూడా ఇంతే. ముక్తఛ్ఛందమంటే వదలబడిన ఛందస్సు గలది—అంటే ఛందస్సును వదిలిపెట్టింది—అని అర్థం. హిందీ కన్నడాదులలో దీనికీపేరే వ్యవహరిస్తున్నారు. కాని ఇది ఆధునికమైన ఒకానొక రీతిలోని ఛందస్సు అని భావిస్తూ ఛందస్సును వదిలిందని చెప్పడం సరికాదు. ఏవో కొన్ని ఛందస్సంబంధియైన అంశాలను అనుసరించడం జరుగుతూనే ఉంది. పాద విభజన స్పష్టంగా కనిపిస్తూనే ఉందిగదా! ఈవిధంగాచూస్తే, బహుళ ప్రచారంలోఉన్న 'వచన పద్యం' అన్న పేరే సార్థకమైందిగా కనిపిస్తుంది. వచనమూ, పద్యమూ రెండు వేర్వేరు లక్షణాలు కలవి. పద్యంఅంటే పాద విభజన యోగ్యమైంది అని అర్థం. వచనానికా యోగ్యత లేదు. ఆవిధంగానే వచనంలోని కొన్ని గుణాలు—గణబంధ రాహిత్యం మొదలైనవి—పద్యంలో లేవు. అందువల్ల వచనమూ, పద్యమూ అన్న రెండు ప్రక్రియలలోని విశిష్ట గుణాలతో రూపొందింది కాబట్టి వచన పద్య మన్నపేరే సార్థకమయింది. 'పద్యానికీ గద్యానికీ పెళ్లి' చేస్తే కలిగిన సంతానం 'వచన పద్యం.' వచనంలోని గణ— అనియతత్వంతోబాటు పద్యంలోని పాద విభజన ఈ ప్రక్రియలో కొట్టవచ్చినట్టు కన్పించే రెండు లక్షణాలు. ఇన్ని విధాలుగా పరిశీలిస్తే 'వచన పద్యం' అన్నదే ఈ ఆధునిక ఛ్ఛందస్సుకి సరైన పేరు.

ఈ పేరులో మరొక విధమైన సూచన ఉంది. ఆ సూచన దాన్ని ఉపయోగించే రచయితను గూర్చి. పద్య—వచన గుణాలు కొన్నికొన్ని సమేళనం పొందే కేంద్రంనుండి రచయిత ఏమాత్రం ఎటుప్రక్కకు జారినా, అయితే వచనకవి అవుతాడు, లేదా పద్యకవి అవుతాడు తప్ప 'వచన పద్య' కవి మాత్రం కాలేడు. అందుకనే 'వచన పద్యం' వ్రాసేవాళ్లు జాగ్రత్తగా ఉండవలసి ఉంటుంది.

ఇక, పద్యాల్లో సాధారణంగా గణాల సంయోజనంలోని ఒకానొక వైశిష్ట్యంవల్ల ఒక విధమైన నడక, తూగు, లయ సిద్ధిస్తవి. ఆ గణ సంయోజనం నియత పద్ధతిలో సాగుతుంది గాబట్టి సామాన్యంగా వాటి గతి సహజంగానే ప్రాప్తమవుతుంది. ఉదాహరణకు ఉత్పలమాలను చూడవచ్చు— ఉత్పలమాలలోని అన్ని పాదాల మొదటి గణం భగణం, చివరిది 'లగం' అవుతుంది. అది నియతం.

"రాజట ధర్మజుండు సుర
రాజ సుతుండట ధన్వి శాత్రవో
ద్వేజకమైన గాండివము
విల్లట సారథి సర్వభద్రుసం........"

ఈ పద్యం 'రాజట' అనే భగణంతో మొదలయింది. రెండవపాదం 'ద్వేజక' అనే భగణంతో మొదలైంది. 'ద్వేజక' అనేది అక్కడ పూర్తిపదంగాదు. అసలది 'ఉద్వేజక' అని. 'ఉద్వేజక'తోటే పాదం మొదలయియేట్టయితే భగణానికి బదులు పాదం మొదట తగణం నిలుస్తుంది. దానితో ఉత్పలమాల లక్షణమూ, నడకా చెడిపోతవి. అందుకని 'ఉత్' అనే దాన్ని మొదటిపాదం చివరకి పెట్టి, 'వేజక' అనే భగణంతోటే రెండవది ప్రారంభింపబడింది. (దీనికి ప్రాస నియమం కూడా ఒక కారణం.) ఇది పద్యంలో గణాల నియత సంయోజనం ద్వారా ఒక గమనాన్ని తూగుని సిద్ధింపచేసే పద్ధతి. ఇలా కాకుండా మరొకరకం ఉదహరిస్తాను—

"ప్రతిమాటకీ శక్తి ఉంది పదును ఉంది
ప్రతి మాటకీ అర్థం ఉంది ఔచిత్యం ఉంది"

—తిలక్. 'నవత—కవిత'

పైవి రెండు పాదాలు. ఈ రెండు పాదాలకూ సమంగా గణ విభజనగానీ, మాత్రావిభజనగానీ, మాత్రాగణ విభజనగానీ

గవేషణ

శ్రీ కె. వి. రమణారెడ్డి

పోయింది!

జాడ లేకుండా పోయింది; చెప్పి మరీ పోలేదు; పోయేది చెప్పి పోలేదు; పోతే పోయింది [illegible] [illegible]; [illegible] [illegible] [illegible]; [illegible] [illegible]; [illegible] [illegible] [illegible] [illegible]; [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible]; [illegible]; [illegible] [illegible]; [illegible] [illegible]; [illegible] [illegible] [illegible], [illegible] [illegible]; [illegible] [illegible], [illegible] [illegible].

పోయింది!

పోతే పోనీలే అనుకోలేను; పైగా [illegible] [illegible]; [illegible] [illegible] [illegible]? [illegible] [illegible], [illegible] [illegible], [illegible] [illegible], [illegible] [illegible], అలాంటివి అనేకం [illegible] [illegible], నాకు కావలసింది ఇదే; మరొకటి కాదిలాంటిది.

రంగు మారితే విలువ తగ్గేనా? [illegible] [illegible] [illegible]! [illegible] [illegible] [illegible] [illegible]! [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible]!

[illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible], [illegible] [illegible]; బజారులో ప్రియమైనదే [illegible] [illegible]; [illegible] [illegible] [illegible] [illegible]; [illegible] [illegible] [illegible]; పోయింది చిన్న వస్తువే అయినా కూడా [illegible] [illegible], [illegible], అన్వేషిస్తున్నాను.

అన్వేషణ! అమ్మను మహానగర వీధిలో పోగొట్టుకున్న అర్భకుణ్ణవుతున్నాను, ఆత్మను తాపత్రయాభీలలో కాన పోగొట్టుకున్న వృథా దేహి నౌతున్నాను, ఆనందాన్ని వృత్తి వ్యాపార శుష్క వ్యాపకాలలో పోగొట్టుకున్న శూన్యజీవనుణ్ణౌతున్నాను; అన్వేషించాలి; తప్పదు; లేకుంటే నాతనం పూర్తికాదు, నాతనానికి స్ఫూర్తి లేదు; ఇది అన్వేషణా? కాదు! సాధన, గవేషణ!

గవేషణ! గ్రంథాలయాన్ని గాలించి గజిబిజి చెందాను; గుప్తచేసుకోబోయి మనస్సును సందిగ్ధపు ఊబిలో దించాను; పుస్తకం వదలి పుస్తకాన్ని, పువ్వును వదలి పువ్వును ఆశ్రయించిన భ్రమరం లాగున, జ్ఞానమధువు కోరికని, ఆశ్రయించాను; ప్రవక్తను వదలి ప్రవక్తను, కాపురం మార్చి కాపురంపెట్టే పిల్లిలాగున, స్థిరత్వంకోసమై, అభిమానించాను; అనేకులను ఆశ్రయించాను; అనేకాలను అభ్యసించాను; నాకు కావలసింది అనేకం కాదు, ఏకైకం, అవిభాజ్య సత్యం, విరాడ్రూపి సౌందర్యం, బృహన్మూర్తి సౌజన్యం!

అనంతం సార్థక్యాన్ని అనుసరించే చోట, ఆలోచన సాఫల్యాన్ని అభిసరించే చోట, కారుణ్యానికి జీవన సరళి పల్లవి అయేచోట, కైవల్యానికి కల్మషరాహిత్యం పర్యాయపద మయేచోట, మనిషికీ మనిషికీ అభేదం స్థాపితమయే చోట, మనికి చక్కదనాల వసంత వనంగా మారేచోట, విజ్ఞానం విధ్వంసనానికి ప్రతివాచీ పరచనిచోట, వ్యక్తిత్వమనగా వికటత్వమని భాష్యం వెలువడనిచోట, స్వేచ్ఛకూ అరాజకానికి సరిహద్దులు కచ్చితంగా గుర్తింపు పొందనచోట, వ్యక్తి-నీతి జాతికి కూడా వర్తించేచోట, అక్కడక్కడా బలిసి పెరిగిన పాదపాలై కాకుండా ఇక్కడా అక్కడని లేక ఎల్లకడలకూ తీగవలె సంపదలూ సౌఖ్యాలూ సంతుష్టీ పుష్టీ వ్యాపించేచోట, అరణ్యహృదయాన ఉద్యానంగా నాగరికతాసాగరాన సంస్కృతిద్వీపంగా దీపస్తంభంగా నారుమడిగా పీఠిబడిగా వెలువారే చోట, మనస్సుల మొగలిపొదల వెనక మిణ్ణాగులై మాలిన్యాలు పొంచుండనిచోట, ముల్లు లేని గులాబీనై పాశవాంశవిడిచి మానవస్వభావం నిర్వక్ర రేఖగా నిగుడేచోట,

కథలలో వినబడి కలలలో కనబడే పగడాలదీవి-అదే కామ్యపదవి!

* * * *

దానిని తనకై తాను సాధించి తనివి చెందక తదితరులకు సూచించినవాని చిత్రపు,

తప్పిపోయింది అదే! ప్రపంచంతో సమసించి నా హృదయం దారితప్పిపోయింది తన్మూలంగానే!

ఆ చిత్రమూ నా చిత్తమూ, కొలతలే ప్రశస్తమైతే, విలువ అప్రధానమైతే, కడుంగడు చిన్నవే, లక్ష్యపెట్టదగనివే;

ఇంతకంటె ఉరువైనవాటికి ఇవి రెండూ రెండు ప్రతీకలు; ఇది నా ఒక్కడి నష్టం కాదు; ఇది నా ఒక్కడి చిత్రమూ కాదు.

దంతపుచట్రం ఖరీదుచేసి ఇంటికి మరలివచ్చి చిత్రం దాచివుంచినచోట జూచి అది కనిపించకపోతే ఎంతబాధ!

- యథార్థానికి ఆదర్శం సంపాదనాస్పదమైనప్పటి కఠిన నిస్పృహ; ఏపుగా పెరిగిన పైరు తరకపడినప్పటి కృషీవలుని కటకట; పూవుకూ తావికీ విడాకులైనప్పుడు తేధయులకూ ఘటిల్లే భంగపాటు; పూత పిందెగా ముదరక పడమటిగాడ్పుకు రాలినప్పుడు అవసిమాలి వనట; నవమాసాలు మోసి శిశువునుగాక వాని శవాన్ని నీళ్లాడినతల్లి తల్లి - తనానికి చిన్నదనం; ఎవరికీ వినబడనట్లు శాపంతగిలిన విమలగాంధర్వాన్ని ప్రసాదించక తప్పని వాని మనఃక్లేశం; మైదానంలో విహరించవలసిన పొగరెక్కిన కోడెదూడకు ములుకింపె అడ్డయినప్పటి స్తంభీకృత విజృంభణం; మేనుపెంచి మోరెదించి చాపచుట్టుగా తిరిగి చెలియలికట్టవైపుగా వచ్చే ఉత్తాల సాగర తరంగం నడిమి దారిలో మరో తరంగాన్ని తాకి గూలి వెనుదిరిగిపోయేప్పటి నిష్ఫలావేశం; ప్రయత్నానికీ ఫలితానికీ నడుమ దాటలేని అగడ్త హఠాత్తుగా కను దగిలినప్పుడు కలిగే నైరాశ్యం; ......

సామాన్యాలెన్నని చూపను? చెప్పేదిది - విధి సమస్త మానవజాతికీ ప్రతికూల శక్తి; తల పెట్టింది కొనముట్టేవరకూ నమ్మకం లేదు; అవాంతరాలు, అంతరాయాలు, అభ్యంతరాలు, అన్నీ విధిలీలలు; అదృష్టం దాని మారుపేరు; వైపరీత్యం దాని చెయిదం!

* * * *

రిక్తపడి బోసిగా దిబూసిగా ఉండి, వట్టి అస్థిపంజరంలాగా మిగులుపడి పోయింది నా దంతపు చట్రమే కాదు;

యావజ్జనతా జగత్తు జీవకళ కోల్పడి శూన్య దేవాలయంగా కనిపిస్తున్నది; చెరలో ఉన్నానని తెలియక సాహసం చూపుతున్నది; మెడకు ఉరి వుచ్చు తగులుకొన్నా ఉరుకుతున్నది ముందుకు, వ్యథలో ఉండే వేడుకలకై ఉవ్విళ్ళూరుతున్నది, మథితమై ఉండీ ప్రశాంతి నభిలషిస్తోంది;

అయ్యో! ఈ ప్రపంచం విధవరాలైపోయింది, వార్ధక్యం వచ్చింది, అస్తవ్యస్తం హెచ్చింది, అకటా వికటాలకు ఎగబడుతున్నది;

ఇది రెండవ బాల్యం కాబోలు? అయితే ఈ ముది మది తప్పిన వృద్ధ శిశువును ఆలించి పాలించే తలిదండ్రు లేరీ? ఏరీ రక్షకులు? వినయం నేర్పి విద్యను కరిపేవారేరీ?

* * * *

రుద్రాక్షలుగా ద్రాక్షాఫల గుళుచ్ఛాలుగా వృంతాకృతులై ఒత్తుగా ఒద్దికతో సమకూరిన ఉంగరాల జుత్తు, ఈ మానవ మోహన రూపంమీద సహజ కిరీటం లాగుంది;

శుభ్రంగా శాంతంగా అగాధమై సమున్నతమై విశాలంగా విశదంగా నీటుగా గోటుగా దిద్దినట్లున్న ఈ ముఖం, అమేయ ఆనందారామం, శాంత సామ్రాజ్యంలాగుంది;

పాప పుణ్యాలకూ తృష్ణా నిర్వాణాలకూ భూదివాలకూ కట్టిన వంపుల వంతెన లాగున్న కనుబొమలు, రావిచెట్టున పుట్టిన జమిలి కొమ్మలు, రూపాజీవ వాసవదత్తకూ రాజరాజ బింబిసారునకూ కాన్పించిన చీలు దారులు;

రెండైన క్షీరసాగరాలు, మెండైన సాయం శాంత జలాశయాలు, అర్ధముకుళితాలు, సౌజన్య స్నిగ్ధాలు, కారుణ్యాంబుదాలు, మానస సరోవరాన రాజహంసల బుభుక్షను పోకార్చే విమల కమల పుష్పాలు, విశద వియత్పథాల వెలిగే సువర్ణ తారకల కాటపట్లు, కార్తిక పూర్ణిమ ప్రసవించిన జంటబిడ్డలు, పావురాల కనుసీలాల గనులు, కనులు;

బారుగా తీరుగా సాగి మనోరంజనీ దళంవంటి ఓష్ఠంవద్ద ఆగిన సుకుమార నాసా శిల్ప విన్యాసం;

కించిన్మందహాసమూ కించిత్సాంత్వనమూ, ఒక కొంచెం జాలి ఇంకొక కొంచెం గేలి, కొంత ఔపనిషద నిర్మమం కొంత బోధిసత్త్వ ప్రమేయం కలగలిసి కూడా, విడిగా ఉన్న అధరోష్ఠాల సున్నిత సంపుటీకరణం నోరు;

లయల లయల్లేని వృత్తాల కొదగని గణాల గుణింతా లెరుగని మాత్రలను కూడా పట్టించుకోని అవిరళ సరళ ప్రవచనధారా మూలమై, సుభగమైన అంతర్లయాన్వితమై, ఆటోపదూరమై, అచ్చమై ఉచ్చమై, సులువై బలువై, చివురై చేవై, అతి కొత్తదై కడు పాతదై, శ్వాసై బాసై, మతమై హితమై, బాధపడినవాని బోధై, అనుకంప గలవాని చాటింపై, ఆపాదమస్తకం వెలుగై దలువై;

ఆ మహనీయ మానవ చిత్రం, గౌతమ బుద్ధునిది; అదే నేను కోల్పోయింది! అదే!

తనంత తానై పోలేదది; అలా పోయేదికాదు పొమ్మన్నా; నిర్లక్ష్యంవల్ల, విస్మృతివల్ల, నిరాదరణవల్ల, నిత్య నియమోల్లంఘనవల్ల, అయోగ్యతవల్ల, అశక్తతవల్ల, కల్లలవల్ల, కపటాలవల్ల, రక్తపాతంవల్ల, హింసారిరంసవల్ల, అది కనుమరుగై పోయింది;

పోగొట్టుకుంది నేనొక్కణ్ణే కాదు, ప్రపంచకం ప్రపంచకం సమస్తం ఆ దృశ్యాన్ని కళ్లముందునుంచి వెడలగొట్టి వెలికి నెట్టివేసింది; బోసి పడింది నా దంతపు చట్ర మొక్కటే కాదు, ప్రపంచకం ప్రపంచకం సమస్తం తన గుండె తడిని, చేతి విరివిని, హృదయ వైశాల్యాన్ని, బాహు వైపుల్యాన్ని, కోల్పోయి ఆత్మను వంచించుకొని సంకుచితమై స్వార్థదూషితమై క్రౌర్యమగ్నమై పోయింది;

ఈ ద్వేషాల చీకటి సందులో, ఈ అపనమ్మకాల గొందిలో, ఈ విరోధాల సందడిలో, విధ్వంసాల ముట్టడిలో—రండి వెదుకుదాం రండి, రసండీ;

శాంతిపేరిటి ఈ యుద్ధాలలో, స్వేచ్ఛ పేరిటి పరాధీనతలో, నయం పేరిటి దుర్నయంలో, నిరంతర మనశ్చాంచల్యంలో, జీవన శైథిల్యంలో—రండి, వెదుకుదాం, రసండీ;

పూవులు దూసి దానిముందు రాశిపోయ బనిలేదు, ధూపం వేయ మనదు, దీపం వెలిగించ నక్కరలేదు; గంటలు కొట్టి స్తోత్రాలు చెయ్య మనదు;

కను వెరగందే ఆ చిత్రాన్ని చూస్తే చాలదూ? కనుమరుగైన ఆ చిత్రాన్ని వెదికి తెచ్చి చట్రంలో ఉంచి రోజు కొకమారు చూస్తే చాలదా ?

దానిది నీరవ సందేశం; మార్మిక సంగీతం; అంతా మూగ భాష; చెవులున్న వారి కందరికీ వినబడుతుందిగాని, చవీ గురీ జత చేరాలి.

ఎక్కడ ఉందో అది? ఏమైపోయిందో? ప్రపంచం ఎలా, అది వినా, నిలుస్తుందో ?



విష్ణుకుండిన గోవిందవర్మ ఇంద్రపాలనగర తామ్రశాసనము

శ్రీ బి. ఎన్. శాస్త్రి

ఆంధ్రదేశ చరిత్రలో మహోజ్జ్వలముగ రాణించిన రాజవంశములలో విష్ణుకుండిన వంశ మొకటి. శాలంకాయనుల యనంతర మీ వంశీయులు రాజ్యము నెలకొల్పి క్రీస్తుశకము 5, 6 శతాబ్దాలలో నాంధ్రదేశమును పాలించిరి. ఆకాలముల దక్షిణాపథ పశ్చిమోత్తరములందు వాకాటక వంశీయులు రాజ్యమును విస్తరింపజేసి శక్తి సమన్వితులై యుండిరి. విష్ణుకుండిన మాధవవర్మ వాకాటక రాజకుమార్తెను వివాహమాడెను. విష్ణుకుండినులు బలవంతులైన రాజులతో సంబంధ బాంధవ్యముల నెరపి, తమ రాజ్యమును సురక్షిత మొనర్చుకొని పాలించుచుండిరి.

అట్టి విష్ణుకుండినుల చరిత్ర నిర్మాణమునకు సాధనము లనదగిన ఆరు తామ్ర శాసనములు, ఒక శిలా శాసనమును ప్రకటింపబడినవి. 1 ఈ శాసనములవలన విష్ణుకుండినులు 'దక్షిణాపథపతి' 'త్రికూట మలయాధిప', 'శ్రీ పర్వతస్వామి పాదానధ్యాత'లను బిరుదములు కలవారని, వారు తమ రాజ్యమును కృష్ణా, గోదావరి నదుల మధ్య ప్రాంతమందేకాక దక్షిణమునను విస్తరింపజేసిరని తెలియుచున్నది. ఈ వంశీయులకు సంబంధించిన శాసనములుగాని, నగరములుగాని తెలంగాణమున నున్నట్లింతవరకు తెలియదు. వేంగీపురము, దెందులూరు, బెజవాడ, వీరి కాలమున రాజధానులుగ నుండెడివి. కొన్ని ప్రసిద్ధ నగరము లా కాలమున నున్నట్లు తెలియుచున్నది. అట్టి నగరములలో ఇంద్రపాల నగర మతి ముఖ్యమైనది. ఈ నగరము తెలంగాణములో నున్నది.

ఇంద్రపాల నగరము

విష్ణుకుండినులనాటి(5, 6 శతాబ్దల కాలము)ఆంధ్రుల యౌన్నత్యమునకు పతాకయై నిలచిన ప్రాచీనాంధ్ర మహా నగరములలో నింద్రపాల నగర మొక్కటి. ఈ నగరము తర తరములనుండి శిథిలమై నేటికి నామమాత్రావశిష్టమై యున్నది. శిథిల నగర మిప్పటికిని స్పష్టముగ కనిపించుచున్నది.

నల్లగొండ మండలములోని రామన్నపేట తాలూకాకు పదుమైళ్ల దూరమున భువనగిరి నల్లగొండ రోడ్డు నానుకొని తుమ్మలగూడెమను గ్రామమున్నది. ఆ గ్రామమునంటి యొక చెరువున్నది. ఆఫ్‌నహర్ (కాలువ) ద్వారా ఆ చెరువులోనికి నీరు ప్రవేశించును. చెరువుకట్ట పొడవు సుమారు రెండున్నర మైళ్లుండును. ఆ చెరువుకట్ట నానుకొని రెండు మైళ్ళ పొడవును, చెరువుకట్టకు, మూసీనదిని అనుకొనియున్న ఇంద్రపాల గుట్టకును మధ్యగల సువిశాల ప్రదేశములో ఈ ప్రాచీనాంధ్ర మహా నగర శిథిలములున్నవి. ఇది యొక ప్రత్యేక స్థలముగ గన్పించుచున్నది. చుట్టు వరిపొలములు, మధ్యన ఎత్తుగనున్న విశాల ప్రదేశములో పెద్ద పెద్ద చింతచెట్లు తుమ్మలు, జీర్ణ దేవాలయములు, శిథిలములు, రాయిరప్పలు, చిన్న చిన్న గుళ్ళు ఇండ్ల అడుగులు, ఇటుకలు కనిపించును. దూరమునుండి చూచినను శిథిల నగర చిహ్నములను గుర్తింపవచ్చును. ఆ శిథిల

---

1 1. వేల్పూరు శిలా శాసనము — సౌ. ఇం. ఇ. వా. 10—1
2. ఈపూరు శాసనము — ఎ. ఇం. వా. 17 పుట 33
3. ఈపూరు శాసనము — ఎ. ఇం. వా. 8 పుట 337
4. రామతీర్థ శాసనము — ఎ. ఇం. వా. 12పుట133
5. చిక్కుళ్ళ శాసనము — ఎ. ఇం. వా. 4 పుట 193
6. పొలమూరు శాసనము ఆంధ్ర చరిత్రక పరిశోధక మండలి జర్నల్ వా—6 పుట 17
7. తుండి తామ్ర శాసనము ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పురాతత్త్వశాఖ సీరీస్ నం. 8.

చిహ్నములను, దేవాలయములను చూచిన ఆనాటి వైభవము కనులకు గట్టినట్లుండును.

మూసీనదికి అరమైలు దూరములో నాగవరమను గ్రామ మున్నది. నాగవరమునకు తుమ్మలగూడెమునకు మధ్యగల దూరము రెండు మైళ్ళు. ఇంద్రపాలగుట్ట, శిధిల నగరము, నాగవరము ఇంచుమించు కలిసియే యున్నవి. సుమారు మూడు మైలవరకు వ్యాపించిన ఈ నగరపు శిధిల చిహ్నములు నాగవరములోను, తుమ్మలగూడెము చెరువులోను, చెరువుకట్టకును ఇంద్రపాల గుట్టకును మధ్యగల విశాల ప్రదేశములోను. గుట్ట పైనను కనిపించును.

ఇంద్రపాల గుట్ట

నాగవరమునకు ఈశాన్యమునను, తుమ్మలగూడెమునకు ఉత్తరమునను మూసీనదిని ఆనుకొనియున్న ఒక ఎత్తైనగుట్ట సుమారు మైలు పొడవునను, అరమైలు వెడల్పునను వ్యాపించి యున్నది. తూర్పు వైపు విశాలముగను, పడమర కొంతభాగము విశాలముగను ఉండి, మధ్యభాగము ఎత్తుగను, గోపురాకారము గను ఉన్నది. గుట్టపైన కోట కట్టబడినది. ఇట్టి దానిని గిరిదుర్గ మందురు. ఈ దుర్గ మతి పురాతన మైనది. విష్ణు కుండినుల నాటిది. గుట్ట నెక్కుటకు ఐడమటి దిక్కు నుండి మెట్లున్నవి. గుట్టపైకి ఎక్కితిమేని, కోట విశాల ముగ గన్పించును. కోటకు పంద్రెండు బురుజా లున్నవి. గుట్ట పైన కోటకు రెండు వందల గజముల దూరములో లోతైన (లంద) కోనేరు ఉన్నది. ఈ లందనే ఏనుగుల బావి యుందురు. ఇచట పెద్ద పెద్ద ఇటుకలు, రాళ్ళు, ఇండ్ల పునాదులు, రెండు గజముల ఎత్తు, గజము ఎత్తు వరకు లేపిన గోడలు, శిథిలమైన గదులు ఉన్నవి. గోపురాకారముగ నున్న శిఖరమును ఎక్కుటకు మెట్లున్నవి. దాని చుట్టున్న మరియొక కోటగోడ యున్నది. ఒక ద్వారము, బురుజాలు ఉన్నవి. ఒక పెద్ద రాతిగుండుపై పూజారి శివార్చనకు బయలుదేరుచున్నట్లు చెక్కబడినది. గుట్టపైన ఎల్లమ్మ గుడి యున్నది. అచటనే పరశురాముని పాదములున్నవి. గుట్టపైకి వెళ్ళు మార్గములో పంద్రెండు స్తంభముల మంటప మున్నది. మంటపములో రెండువైపుల కూర్చొనుటకు వీలుగా నుండునట్లు పెద్ద బంకులు (అరుగులు) ఉన్నవి. మంటప ద్వారము సింహద్వారమువలె నున్నది.

తూర్పుదిశగా నున్న పర్వత భాగము చాల పొడవుగను, పల్లముగను, విశాలముగను నున్నది. గుట్టపైన శివాలయ మున్నది. అది కొండపై గల రెండు పెద్ద రాతిగుండ్లచే, దాని యంతట అదే ప్రకృతిసిద్ధముగా వెలసినట్లున్నది. శివలింగము నల్లరాతితో మలచబడినది. లింగము ఎత్తు రెండు అడుగులు. ఒక రాతిగుండుపై మరియొక రాతిగుండు నిలచి దేవాలయ ముగా రూపుదిద్దుకొని అతి సహజముగా నున్నది. శివా లయములో నున్న పెద్ద రాతిగుండు వెనుక భాగమునం దొక తెలుగు శాసనము చెక్కబడినది.

శివాలయమున కెదురుగా పురాతన మంటప మొకటి యున్నది. మంటపమున కెగువభాగమునం దొక కోనేరు, దిగువ భాగమునం దొక కోనేరు, శివాలయమున కుత్తరభాగమునం దొక కోనేరును ఉన్నవి. శివాలయమున కెదురుగా నొక శిలాశాసన మున్నది. విష్ణుకుండినుల కాలపు ఈ శిలా శాసనము రెండు ముక్కలుగా విరిగి క్రిందబడి యున్నది. శివాలయము నకు దూర్పుగా శిధిలములైన కట్టడము లున్నవి. వాని దాటి తూర్పునకు వెళ్ళిన మరియొక దేవాలయ మున్నది. అదియును శివాలయమే. ముందు మంటపము, గర్భగుడి, చుట్టు ప్రాకారము గల ఈ దేవాలయమున గల లింగము భిన్నమై పోయి నది. అచటనే మరికొన్ని శిధిలాలయము లున్నవి.

శివాలయమున కుత్తరముగా నున్న కోనేరు ప్రక్క నుండి, మూసీ నదిలోనికి దిగుటకు దారి యున్నది. నదిలో స్నానము చేయుటకు వీలైన ఘట్టము లున్నవి. ఇంద్రపాల గుట్టకు, ఫర్లాంగు దూరములో మూసీనదిలో గుట్టకు ఎగువ భాగముగ ఒక నరుపు బండపై నూట ఒక్క శివలింగములు చెక్కబడి యున్నవి.

ఇంద్రపాలగుట్టకు దక్షిణ భాగములో గుట్ట నాను కొని యున్న విశాలమైన ప్రదేశములో శిధిలరూపములో నున్న ఇంద్రపాల నగర మున్నది. శిధిలమైనట్టివియు, జీర్ణా వస్థలో నున్నట్టివియు నగు ఆలయము లా ప్రదేశమున అడుగడ గడుగున నున్నవి.

పంచలింగేశ్వరాలయము

ఈ ఆలయము రాతితో నిర్మింపబడినది. ఆలయ గోపురము మాత్రము, ఇటుక, సున్నము కలిపి నిర్మించినట్టిది. ఆలయ మతి విశాలమైనది. ఐదు ఆలయములను కలిసియే యున్నవి. నలుబది స్తంభములు గల గర్భగుడి, విశాలమై సాధా రణ శిల్పముతో నొప్పారుచున్నది. గర్భగుడి ముందు గల నంది విగ్రహము నల్ల నరపురాతితో మలచబడినది. అది మహమ్మ దీయుల దురంతములకు గురియైనది. తల నరికివేయబడినది. ఆలయమంతయు జీర్ణించిపోయినది. ఐనను ఆలయత్వమును కోల్పోలేదు. దూరమునుండి చూచిన గంభీరముగ నుండి పూర్వపు వైభవము చాటుటకు నిలచియున్నట్లు తోచును. తక్కిన ఆలయములలోని శివలింగములు భిన్నించినవి. కాని

ముఖ్యమైన ఆలయములోని శివలింగము మాత్రము చెక్కు చెదరక నిలిచియున్నది.

ఆలయమున కెదురుగా రెండంతస్తుల మండప మున్నది. (గాలిగోపురము)పై మండపమునకు నాలుగు స్తంభ ములు, క్రింది మండపమునకు ఆరు స్తంభము లున్నవి ఆలయమునకు చేరువ ఉత్తరభాగమున నాలుగు స్తంభములతో నిర్మింపబడిన విశాలమైన మంటప మున్నది. అది వివాహ మంటపము. ఆలయమునకు ముందు ఎడమవైపున కోనేరు ఉన్నది. దాని ప్రక్కన శిలాశాసన మున్నది. ఆ శాసనము తెల్ల రాతిపై చెక్కబడియున్నది. అక్షరములన్నియు చెదిరి పోయినవి.

దేవాలయమునకు ఈశాన్యభాగమున వంద గజముల దూరములో మరియొక శిలాశాసన మున్నది. దాని ఎత్తు ఎనిమిది అడుగులు. శాసనమునందలి యక్షరములు చెదిరిపోయినవి. ఆ శాసనమునకు నాలుగు గజముల దూరమున శిలాశాసన మొకటి రెండు తునకలుగా విరిగిపడి యున్నవి.

ఈ శాసన స్తంభములకు తూర్పుదిశలో ఒక మసీదు ఉన్నది. అది నూతనముగా కట్టబడినది. ఈ మసీదుకు వంద గజముల దూరములో గుట్టకు దగ్గరగా పొలము ప్రక్కన ఒక శిలాశాసన మున్నది. ఇది తెలుగు శాసనము.

వేంకటేశ్వరాలయము

పంచలింగేశ్వ రాలయమునకు పశ్చిమమున ఫర్లాంగు దూరములో ఉత్తర దిశాభిముఖముగా వేంకటేశ్వరాలయ మున్నది. ఇది జీర్ణావస్థలో నున్నది. ఇటుక, సున్నముతో గట్ట బడిన గోపురము గల ఈ దేవాలయము రాతితో నిర్మింపబడినది ఆలయముయొక్క ముందరిభాగము 16 స్తంభములతో నిర్మింప బడినది. ఆలయ సింహద్వారము ఆరు స్తంభములచే నిర్మింప బడినది. సింహద్వారమునకు తూర్పువైపుగా నున్న మూడు స్తంభములలో మధ్యన నున్న స్తంభమునకు నాలుగు వైపుల శాసనము చెక్కబడినది. శాసనము గల స్తంభమునకు మొదటి వైపు గల శాసన భాగము మరియొక స్తంభము దాని నాను కొని యుండుటవలన చదువుటకుగాని ప్రతిబింబము తీయుటకుగాని వీలులేదు. ఈ శాసనము విష్ణుకుండినుల నాటిది. వేంకటేశ్వరాలయమున గల స్తంభములలో రెండు స్తంభము లపై శాసనము చెక్కబడినవి. ఇవి తెలుగు శాసనములు.

ఇంద్రపాల ముత్యాలమ్మగుడి

పంచలింగేశ్వరాలయమునకు దక్షిణముగా శిథిలమైపోయిన ఇంద్రపాల ముత్యాలమ్మగుడి కలదు. దానికి ఏబది గజముల దూర మున పశ్చిమ దిశలో నూతనముగా నిర్మింపబడిన ముత్యాలమ్మ గుడి యున్నది. ప్రతి సంవత్సరము శ్రావణ మాసమున అచట ఉత్సవములు జరుగును.

ఈ ఆలయములే కాక మనకు అడుగడుగున శిథిలా లయముల ఛాయలు గోచరించును. హనుమదాలయములు, భైరవస్వామి ఆలయములు, రాతి విగ్రహములు లెక్కకు మిక్కి లిగా నున్నవి. తుమ్మలగూడెము చెరువులో ఈ శిథిల నగరము నకు దగ్గరలో ఒక శివలింగ మున్నది. వాగవరమున కుత్తర ముగా అసఫ్‌నహర్ కట్ట ప్రక్కన శివలింగ మున్నది. ఇట్టి శిథిలాలయముల జాడలు అచ్చటచ్చట కనిపించుటవలన పూర్వ మచట శివాలయము లుండెనని చెప్పవచ్చును. తుమ్మలగూడె మునకు దూర్పుగా మల్లెనగుట్ట యున్నది. ఆ గుట్టపై నున్న శివాలయము ఇంద్రపాల గుట్టపైన ఉన్న శివాలయము వలెనే యున్నది. అదియును విష్ణుకుండినుల నాటి శివాలయమే యని యూహింపవచ్చును. అసఫ్‌నహర్ ప్రక్కగా తుమ్మల గూడెము గ్రామమునకు తూర్పుగా మైలు దూరములో రామేశ్వర తోటలో ఒక శివాలయ మున్నది. దానిని రామేశ్వరాలయ మందురు. అదియును ఇంద్రపాల గుట్టపైన నున్న శివా లయమువలె రాతిగుండ్లతో సహజముగా నేర్పడియున్నది. శివ లింగము పాలరాతితో నిర్మింపబడినది.

ఇంద్రపాలగుట్ట—ఇంద్రపాల నగరము విష్ణుకుండిన ప్రభువుల కావాసమై ఆంధ్రదేశమునం దానాటి మహానగరము లలో నొకటిగా కీర్తింపబడి యుండవచ్చును. విష్ణుకుండినుల శాసనములలో ఆరు తామ్రశాసనములు ప్రకటింపబడినవని తెలుపబడినది. ఈ శాసనములందలి రాజుల పేళ్ళ, విషయ ములను సమన్వయపరచుకొనిన యెడల, విష్ణుకుండినుల చరిత్ర నిర్మాణమునకు ఈ ఇంద్రపాల నగర శాసనములు కొంతవర కుపయోగించు ననుటలో సందేహములేదు.

విష్ణుకుండినుల ఈ ఆరు తామ్ర శాసనములు ఇంతవరకు ప్రకటింపబడినవి :

1. చిక్కుళ్ళ శాసనము	రెండవ విక్రమేంద్రవర్మ
2. రామతీర్థ శాసనము	మహారాజ ఇంద్రవర్మ
3. ఈపూరు శాసనము	మూడవ మాధవవర్మ
4. ఈపూరు శాసనము	రెండవ మాధవవర్మ
5. పొలమూరు శాసనము	మూడవ మాధవవర్మ
6. తుండి శాసనము	విక్రమేంద్ర భట్టారకవర్మ

ప్రకటింపబడని శాసనములు :

1. ఇంద్రపాల నగర శాసనము	గోవిందవర్మ
2. ,,	విక్రమేంద్రభట్టారకవర్మ

విష్ణుకుండిన గోవిందవర్మ ఇంద్రపాలనగర తామ్రశాసనము

శాసనము లందలి రాజులు

1. చిక్కుళ్ల శాసనము.
   - (1) మహారాజమాధవవర్మ
   - (2) శ్రీ విక్రమేన్ద్రవర్మ
   - (3) మహారాజ ఇంద్రభట్టారకవర్మ
   - (4) రెండవ మహారాజ విక్రమేన్ద్రవర్మ.

2. రామతీర్థ శాసనము.
   - (1) మహారాజ మాధవవర్మ.
   - (2) మహారాజ విక్రమేన్ద్రవర్మ.
   - (3) ఇంద్రవర్మ.

3, 4. ఈపూరు మొదటి శాసనము, పొలమూరు శాసనము
   - (1) విక్రమేన్ద్రవర్మ.
   - (2) గోవిందవర్మ.
   - (3) మూడవ మాధవవర్మ.
   - (4) మంచన భట్టారక.

5. ఈపూరు రెండవ శాసనము.
   - (1) మహారాజ మాధవవర్మ.
   - (2) దేవవర్మ
   - (3) రెండవ మహారాజ మాధవవర్మ

6. తుండి శాసనము.
   - (1) మాధవవర్మ
   - (2) విక్రమేన్ద్ర భట్టారకవర్మ
   - (3) ఇన్ద్రవర్మ
   - (4) విక్రమేన్ద్ర భ ట్టారకవర్మ.

7. గోవిందవర్మ ఇంద్రపాల నగర శాసనము.
   - (1) మహారాజేన్ద్రవర్మ
   - (2) మాధవవర్మ
   - (3) గోవిందవర్మ.

8. విక్రమేన్ద్ర భట్టారకవర్మ ఇంద్రపాల నగర శాసనము
   - (1) గోవిందవర్మ
   - (2) మాధవవర్మ
   - (3) విక్రమేన్ద్రవర్మ
   - (4) ఇన్ద్రభట్టారకవర్మ
   - (5) విక్రమేన్ద్ర భట్టారకవర్మ
   - (6) మాధవవర్మ.

విష్ణుకుండిన వంశవృక్షము


- మహారాజేంద్రవర్మ
  - మాధవవర్మ—I
    - గోవిందవర్మ—I
      - మాధవవర్మ—II
        - దేవవర్మ
          - మాధవవర్మ III
        - విక్రమేన్ద్రవర్మ
          - ఇన్ద్రభట్టారకవర్మ
            - విక్రమేన్ద్ర భట్టారకవర్మ
              - గోవిందవర్మ II
                - మాధవవర్మ IV
                  - మంచన భట్టారకుడు.

తా మ్ర శా స న ము ఫ లా ల ము




మొ ద టి రే కు - రెం డ వ ప్ర క్క

1. స్వస్తి జితం భగవతా తేన సంబుద్ధేన కృపాత్మనా నిర్వాణ ప్రాప్తయే యేన సద్యోమార్గః ప్రదర్శితః॥ సత్వసత్య
2. త్యాగాభిజన నయ వినయోత్సాహాది గుణగుణ సంపదా స్వయ మధిగత రాజ్యానాం సమ్యక్ప్రజాపాలనాత్ప్రి
3. థి తావదాత పృథు యశసాం రాజ్ఞాం విష్ణుకుణ్డీనా మమల విపుల సకల కుల తిల
4 కేన (శ్రీ) మహారాజేన్ద్ర వర్మణ సత్పుత్రేణ మహారాజ (శ్రీ మాధవ వర్మణః సుపుత్రేణ స్వతయ
5. భుజబలోత్సాహ ప్రభావానురాగా వాప్త స్వరాజ్యేన శౌర్య ధైర్య ప్రతాపానుభావా ద



రెండవ రేకు - మొదటి ప్రక్క

1. స్య సామన్తా క్రాన్త రాజ్యాన్తరేణ దానమానాదిభి రనురక్త వర్ణా శ్రమ స్వజన పరిజనేన గ్రామక్షేత్ర
2. హిరణ్య ద్విరద తురగ గో బలీవర్ద్ద శయ నాసన యాన పానభోజన భాజన భవన వసనాభరణ కన్యా
3. దాసీదాన సహస్రాణాం దాత్రా అనేక దేవాయతన విహార సభా ప్రపాత టాకోదపానా
4. రామ ప్రతి సంస్కార పూర్వకరణే నాలంకృత సకల దిగన్తరేణ భిక్షుద్విజా నాథ యాచక వ్యా
5. ధిత దీన కృపణజనోపభుజ్యమాన న్యాయాధిగత విభవ ధన సముదయేనా సకల సకృత్స్న—వర్గ
6. స్వత్యాగినా సకల శాస్త్రార్థ శ్రవణ పరిజ్ఞా నా దహ పరత్రచా నవ్యచక్షుషా విద్ధి చుర్భార మహా




రెండవరేకు - రెండవ ప్రక్క

1. కులీనజన సమాశ్రయేణ సకల సత్వధాత్వాత్రాణాయోత్పాదితి మహాబోధి విస్తైన మహారాజశ్రీ
2. గోవిన్దనమ్మర్ణా ఆత్మనః ప్రవర్ధమాన విజయరాజ్య సంవత్సరే సప్తత్రింశత్యే వైశాఖే పూర్ణమాస్యాం భగ
3. వతో దశబలబలినః చతుర్వైశారద్య విశారద స్యాష్టాదశావేణిక బుద్ధధమ్మ సమలంకృ
4. తి మహత్రేద్వాత్రింశ న్మహా పురుషలక్షణ వరోపలక్షితస్య జాతి జరా మరణ శోకాదషు బహు
5. సంసార దుఃఖ నిమగ్న సర్వ సత్వోత్తారణా యానేక కల్ప సంజ్ఞయోపచిత పుణ్యజ్ఞాన సంభారం భాగి
6. స్య పగత రాగద్వేష మోహా జనన మరణ దుఃఖస్యా ప్రతిహతాష్టావరణ సకలజ్ఞేయ జ్ఞానా



మూండవ రేకు - మొదటి ప్రక్క

1. న్సమ్యక్సంబుద్ధస్య•బుద్ధస్య మార్గ మభి ప్రపన్నం నిర్వదివ్యరాగశీల శిక్షా ధృ (స్య)తగుణాఢ్యయన శ్రవణ...
2. స్తన భావనా ధ్యాన సమాధి సమాపత్యాదిభి గుణ గణోరనుత్తరం పుణ్యక్షేత్రం శ్రియానసూయినం చాతుర్ద
3 శ మాయ్యసఙ్ఘముద్దిశ్య త్యాగ పరిభోగాన్వయ మోఽధిక (వో) పుణ్య క్రియా వస్త్వభి నివర్ద్ధి
4. యిష్యతా మాతాపిత్రోః సర్వ సత్వానాఞ్చ నిఖల దారిద్ర్య దుఃఖోపశమహేతోః స్వస్యా అగ్ర
5. మహిష్యా పరమ మహాదేవ్యా విహారస్య దీప ధూప గన్ధ పుష్ప ధ్వజ పాన భోజన శయనాసనగ్లాన
6. భైషజ్య చేణ్ణ స్ఫుదిత శీర్ణ సంస్కారాది కుశల మూలా నుచ్ఛేదార్థం ద్వావేమ్మ్యాదం పేణ్కాపల



నాలుగవ రేకు - మొదటి ప్రక్క

1. స్వదత్తాం పరదత్తాం వా యో హరేత వసున్ధరామ్ స విష్టాయాం క్రిమి భూత్వా పితృభి స్సహపచ్యతాం॥
2. బహుభి ర్వసుధా దత్తా బహుభి శ్చానుపాలితా యస్య యస్య యదాభూమి స్తస్య తస్య తదా
3. ఫలమ్॥ భువి మేరూదధీ యావ ద్దీపేస్దు రవి మారుతా తావచ్ఛ్రీ విష్ణుకుణ్డీనాం పృథివీ శాస్తు శాసనం॥

ఇంద్రపాలనగర తామ్రశాసనము అనువాదము

స్వస్తి. సంబుద్ధుడును, కృపాత్ముడు నగు భగవంతునిచేత మోక్షప్రాప్తి కొరకు సులభశీఘ్రమగు మార్గము చూప బడినదో, అతడు. సత్యము త్యాగము ఉన్నత వంశ సంజాతత్వము, (ఆభిజాత్యము) నయ వినయోత్సాహాది సద్గుణ గుణ సంపత్తిచే స్వ పరాక్రమంబున రాజ్యముం బొంది సక్రమ ప్రజాపాలన వలన కీర్తిగాంచి, అనేక దానముల వలన విస్తార కీర్తిం బొందిన విష్ణుకుండిన రాజలోకములో నందరికిని తిలకాయ మానుడగు శ్రీ మహా రాజేంద్రవర్మ పౌత్రుడై, మహారాజ శ్రీ మాధవవర్మకు సుపుత్రుడై, తన భుజబలోత్సాహముల చేతను, ప్రభావానురాగములచేతను స్వరాజ్యమం దంతటను వ్యాప్త కీర్తియై శౌర్యధైర్య ప్రతాపాను భావముల వలన శత్రువుల చేత నితర రాజ్యాక్రమణము గలవాడై, దాన మానాదులచే నను రక్తమగు వర్ణాశ్రమ స్వజన పరిజనుడై, గ్రామక్షేత్ర హిరణ్య ద్విరద తురగ గో బలీవర్ద శయనాసనయాన పాన భోజన భాజన భవన వసనాభరణ కన్యాదానములం జేయువాడును, వేలకొలది దాసుల దానము చేయువాడును, ననేక దేవాయతన విహార సభా ప్రపాతటాకోదుపానా రామ ప్రతి సంస్కారపూర్వకములగు నుపకార కార్యముల జేయువాడును, విభూషిత దిగంతరుడు భిక్షు ద్విజానాథ యాచక వ్యాధిత దీన కృపణ జనులచే ననుభ వింపబడు న్యాయార్జిత ధన సమృద్ధి గలవాడును, నందరకు నన్నిటిని దానము చేయువాడును, సకల శాస్త్రార్థ శ్రవణ పరి జ్ఞానము వలన విహపరములందు సాటిలేని దూరదృష్టి కల వాడును.....శూరులకు, కులీనులకు, నాశ్రయభూతుడును, సకల ప్రాణికోటికిని రక్షణార్థ ముత్పాదింపబడిన మహా బోధిచిత్తము గలవాడును అగుమహారాజ శ్రీ గోవిందవర్మచేత, ఆతడు పాలింప మొద లిడినది మొదలభివృద్ధి నొందు ముప్పదియేడవ సంవత్సరమందు, వైశాఖ పూర్ణిమనాడు చతుర్వైశారద్య విశారదుండును, అష్టా దశ వేణికాత్మకమగు బుద్ధధర్మముచే సమలంకృతమూర్తియును, ద్వాత్రింశన్మహాపురుష లక్షణోపలక్షితుడును, జరామరణ శోకాది బహువిధ (దుఃఖములందును) సంసారదుఃఖములందును పూర్తిగా మునిగిన ప్రాణికోటి నుద్ధరించుటకు విధి విధానముగా యజ్ఞము లొనర్చి పుణ్యమును జ్ఞానమును నార్జించినవాడును, రాగద్వేష మోహముల నుండి జనన మరణాది దుఃఖముల నుండియు తప్పించుకొన్నవాడును, అప్రతిహతము ననావర ణము (నగుబుద్ధిచే) తెలియదగిన జ్ఞానము నంతను తెలిసి కొనుటవలన నతి విజ్ఞానియగు దశబల బలియను పూజ్యునికి నతి ప్రసన్నమగు శౌద్ధమార్గము, నిర్విరాగశీల శిక్షా ధృ(దృ) తములు మొదలగు గుణముల నధ్యయన శ్రవణ .... కీర్తన భావ నా ధ్యాన సమాధి సమాపత్తి మొదలగు గుణగణములతో కూడినదై పుణ్యక్షేత్ర త్రియానముల ననుసరించు నదువాల్గవ ఆర్యసంఘము నుద్దేశించి, పుణ్యకార్యములం దధికముగా వాడు బడు పుణ్యవస్తు విశేషము కలది యగుటచే దానము వలన ననుభవించుటకు దగిన దానిదిగా తలిదండ్రులయొక్క ఋణ మును తీర్చునట్టియు, సర్వ ప్రాణులను రక్షించునదియు, సర్వ విధములగు దరిద్రములను దుఃఖములను నుపశమింప జేయు నిమిత్తమై తన పట్టమహిషియైన పరమ మహాదేవి చేత విహారమునకు దీప, ధూప, గన్ధ, పుష్ప, ధ్వజ, పాన, భోజన శయనాసన గ్లాన .... భైషజ్య—'ఛాన్దస్ఫుటిత' శీర్ణ సంస్కా ములు మొదలగు క్షేమములు కలుగుట కొరకు ద్వావేమ్బక దల పేణ్కవణి అను పేరుగల గ్రామము నిధులు, ఉపనిధులు, దండకరవృష్టులు, ఉచ్ఛిష్టభాగము లన్నిటితో కూడ ధారా పూర్వకముగా దానము చేయబడినది. ఆ గ్రామము, భటులు, దూతలు, ప్రభువులు, రాజపురుషులు మొదలగువారిచే చొర రానిదియు, నన్ని రకముల సుంకముల వదిలివేయబడినదియు, విష్ణుకుండిన రాజవంశ్యులగు, రాజులచేత రక్షింపదగినదియు, నభివృద్ధిచేయ దగినదియునై యున్నది. ఈ నియమము నుల్లంఘించిన యెడల మహాపాతకయోగము కల్గును. లేనిచో ప్రారంభించిన పుణ్యకార్యంబును నాశన మొనరించుటచేత దుఃఖ భూయిష్ఠమగు నరకవాసమునందును దుష్కార్యముచేసి, ప్రేతమై కర్మలోప ఫలము ననుభవించెదరు. ఇచ్చట మనుగీత శ్లోకములును నున్నవి. భూదానము చేయువాడు అరవైవేల సంవత్సరములు స్వర్గమునందు నివసించును. దీనికి నాక్షేకము జెప్పువాడును, పరాక్షేపము నంగీకరించినవాడును నరక మందే నివసించును. స్వదత్తముగాని, పరదత్తముగాని యగు భూమిని ఎవ్వడు హరించునో యాతుడు మలమందలి క్రిమియై పితరులతోగూడ నధఃపతన మందుగాక! భూమి చాలమందిచే దానము చేయబడినది. భూమి చాలమందిచేత పాలింపబడినది. ఏయే కాలములందు భూమి యెవని యధీనమందున్నదో యాయా కాలములలో నా ఫలము వారివారికి జెందును. మేరు పర్వత మెంతకాల ముండునో, సూర్యు డెంతకాలము భూమిపై నుండునో అంతవరకు శ్రీ విష్ణుకుండినులయొక్క శాసనమును భూమి పరిపాలించుగాక.

శాసన స్వరూపము

ఐదు రేకులు గల ఈ శాసనము నాగవరము నివాసియగు శ్రీ తమ్మళి ఆంజనేయులుకు లభించినది. నాగవరము, ఇంద్రపాల గుట్ట, శిథిలమైన ఇంద్రపాల నగరము కలిసియే యున్నవి.

శ్రీ తమ్మళి అంజనేయులు తన పొలమునకు గట్లు పోయించుచు, పొలము ప్రక్కన నున్న ఎత్తుగడ్డను త్రవ్వించు చుండ, మట్టికుండ బయలుపడినది. ఆ కుండ మట్టితో పూడి యుండుటవలన మట్టిని తీసివేసి చూడ ఉంక (ఊక) మధ్యన ఈ తామ్రశాసనము భద్రపరుచబడి యున్నది. కడియముతో నున్న ఈ శాసనము నతడు కడిగించి, యందలి యక్షరములను చదువుటకు ప్రయత్నించి విఫలుడైనాడు. నాలుగు సంవత్సరము లాత డీ శాసనమును తన ఇంటిలోని దేవుని గూటిలో నుంచినాడు.

శ్రీ పి. రాజారావుగారు నాగవరమునకు దగ్గరలో నున్న కమ్మగూడెపు నివాసి. ఒకమారు ఆయన శ్రీ అంజనేయులు గారింటికి వెళ్లుట తటస్థించినది. మాటల సందర్భమున శ్రీ అంజనేయులుగారు, రాజారావుగారికి తమ ఇంటనున్న శాసనమును చూపించినారు. రాజారావుగారు ఆ శాసనమును తమ వద్ద నుంచుకొని, కారణాంతరమున తమ ఇంటికి వచ్చిన శ్రీ కె. రమామనోహరరావుగారికి నప్పగించినారు. రెండు మాసములవరకు శాసనము శ్రీ రమామనోహరరావుగారి వద్దనే యుండెను.

ఒకనాడు శ్రీ రమామనోహరరావుగారు నాతో సంభాషించినప్పుడు "మా ఇంటిలో తామ్రశాసనము లున్నవి" అనినారు. నా కెంతో ఆనందము కలిగినది. శ్రీ రమామనోహర, రావుగారితో వారి ఇంటికి వెళ్లి దయతో వారొసంగిన శాసనములను తెచ్చినాను. అవి రెండును తామ్రశాసనములు. విష్ణుకుండినులవి. ఇంద్రపాల నగరములో అంతకు పూర్వము నేను చూచిన శిలాశాసనములు అందలి లిపి, భాష ఈ తామ్ర శాసనములందలి లిపి భాషలను పోల్చి చూచి సంతోషపడినాను. శ్రీ రమామనోహరరావుగారికి నా కృతజ్ఞతలు.

ఈ శాసనమున ఐదు రాగిరేకు లున్నవి. ఒక్కొక్క రేకు పొడవు 26.8 సెం. మీ. వెడల్పు 5.5 సెం. మీ. ఈ ఐదు రేకులును ఒక రాగి కడియమునకు తగిలించి యున్నవి. కడియము యొక్క చుట్టుకొలత 23.5 సెం. మీ. మొత్తము శాసనము తూకము 1 కిలో 4 గ్రాములు.

మొదటి రేకు తూకము	167	గ్రాములు.
రెండవ రేకు ,,	165	,,
మూడవరేకు ,,	158	,,
ఐదవ రేకు ,,	146	,,
కడియము సీలుతో సహా	200	,,

ఈ శాసనమున ఐదు రాగిరేకులున్నను ఒక రేకు మాత్రము వదిలివేయబడినది. శాసనము నాలుగవరేకు మొదటి ప్రక్కతో పూర్తయినది. శాసనము మొదటి రేకు రెండవ ప్రక్క నుండి ప్రారంభింపబడినది. శాసనమున గల పంక్తుల మొత్తము సంఖ్య 32.

మొదటిరేకు రెండవప్రక్క	5	పంక్తులు
రెండవ రేకుమొదటిప్రక్క	6	,,
రెండవ రేకు రెండవప్రక్క	6	,,
మూడవరేకు మొదటిప్రక్క	6	,,
మూడవరేకు రెండవప్రక్క	6	,,
నాలుగవరేకు మొదటిప్రక్క	3	,,
మొత్తము	32	

శాసనపు రేకులకు ఎడమవైపున 1.2 సె.మీ వ్యాసము గల రంధ్రము లున్నవి.

ఈ శాసనమున రెండవ రేకు మొదటి ప్రక్క ఐదవ వరుసలోని చివరి యక్షరములు చిలుముపట్టి చెదరిపోయినవి. శాసనపు రేకుల కొనలు అక్షరములను కాపాడుట కంచులుగ తీర్పబడి యుండలేదు. విష్ణుకుండినుల శాసనము లన్నియు నిట్లే యున్నవి.

భా ష

ఈ శాసనభాష యంతయు సంస్కృతము. శాసనము మొదట శుభ ప్రతిపాదితమైన 'స్వస్తి' తో ప్రారంభింపబడినది. 'జితం భగవతా' అను శ్లోకము పిదప మూడవ రేకు రెండవ ప్రక్కలో ఐదవ వరుసలో నున్న మనుగీతా శ్లోకము వరకు గల శాసనభాగ మంతయు సంస్కృత వచనములో నున్నది. మూడు శ్లోకముల తరువాత ముగింపు వచనములో నున్నవి.

లి పి

క్రీస్తుశకము నాలుగైదు శతాబ్దులలో నాంధ్రదేశమున వాడుకలో నుండిన తెలుగు లిపి లేక శాలంకాయనుల నాటి వేంగి లిపి ఈ శాసనమున వాడబడినది. శాసనాక్షరములు స్పష్టముగ నున్నవి. పరిమాణమున కొన్ని వరుసలలో చిన్నవిగను, కొన్ని వరుసలలో పెద్దవిగను ఉన్నను అక్షరములను శిల్పి కడు జాగరూకతతో చెక్కినాడు.

ఇవి 'గుంద్రఘత్తు' అక్షరములు. విక్రమేంద్ర భట్టారక వర్మ ఇంద్రపాల నగర శాసనము, 1, విక్రమేంద్రవర్మ చిక్కుళ్ల

1. శాసనము ప్రకటింపబడలేదు.

శాసనము[1], ఇంద్రభట్టారకవర్మ రామతీర్థ శాసనము[2] ల లోని యక్షరములను బోలియున్నవి. ఈ శాసనమున సంఖ్యా సంకేతములు ప్రాచీన పద్ధతిలో నున్నవి. మొదటి రేకు రెండవ ప్రక్క ఎడమవైపున నున్న రంధ్రమునకు పైభాగమున ఒకటి గుర్తును, రెండవరేకు రెండవ ప్రక్క రెండు గుర్తును, మూడవరేకు రెండవప్రక్క మూడు గుర్తును ఉన్నవి. ఈ శాసనపు రేకులపై చెక్కబడిన అంకెల గుర్తులు.

ఒకటి	3
రెండు	33
మూడు —	333

వర్ణక్రమము

1. నిర్వాణము — నివ్వార్ణం
2. మాధవవర్మ — మాధవమ్మర్
3. శౌర్య — శౌయ్యర్
4. ధైర్య — ధైయ్యర్
5. వర్ణక్రమ — వణ్ణర్క్రమ
6. బలీవర్ద — బలీవద్దర్
7. సంస్కారపూర్వ— సంస్కారపూవ్వర్
8. శాస్త్రార్థ — శాస్త్రాత్థర్

ఇట్లు నిర్వాణము, వర్మ, శౌర్య, ధైర్య ఇత్యాదులందు 'ర'—వలవలగిలకకు పూర్వాక్షరము ద్విత్వముగ వ్రాయబడినది. శాసనమున మూడవరేకు మొదటిప్రక్క ఆరవ పంక్తిలో 'పేణ్కపఱ' అను గ్రామమున 'ఱ' వ్రాయబడినది. శకటరేఫము గ్రామ నామములో నున్నది. సంపూర్ణముగా సంస్కృతభాషలో వ్రాయబడిన ఈ శాసనమున 'ఱ' రేఫమున కొక ప్రత్యేకత ఈయబడినది. శకటరేఫమునకు ప్రత్యేక స్థాన మానాడు తెలుగక్షరములలో నుండెను. కళింగరాజగు అనంతవర్మ తామ్రశాసనము నాగరిలిపిలో వ్రాయబడినది. ఆ శాసనమునందు శకటరేఫము ప్రత్యేకముగ వ్రాయబడినది.

శాసన విషయము

దాతయైన గోవిందవర్మ విష్ణుకుండిన మహా రాజేంద్ర వర్మ పౌత్రుడు (శ్రీ మహా రాజేంద్రవర్మ పౌత్రేణ), మాధవవర్మ పుత్రుడు (మహారాజశ్రీమాధవవర్మణః సుపుత్రేణ) అగు ఈ గోవిందవర్మ తన భుజబలోత్సాహములచేతను, ప్రభావానురాగముల చేతను స్వరాజ్యమం దంతటను వ్యాప్త కీర్తియై శౌర్య ధైర్య ప్రతాపానుభావములవలన శత్రువుల చేత వితర రాజ్యాక్రమణ గలవాడై దానమానాదులచేత వశ రక్తమగు వర్ణాశ్రమ స్వజనపరిజనుడై, గ్రామక్షేత్ర హిరణ్య ద్విరద తురగ గోబలీవర్ద శయనాసన యానపాన భోజన భాజన భవన వసనాభరణ కన్యాదానములం జేయువాడును, వేలకొలది దానుల దానము చేయువాడును, ననేక దేవాయతన విహార సభా ప్రపాత—అనుపానారామప్రతి సంస్కారపూర్వకములగు నవ కార కార్యములు జేయువాడును విభూషిత దిగంతరుడును భిక్షు ద్విజానాథ యాచక వ్యాధిత దీన కృపణ జనులచే ననుభవింపబడు న్యాయార్జిత ధన సమృద్ధి గలవాడును, నందఱకు నన్నిటిని దానము చేయువాడును, సకలశాస్త్ర శ్రవణ పరిజ్ఞానమువలన నిహపరములందు సాటిలేని దూరదృష్టి కలవాడును, శూరులకు కులీనులకును నాశ్రయభూతుడును, సకల ప్రాణికోటికిని రక్షణార్థ ముత్పాదింపబడిన ......" అని ప్రశంసింపబడినాడు.

ఈ శాసనము గోవిందవర్మచేత నాతడు పాలింప మొదలిడినది మొదలభివృద్ధినొందు ముప్పది యేడవ సంవత్సరమందు వైశాఖ పూర్ణిమనాడు ఈయబడినది (మహారాజశ్రీ గోవిందవమ్మర్ణా ఆత్మనః ప్రవద్ధర్మాన విజయరాజ్య సంవత్సరే సప్తత్రింశత్కే వైశాఖీపూణ్ణర్మాస్యాం).

గోవిందవర్మ 37 వ రాజ్య సంవత్సరమున వేయింపబడిన ఈ శాసనము శాద్ధమతానుయాయియు, చతుర్వైశారద్య విశారదుడును, అష్టాదశావేణికాత్మకమగు బుద్ధ ధర్మముచే సమలంకృతమూర్తియును, ద్వాత్రింశన్మహా పురుష లక్షణోప లక్షితుడును, జరామరణ శోకాది బహువిధ సంసార దుఃఖమునందు పూర్తిగా మునిగిన ప్రాణికోటి నుద్ధరించుటకు విధివిధానముగా యజ్ఞము లొనర్చి పుణ్యమును, జ్ఞానమును మును ఆర్జించినవాడును, రాగ ద్వేష మోహముల నుండియు జనన మరణాది దుఃఖముల నుండియు తప్పించుకొన్నవాడును, అప్రతిహతము, ననావరణము (నను బుద్ధిచే) తెలియదగిన జ్ఞానము నంతను తెలిసికొనుటవలన నతి విజ్ఞానియగు దశబలబలియను పూజ్యునికి—నదువాల్గవ—ఆర్యసంఘము నుద్దేశించి—తలిదండ్రుల ఋణమును తీర్చునట్టియు, సర్వ ప్రాణులను రక్షించునదియు, సర్వ విధములగు దరిద్రములను, దుఃఖములను నుపశమింపజేయు నిమిత్తము తన పట్టమహిషియైన పరమ మహాదేవిచేత విహారమునకు గంధపుష్ప ధ్వజపాన భోజన శయనాసనగ్లాన—భైషజ్య— ఆది క్షేమములు కలుగుట కొరకు, ద్వావేమర్ దల 'పేణ్కపఱ' అను గ్రామము విధులు ఉపవిధులు, దండకర వృష్టులు, ఉచ్ఛిష్టభాగము లన్నిటితో కూడ ధారాపూర్వకముగా దానము చేయుబడినది.

---

1. ఎ. ఇండి. వా—12 పుట—133.
2. ఎ. ఇండి. వా—4. పుట—193.

కాలనిర్ణయము

విష్ణుకుండినులు బ్రాహ్మణ మతాభిమానులు, ఏకాదశాశ్వ మేధములు, క్రతు సహస్రములు చేసినవారు. ఇంద్రవర్మ రామతీర్థ శాసన మాతని 27 వ రాజ్యకాల సంవత్సరమున జేష్ఠమాస శుక్లపక్ష సప్తమి తిథినాడు తైత్తిరీయ శాఖా బ్రాహ్మణుడును, మాంగిరస గోత్రుడును అయిన వస్ను శర్మకు పళికి రాష్ట్రములోని పెరువాడక గ్రామమును దానము చేసినట్లు తెలుపుచున్నది. పొలమూరు శాసనము, ఈపూరు మొదటి శాసనము మాధవవర్మ దానములను తెలుపును. పొలమూరు శాసనము మాధవవర్మ తన 47 వ విజయ రాజ్య సంవత్సరము ఫాల్గుణ పౌర్ణిమ సోమగ్రహణ నిమిత్తమున గౌతమగోత్రుడైన శివశర్మకు పులోంబూరు గ్రామమును దానమిచ్చిన విషయమును, ఈపూరు మొదటి శాసనము మాధవవర్మ తన 37 వ విజయరాజ్య సంవత్సరమున వత్స గోత్రుడైన అగ్నిశర్మకు 'విలెంబలి' యను గ్రామమును దాన, మిచ్చిన విషయమును తెలుపును.

ఈపూరు రెండవ శాసనము నిచ్చినవాడు మాధవవర్మ. ఇతడు దేవవర్మ కుమారుడు. ఇతడు తన 27 వ రాజ్య సంవత్సరమున వత్సగోత్రులగు అగ్నిశర్మ ఇంద్రశర్మలకు దాన మిచ్చినాడు.

చికుళ్ల, తుండి శాసనములలోని దాత విక్రమేంద్ర భట్టారకవర్మ. ఇతడు తన 10 వ విజయరాజ్య సంవత్సరమున సోమగిరీశ్వరనాథునికి చిక్కుళ్ల శాసనమును, 14 వ విజయరాజ్య సంవత్సరమున కౌండిన్యగోత్రుడును, ఆపస్తంబ సూత్రుడును అగు స్వామిశర్మకు తుండి గ్రామమును దాన మిచ్చిన విషయములను తెలుపును.

విక్రమేంద్ర భట్టారకవర్మ ఇంద్రపాల నగర తామ్ర శాసనమున అతని విజయరాజ్య సంవత్సరములోపాటు శక సంవత్సరము స్పైతము పేర్కొనబడినది. విష్ణుకుండినులు శాసనములందు విజయరాజ్య సంవత్సరము తప్ప, శక సంవత్సరము పేర్కొనుట ఆచారముగ లేదు. ఈ విక్రమేంద్ర వర్మ శాసనమున అతనికి ఉత్తమాశ్రయుడను బిరుద మున్నట్లును, అతని తండ్రి ఇంద్రభట్టారక వర్మకు సత్యాశ్రయుడను బిరుద మున్నట్లును తెలియుచున్నది. విక్రమేంద్ర భట్టారకవర్మ శకసంవత్సరము 488 గడచిన పిదప ఆ దానమును చేసినాడు. (సాష్టాశీతి చతుఃశతే శకయుతే సంవత్సరాణాం గతే.)

విష్ణుకుండిన వంశమునకు మూలపురుషుడు మాధవవర్మ యని ఇంతవరకు లభించిన శాసనముల ననుసరించి చరిత్రపరిశోధకులు ఈవిధముగా నిర్ణయించినారు.

మాధవవర్మ—I
(క్రీ. శ. 420—455)

- దేవవర్మ (క్రీ. శ. 455—458)
  - మాధవవర్మ—II (క్రీ. శ. 458—488)
- విక్రమేంద్రవర్మ (క్రీ. శ. 488—493—500)
  - ఇంద్రభట్టారకవర్మ (క్రీ. శ. 493—500—5 0)
    - విక్రమేంద్రవర్మ—II (క్రీ. శ. 530—540)
      - గోవిందవర్మ (క్రీ. శ. 540—546)
        - మాధవవర్మ—III (క్రీ. శ. 546—610)
          - మంచన భట్టారకుడు (క్రీ. శ. 610—612)

ఇంతవరకు విష్ణుకుండిన వంశమునకు చెందిన తొమ్మిది మంది రాజుల చరిత్ర ప్రకటితములైన ఈ శాసనముల వలన తెలియుచున్నది. చారిత్రకులీ వంశీయుల కాలమును ఆయా రాజులు వేయించిన శాసనములందు పేర్కొనబడిన విజయ రాజ్య సంవత్సరముల ననుసరించి నిర్ణయించినారు. కాని విష్ణు కుండిన ఇంద్రపాల నగర శాసనములలోని రాజుల పేర్లు, ప్రకటించబడిన శాసనములలోని రాజులపేర్లు కలియుచున్నను, గోవిందవర్మ ఇంద్రపాల నగర శాసనము విష్ణుకుండిన వంశ చరిత్రలో నూతన విషయములను చేర్చుటలో తోడ్పడుచున్నది.

గోవిందవవర్మ శాసనము :

మహారాజేంద్రవర్మ
|
మాధవవర్మ—I
|
గోవిందవర్మ—I
(37 వ విజయరాజ్య సంవత్సరము)

విక్రమేంద్ర భట్టారకవర్మ శాసనము :

గోవిందవర్మ
|
మాధవవర్మ
|
విక్రమేంద్రవర్మ
|
ఇంద్రభట్టారకవర్మ
|
విక్రమేంద్ర భట్టారకవర్మ
|
మాధవవర్మ

పరిశీలింపగా గోవిందవర్మ శాసనము విక్రమేంద్ర భట్టారకవర్మ శాసనముకన్న పూర్వపుదని నిర్ణయింపవచ్చును.

గోవిందవర్మ 37 వ విజయరాజ్య సంవత్సరమున వేయించిన యీ శాసనమును బట్టి మొదట విష్ణుకుండినులు బౌద్ధ మతాభిమానులని తెలియుచున్నది. గోవిందవర్మ ఇంద్రపాల నగర శాసనమున 'పేణ్కపఱ' గ్రామము బౌద్ధవిహారమున కొసంగబడినట్లున్నది. మొదట విష్ణుకుండినుల యావాసము తెలంగాణమునందలి ఇంద్రపాల నగరము. ఇంద్రపాల నగర రెండు తామ్రశాసనములను బట్టి, పూర్వము ప్రకటింపబడిన శాసనములలోని రాజుల పేళ్ళను, విజయరాజ్య సంవత్సరములను బట్టి, విష్ణుకుండినుల కాలమును, వంశమును ఇట్లు నిర్ణయించవ లగుచున్నది.

మహారాజేంద్రవర్మ
(క్రీ. శ. 3[illegible]0—400)
|
మాధవవర్మ—I
(క్రీ. శ. 400—418)
|
గోవిందవర్మ—I
(క్రీ. శ. 418—455)
|
మాధవవర్మ—II
(క్రీ. శ. 455—490)

దేవవర్మ (క్రీ. శ. 490—493)
|
మాధవవర్మ—III (493—522)

విక్రమేంద్రవర్మ (క్రీ. శ. 522—528)
|
ఇంద్రభట్టారకవర్మ (528—556)
|
విక్రమేంద్రభట్టారకవర్మ (556—570)
|
గోవిందవర్మ—II (570—576)
|
మాధవవర్మ—IV (576—623)
|
మంచన భట్టారకుడు (623—624)

విక్రమేంద్ర భట్టారకవర్మ ఇంద్రపాల నగర శాసన కాలము శక సంవత్సరము 488. అనగా క్రీ. శ. 566. విక్రమేంద్రభట్టారకవర్మ చిక్కుళ్ళ శాసన మాతని 10 వ విజయ రాజ్య సంవత్సరమునను, ఇంద్రపాల నగర శాసనము 11 వ రాజ్య సంవత్సరమునను, తుండి శాసనము 1[illegible] వ విజయరాజ్య సంవత్సరమునను వేయింపబడినవి. ఐన విక్రమేంద్రభట్టారకవర్మ రాజ్యమునకు వచ్చిన సంవత్సరము శ. సం. 476. తుండి శాసనము 14 వ విజయరాజ్య సంవత్సరమున వేయించినది. అనగా శక సంవత్సరము 489 (క్రీ. శ. 567). తరువాత మూడు సంవత్సరముల కాల మాతుడు జీవించి యుండవచ్చును.

గోవిందవర్మ ఇంద్రపాల నగర తామ్రశాసనమువలన విష్ణుకుండిన వంశ చరిత్ర క్రీ. శ. 388 నుండి ఆరంభమగుచున్నది. అనగా శాలంకాయనులు ఆంధ్రదేశమును పాలించుచుండిన కాలమున విష్ణుకుండిన వంశీయుడగు మహారాజేంద్రవర్మ ఇంద్రపాల నగరమును రాజధానిగ తెలంగాణ ప్రాంతమును పాలించి యుండవచ్చును. మహారాజేంద్రవర్మ కుమారుడు మొదటి మాధవవర్మ. ఈతని కుమారుడు గోవిందవర్మ. ఈ గోవిందవర్మ వేయించిన ఇంద్రపాల నగర శాసన మాతని 37 వ విజయరాజ్య సంవత్సరపుది. విక్రమేంద్ర భట్టారకవర్మ ఇంద్రపాల నగర శాసనములో గోవిందవర్మ ప్రశంస కలదు. ఈ గోవిందవర్మ ఇంద్రపాల నగర శాసనము వేయించిన గోవిందవర్మయు నొక్కరే. గోవిందవర్మ కుమారుడు రెండవ మాధవవర్మ. ఈతడే వాజపేయ, అశ్వమేధాది యజ్ఞము లాచరించి వాకాటక రాజకుమార్తెను వివాహమాడినాడు. ఈరెండవ మాధవవర్మనే చారిత్రకు లింతవరకు లభించిన శాసనముల నాధారముగా మొదటి మాధవవర్మయని నిర్ణయించినారు. తరువాతి వంశ క్రమమునకు విక్రమేంద్రభట్టారకవర్మ ఇంద్రపాల నగర శాసనమందలి రాజులపేళ్లు సరిపోవుచున్నవి. కావున విష్ణుకుండిన వంశము మహా రాజేంద్రవర్మతో ప్రారంభ మగుచున్నది.

వడిబాఱు జలమున కొడలెల్ల గాళ్లు
వడిగాలు చిచ్చున కొడలెల్ల నోళ్లు

(పాల్కురికి బసవపురాణం)

అసుర సంధ్య

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

అసురసంధ్య వేళ....

"గాంధీమహాత్ముణ్ణి ఎవరో చంపివేశారట, వదినా !"

"ఆఁ ?"

"ఇందాక రేడియోలో చెప్పారుట."

వీధి అరుగుమీద నిల్చుని పక్కింటావిడతో ఒక ఇల్లాలు అంటున్న మాటలు విన్నాడు శ్రీధర్.

ఎవరినీ ? గాంధీగారినా !! నిజమేనా ?? చప్పున నమ్మకం కలగలేదు. కొన్ని క్షణాలు వాళ్ల వైపు చూస్తూ ఆగిపోయిన శ్రీధర్, పార్కు రేడియోవైపు నడుస్తున్నాడు.

వెనుకనుంచి వడిగా దూసుకువచ్చారు ఇద్దరు పిల్లలు. ఒకడి భుజం శ్రీధర్ కుడిచేతికి గట్టిగా తగిలింది. భుజాన్ని తడుముకొంటూ ఆగిపోయా డా అబ్బాయి. వానితోబాటు రెండోవాడూ ఆగాడు. ఇద్దరూ వెనక్కి తిరిగి శ్రీధర్‌వైపు చూస్తున్నారు.

"ఫరవాలేదు, వెళ్లండి" అన్నాడు శ్రీధర్.

"ఏమండీ, గాంధీగారు పోయారటండీ, మీకు తెలుసా?" అన్నాడు పెద్ద పిల్లవాడు.

"అవునట ?"

"మీరు రేడియోలో విన్నారా ? ఏం చెప్పారండి ?"

"లేదు .... పార్కు రేడియో దగ్గరకు వెళ్తున్నాను."

"మేమూ అక్కడికేనండి."

పిల్ల లిద్దరిలో చిన్నవాడికి ఏడేళ్లుంటాయి. నడుస్తూ ముఖమెత్తి ఆత్రంగా శ్రీధర్‌ను ప్రశ్నించాడు వాడు : "గాంధీ గారు చచ్చిపోతే, స్వరాజ్యం పోదా అండీ ?"

అమాయకపు ప్రశ్నకు ఏం చెప్పాలో తోచలేదు శ్రీధర్‌కు. "ఎందుకు పోతుంది ? .... మిగతా నాయకులు లేరూ ? ప్రభుత్వం నడిపేది వాళ్లేగా ? .... అసలు ప్రభుత్వా నికీ గాంధీగారికీ సంబంధమే లేదు !.... స్వరాజ్యం ఎందుకు పోతుందీ, పోదు ! .... కాని గాంధీని ఎవరైనా చంపటమేమిటి ?"

"రఘుపతి రాఘవ రాజారాం" భజన వినిపిస్తున్నది పార్కు రేడియోలో.

జనం ప్రవాహంగా పార్కులోకి వచ్చేస్తున్నారు.

రేడియో చుట్టూ పెద్ద గుంపు ....

జనం ముగ్గురుగా, నలుగురుగా అక్కడక్కడా కూర్చున్నారు.

.... ఆత్రంగా, కుతూహలంగా, విచారంగా ....

గాంధి నిర్యాణ వార్తను మళ్లీ ప్రసారం చేసింది రేడియో.

ప్రసారం పూర్తికాగానే సగం జనం వెళ్లిపోయారు. శ్రీధర్‌తో వచ్చిన పిల్లలు ఇంటికి వెళ్లిపోయారు.

రాత్రి తొమ్మిది పదిహేనుకు నెహ్రూ, పటేల్ రేడియోలో మాట్లాడతారని ప్రకటన వెలువడింది. శ్రీధర్ కూర్చుండిపోయాడు పార్కులోనే ఒంటరిగా.

మనస్సు గాంధీ మరణించిన అంతిమ దృశ్యాన్ని ఊహిస్తోంది......

పిస్తోలు దెబ్బలతో రక్తసిక్తంగా నేలకు ఒరిగిపోతున్న గాంధీ మూర్తి .... బాధ—రక్తం—మృత్యువు .... లిప్త కాలంలో చైతన్యంలోనుంచి నిశితంగా దూసుకుపోయే ఒక బాధాస్పృహ .... అది మెఱుపులా సోకటం .... ఆత్మనాద స్వరూపమైన 'రాముని' తో ఐక్యం కావటం ! .... నిజంగా అది మహాత్ముని నిర్గమనమే !

నిండు ప్రాణంలో దూసుకుపోయిన ఆ పిస్తోలు గుండు ప్రపంచ చైతన్యంలో మంచే చొచ్చుకుపోయింది. ఒక్క లిప్తలో—అందుకే యింతమంది హృదయాల్లో గాయం !

"మరి స్వరాజ్యం పోదాండీ ?"

పసివాని ప్రశ్న హాస్యాస్పదంగా ఉన్నా అందులో నిండి ఉన్న దిగులేదో అది మాత్రం అందరిలోనూ స్పష్టంగా తెలుస్తూనే ఉంది. .... ఇన్నాళ్లనుంచీ ఉంటున్న గాంధి .... ఇంకెప్పుడూ యిలానే ఉంటాడని ఏదో నమ్మకాన్నీ, భ్రమనూ, కలిగించిన గాంధీ .... ఇప్పుడు లేడనగానే ఏదో అర్థంకాని భయం !—ఈ క్రొత్త పరిస్థితి .... అలవాటు కావటం సులభంకాదు !

హాస్యాస్పదమైన ఆ ప్రశ్న కొక విశేషార్థం కూడా ఉంది. గాంధీ లేకపోతే స్వరాజ్య మేమిటి ? భూమిమీద వడచిన కైలాస శిఖరం గాంధీ; ఆ శిఖరంవైపు అఞ్జలులు చాచుకుని గర్వంగా నిలబడిన భారతీయులు, వీళ్లు స్వరాజ్యం పొందారు. పొంది సాధించే దేమిటి ? దేశం స్వతంత్రమైంది. ఫలితంగా రక్తపాతం, ద్వేషం, అమానుష ప్రవర్తన, భీభత్సం. "ఈ చీకటిలో నాకు వెలుగు కనిపించటంలేదు." అన్నాడు గాంధీ. ఆయన అన్వేషణ యీ ఆత్మార్పణతో ముగిసిపోయినట్లేనా? ఫలితమేమీ నిలవదా, మిగలదా ? ....

మొదటిరోజుల్లో శ్రీధర్ ఊహలో గాంధీ అంటే కేవలం ఒక వివాదం, ఒక మంత్రం, ఒక ఉద్యమం.

1943 లో ఆయన నిరశనదీక్ష పూనినప్పుడు, తోటి విద్యార్థులతో శ్రీధర్ కూడా ఉపవాసవ్రతం చేసి ప్రార్థనలు చేశాడు. గాంధీగార్ని గూర్చి చదివాడు. గాంధీ ఒక మహోన్నతమైన ఆదర్శంగా మనస్సులో ఆవిష్కరణ జరిగింది.

1945 లో మద్రాసులో బి. ఎస్‌సి. ఫైనల్ చదివే రోజుల్లో గాంధీజీ దర్శనం లభించింది. ముసలితనమే ఒక అపురూప సౌందర్యంగా గాంధీమూర్తితో దిద్దుకుంటున్నట్లు తోచింది .... అది ముసలితనం కాదు, కేవలం ఆత్మ పరిపక్వత, అది ఒక వెలుగు !

గాంధీ అంటే ఒక ఆదర్శంగా మనస్సులో ఇదివరకు ఏర్పడిన భావం, ఊహ, నిరీక్షణా ఆయన్ని ప్రత్యక్షంగా చూడటంవల్ల ఏమాత్రం భంగపాటు చెందలేదు సరికదా అప్పట్లో కల్పనే యదార్థం నుంచి రంగుల్ని దిద్దుకున్నట్లయింది. గాంధీగారితో ఏదో వ్యక్తిగతమైన బంధమే ఒకటి ఏర్పడింది తనకు .....

తను గాంధీయుగంలో పుట్టాడు. ఆయుగం నేటితో అంతమైంది. ఇకనుంచి గాంధీ మళ్లీ కేవలం ఒక ఆదర్శం, ఒక వివాదం కాబోలు !

తొమ్మిది గంటలైంది. భూమి నలుమూలల్నించి వచ్చిన సంతాపసందేశాల్ని వినిపిస్తోంది రేడియో.

"అతి సాధువుగా ఉండట మెంత ప్రమాదకరమో !" అని బెర్నార్డుషా వ్యాఖ్యానం. సంతాప సందేశంలోనూ తన్ను తాను మరువలేకపోయాడు షా !

నెహ్రూ రుద్ధకంఠం విన్పించింది. "ఒక పిచ్చివాని అకృత్యం" .... అనంతమైన దుఃఖంలో కోపానికి తావెక్కడ !

రేడియో మూగవోయింది. జనం ఇండ్లకు మళ్లారు.

* * *

"ఏమిటో కడుపులో నొప్పిగా ఉందండీ తెల్లవారుట .... ఇవాళ్టికి మీరు షికారు వెళ్లకపోతే నేం ? సమయానికి మీరు దగ్గరుండకపోతే నాకు భయం వెయ్యదూ ?' అన్నది శ్రీధర్ భార్య తార ఆ సాయంత్రం అతను షికారు బయలు దేరుతూండగా. ఆమెకు ప్రసవించే రోజులు. ఆమెకోసమే పది రోజులు సెలవుతీసుకుని, ఉద్యోగంచేస్తున్న మద్రాసునుంచీ బందరు వచ్చాడు శ్రీధర్.

తారతో అతనికి నచ్చని గుణం: ఆమెకు సత్యంమీద బొత్తిగా గౌరవంలేకపోవటం. నొప్పి లేకపోయినా ఉందని చెబుతుంది ! ఏ మాటలతో భర్తని లొంగదియ్యాలో, ఎప్పుడెలా నిర్బంధించాలో ఆమెకు బాగా తెలిసిన విద్య. ఆమె మాటలకీ యథార్థానికీ సంబంధమే ఉండదు ! అనుభవంమీద ఈ సంగతి ఎంత బాగా తెలిసి వస్తున్నా, ఎప్పటికప్పుడు ఆమె సమ్మోహనాస్త్రాలు పనిచేస్తూనే ఉన్నాయి. తనమీద కనీసం యీ ఒక్కసారైనా అలా జరక్కూడదనే షికారు బయల్దేరాడు తను .... ఇంతలో గాంధీని గూర్చిన యీ ఘోర వార్త .... తార కోరినట్లు నిజంగా ఆమెతో మాట్లాడుతూ ఉండటానికే అయితే తను ఉండిపోయేవాడే ! కాని ఆమె వంటయింట్లో తల్లిదగ్గర పీటవేసుక్కూచుంటుంది. లేకపోతే అక్కయ్యతో ఆప్యాయంగా కబుర్లు చెప్పుకుంటూ ఉంటుంది. భర్త మాత్రం భద్రంగా పిధి గదిలో కూచుని ఉండాలని ఉద్దేశ్యం. అందుకు ఏవో మాటల్ని వలగా విసరటం: అవి నిజమైనా అబద్ధమైనా, వాటికి అర్థంఉన్నా లేకపోయినా, ముందుకాళ్లకి బంధాలు వేయుటమే ఆమె లక్ష్యం.

ఒకవేళ ఆమెకు ప్రసవవేదనే వస్తే తను దగ్గర ఉండి మాత్రం చేసేది ఏమిటి ? నిజానికి ఆమె బంధువులే ఆమెకు ఎక్కువ కావలసినవాళ్లు. వాళ్ల తర్వాతే తన స్థానం. ఒక సారి కాదు, ఎన్నోసార్లు మాటలలో ప్రవర్తనలో అలా రుజువు చేసింది తార. పుట్టింటికి వచ్చిన ఆరు మాసాల్లో నా ఆమె వ్రాసిన మొత్తం ఉత్తరాల సంఖ్య ఆరు ! ....

తారకు కోపం తెప్పించాలనే షికారు బయల్దేరినా విందు భోజనాలుగా ఉన్న భార్య మనస్సుకి కష్టం కలిగించటం మంచిదా, పోనీ, యీ ఒక్కసారి తను ఆమె మాట మన్నించి ఉంటే ఏం పోయేది ? అనిపించింది. ఎందుకో తనకీ పట్టుదల !

ఇలాంటి సమస్యలేవీ రాకుండా దాంపత్య జీవితం సవ్యంగా ఎందుకని సాగిపోదో ! ఒక మనిషి జీవితమే కాని, ఒక దేశ చరిత్రేకాని సవ్యంగా నడవకపోవటానికి కారణం ఏముంది ? దురదృష్టం, దౌర్భాగ్యం అంతకంటే సరియైన సమాధానమే లేదా ? లేకపోతే ఉన్నట్టుంటి గాంధీగారి నెవరో ఎందుకు హత్యచేయాలి ?

ఇంటి అరుగుమీద నిల్చుని ఉన్న వ్యక్తి శ్రీధర్ నమిపించటంతో లోపలికి వెళ్లిపోయాడు. ఆ వ్యక్తి మామగారు ! తనింకా రాలేదని ఎదురుచూస్తున్నాడా ఏమిటి ? క్రొత్తగా ఉందే ! ....

లోపలికి వెళ్లేటప్పటికి ఎవరూ కనిపించలేదు. శ్రీధర్ కుర్చీలో కూర్చున్నాడు. అయిదు నిమిషాల తర్వాత అతని మామగారైన వెంకయ్యగారు గదిలోకి వచ్చి ఎదురుగా పడక కుర్చీలో కూర్చున్నారు.

"నువ్వు వెళ్లి భోంచెయ్యి. రంగమ్మ వడ్డిస్తోంది... వాళ్లు ఆస్పత్రికి వెళ్లారు." అన్నా డాయన.

మాట్లాడకుండా లేచి లోపలికి వెళ్లాడు శ్రీధర్.

అయితే తారకు ప్రసవవేదన నిజంగానే వచ్చిందన్న మాట ! ఒకసారి అబద్ధం, ఒకసారి నిజం చెప్పేవాళ్లను ఎలా నమ్మటం ? ఆదేదో కథలో : "పులి" అని రెండుసార్లు ఊరికే అన్నాడట కుఱ్ఱవాడు. మూడోసారి పులి నిజంగానే వచ్చింది. ఎవరూ రక్షించటానికి రాలేదు. ఫలితం కుఱ్ఱవాణ్ణి పులెత్తుకుపోయింది .... దేవుడు మేలుచేస్తే తారకే ప్రమాదమూ రాకూడదు !

పాంటు విప్పి మడిచిపెట్టి ధోవతి కట్టుకున్నాడు. షర్టు మార్చుకోలేదు. భోంచెయ్యగానే ఆస్పత్రికి వెళ్లాలి కాబోలు !

కాళ్ళూ, చేతులూ కడుక్కొని అన్నం ముందు కూర్చున్నాడు.

ఆస్పత్రిలో ఏం జరుగుతూ ఉంటుందో! తను వెళ్ళి ఏం చెయ్యాలి ? అక్కడ తన్నెవరూ పలకరించకపోతే ఎలా ఉంటుంది ? వెళ్ళకపోతే మామగారూ, అత్తగారూ, వదిన ఏమనుకుంటారు ? తనకేమీ పట్టదు, తనకు తారమీద ప్రేమ లేదని అనుకుంటారా ? తన్నొక వింత మృగంగా చూస్తారా ? ఇప్పటికే చూస్తున్నారు, దానికి కింకొక వన్నె కలుస్తుంది, అంతే !

"ఏం బాబూ, కూర బాగులేదా ? తినటమే లేదు!" అంటోంది రంగమ్మ.

"పిళ్ళు ఆస్పత్రికి వెళ్ళి ఎంతసేపైంది ?"

"ఏనిమిది దాటి ఉంటుంది బాబూ, అప్పుడే అయ్య గారు భోజనం ముగించుకున్నారు, మీరింకా రాలేదే, ఆలస్య మైందనుకుంటూ. అమ్మాయి నొప్పులొస్తున్నయ్యంది. అమ్మగారు గబగబా అన్నంతిని బండి పిలిపించింది. ఆస్పత్రికి తీసు కెళ్ళిపోయారు. తర్వాత పెద్దమ్మాయి నెమ్మదిగా కావలసిన వన్నీ పట్టుకెళ్ళారు .... అయ్యగారు ఇందాకనే తిరిగొచ్చారు ..."

"రంగమ్మా, నేనూ వెళ్ళాలంటావా ?"

"అదేంటండీ, వెళ్ళి చూసిరండి .... దగ్గరే .... మొదటి కాన్పు గదండీ, కాస్త ఆదుర్దాగానే ఉంటుంది మరి...."

శ్రీధర్ వెళ్ళటానికే నిశ్చయించుకున్నాడు.

అన్నం సయించనేలేదు.... ఏమిటేమిటో అన్నీ ఒక్క సారే జరిగిపోతున్నా యనిపించింది .... విస్తరిముందు నుంచి లేచాడు.

"పెరుగు తెచ్చాను, అంతలోనే లేచారేంటండీ ?"

"వద్దు రంగమ్మా, ఆకలి కావటంలేదు..... గాంధీగారు పోయారు విన్నావా ? .... పార్కు రేడియో దగ్గర కూర్చు న్నాను, ఆలస్యమైపోయింది .... పాపం, రోజా నువ్వీపాటికి వెళ్ళిపోయేదానివి కూడా !"

"అవును బాబూ, దీపాలు పెట్టాక యీ బజార్లో అనుకుంటున్నారు .... ఎవరో కాల్చేశార్ట కాదూ ! ఏం కాలం బాబూ ! .... మీ రెళ్ళిరండి ఆస్పత్రికి .... మంచినీళ్ళ చెంబు మీ మంచం దగ్గర పెట్టి పడుకుంటాను."

శ్రీధర్ హాల్లోకి వెళ్ళేటప్పటికి వెంకయ్యగారు పేపరు చూస్తున్నారు దీక్షగా .... నిజంగానే చదువుతున్నారా ? అనిపిం చింది శ్రీధర్‌కు. అందులో సంగతులమీద ఆయన మనస్సెలా నిలుస్తోంది ! ఒకవైపు గాంధీగారు పోవటం, ఇంకోవైపు కుమార్తె ఆస్పత్రిలో తొలిసారి పురుడుపోసుకుంటూ ఉండటం ఈ రెండిటినీ దాటి ఇంకో విషయంమీద ఎవరికైనా మన స్సెలా పనిచేస్తుందీ, నెమ్మదిగా పేపరు చదవటానికి !

రెండు నిముషాలు కుర్చీలో కూర్చొని నిరీక్షించాడు. మామగారు తలెత్తి చూడలేదు ! చివరకు లేచి నిల్చున్నాడు శ్రీధర్.

"శ్రీదేవి నర్సింగ్‌హోంకేనా వెళ్ళిందీ ? .... నే నట వెళ్ళొస్తాను."

పేపరు పక్కకుతీస్తూ వెంకయ్యగారు : "ఆఁ ? .... ఆఁ !.... అక్కడికే" అన్నారు ప్రత్యుత్తరంగా. తర్వాత పేపర్ని సగానికి మడిచి, అలానే దాన్ని పొట్టమీద పెట్టుకుని, పైకప్పుకేసి చూస్తూ ఉండిపోయారు. మరో మాట లేదు.

ఒక్క క్షణం చూచి, శ్రీధర్ వీధిలోకి వచ్చాడు.

వీధి మాటుమణిగింది. అవతల సందులో కుక్క మొరుగుతోంది. ఒక్క సాయంత్రంతో లోకమే మారి పోయిందే ! తారకు కోసం తెప్పించి అలా వీధిలోకి వెళ్ళాడో లేదో గొప్ప దుర్వార్త వినవలసి వచ్చింది .... తార ఎలా ఉందో!

ఒక వెన్నెలరాత్రి : ట్రిప్లికేనులో మేడమీద అద్దెకున్న పోర్షను వరండాలో ఆరు బయట, సినిమాకు వెళ్ళివచ్చి పడు కున్నారు తారా, తనూ. ఉక్కపోసి ఉడికిన దేహం చల్లగాలికి హాయిగా దిరుసెక్కుతూ ఉంటే, దూరాన సముద్రపు హోరూ, తార జడలో జాజిపూల వాసనా, స్వప్నంలాంటి వెన్నెలా .... సినిమాలో హాస్యం గుర్తుకుతెచ్చి మాటిమాటికి కిలకిలా నవ్వుతోంది తార. గిలిగింతలు పెట్టాడు, జడ పట్టుకు లాగాడు, మెడవాటేసుకుని పువ్వుల్లో ముఖం దూర్చి మత్తులో కరిగిపోయేడు .... ఆకాశమూ, వెన్నెలా, సముద్ర ఘోషా, భూమి తావమూ అన్నీ తనుగా లీనమైన ఒక స్వర్గానుభూతి అది .... అదే హేతువు యీ రాత్రికి, తప్ప కుండా ఆ రాత్రే ! తనకు గట్టి నమ్మకం.

ఆ రాత్రే, పాపం, నెలలు నిండి యీ రాత్రిగా చీకట్లో ప్రసవవేదన పడుతోంది !

ఒకోసారి తను ఆకాశంగా, తార భూమిగా, చీకట్లో గమ్యం తెలిని ఆన్వేషణలో సమాంతరంగా అలసిపోతే చివరకు నిద్రలో స్పృహ తప్పిపోయేది .... ఒకోసారి బాగా పోట్లాడు కుని ఒకరి నొకరు మాటలతో గాయపరచుకుని కన్నీళ్ళ పర్యంత మైనప్పుడు చివరకి పరస్పరాలింగన సౌఖ్యమే మనస్సులోని గాయాలకి ఆలేపన మయ్యేది .... లేకపోతే తనకోసం, ఆ మొండితనం, ఒకదాని కొకటి లొంగకుండా యుద్ధంచేసి, దేని కదే భంగపడి సిగ్గుపడి, క్రమంగా ఆరిపోయే చితిలాంటి అను భవమై మనస్సునే బూడిదగా మార్చేది ....

దాంపత్యానుభూతి రెండేళ్ళల్లో ఎన్నో అవతారాల్ని దాల్చింది .... స్త్రీ పురుషుల కలయిక కేవలం శారీరకమూ కాదు, దానికి ఏకరూపమూ లేదు .... అది విచిత్రమైంది, ఎప్పటికప్పుడు నిత్యనూతనమైనదీ, క్రొత్తదీ .... ఎంత తరచినా అర్థంకానిది .... తెలిసినా తెలినిదీ ! .....

ఆ వెన్నెలరాత్రికీ ఈ చీకటిరాత్రికీ పోలికే లేదు. ఆ అను భూతి పరిపూర్ణతకూ యీనాటి రాత్రి తన మనోవైకల్యానికీ ఎక్కడి పోలిక ? .... తల్లిదండ్రులకూ సంతానానికీ పోలికలు ఇదమిత్థమని నిర్ణయింలేదు ఎక్కడా !

గాంధీగారి పితృత్వానికీ స్వరాజ్య శిశువుకీ పోలిక ఉందా ?

పుట్టబోయే శిశువు మాత్రం తను కోరినట్లు ఉంటాడా ?

నర్సింగ్‌హోమ్‌లో వదినె నాగరత్నమ్మ ఎదురైంది. తార కుద్దేశించిన మంచం ఖాళీగా ఉంది. అత్తగారు కూడా కన్పించ లేదు. నాగరత్నమ్మ శ్రీధర్‌ను చూడగానే : "ఇంకా లేదు .... ఇప్పుడే లోపలికి తీసుకెళ్లారు .... భయమేం లేదనే చెప్పింది డాక్టరు .... మీరు రావట మెందుకూ ? అవసరమొస్తే కబురు పెడతామని చెప్పావ్వామే నాన్నగారితో.... రంగన్నను ఇక్కడే ఉంచాము అందుకోసం."

'మీరు రావట మెందుకూ ?' అన్న మాటలో ధ్వనించిన వెటకారాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలీలేదు. దాన్ని గుర్తించనట్టే : "ఎంతసేపైంది మీ రిక్కడకు వచ్చి ?" అన్నాడు.

"తార సాయంత్రమే చెప్పిందటగా మీతో ! ఆవేమో తొలి నొప్పులు .... తర్వాత అరగంట, గంటకు బాగా వచ్చాయి. మీ రెంతకీ రాలేదు, ఆలస్యం చేశారు .... దానికేమో అదుర్దా మీరు దగ్గర లేరని .... 'ఆయ నింకా రాలేదే' అంటూనే ఉంది ఇప్పటిదాకా !"

"ఇప్పుడు చూడవచ్చా ?"

"ఇప్పు డెలా చూస్తారూ ?" దీర్ఘంతీసింది. శ్రీధర్ ప్రశ్న ఎంత తెలివితక్కువగా ఉందో కంఠంలో ధ్వనింప జేసింది.

శ్రీధర్‌కు ఇక అక్కడ ఉండటానికి మనస్కరించ లేదు. లేచాడు.

"నే ననుకోలేదు .... నిన్నా మొన్నా కూడా 'ఎలానో ఉంది' అంటూనే ఉంది కదా , ఇవాళ అయితే కాబోలు ననుకున్నా."

"రోజా అంతే ఎలా అవుతుందీ ? .... ఎప్పుడో, ఏ క్షణమో ! .... నెలలూ రోజులు నిండాక ఎప్పుడైనా సిద్ధంగా ఉండాలిసిందే !"

"నేను వెళ్ళనా ?"

"వెళ్ళక మీరుండి చేసేదేమిటి ? వెళ్లి పడుకోండి, తెల్లారాక చూద్దురుగాని మీ సుపుత్రుణ్ణి !"

సిగ్గుతో నవ్వాడు శ్రీధర్. ఆ చివరి మాటలో ధ్వనించిన సద్భావానికి కొంత తృప్తి కలిగింది .... ఇంటికి బయ ల్దేరాడు.

'రోజా అంతే ఎలా అవుతుందీ ? ఎప్పుడో ఏ క్షణమో అని సిద్ధంగా ఉండాల్సిందే' .... అయితే ఆ పులి కథలో తప్పు పెళ్లనివాళ్ళదే గాని, కుఱ్ఱవాడిది కాదన్నమాట ! కుఱ్ఱవాడి కుఱ్ఱతనాన్ని వాళ్ళు సరిగా అర్థం చేసుకోలేదు ! చిన్నతనంలో పుస్తకాల్లో నేర్చుకున్న నీతులు జీవితంలో తిరగవేసి నేర్చు కోవాలి కాబోలు ! లేకపోతే జీవితం అర్థంకాదు !

ఆస్పత్రినుంచి తిరిగివచ్చి పడుకున్నాడు శ్రీధర్.

కన్నులు మూసుకొంటే రక్తపు మడుగులో పడిపోయిన గాంధీ కనిపిస్తున్నాడు. అంతలో వ్యూహ జారుతూ, గాంధీ బదులు తార రక్తపు మడుగులో ఉన్నట్లూ, బాధగా 'రామా' అని మూలుగుతున్నట్లూ ..... తార ముఖం స్పష్టంగా కని పిస్తూ అందులో ఒక క్రొత్త వన్నె స్ఫురిస్తోంది.... మెలకువ .... ఆలోచన ప్రారంభం.... నిద్ర రావటంలేదు అతనికి.

తార వ్యక్తిత్వంలో యిదివరకు కనపడని ఒక ఉదాత్తత గోచరిస్తోంది .... మాతృత్వాన్ని పొందుతున్న తార, పుట్ట బోయే శిశువుకోసం రక్తంలో ఆత్మార్పణ చేస్తున్న తన భార్య, తను సాధించలేనిదాన్ని దేన్నో సాధిస్తున్నది. యమునితో పోరాడిన సావిత్రిలా మృత్యువుతో నోటితో తల దూర్చి, ఈ లోకపు జీవితానికి అవతలి గట్టు నుంచి ఒక శిశువును, ఒక దేవతామూర్తిని, ఒక అమృతకలశాన్ని తనకోసం సంగ్ర హించుకొని వస్తోంది' ; తన కందీయబోతోంది !.... ఆమె తప్పుల్ని లెక్కించటానికీ, ఆమె లోపాల్ని విమర్శించటానికి తనెవ్వరు ?

2

తెల్లవారి లేవగానే రంగమ్మ కబురు చెప్పింది. తార ఆడపిల్లను ప్రసవించిందని. రంగన్న వార్త తీసుకొచ్చి ఆస్పత్రికి కాఫీ వగైరా పట్టుకు వెళ్లాడట. తర్వాత అత్తగారు వచ్చి వెళ్లారట. మామగారి జాడ లేదు. నిద్ర లేచారో లేదో మరి !

కొడుకే పుడతాడని ఎందుకో శ్రీధర్‌లో చాలా నాళ్ళుగా ఏర్పడిపోయిన నమ్మకం, అది వట్టిదై పోయింది. అన్నయ్యకు ఇద్దరు ఆడపిల్లలు: శ్యామల, సీత. అందుకే కాబోలు మగపిల్లవాడు కావాలని తనకు కోరిక. ఈవార్త తన వాళ్లకేమీ ఉత్సాహం కలిగించబోదు. ఏమైనా తనకు ఒక ఆడ పిల్ల, కొమార్తె ! ఇకనుంచీ అలా అలవాటు పడాలి.

స్నానం వగైరా పూర్తిచేసుకొని దుస్తులు వేసుకొనే టప్పటికి రంగమ్మ టిఫిన్, కాఫీ, సిద్ధంగా ఉంచింది.

"తొలికాన్పు లక్ష్మిందేవి పుట్టటంవే అదురుష్టం బాబూ !" అంటోంది రంగమ్మ సంతోషాన్ని రేకెత్తింపజేయా లనే ఉద్దేశంతో. 'రంగమ్మ హృదయం మంచిది' అను కున్నాడు శ్రీధర్.

అతను ఆస్పత్రికి చేరుకునేటప్పటికి అత్తగారు పాప పొత్తిళ్లను సర్దుతోంది. తార ఆసక్తిగా, శ్రద్ధగా, కించిత్ గర్వంతో గమనిస్తోంది. శ్రీధర్ వెళ్లి నిలబడగానే తార కళ్లు అతనివైపు తిరిగి లిప్తలో మళ్లీ ప్రక్కకు తిరిగాయి. అత్త గారు అతన్ని పలకరించకుండానే గదినుండి బయటకు వెళ్లి పోయింది. మాట్లాడకుండా తార కళ్ళు మూసేసుకున్నది.

దగ్గరకు వెళ్లి ఆ చెంపను ముని వ్రేళ్లతో తాకాడు.

"కోపమా ?"

ముఖం తప్పించింది తార.

"నన్ను తాకుతా రెందుకు ?.... అదుగో పాప, చూడా లంటే చూడండి !"

పాప దగ్గరకు వెళ్లాడు. వంగి పరీక్షగా చూశాడు. చాల చిన్నగా, లేతగా, మసగ్గా, ఎఱుపుగా, కానుగచెట్టులో అప్పుడే విచ్చిన చిగురుటాకు మళ్లే నవనవలాడుతూ కోమ

లంగా ఉంది! తాకాలనిపించింది. సాహసించలేకపోయాడు. పిడికిళ్ళు మూసుకుని ఆ రెండు బుల్లిచేతుల్నీ చెవులకు దగ్గరగా పెట్టుకొని వెల్లకిలా పడుకొన్న ఆ బొమ్మ "ఇదుగో నీకోసం ఏం తెచ్చానో చెప్పుకో" అని చేతులెత్తి తనను పిలిచి కవ్విస్తోంది! మళ్ళీ చప్పున చిలిపిగా కళ్ళు మూసికొని నటిస్తోంది! ఊహిస్తూ శ్రీధర్ నవ్వుకున్నాడు.....

ఏం తెచ్చిందో యీ పాప తనకోసం? ఎందుకు వచ్చిందో ఆవలిగట్టునుంచి యీ లోకానికి? వైతరణి అంటారే ఆ చీమూ నెత్తురు నదిని ఎలా దాటి ఎంత శ్రమపడి వచ్చిందో? తన్ను కవ్వించటానికేనా? ....

"ఏమిటా చిదానందం? చాల సంతోషిస్తున్నట్టున్నారే!" అన్నది అతణ్ణే తదేకంగా గమనిస్తున్న తార.

ఆ 'చిదానందం' అన్న పదాన్ని అతనెప్పుడు సంతృప్తిగా సంతోషంగా ఉన్నట్టు కన్పించినా ప్రయోగిస్తుంది తార. అదొక వెక్కిరింపు!

"నీ యీ ఘనకార్యానికి చిదానందమే మరి!" అన్నాడు. అతని మనస్సు యుద్ధ సన్నద్ధంగా మారింది. మరచిపోబోతున్న ఆశాభంగమే అస్త్రంలా పనికివచ్చింది ఆమెమీద ప్రయోగానికి.

"ఆ! ఎవరి ఘనతో తెలుస్తూనే ఉంది!" అని ముఖం శ్రీధర్‌కు కనిపించకుండా అటువైపు తిరిగి పడుకొన్నది తార ... . ఆమె కంఠంలో తొణికిన దుఃఖం, ఆమె కన్నీళ్ళ పర్యంతం కావటం, అతణ్ణి పూర్తిగా ఓడించేశాయి. ఊహించలేదు యింత చప్పున సే దాపోహం అనవలసి వస్తుందని ......

పాపను విడిచి ఆమె దగ్గరకు వెళ్ళాడు. ఆమె తల స్పృశించాడు.

"నిజంగా నాకేం కొరతలేదు తారా! నా క్కావలసింది కూతురేనని పాపను చూడగానే తెలుసుకున్నాను .... అందుకే నాకు సంతోషంగా ఉంది.... పాప ఎంత చక్కగానో ఉంది కదా బొమ్మల్లే!"

తార కళ్ళు తుడుచుకుని ఏం మాట్లాడలేదు.

"నామీద కోపంగా ఉందా నీకు?" అన్నాడు.

ఆమె ఇటువైపు తిరిగి పాప వంక చూస్తూ: "మీరు నిన్న సాయంత్రం వెళ్ళకుండా నా దగ్గరే ఉన్నట్లయితే అబ్బాయే పుట్టేవాడు ..... అని నా నమ్మకం" అన్నది.

"ఎన్నో నెలల క్రితం ఆ సంగతి ఏర్పడిపోయి ఉంటుంది తారా!"

"ఏమీ కాదు! అదంతే! మీ ప్రయోజకత్వం, కబుర్లు చెప్పటానికీ, వాదించటానికీ అయితే సరి! నిన్న వెళ్ళకపోతే ఏం మునిగిపోయేది? నామీద కచ్చకు వెళ్ళారుగాని ...."

"నిన్న గాంధీగారు పోయ్యారు, తెలుసా నీకు?"

"పోతే పోయారు, నాకేం?"

"ఏమిటా మాట! లోకమంతా దుఃఖిస్తుంటే నీ కొక్కదానికే విచారంలేదు! ఎప్పుడూ నువ్వూ నీ సంగతే! వీధిలో జనం గుంపులు గుంపులుగా రేడియోల దగ్గర మూగి వింటున్నారు. కొట్లూ, హోటళ్లూ అన్నీ కట్టేశారు. రేడియోలో దేశ నాయకులు గాంధీకి జోహార్లు అర్పిస్తున్నారు.... నిన్న సాయంత్రము ఎంత ఘోరం జరిగిందో, లోకం ఎంత విచారిస్తోందో ఊహించుకోలేవా?"

"అయితే మిమ్మల్నిక్కడ ఉపన్యాస మిమ్మన్నారు కాబోలు! మీరూ వెళ్ళి ఆ రేడియోలోనే మాట్లాడండి. నాకు అలసటగా ఉంది, నేను నిద్రపోవాలి!"

ఆమె నిద్ర కుపక్రమించింది.

తనకు ముఖ్యమైనవేవీ ఆమెకు ముఖ్యం కాదు. అయినా యింత తిరస్కారభావ మేమిటి?

"నేను వెళ్తున్నా. సాయంత్రం రమ్మంటావా?"

కళ్ళు తెరచి చురుగ్గా చూచింది. విసురుగా:

"మీ యిష్టం! .... సాయంత్రం మీటింగేమైనా ఉంటుందేమో వెళ్ళండి, ఎలా వస్తారు?" అని మోచేయి నొసటి మీదుగా వేసుకున్నది నిద్రించే ప్రయత్నంలో తార.

శ్రీధర్ మళ్ళీ పాపాయి దగ్గర ఒక్క క్షణం నిల్చుని చూచి తర్వాత గది వెలుపలికి వచ్చేశాడు.

"ఏమిటి, అప్పుడే వెళ్ళిపోతున్నారు, మరదిగారు?" అంటూ వరండాలో వస్తూన్న నాగరత్నమ్మ శ్రీధర్‌ను చూచి అన్నది.

ఒక్కొక్కసారి తెచ్చిపెట్టుకున్న ఆప్యాయతతో ఆమె పలకరించటం, అది ఏదో ఎత్తిపొడుపుకు ఉపోద్ఘాతమేనని శ్రీధర్‌కు తెలుసు.

"తార నిద్రపోతా నన్నది, వచ్చేశాను."

"పాపను చూశారా అచ్చం తను పోలికే! .... ఆడపిల్లకు తండ్రిపోలిక రావటం అదృష్టమే అంటారు మరి!"

"ముక్కూ మొహం ఏర్పడకుండానే పోలికలేం తెలుస్తాయి?" అన్నాడు ఆత్మరక్షణోపాయంగా.

"తెలిసినవాళ్ళకి గాని తెలీదు... ఆ ముక్కూ, గెడ్డం, రంగూ అన్నీ మీవే, మావి కావు!" దీర్ఘం తీస్తూ అంది.

ఆమెను చాచి లెంపకాయ కొట్టాలన్నంత కోపం వచ్చింది శ్రీధర్‌కు. ఒక్క చూపు చూచి, మాట్లాడకుండా బయల్దేరాడు.

రంగు అనటంలో ఆమె ఆక్షేపణేమిటో బోధపడ్డది. తన రంగు తక్కువ, తార చాయ ఎరుపు. తనకు ఆడపిల్ల, చాయ తక్కువ ఆడపిల్ల, కలిగిందని ఈసడింపు!

* * *

బారసాలకు ముందే మద్రాసు బయల్దేరవలసి వచ్చింది. శ్రీధర్ అమ్మాయికి 'విద్య' లేక 'ఉమ' అని పేరు పెట్టవలసిందని సూచించాడు. భార్య, వదినె యిద్దరూ కూడా సుముఖంగా లేరు. 'స్వరాజ్యం', 'ప్రేమాంజలి' వాళ్ళు ఎన్నిక చేసిన పేర్లు. చివరకు 'స్వరాజ్యం' అన్న పేరు ఆమోదించి రాజీ పడ్డాడు.

ఈ పర్యాయం వచ్చినప్పటినుంచీ చాల ముక్తసరిగా వ్యవహరించిన మామగారు, శ్రీధర్ ప్రయాణమౌతున్న రోజున అకస్మాత్తుగా ప్రస్తావించాడు ఉద్యోగం విషయం.

"ఉద్యోగం ఖాయం చేశారా ?"

"ఇంకా లేదు."

"అసలు మన తాహతుకి గుమాస్తా ఉద్యోగం ఏం సరిపోతుందీ ?"

శ్రీధర్ బిగిశాడు. ఈ విషయమై చాల కథే జరిగింది. ఇక మామగారు ఆ ప్రసక్తి తీసుకురారనే నమ్మకానికి వచ్చాడు శ్రీధర్. కాని, ఉన్నట్టుండి మళ్లీ ఆ సంగతి యీవిధంగా తీసుక రావటం అతనికి ఆశ్చర్యం కలిగించింది.

"ఖాళీగా కూచోవటంకన్న అదే నయం, ఇంకోటి దొరికే దాకా !" అన్నాడు. చివరిమాట, తనేం పెద్ద ఉద్యోగం వస్తే నిరాకరించలేదనీ, తనది మొండిపట్టు కాదనీ సూచించటానికే అన్నాడు.

"చిన్నవాటిల్లో జొరబడ్డ తర్వాత పై ఉద్యోగాలు ఎలా దొరుకుతాయి ? అందులోనే ఉండమంటారు ఎవరి వడిగివా. అసలు పెళ్లి అడగటానికే యిబ్బంది ! .... మీ అల్లుడేం చేస్తున్నా డిప్పుడు? అన్న ప్రశ్న కేవిటి జవాబు ? చెబితే వెంటనే చప్పరించేస్తారు: అప్పే అంతకంటే శుభ్రంగా వ్యవసాయమే చూచుకోవచ్చుగా అని. బి. ఎస్. సి చదివి గుమాస్తాగిరీ ఏమిటండీ ? అనటమే ఎవరు కనిపించినా ! .... ఇలా ఉంటే ఇంకో ఉద్యోగం ఎలా వస్తుంది ? ఎప్పటికీ రాదు, ఇంతే !"

"అయితే ఏం చెయ్యమంటారు ? ఉద్యోగం లేకపోతే వ్యవసాయమే చూచుకుంటాము...."

"మీరైవు వ్యవసాయంచేస్తే ఏం వొరుగుతుంది ? మీ అన్నయ్య చేస్తున్నాడు, ఏం గిట్టుతోంది ? అంతకంటే గుమాస్తా ఉద్యోగమే నయం, గుడ్డిలో మెల్ల !"

ఈ మాటల అంతర్యమేమిటో బోధపడుతోంది. తను వ్యవసాయం మామగారింటి దగ్గరుండి చెయ్యాలి ! ఆ స్థితికి మెల్లగా ఒప్పించటానికే నన్నమాట యింత పన్నుగడ, సంతం, సూటీ పోటీ మాటలూ, ఒత్తిడీ, ప్రచ్ఛన్నయుద్ధం, అన్నీ !

శ్రీధర్ మాట్లాడకుండా లేచి గదిలోంచి వెళ్లిపోయాడు.

దీనికి నాంది అసలు పెళ్లిమాటలు జరిగినప్పుడే ఉన్నట్లు అర్థమౌతోంది శ్రీధర్‌కు.

ఆరోజు సాయంత్రం—మద్రాసులో హిందీ ప్రచారసభ మైదానంలో గాంధీగారిని చూచి ఆలస్యంగా హాస్టలు చేరుకున్న సాయంత్రమూ అదే !— ఇద్దరు పెద్దమనుష్యులు, కృష్ణా జిల్లా వాళ్ళు, ఖద్దరు వస్త్రధారులు ప్రక్కగదిలో తనకోసం నిరీక్షిస్తున్నారని తెలిసింది. మిత్రుడు ప్రసాద్ వాళ్ల విషయం తనతో ఆదివరకే ప్రస్తావించాడు. అందులో ఒకరు రామినీడు గారని భూస్వామి; డబ్బు పలుకుబడి గల మనిషి. రెండవ వ్యక్తి ఆయన బావమరిది వెంకయ్యగారు. స్కూలుఫైనలు పూర్తి చేసిన తారను, వెంకయ్యగారి చివరి సంతానాన్ని తనకు ఇవ్వాలన్న ఉద్దేశ్యం వ్యక్తపరిచారు. శ్రీధర్ కుటుంబాన్ని గురించి కొంత సూటిగానూ, కొంత లౌక్యంగానూ ప్రశ్నించారు. రామినీడుగారు, వెంకయ్యగారు ఏమీ మాట్లాడలేదు. వివాహ విషయంలో బాధ్యత సర్వమూ తన తండ్రిదేనని, ఆయన నిర్ణయమే తన నిర్ణయమౌతుందనీ వాళ్లతో అన్నాడు శ్రీధర్ సవినయంగా.

"నయమే ! మా జిల్లా కుర్రవాళ్లలా బరితెగించిపోయి పెద్దవాళ్ల లెక్కేమిటంటూ మాట్లాడటంలేదు !" అన్నారు రామినీడుగారు నవ్వుతూ, సాభిప్రాయంగా వెంకయ్యగారి వైపు చూచి.

ఆ వ్యాఖ్యానం తనకు నచ్చకపోయినా బదులు చెప్పలేదు. కాని, ఆ మాటల కొక వింత అర్థం యివాళ స్ఫురిస్తోంది !

"బి. ఎస్‌సి. తర్వాత ఏం చేయాలని ఉద్దేశం ?" అని ప్రశ్నించారు రామినీడుగారు.

"ఇంకా ఏమీ నిశ్చయించుకోలేదు."

అప్పుడు వెంకయ్యగారు ప్రథమంగా నోరు విప్పారు:

"ఏదైనా ఇండస్ట్రీలో చేరితే చదివిన డిగ్రీకి ఉపయోగం ఉంటుంది. మంచి భవిష్యత్తూ ఉంటుంది..... ఏమంటారు బావా ?" రామినీడుగారు ఆమాటకు తల పంకించి తటస్థంగా వూరుకున్నారు. ఏమీ బదులు చెప్పలేదు.

1946 వేసవిలో అయిదువేల కట్నంతో వివాహం జరిగింది.

తర్వాత ఆరు నెలల కాలం ఉద్యోగాన్ని అరటిపండొలిచి అరచేతిలో పెట్టినట్లే మాట్లాడారు అత్తవారు. రామినీడుగారు పెద్ద భాగస్వామిగా ఉన్న పంచదార ఫ్యాక్టరీలో శ్రీధర్‌కు ఉద్యోగం వేయించటం .... తర్వాత ఫాక్టరీ ఖర్చు మీదే ట్రెయినింగ్‌కి భార్యతో సహా విదేశాలకు వెళ్లిరావటం... తర్వాత తర్వాత క్రమంగా ఏ ఫాక్టరీ మానేజరుగానో, మానేజింగ్ డైరెక్టరుగానో శిఖరారోహణ చెయ్యటం .... ఈ పథకాన్ని అరచేతిలో వైకుంఠంగా చూపిస్తూనే ఉన్నారు వెంకయ్యగారు .... చివరకు అన్నీ గాలిమేడలుగానే తేలిపోయాయి.

అది శ్రీధర్ దురదృష్టమో, లేక రామినీడుగారి ధర్మపత్ని అంటే వెంకయ్యగారి సోదరి పదేళ్ల క్రితమే మరణించి ఆయన రెండవ వివాహం చేసుకొని ఉండటమే కారణమో, రామినీడుగారు మాత్రం వెంకయ్యగారికి మాట సాహాయ్యం మినహా యింకే సాహాయ్యమూ చెయ్యరనీ, చేసే ఉద్దేశం కూడా లేదనీ శ్రీధర్‌కు స్పష్టంగా బోధపడ్డది. కాని, 'చెయ్యను' అన్న మాట మాత్రం కఠినంగా నోటివెంట ఎన్నడూ చెప్పరు రామినీడుగారు. అలా చెప్పటం ఆయన తత్త్వంకాదు !

రెండు పర్యాయాలు శ్రీధర్‌ను వెంటబెట్టుకొని విజయవాడకు రామినీడుగార్ని చూడటానికి ఉద్యోగప్రయత్నంమీద వెళ్లారు వెంకయ్యగారు. రెండుసార్లూ బంధు మర్యాద, కబుర్లు, జరిగాయి. అసలు విషయం మాత్రం యీయన గట్టిగా అడగలేదు, ఆయన చెప్పలేదు ! శ్రీధర్‌కి యిదేమీ నచ్చలేదు. కేవలం బంధుమర్యాదగా వెళ్లితే బాగుండేది, లేక

పోతే వ్యవహారంకోసం వెళ్లినట్లుగా నూటిగా అడిగి సంగతి నిక్కచ్చిగా తేల్చుకున్నా బాగుండేది. ఎటూకాని సందిగ్ధావస్థ శ్రీధర్‌కు కష్టమనిపించింది. మూడవసారి రామినీడుగారి వద్దకు రమ్మని వెంకయ్యగారు పిలిచినప్పుడు తనకు అలా రావటం యిష్టంలేదని మొహమాటం లేకుండా చెప్పేశాడు శ్రీధర్. అంతటితో ఆయనకూ, ఆయన ఇంటిల్లపాదికీ కోపం వచ్చింది. తారకూ అసంతృప్తి కలిగింది.

రామినీడుగారు ఉద్యోగం వేయించకపోవటానికి కారణం శ్రీధర్ దురభిమానం, ఉలిపికట్టెతనం, శ్రీధర్‌కు పైకి రావాలన్న ఆకాంక్ష, ఆశయం లేకపోవటమే అంటూ వ్యాఖ్యానం ప్రారంభమైంది.

పెళ్లయి ఎనిమిది నెలలు యిలా గడిచిన తర్వాత, స్వయంగా ప్రయత్నించి మద్రాసులో సివిల్ సప్లయిస్ శాఖలో, లోయర్ డివిజన్ గుమాస్తాగా ప్రవేశించాడు శ్రీధర్. ఉద్యోగం తాత్కాలికం. అసలు ఆ శాఖనే తాత్కాలికం అన్నారు. ఇదికూడా శ్రీధర్ అత్తవారి యీసడింపుకు గట్టి కారణమైంది. ఫాక్టరీలో పెద్ద ఉద్యోగం వేయిస్తామంటే వద్దని మంకుపట్టు పట్టి ఇంతలో మునిగిపోయినట్లు మద్రాసులో గుమాస్తాగా కాలక్షేపం చెయ్యటానికి నిశ్చయించుకోవటం అది స్వతః హుందాతనం లేకపోవటమే కారణమనీ, అల్లుడికి తాహతంటే ఏమిటో తెలీదనీ, వ్యాఖ్యానిస్తూ ప్రతి మాటలో చేతలో తమ విమర్శని వ్యక్తం చెయ్యటం ప్రారంభించారు అత్తవారు.

మద్రాసు ఉద్యోగం తాత్కాలికం కావటంతో అది ఎప్పుడో ఊడిపోతుందనీ, తర్వాత అల్లుడు తమ ఆశ్రయం ఎలాగూ కోరవలసి వస్తుందనీ వాళ్ల నమ్మకం కాబోలు ! అప్పుడు మిగిలేది యిల్లరికపు టల్లుడుగా వ్యవసాయం చూసుకోవటమే నని వాళ్లొక అభిప్రాయానికి వచ్చినట్లున్నారు. ఆ అభిప్రాయమే యిప్పుడు మామగారు స్పష్టం చేశారు.

తన మానాన్ని తనను ఉండనివ్వకుండా ఏమిటీ హింస ? పిల్ల తనకు పెద్ద ఉద్యోగం వేయిస్తే తనేమి నిరాకరించలేదు. వేయించలేదే అని అలిగి యుద్ధమూ ప్రకటించలేదు. తన జీవితమేదో తను చక్కదిద్దుకోవటానికి మాత్రమే ప్రయత్నిస్తున్నాడు. కాని, అందుకు అడ్డు తగులుతున్నారు. తనకూ తన భార్యకూ మధ్య పొరపొచ్చాలు కల్పిస్తున్నారు కూడా !

రామినీడుగారు వీరి ఆశల్ని సఫలం చెయ్యకపోతే దానికి తనెట్లా కారణం ? కాని, అందుకు తనే కారణమైనట్లుగా ప్రవర్తిస్తున్నారు .....

మగశిశువుకు బదులు ఆడపిల్ల కలగటం తను బుద్ధిపూర్వకంగా చేసిన తప్పిదమా ? ఆ శిశువు చామనచాయగా ఉండటం కూడా తన ప్రయోజకత్వమేనా ?

"అదృష్టవంతులైతే అన్నీ అమరుతాయి తల్లీ !" అంటోంది అత్తగారు నిష్ఠూరంగా, ఏదో చిన్న విషయమై తారతో మాట్లాడుతూ తను వినేట్టుగా.

తన తప్పిదమూ, తన అప్రయోజకత్వమూ, తను దురదృష్టవంతుడు కావడమే నట ! ఇంతకూ ఏమిటీ తన గొప్ప దురదృష్టం అంటే—తనవల్ల వాళ్ల కన్న కలలూ, కట్టిన గాలిమేడలూ వ్యర్థమై పోవటం ! ......

రైలు వెడుతూఉంది చీకటిని చీల్చుకొంటూ ....

శ్రీధర్ చీకట్లోకి చూస్తూ కూర్చున్నాడు క్రిక్కిరిసి ఉన్న ఆ మూడవ తరగతి పెట్టెలో ....

తెల్లవారితే మద్రాసు .... ఆఫీసు .... లాడ్జి .... యథా కార్యక్రమం.....

కాని యీ పది రోజుల్లో ప్రపంచం ఎంతో మారి పోయినట్లే .....

గాంధీగారు పోయారు.

తన బాధ్యత పెరిగింది.

తనిప్పుడు తండ్రి, కుటుంబీకుడు, తనకు ఆత్మ గౌరవం ఉంది. తనకు స్వరాజ్యమనే బుల్లి పాపాయి ఉంది. అది అంతా తన పోలికే, తనలానే నలుపు ! ,పిడికిళ్లు మూసి పెట్టుకుని, తనకోసం అవతలిగట్టు మంచి ఏమిటో తెచ్చింది... ఏమి తెచ్చిందో ?

3

గుహముందు నిల్చుని పులి, గాండ్రుమంటూ, జ్యోతుల్లా మెరుస్తున్న కళ్లతో చూస్తోంది. గుహలో నిద్రిస్తూఉండి మేల్కొంటున్న తను పులిని చూచి ప్రాణాలు ఉగ్గబట్టుకుని మెదలకుండా అలానే ఉన్నాడు, ఎలా తప్పించుకోవటమా అని ఆలోచిస్తూ ....

కళ్లుతెరచి చూశాడు శ్రీధర్. వీధిలో ఎవరో మోటారు సైకిలు స్టార్టు చేస్తున్నారు. మధ్యాహ్నం రెండు గంటల వేళ.

ఆదివారం ఆఫీసు లేకపోవటంతో భోజనం తర్వాత పండుకున్నాడు. కునుకు పట్టింది. ఇంతలో కల. పగటి కలలో పులేమిటి ? గుహేమిటి ? కలలో తను అడవిలో నివసిస్తున్న ఆదిమానవుడు, గుహలో పడుకున్నాడు, ఇంతలో పులి వచ్చింది. కాని నిజంగా ఆదిమానవుడైనవాడు పులిని చూచి తను పొందినంత భయాన్ని పొందిఉంటాడా ? అది వాడికి మామూలు సంఘటనే అయిఉంటుంది ! ఇరవయ్యో శతాబ్దపు నాగరకునికి ఉన్నంత భయం ఆదిమానవుడికి ఎప్పుడూ ఉండి ఉండదు !

ఎదుటి గోడమీద ఉన్న కాలెండరులోని సినిమాతారే రాత్రి తనూ నాగరాజూ వెళ్లిన చిత్రంలో నాయికగా వేసింది. ఆమె ముఖంలో ఏదో ప్రత్యేకమైన ఆకర్షణ ఉంది : గుండ్రని ముఖం, పెద్ద కళ్లు, చిలిపిగా ముద్దొచ్చే చిన్న ముక్కు.... తీర్చిదిద్దినట్లున్న ఆ ముక్కు సొగసు ఎన్నిసార్లు చూచినా తనివితీరటంలేదు ! ఆమె ఎవరినో జ్ఞాపకం తెస్తూనే ఉంది రాత్రి సినిమా చూసినంతసేపూ.... పద్మమణి ! .... ఏడెనిమిదేళ్ల క్రితం హైస్కూల్లో తనతో చదువుకొన్న పద్మమణి!..

నాలుగు, ఐదు, ఆరు ఫారాల్లో మూడేళ్లూ సహాధ్యాయిని పద్మమణి. చామనచాయగా, పొట్టిగా, చలాకీగా

ఉండేది. కిలకిలా నవ్వితే నవరత్నాలూ రాలేవి .... తరగతిలో మేష్టారు ఏదైనా చమత్కరించినా, ఒక వింత విషయం చెప్పినా ఆమె నవ్వుకోసం, ఆమె హావ భావాలకోసమే తన నిరీక్షణంతా. చదువుపై ధ్యాస చెరువునీటిలా కదలకుండా మెదలకుండా లోతుగానే ఉంటున్నా పద్మమణి నవ్వుల్తో అది తరచు తరంగిత మయ్యేది. అదే ధ్యాస, మళ్లీ పాఠాల్ని ఇంటిదగ్గర చదివేటప్పుడు, ఆయా ఘట్టాల్లో ఒక తియ్యని స్మృతినీ, సూర్యోదయ పద్మరాగ ఛాయల్ని అద్దుకొన్న వీటి దృశ్యాన్నీ, ఆహ్లాదకరంగా అనుభవానికి తెచ్చేది ! ....

ఆ రోజుల్లో తనకు ఆడపిల్లలంటే తగని సిగ్గు ....

పద్మతో ఎప్పుడూ మాట్లాడలేదు, మాట్లాడాలని ప్రయత్నం కూడా చెయ్యలేదు. మొదటి ఏడాది పద్మ ఆకర్షణ కేవలం స్వరూపంలేని తన్మయానుభూతి .... రెండో ఏడాది నవలల్లో నుంచి 'ప్రేమ' అనే పదం అతని పరిభాషలో ఊహలో ప్రవేశించింది. ఆ పదాన్ని స్వకీయం చేసుకోవాలనీ చేసిన ప్రథమ ప్రయత్నమే. 'నేను పద్మను ప్రేమిస్తున్నాను' అని మనస్సులో పదేపదే వల్లించుకోవటం .... అలా చెయ్యటమే మనస్సుకి ఎంతో నిండుదనాన్నీ ఉత్సాహాన్నీ యిచ్చేది ....మూడో సంవత్సరం, ఆరవ ఫారం చదువుతూ, పద్మను నిత్యమూ ఆరాధనా భావంతో చూసేవాడు. స్కూలు వదలినప్పుడు ఆమె వెనుక నడిచేవాడు. ఆమె నడక తీరు, హావభావాలు, జడవిసురు, కుచ్చెళ్ల పూవు, చీలమండలమీద పరికిణీ కదలికా—ఆమెను గూర్చిన ప్రతి విషయమూ ఎంతో చక్కగా, అందంగా, ఆహ్లాదంగా ఉండేది. ఆమె ఎదురైనప్పుడూ, ప్రక్కగా, దగ్గరగా వెళ్లినప్పుడూ, ఆమె ముక్కుపోయగమూ, కన్నుల తళుకూ తన చూపుల్నీ హృదయాన్నీ ఆకట్టేవి ! ఎప్పుడైనా ఆమె తన కళ్లల్లోకి సూటిగా చూడటమే సంభవిస్తే, చాల సిగ్గుపడి పోయేవాడు ! తనేదో దొంగతనం చేస్తున్నట్లు, ఆమె అది గుర్తించేసి తనమీద కోపం విరక్తి తెచ్చుకుంటున్నట్లు వూహించుకుని బాధపడి పోయేవాడు. తను ఆమె నెంత నిష్కల్మషంగా, పవిత్రంగా దివ్యంగా ప్రేమిస్తున్నాడో ఆమె కెలా తెలుస్తుంది ? అని చింతించేవాడు.

ఒకసారి పరీక్ష వ్రాస్తుంటే పద్మ కలం చెడిపోయింది. ఆమె మేష్టారుతో ఆ విషయం చెప్పింది. మేష్టారు చుట్టుపక్కల ఉన్నవాళ్ల జేబులవైపు చూశాడు. శ్రీధర్ జేబులో ఒక కలం మిగులుగా ఉంది, కాని, అలా చెప్పి తీసి యిచ్చే ధైర్యం లేదు. ఇంతలో మేష్టారే చూచాడు. ఆ రెండో కలం యిమ్మని అడిగాడు. పద్మవైపు చూడనన్నా చూడకుండా హృదయం ఉద్వేగపడుతున్నా ఏదో విధి నిర్వర్తిస్తున్నట్లే కలం మేష్టారుకి అందజేశాడు ! పద్మ ఆ కలంతో వ్రాస్తుండనీ ఆ కలం తనదని ఆమెకు తెలుసుకదా అనీ ఏదో తృప్తి, సంతోషమూ కలిగాయి. పద్మ వ్రాయటం ముగించి లేచింది. పరీక్ష పేపరు మేష్టారి కివ్వటానికి వెళ్తూ శ్రీధర్ కూర్చున్న చోటికి వచ్చి కలాన్ని అతని కెదురుగా డెస్కుమీద పెట్టి వెళ్లిపోయింది. పద్మ కలాన్ని మేష్టారు చేతికే తిరిగి యివ్వకుండా, తన డెస్కుమీద పెట్టి వెళ్లిందే ! అది ఆమె తన పట్ల చూపిన యిష్టమూ, విశ్వాసమూ, ప్రత్యేకతా అనిపించింది. తర్వాత చాల రోజుల వరకూ ఆ జ్ఞాపకం పస్తూనే ఉండేది ! .....

శ్రీధర్ నవ్వుకున్నాడు. "అప్పు డలా ఉండటం సహజమేనేమో ! పట్టి అమాయకత్వం, విపరీతమైన సిగ్గు ఆ రోజుల్లో ....అందరు కుఱ్ఱవాళ్లూ నాలా ఉండరు కూడా !" అనుకుంటూ పక్కమీదనుంచి లేచాడు.

కాలెండరు దగ్గరగా వెళ్లి పద్మ మణిలా ఉన్న ఆ సినిమా తార ముఖాన్ని కొన్ని క్షణాలు పరిశీలించి చూచాడు. తర్వాత స్నానాలగది వైపు వెళ్లాడు.

నాగరాజు వాళ్ల హాస్టలు వార్షికోత్సవానికి ఆ సాయంత్రమే ఆహ్వానం ఉందన్న సంగతి చప్పున గుర్తుకు వచ్చింది. జ్ఞాపకాల్లో పడి మరిచేపోయాడు తనింతసేపూ ! గబగబ తయారవటం ప్రారంభించాడు.

రాత్రి సినిమాలో జరిగిన సంఘటన .... ఇద్దరు యువతులూ ఒక చిన్న కుఱ్ఱవాడూ వచ్చి ముందు వరుసలో కూర్చున్నారు. అందులో ఒకరికి వివాహమైనట్లు లేదు. ఆమె కాలేజీలో చదువుతున్నట్లుగా ఉంది ధోరణి చూస్తే: రెండవ ఆమె కన్న నాజూగ్గా తయారయింది. ఆ కాలేజీ అమ్మాయి తన కెదురుగా ఉన్న కుర్చీలో కూర్చోగా, ఆమె ప్రక్కన నాగరాజు కెదురుగా వివాహితయైన స్త్రీ, తర్వాత ఆమె కొడుకూ కూర్చున్నారు.... జడనిండా సన్నజాజులు తురుముకొన్నది కాలేజీ అమ్మాయి .... ఆ పరిమళం శ్రీధర్‌కు పిచ్చెత్తిస్తోంది... ఈ లోకానికి చెందని, వెన్నెలవంటి, పాల నురుగువంటి, ఒక స్నిగ్ధ సౌందర్యభావన ఆ సౌరభంతో కలిసి హృదయాన్ని మెలి త్రిప్పివేస్తోంది ..... ఆ అమ్మాయి ముఖం కనిపించకున్నా పరిమళం ప్రభావంవల్ల ఆమె అందాన్ని మధురంగా ఉదాత్తంగా ఊహించుకొంటున్నాడు. ఆమె జడలోని పువ్వుమీద దృష్టి కేంద్రీకరించి, పరిమళం పదునెక్కిస్తున్న భావనైశిత్యంతో, సూక్ష్మరూపంలో ఆమె మనసులో తను ప్రవేశిస్తున్నట్లూ, ఆమె ఊహల్ని స్పృశిస్తూ ఒక క్రొత్త ప్రపంచాన్ని దర్శిస్తున్నట్లు ఒక వింత అనుభూతిలో ఉన్నాడు శ్రీధర్. ఆ అమ్మాయి ఎందుకో అంతలో లేచి నిల్చుని తను అటువైపుకు వస్తానని రెండవ ఆమెతో చెప్పి వెళ్లి పిల్లవాడి ప్రక్కన ఖాళీగా ఉన్న కుర్చీలో కూర్చున్నది. ఇలా ఈమె అకస్మాత్తుగా తొట్రుపడుతూ వెళ్లి చటుక్కున కూర్చోవటంలో ఆమె జడలోని పువ్వుల్లోనుంచి ఒక పువ్వు రాలి క్రింద పడింది. అలా జరగటానికీ, తన దృష్టి, ఊహా ఆమెమీద కేంద్రీకృతమై ఉండటానికీ ఏదో సంబంధం వున్నట్లే తోచింది శ్రీధర్‌కు! ఇంతలో నాగరాజుకూడా ఆఅమ్మాయికి సరిగ్గా వెనుకనున్న కుర్చీలోకి మారుతూ, శ్రీధర్ని ప్రక్క కుర్చీలోనికి ఆహ్వానించాడు. తనకా మార్పు నచ్చకపోయినా వెళ్లి కూర్చోక తప్పలేదు. కూర్చుంటూ క్రిందికి చూశాడు. ఆమె జడలో నుంచి రాలిన పువ్వుకోసం. అది నాగరాజు స్థానం మార్చుకోవటంలో అతని బూటు

క్రిందపడి నలిగిపోయివుంది. తనలో ఏదో విషాదమూ, నాగరాజు మీద విసుగూ కలిగింది.

సినిమా ప్రారంభించారు. పూల పరిమళంతో బాటు కథలో లీనమయ్యాడు. ఇంటర్వల్‌లో కాలేజి అమ్మాయి ప్రయత్నపూర్వకంగా రెండుమూడు సార్లు తలవెనక్కి త్రిప్పి చూసింది. ఆమెచూపులు నాగరాజు చూపుల్నికలుసు కుంటున్నాయి. తనలో కించిత్ అసూయ. నాగరాజు ఠీవిగా అందంగా వుంటాడు... ఆమె మళ్లీ తిరిగి చూసినప్పుడు ఆమె సౌందర్యం ఏపాటిదో పరీక్షించి చూడటానికి వీలయింది.. ఆసౌందర్యం తనని ఆకర్షించలేదు... ఆఅమ్మాయిని గూర్చి చులకన అభిప్రాయం కూడా కలిగింది... ఆమొదటి అను భూతి మళ్లీ కలగలేదు!

జరిగిన సంగతేమిటో నాగరాజు తర్వాత చెప్పాడు. సినిమా జరుగుతూండగా నాగరాజు ఆ అమ్మాయి జడని మెల్లిగా కదిలించాడట. ఏమీ చలనంలేదు. తర్వాత ఆమె నడుముని తాకాడట. అప్పటికీ ఏమీ 'వ్యతిరేకమైన' కదలిక ఆమెలో కనిపించకపోవటంతో, వ్రేలితో ఆమె నడుముమీద మెల్లగా రాశాడట, చిలిపిగా, 'లవ్' అన్న ఇంగ్లీషు అక్షరాల్ని! అది ఉపోద్ఘాతం. కొంతసేపు అలానే ఉండి ఆ అమ్మాయి ముందుకు జరిగి నాగరాజుకు అందకుండా కూర్చునేదట. మళ్లీ కొంతసేపటికి వెనక్కి వాలేదట ఆ స్పర్శకోసం! ఇలా సినిమా జరిగినంత సేపూ!

"ఛీ, పాపం, ఎందుకలా చెయ్యటం? నిన్ను గూర్చి ఏమనుకుంటుంది ఆ అమ్మాయి?" అన్నాడు శ్రీధర్.

"ఏమనుకుంటుంది! నా ప్రక్కన నువ్వూ, ఆ అమ్మాయి వెంట వాళ్ల వదినా(?) గనక లేకపోతే మా యిద్దరికీ స్నేహం కలిసేది! స్పర్శలో ఉండే మహత్యం నీ కేం తెలుసోయ్! పెళ్లయిన వాళ్లకి శరీరంలో స్పర్శనైశిత్యం మొద్దుబారి పోతుంది. నాబోటివాడికి దేహంలో ప్రతి అంగుళంలోనూ స్పర్శసౌఖ్యం అనుభూత మౌతుంది. దాన్ని అలా నిలుపు కోవటమే ఒక తపస్సు! నా కేమిటి, పెళ్లికాని ఆ అమ్మాయికీ అంతే! ఈ సున్నితమైన అనుభవాలు నీకేం అర్థమౌతాయిలే!' అన్నాడు నాగరాజు.

శ్రీధర్‌కు కోపం వచ్చింది. ఏది సున్నితం, ఏది మొరటు? ఆమె జడలోని పూల పరిమళాన్ని తనెలా మానసికంగా ఆనందించ గలిగాడో, అప్పు డొక పువ్వు రాలి పడటంతో విశేష మేమిటో, దాని విషాదాంత మేమిటో కవిత్వంగా వర్ణించి చెప్పారు. దానికి నాగరాజు జవాబు: "నీది భావ కవిత్వం. నైతికంగా నువ్వు చేసిందీ నేను చేసిందీ ఒక్కటే కద! కాకపోతే నీకు భయం! జీవితంవల్ల నాకు ఆ సందేహమూ భయమూ లేవు! అనుభ వాన్ని మించి విలువైన దేదీ నాకు కనిపించదు ...."

బస్సు రావటంతో తర్వాత వాదించటానికి అవకాశం లేకపోయింది. "రేపు మా సెంట్ థామస్ హాల్ వార్షికోత్సవం, నీకోసం గెస్టు టికెట్ తీసి అట్టే పెట్టాను, తప్పకుండా రా! అప్పుడే గుమాస్తా జీవితానికి అలవాటు పడిపోతున్నావ్? నీకు క్రొత్త స్నేహితుల్ని పరిచయం చేస్తాను రా!" అంటూ బస్సెక్కి వెళ్లిపోయాడు నాగరాజు.

* * *

నాగరాజు శ్రీధర్‌కు లయోలా కాలేజీలో రెండేళ్లు సహాధ్యాయి. డిగ్రీ పుచ్చుకున్న తర్వాత శ్రీధర్ పెళ్లిచేసుకుని ఉద్యోగ ప్రయత్నంలో పడ్డాడు. నాగరాజు తాంబరం క్రిస్టియన్ కాలేజిలో ఎం. ఏ. లో చేరాడు. ఇద్దరికీ చాలా అన్యోన్యం, ఆత్మీయతా. ఒకరి కొకరు చెప్పుకోని ఊహాలంటూ, రహస్యాలంటూ, చర్చించని సిద్ధాంతాలంటూ లేవు. శ్రీధర్ చదువు చాలించి, పెళ్లి—ఉద్యోగం వంటి బాధ్యతల్ని అప్పుడే మీద వేసుకోవటం నాగరాజుకు నచ్చలేదు. మామగారి దగ్గర ధన సాహాయ్యం పొంది, శ్రీధర్ ఎం. ఎస్‌సి లో చేరిఉండవలె నని నాగరాజు అభిప్రాయం. శ్రీధర్‌కు ఆత్మాభిమానం అడ్డు వచ్చింది. తండ్రి పైకి చదివించలేనని స్పష్టం చేశాడు. ఇక తన బరువు తను మోయుటమే ధర్మ మనిపించింది శ్రీధర్‌కు. ఇదంతా శ్రీధర్ అమాయకత్వం, చేతకానితనం అంటాడు నాగరాజు.

* * *

శ్రీధర్ బస్సులో త్యాగరాయనగరం వెళ్లి ఎలక్ట్రిక్ ట్రెయినుమీద తాంబరం చేరుకునేటప్పటికి కొంత ఆలస్యమే అయింది. అప్పటికే అతిథు లందరూ వచ్చేశారు, పార్టీలో కూర్చుంటున్నారు. ఒక వలంటీరు శ్రీధర్‌కు నాగరాజు ఎక్కడున్నాడో చూపించాడు. బూడిదరంగు ట్వీడ్ సూట్‌లో అందంగా చెక్కిన విగ్రహంలా ఉన్న నాగరాజు ఇద్దరు యువతుల మధ్య అప్పుడే టీ టేబుల్ దగ్గర కూర్చోబోతూ ఉన్నాడు. శ్రీధర్‌ని గుర్తించి నవ్వుతూ చేయి పైకెత్తాడు రమ్మని. పెళ్లిలో అత్తవారు చదివించిన ముదురు నీలంరంగు పేంటు, తెల్ల సిల్కు బుష్‌షర్టు వేసుకున్నాడు శ్రీధర్. పూర్తి సూట్ వేసుకుని ఉంటే బావుండేదేమో అనిపించింది. నాగరాజును చూడగానే మళ్లీ ఫరవాలేదు లెమ్మని సరిపుచ్చుకున్నాడు.

నాగరాజు శ్రీధర్‌ని ఆ యిద్దరి యువతుల మధ్య కూర్చోబెట్టుతూ వాళ్లని పరిచయం చేశాడు: మాయులతా రామస్వామి, సిసీలియాపాల్ అంటూ. తర్వాత తను సిసీలియా ప్రక్కన కూర్చున్నాడు నాగరాజు. ఆ టేబిల్ దగ్గరే మరో ముగ్గురు—యిద్దరు యువకులూ ఒక యువతీ కూర్చున్నారు. కాని, వాళ్ల జట్టు వేరు, వీళ్ల జట్టు వేరు. అదీ పద్ధతి. శ్రీధర్‌కు కొంచెం క్రొత్తగా ఉంది. లయోలాలో హోస్టలు డేకి ఆడవాళ్లని అతిథులుగా పిలవటానికే వీల్లేదు. అదీకాక అక్కడ యిక్కడివలె ఇద్దరు హోస్టలు మెంబర్లు చొప్పున వాళ్లకి వాళ్ల అతిథులకి మాత్రమే ప్రత్యేకంగా టేబిల్ ఏర్పాటు చెయ్యటమూలేదు. అందర్నీ ఒకే పొడుగునా బంతి భోజనాలకు కూర్చోబెట్టేవారు.

మాయులత శ్రీధర్‌ని పలకరించి, కలుగజేసుకుని మాట్లాడడం ప్రారంభించింది. సిసీలియా ఒకటి రెండు పొడి

మాటలు తప్ప శ్రీధర్‌తో మాట్లాడలేదు. ఆమె అటువైపు తిరిగి నాగరాజుతోనే మాట్లాడుతూ ఉంది. అతని కళ్లల్లోకి గుచ్చి చూస్తూ, ఒకసారి ఆప్యాయంగా గోముగా, ఒకసారి మందలిస్తున్నట్లు, ఒకసారి సుస్మితంగా వెక్కిరిస్తున్నట్లు మాట్లాడుతోంది. ఆమె మాటల్లో వింత విషయాలేమీ లేకపోయినా నాగరాజుతో ఆమె ధోరణి విచిత్రంగానే తోచింది శ్రీధర్‌కు. అందుకు భిన్నంగా మాయలతలో వ్యక్తమౌతున్న నమ్రత, మార్దవం, సిగ్గు శ్రీధర్‌ని బాగా ఆకర్షించాయి. ఆమె విరజిమ్ముతున్న మొగలి అత్తరు వాసన, ఆమె వ్యక్తిత్వానికే ఒక విశిష్ట మధుర గుణాన్ని ఆపాదిస్తోంది.

పరిచయంచేస్తూ నాగరాజు గడుసుగా అబద్ధ మాడేశాడు : "ఇతను శ్రీధర్, ప్రెసిడెన్సీ కాలేజీలో ఎం. ఎస్‌సి ఫైనల్ చదువుతున్నాడు." అన్నాడు. ఎందుకలా అన్నాడో శ్రీధర్‌కు వెంటనే అర్థంకాలేదు. తర్వాత కారణం సులువుగానే ఊహించుకున్నాడు. గుమాస్తాగా పరిచయం చేస్తే ఆ యువతుల ముందు ఇద్దరికీ గౌరవలోపమే అవుతుంది కాబోలు ! కొంతసేపటికి మాయలత అడిగింది : "మీరు మదనపల్లిలో పెద్ద భూస్వాములట కదూ ! నాగరాజు చెప్పాడు.... "శ్రీధర్‌కు చిక్కుగా ఉంది. తను ఇంకా రంగంలో ప్రవేశించకముందే తనను గూర్చి నాగరాజు ఏవేవో గొప్పలు చెప్పేశాడు ! తనకి అబద్ధా లాడటం, గొప్పలు పోవటమంటే బొత్తిగా నచ్చదు. కాని, యీ పరిస్థితిలో ఏదో చెప్పక తప్పదు. తన కుటుంబానికి భూమి వ్యవసాయం ఉండటం నిజమే కాబట్టి : "ఏదో ఉందిలెండి" అన్నాడు. "మీరు గొప్పలు చెప్పరనీ, మాడెస్ట్ అని కూడా అన్నారులెండి" అన్నది మాయలత నవ్వుతూ, శ్రీధర్ జవాబును ఇంకోవిధంగా అన్వయిస్తూ. ఆమెతోపాటు తనూ నవ్వాడు చేసేదిలేక.

"మా పెత్తండ్రిగారు మీ మదనపల్లి శానిటోరియంలో డాక్టరు. నేను రెండేళ్ల క్రితం ఒకసారి వచ్చాను. మదనపల్లి చక్కని ఊరు. ఆరోగ్యవరం ఎంతో హాయిగా ఉంటుంది!" అన్నది మాయలత. "నిజమే" అని ముక్తసరిగా అంగీకరించాడు శ్రీధర్.

"నా చదువు పూర్తికాగానే ఆరోగ్యవరంలో ఒక ఏడాది స్పెషల్ ట్రెయినింగ్ కోసం గడపాలని యిప్పటినుంచే ప్లాను!" అన్నది మాయలత.

ప్రశ్నలమీద ప్రశ్నలూ, జవాబులూ, నాటకంచూస్తూ చనువుగా వ్యాఖ్యానాలూ నవ్వులూ దొర్లాయి. డిన్నరు వేళకు మాయలత శ్రీధర్‌ను వ్యక్తిగతమైన వివరాలు, అతని జీవిత భవిష్యత్తును గూర్చి ప్రశ్నించేదాక వచ్చింది. జవాబు నివ్వటం ఒక్కోసారి యిబ్బందిగానే ఉన్నా ఆమెతో పరిచయం శ్రీధర్‌ను మధురంగా, హాయిగా, ఏ నాగలోకపు మొగలి తోటల్లోనో విహరిస్తున్నట్లుగా మైమరపిస్తోంది ....

"మీరు ఎం. ఎస్.సి. తర్వాత ఏం చేస్తారు ?" అన్న ప్రశ్నకు శ్రీధర్ ఎక్కువగా తడుముకోలేదు. "ఏదైనా పరిశ్రమలోనో, కంపెనీలోనో చేరటమో, లేకపోతే ఫారిన్ వెళ్ళాలనో అనుకుంటున్నాను." అన్నాడు. అలా అనటానికి అత్తవారు తన్నుగూర్చి కట్టిఉంచిన గాలిమేడలు సమయానికి తడుముకోకుండా బాగా సహాయపడ్డాయి. మాయలతకు ఆ జవాబు ఎంతో నచ్చింది. కళ్ళు పెద్దవిచేసి, ఉత్సాహంగా "నాకూ ఫారిన్ వెళ్లాలని ఎంతో ఉంది !" అన్నది.

డిన్నరు పూర్తి అయ్యేటప్పటికి ఎనిమిదిన్నర అయింది. సిసీలియా మాయలతలు వెంటనే వెళ్లిపోవా లన్నారు. నలుగురూ స్టేషన్ చేరుకున్నారు. అప్పుడే ఒక ట్రెయిన్ వెళ్లటంతో, ఇంకా ముప్పావుగంట ఆలశ్యం ఉందని తేలింది. నలుగురూ ప్లాట్‌ఫారమ్ చివరిదాకా నడిచి, వెలుతురు పడకుండా మసగ్గా ఉన్నచోట నిల్చున్నారు.

"మీరూ మాతో టౌన్‌కి వస్తారుకదా !" అన్నది మాయలత శ్రీధర్ నుద్దేశించి.

"లేదు, ఈపూట యిక్కడే ఉంటాడు" అన్నాడు నాగరాజు.

మాయలత శ్రీధర్‌వైపు వంగి అతని ముఖంలో ముఖంపెట్టి "మీ రిద్దరూ అంత ఎడబాయలేని మిత్రులేమిటి ?" అన్నది.

శ్రీధర్ ఏమీ మాట్లాడలేదు. చిరునవ్వు నవ్వాడు.

"నువ్వు తీసుకువెడితే నా కభ్యంతరం ఉండదులే" అన్నాడు నాగరాజు మాయలత నుద్దేశించి.

అంతవరకు ఏమీ మాట్లాడకుండా మౌనం వహించి కొంత ఎడంగా నిల్చునిఉన్న సిసీలియా చప్పున "రా !" అని పిలిచింది. "వచ్చే శనివారం ఆ విషయం ఏమైందీ నాకెలా తెలుస్తుంది ?" అన్నది అతనితో వాళ్ళిద్దరికే ప్రత్యేకమైన సంగతిని దేన్నో గుర్తుకుతెస్తూ ....

నాగరాజు రాగయుక్తంగా చిలిపిగా "నేను వస్తానుగా" అన్నాడు.

సిసీలియా నాలు గడుగులు ముందుకు కదిలింది అతనితో ప్రత్యేకంగా ఏదో మాట్లాడాలని సూచిస్తూ. నాగరాజు ఆమెతో వెళ్లాడు.

మాయలత శ్రీధర్ పక్కనే దగ్గరగా నిల్చుని ఉంది.

"మా హాస్టలుకి ఎప్పుడైనా రండి" అన్నదామె మెల్లగా.

ఇంతలో కరెంటు పోయి సర్వం గాఢాంధకారం అయింది.

"ప్పీశ్లీ ! చీకటి అంటే నా కేదో చెప్పరాని భయం !" అన్నది మాయలత శ్రీధర్‌ని వ్రేలితో తాకుతూ.

"నా చేయి పట్టుకోండి" అన్నాడు శ్రీధర్ కుడిచేయి ఆమె కందిస్తూ.

"థాంక్స్."

రెండు నిముషాల తర్వాత దీపాలు వెలిగాయి. శ్రీధర్ మాయలతలు అక్కడే నిల్చుని ఉన్నారు. వాళ్లకు నాగరాజు సిసీలియాలు కన్పించలేదు.

"వాళ్ళు చీకట్లోనే వెయిటింగ్‌రూముకి చేరుకున్నారు కాబోలు" అన్నది మాయలత.

శ్రీధర్ ఆమెతో వెయిటింగ్‌రూము వైపు నడిచాడు. నాగరాజు, సిసీలియాలు అక్కడ లేరు. శ్రీధర్ మాయలతలు వేరొక కుర్చీలో కూర్చున్నారు. ఫంక్షనుకు వచ్చిన అతిధుల చాలమంది అప్పుడే స్టేషను చేరుకుంటున్నారు. ఇంతలో రైలు వచ్చి ఆగింది. శ్రీధర్ మాయలతా వెయిటింగ్‌రూమ్ బయటికి వచ్చి చూశారు. నాగరాజ్ సిసీలియా ప్లాట్‌ఫారమ్ అవతలి కొసనుంచీ వస్తూ ఉన్నారు.

సిసీలియా ముఖం గంభీరంగా ఉంది. ఆమెకు కోపం వచ్చినట్లుంది. నాగరాజు కూడా మామూలుగా నవ్వుతూ లేడు. ఆలోచిస్తూ బరువుగా పరధ్యానంగా ఉన్నాడు.

మాయలతా, సిసీలియా రైల్లో ఎక్కి కూర్చున్నారు. తర్వాత ఎవరూ మాట్లాడలేదు. విజిల్ యిచ్చారు. నాగరాజు ఏదో మాట్లాడబోయారు.

"నాకు తల నొప్పిగా ఉంది రాజ్ .... శ్రమ తీసుకున్నారు ... థాంక్స్" అన్నది సిసీలియా.

"థాంక్స్ .... థాంక్స్" అన్నది యిద్దరితోనూ మాయలత చివరిచూపు శ్రీధర్‌మీద నిలిపి రైలు కదులుతూండగా....

"అబ్బ ! ఈ ఆడవాళ్ల గొడవ యిప్పటికి తీరింది !" అన్నాడు నాగరాజు దీర్ఘ నిశ్వాసంతో ఓవర్‌బ్రిడ్జి మెట్లెక్కుతూ.

"గొడవేమిటి ? సాయంత్రం చాలా సరదాగా గడిచింది. అంతా అయిన తర్వాత ఊరికే అలా అనటం ఆడో పోజు కాబోలు" అన్నాడు శ్రీధర్.

నాగరాజు ఏమీ మాట్లాడలేదు. ఏదో ఆలోచనలో పడిపోయాడు. శ్రీధర్ మనస్సు మాయలతతో సాయంత్రం జరిగిన సంభాషణని తరంగాలుగా రాగాలాపన చేస్తూవుంది. ఇద్దరూ మౌనంగానే హాస్టలు చేరుకున్నారు.

సూటువిప్పి దోవతి తీసి లుంగీగా ధరిస్తూ, శ్రీధర్‌కు కూడా ఒక చాకింటి దోవతి యిచ్చాడు నాగరాజు. బాత్‌రూమ్‌కి వెళ్లి ముఖాలు కడుక్కున్నారు. "అలా గాలిలో తిరిగి వద్దాంరా" అన్నాడు నాగరాజు.

వెళ్లి కాలేజి భవనాల ముందున్న విశాలమైన మెత్తని పచ్చికమీద ఒకచోట కూర్చున్నారు.

"నిన్నివాళ పెద్ద అబద్ధాలకోరును చేశావు. చదువు, ఆస్తి, పెళ్లి అన్ని విషయాల్లోనూ ఒక వేషం వెయ్యాల్సి వచ్చింది. అది నాకేం నచ్చలేదు." అన్నాడు శ్రీధర్.

"ఏమిటి నీ మొహం నీకు నచ్చేది !" ఆప్యాయంగా నవ్వుతూ, మందలిస్తూ అన్నాడు నాగరాజు. "నీకు జీవితం అంటే ఏమిటో తెలీదు ! ఆ అమ్మాయితో సరదాగా కబుర్లాడుతూ ఒక సాయంకాలం గడిపావా, లేదా ? అంతకంటే నీవు బావుకునే దేమిటోయ్ నీ సత్యసంధతతో ! రేపటి విషయం అంటావా, నీ కిష్టంలేకపోతే ఇక నువ్వామెను ఎప్పుడూ కలుసుకోనక్కరలేదు ! ఈ సాయంత్రం యిలా మధురంగా గడిపావ్, చాలు, యీ జ్ఞాపకాన్ని దాచుకో !"

"బాగుంది నీ వేదాంతం ! అయితే సత్యానికి విలువ లేదంటావ్ .... అదలా ఉంచు కాని, ఎవరు వీళ్లు ? ఈ అమ్మాయిలను గూర్చి నా కెప్పుడూ చెప్పనేలేదే !"

"పోయిన సంవత్సరం ఒకసారి సినిమాలో యీ సిసీలియాతో స్నేహం కలిపాను. ఆమెకు ఇంటరులో క్లాస్‌మేట్ యీ మాయలత. మెడిసిన్ నాలుగోయేడు చదువుతోంది. సిసీలియా బి. ఏ. ఒక పార్టు మాత్రం పాసయి ప్రస్తుతం యింట్లో ఉంటోంది. ఒక్కర్తే కూతురు. తండ్రి బాగా డబ్బున్న ఇంజనీరు. మాయలత సిసీలియాతో 'బాయ్ ఫ్రెండ్' కావాలన్నదట. వాళ్ల 'మెడికోస్' అంటే ఆమెకు నచ్చరట. సరే పరిచయం చేస్తాను తీసుకురా అని నిన్న ఆమెకు అప్పగించాను. ఇక నీ యిష్టం !"

"ఆమె నా వివరాలన్నీ గుచ్చి గుచ్చి అడుగుతోంది !"

"ఇంకేం ? తొలిచూపులోనే వలపు ! నచ్చానన్నమాట."

"కరెంటు పోయినప్పుడు చీకట్లో భయం వేస్తోందని నా చేయి పుచ్చుకొన్నది.

"నువ్వేం జేశావ్ ?"

"ఏం జేస్తాను ? .... నాకు వివాహమైపోయిందిగా ?"

"అయితే ఏం ?"

"అంటే నీ ఉద్దేశ్యం ఏమిటి ? నువ్వు నిజంగానే చాలా చెడిపోయినట్లున్నావు ఒక ఏడాదిలో ! .... రాత్రి సినిమాలో అలా చేశావు. ఇప్పుడు నీ ధోరణి యిలా ఉంది ! నాకు ఒకవేళ వివాహం కాకపోయినా ఆ అమ్మాయి నమ్మి చెయ్యి పుచ్చుకున్నప్పుడు నా ధర్మం నాకు తెలీదా ?"

"ఏమిటోయ్ ధర్మమంటే, చెడిపోవటమంటే, ఆలోచించు ! నువ్వు దగ్గరకు తీసుకుని ముద్దుపెట్టుకుంటావనే ఆ అమ్మాయి అలా చేసిందనుకో, ఆమెకు ఆశాభంగం కలిగించటం నీ ధర్మమా ? .... అయినా నీతో వాదించటానికి నా కిప్పుడు ఓపికలేదు గాని, అదీ సంగతి ! నీ కిష్టంలేకపోతే ఆమెను శుభ్రంగా మరచిపోయి పోయినా ఉండు. బలవంతంలేదు ! నీ ధర్మాన్ని విడిచిపెట్టమని నేను చెప్పటంలేదు!"

"అయితే నీకు ఆ సిరియన్ క్రిస్టియన్ అమ్మాయిని వివాహం చేసుకోవాలనే లేదా ? ఆమెను ప్రేమించావుగా !"

"ప్రేమ .... ప్రేమ .... మళ్లీ ఇంకో భావకవిత్వం తాలూకు పదం వాడుతున్నావు, నిర్వచనం లేకుండా ! చిలుక పలుకుల్లా అప్పగించేస్తున్నావు ! పోనీ ప్రేమే అనుకో, పెళ్లి చేసుకోవాలని ఎక్కడుంది ?"

"అయితే నీ ఉద్దేశం ఏమిటి ? ఆ అమ్మాయిని మోసం చేద్దామనే ! ఛీ, అలా చెయ్యబోకు ! ఆ అమ్మాయికి నువ్వంటే ఎంతో మమకారం ఉంది. నేను చూస్తూనే ఉన్నానుగా, నిన్ను నిజంగానే ప్రేమిస్తోంది !"

"నీకు బుద్ధి విస్తృతం కావటంలేదు ! .... ఊత పదాల్ని, తీకదంపుడు భావాల్ని పట్టుకుని వదలనంటున్నావు, నేనేం జేసేది ? ఆమెను నాలో ఆకర్షిస్తున్న దేమిటి ? సరదా, ఆనందం. సరే, నాకూ అదే కావాలి అనుకుందాం. ఈ పరస్పరం

వాంఛిస్తున్న దానిని నువ్వు 'ప్రేమ' అంటావనుకో. పెళ్లి చేసుకున్న తర్వాత అది ఎలాగూ నిలవదు. అప్పుడు ఇద్దరి గతి ఏమౌతుంది ? అందువలన యిప్పటి యీ స్నేహానికి అంతకంటే విలువ లేదు, యివ్వరాదు, అని నా అభిప్రాయం.... నా మనస్సు బాగులేదు, ఇప్పు డింతకంటే చెప్పను."

"అయితే నువ్వు పెళ్లే చేసుకోవా ? నీకు పెళ్లిలో నమ్మకం లేదా ?"

"ఏమో, లేనటి సంగతి ఆలోచించటం నా కిష్టం లేదు ! పోదాం పద, పడుకుందాం" అన్నాడు నాగరాజు.

దీపం తీసివేసిన తర్వాత చాలసేపు ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు. ప్రేమించి పెళ్లిచేసుకోవాలని శ్రీధర్ ఎన్నడూ ఆశయంగా పెట్టుకోలేదు. అందుకే పెళ్లి సంబంధం రాగానే, అమ్మాయి, నచ్చగానే తండ్రి అనుమతితో పెండ్లి చేసుకున్నాడు. కాని, ప్రేమ అనేది సంభవించినా నాజరాజు పెళ్లి విషయమై సందేహిస్తూ ఉండటమేమిటో అతనికి అర్థం కాలేదు ! మాయలత లాంటి మెడిసిన్ చదువుతున్న అందమైన యువతి తనను కోరితే, అవివాహితుడై ఉంటే తను కాదనే వాడేనా ? "చీకట్లో నాకు భయం వేస్తుంది" అని మృదువుగా మధురంగా ఆమె కోరటమూ, తను చేతిని అందివ్వటమూ, అది జీవితానికే అందమైన అర్థాన్ని ఆపాదించే సంఘటనలా ఉంది ! అది వివాహానికే వ్యాఖ్యానం—జీవితమనే చీకటిదారిలో ఆడది మగవాడి చేయి పట్టుకుని నడవటమే కదా వివాహం !

"రాజా, మాయలత కులమేమిటి?"

"ఇండియన్ క్రిస్టియన్."

"మరి ఆ పేర్లేమిటి ?"

"అవును, వాళ్ళ తాతగారు మతం మారారు."

మతాంతర వివాహమైతేనేం, అదీ ఒక గొప్ప ఆదర్శాన్ని సాధించటమే కదా అన్పించింది శ్రీధర్‌కు.

"నాకు వివాహం కాలేదనుకో, నాకు మాయలతను మతాంతర వివాహం చేసుకునే అవకాశం ఉండేదంటావా ?"

"నీ ప్రశ్నలూ, నువ్వూ ! .... వట్టి అమాయకుడి వోయ్ ! నీకు నిజంగానే నేను చెప్పినంతా, ఆమె ఊహించినంతా జమీందారీ డబ్బూ ఉన్నట్లయితే మతమూ అడ్డు రాదు, ప్రేమా అవసరంలేదు ! తప్పకుండా ఆ అవకాశం ఉండేది. కాని, శ్రీధర్, చూడు, ఈ ఆడపిల్లలకి కావలసిందొక్కటే, అది సరదా ! అది కూడా పరిస్థితుల్నిబట్టి రెండు రకాలుగా ఉంటుంది. నీసీలియాకు డబ్బుకొరత లేదు. అందువల్ల ఆమెకు జీవితంలో కావలసిన సరదా, సుఖం, నాలాంటి చలాకీగా ఉండే వ్యక్తియొక్క స్నేహం. మాయలతకు డబ్బులేదు. కాబట్టి ఆమె ముఖ్యంగా కోరుకొనేది డబ్బు యివ్వగలిగిన సరదాలు. ఫారిన్ వెళ్ళటం, కారులో తిరగటం, ఊటీ, కాశ్మీర్ వెళ్లటం లాంటివి .... చూశావా, వాళ్లిద్దరిమధ్యా భేదం ! అదీ సంగతి .... నువ్వు మళ్ళీ మాయలత ముఖం చూడదలుచుకుంటే వెళ్ళేప్పుడు ఒక వంద నోటు జేబులో పెట్టుకుని వెళ్ళు. ఏదైనా ప్రెజెంట్ యివ్వు, టాక్సీలో త్రిప్పు, నువ్వు చెప్పినట్లు వింటుంది ! అమాయకంగా చేతులూపుకుంటూ వెళ్ళి 'నేను అప్పుడు అబద్ధాలు చెప్పాను, నేను సత్యసంధుణ్ణి, నిన్ను జీవితాంతం ప్రేమిస్తాను' అని ప్రారంభిస్తే మాత్రం తలుపుతీసి రోడ్డు చూపిస్తుంది ! జీవితమోయ్, యిది జీవితం ! నీ ఆదర్శాల కోసం జీవితం ఆగటంలేదు. అవి పుస్తకాల్లో ఉన్నాయి; ప్రస్తుత జీవితంలో లేవు !"

"అయితే ఈమధ్య నువ్వు చేస్తున్న వాదం మాట వరసకి మాత్రమే కాదు. ఇదంతా జీవన సిద్ధాంతంగానే తయారుచేసుకుంటున్నా వన్నమాట ! ఏమిటి నీ లక్ష్యం? ప్రేమ, సత్యం, ఆదర్శాలూ లేకపోతే జీవితంలో మిగిలే దేమిటి రాజా ? క్షణికమైన ప్రయోజనాల కోసం అనంతమైన శాశ్వతమైన విలువల్ని బలిపెట్టటమేనా ?"

"నిజంగానే మిగిలే దేమీ లేదు, కాని అప్పుడే సర్వమూ మిగులుతుంది, అంటే నీ కర్థమౌతుందా ?.... నువ్వు పలికేవి చిలకపలుకులు .... నా కిప్పుడు ఓపికలేదు, ప్రొద్దున చెబుతాను—కాని జ్ఞాపకం పెట్టుకోవలసింది ఒక్కటే శ్రీధర్ ! జీవితం !! జీవితం దిగిలే గాని లోతు తెలీని ప్రవాహం. నువ్వు పెళ్లి చేసుకోవటంతో కేవలం పాతబాట పట్టుకొని వెళ్లిపోతున్నావు. నేను క్రొత్తమార్గం అన్వేషిస్తున్నాను. అంతే.... ఆలోచించుకో !"

"నాకు నమ్మకంలేదు క్రొత్తమార్గాలంటూ ఉన్నాయని. ....మనుష్యులు వ్యామోహంలో పడిపోతూ ఏదో క్రొత్త సంగతి కనిపెట్టుతా మనుకుంటారు, చెడిపోతారు...."

"నీ మొహం ! అది ఆత్మవిశ్వాసం లేనివాళ్ళ సంగతి .... ఇక పడుకో నాకు నిద్రవస్తోంది ...."

శ్రీధర్ కూడా వాదించ దలచుకోలేదు.... నాగరాజులో ఏదో పెద్ద మార్పే వస్తోంది !.... అయితే మాయలత తన్ను ధనికుణ్ణనుకుని తనమీద ఆసక్తి కనబరుస్తోందా ? .... ఏమైనా తను వివాహితుడు, యిక ఆమెను గూర్చి ఆలోచించి ఏం చేయాలి ? .... తనకు ప్రేమద్వారం శాశ్వతంగా మూయబడింది ! .... తను తారను ప్రేమించటంలేదూ ? ప్రేమించకపోతే ఎందుకు పెళ్లి చేసుకున్నాడు ? ప్రేమిస్తూనే ఉన్నాడు, కాని తార తనని అర్థం చేసుకోవటమే లేదు ! దాని క్కారణం ఆమె తల్లిదండ్రులు ! అర్థంచేసుకోవటానికి ఆమె ప్రయత్నమైనా చెయ్యనక్కరలేకుండా, వివాహ వ్యవస్థ ఒక్కసారిగా ఆమెకు తనమీద ప్రసాదించిన హక్కులే మరొక కారణం !... ప్రేమద్వారం ముందు నిల్చుని తలుపు తట్టుతూ తను యిలా ఎంతకాలం నిరీక్షించాలో !

4

అద్దము నేలమీద పడి ముక్కలైపోయింది. చేతినుండి అది ఎలా జారిపోయిందో శ్రీధర్‌కు అర్థంకాలేదు. మామూలు జాగ్రత్తతోనే తీశాడు. తల దువ్వుకున్నాడు, మళ్ళీ యథాస్థానంలో పెట్టబోయేంతలో జారి పడిపోయింది. అద్దం పగిలిపోవటం మంచి శకునం కాదంటారు !

ఆఫీసుకు వేళకు సరిగానే చేరుకున్నాడు గాని శ్రీధర్ మనసు మనసులో లేదు. ప్రొద్దున తాంబరం నుంచి వస్తూ

వస్తూ నాగరాజుతో పెద్ద వాదన పెంచుకున్నాడు, గతరాత్రి మాట్లాడిన విషయాలమీద.

"అబద్ధం ఏ పరిస్థితిలోనైనా సరే చెప్పకపోవటం, నిత్య వ్యవహారంలో నిజాయితీ, స్త్రీ, పురుష సంబంధాల్లో, ఉదాత్తత పవిత్రత—యివి జీవితానికి చాల ముఖ్యం" తన విశ్వాసాన్ని నొక్కి చెప్పాడు శ్రీధర్. నాగరాజు సమాధానం డొంక తిరుగుడుగా ఉంది.

"నిజమే, ఇవన్నీ మంచి విలువలే, కాని జీవితం అన్నింటికన్నా ముఖ్యం. జీవితాన్ని యీ విలువల్నించి విడదీసి చూడటం నేర్చుకో ! ఏమంటే, జీవితానికీ నువ్వు చెప్పే విలువలకీ అవినాభావ సంబంధంలేదు. జీవితం వాటిమీద ఆధారపడవచ్చును. ఆధారపడకుండా ఉండవచ్చును కూడా ! జీవితమే పరమోత్కృష్టమైనది కావటంతో నైతికమైన విలువల కోసం వ్యక్తి తన జీవితాన్ని కుష్కింపజేయుటం, లేక అనుభవాన్ని నిరాకరించటం ఆత్మహత్య" అంటాడు నాగరాజు.

ఇలా జీవితాన్నీ 'విలువల్నీ' వేరుచేసి కుస్తీ పట్టటం తనకు నచ్చలేదు. "గాంధీగారి జీవితాన్ని గూర్చి నీ అభిప్రాయమేమిటి ?" అని ప్రశ్నించాడు తను.

"అవును, గాంధీగారిలోనూ జీవితమే ప్రాముఖ్యం వహించింది ! లేకపోతే ఆయన ఇంత విప్లవాన్ని ఎలా సాధించగలిగాడు ! ఆయన విషయంలో జీవితం నైతికమైన విలువల క్రింద నలిగిపోకుండా వాటి ద్వారానే రూపొందటం జరిగింది. అది ఆయన సాధించిన విశిష్టత. అంతే ! ఆ అదృష్టం, అలాంటి వ్యక్తిత్వం ఎందరికి ఉంటుంది ? లక్షమందిలో, కోటి మందిలో ఒక్క గాంధీ అయినా కనిపించకపోవటానికి కారణమేమిటి ? .... అందరిలోనూ జరిగేది; కొన్ని నైతిక సూత్రాలకు, ఆదర్శాలకు జీవితాన్ని బలిపెట్టడం: దానివల్ల ఏమిటో సాధింపబడుతోందనుకోవటం: చివరకు వ్యర్థజీవులు కావటం. అలా కావటమే నా కిష్టంలేదు ! జీవితానికే ప్రాముఖ్యం ఇస్తూ అవసరమైన విధంగా నా నైతికాదర్శాన్ని రూపొందించుకోవటమే నా పద్ధతి..... గాంధీ మాత్రం ఏంచేశాడు ? క్రొత్త విలువల్ని రూపొందించలేదా ?"

"జీవితం అంటే ఏమిటి ? నువ్వు వాడుతున్న అర్థంలో ఆ పదం నాకు బోధపడటంలేదు."

"కేవలం అనుభూతి—సుఖమో, దుఃఖమో, ఆనందమో, విషాదమో—మంచీ, చెడూ ప్రమేయంలేని స్వచ్ఛందమైన అనుభూతి, అది ఒక్కటే పరమోత్కృష్టమైనది. దాన్ని పొందటమే జీవితం అంటాను."

"ఉదాహరణకు."

"ఉదాహరణా ? ఏముందీ ! నిన్న నువ్వు మాయులత సన్నిధిలో మధురంగా గడిపిన క్షణాలు నీకు కలిగించిన అనుభూతి ఏమిటి ? కేవలం ఒక ఆనందం. అదే జీవిత ధర్మం. దాన్ని గుర్తించి, దానికి విలువ యివ్వు ! నువ్వు నిన్ను గూర్చిన వివరాలు ఆమెకు సరిగా చెప్పావో లేదో అనేది అప్రస్తుతం, దానికి ప్రాధాన్యం లేదు....."

"పిచ్చినట్లుంది ! ఇలా అయితే మనుష్యులు ఒకరి నొకరు నమ్మటం ఎట్లా ? లోక వ్యవహారం జరగటం ఎట్లా ?"

"ఎందుకు నమ్మరు ? లోక వ్యవహారం ఎందుకు జరగటంలేదు ? నమ్మేవాడు అబద్ధం చెప్పినా నమ్ముతాడు, నమ్మకము లేనివాడు నిజం చెప్పినా నమ్మడు. ఏ సమయంలో ఏది పనిచేస్తుందో, ఏది అవసరమో దాన్ని ఉపయోగించటమే జీవితలక్షణం .... జీవితం నిజాయితీమీదే జరగటంలేదే ! నిజాయితీ తక్కువై ఆగిపోవటంలేదే !"

"నువ్వు తమాషాకు వాదిస్తున్నావేమో నాకు తెలీటం లేదు కాని, ఇంత అవకాశవాదివై పోయావు, ఎప్పటినుంచీ రాజా ? నా కాశ్చర్యం వేస్తోంది !"

"అవకాశవాది అన్న పదం చక్కనిది! అవును, అలా కావటమే జీవించటం అంటే ! మన రాజకీయాలు చూడు ఉదాహరణకి ! జీవితస్వరూపం తెలీనివాళ్ళు కొన్ని విలువలే దాని స్వరూపం అనుకొని భ్రమపడతారు. ఆ రూపాన్నే అంటిపెట్టుకుంటారు. అంతలో జీవితం ఆ విలువల్ని దాటి, వాళ్ళని వదలిపెట్టి ముందుకు కదలిపోతుంది. జీవితం విలువల్ని సృష్టిస్తుంది కాని విలువలు జీవితాన్ని సృష్టించవు అనే సత్యం వాళ్ళకు తెలీదు. గాంధీగారు చేసిన పనేమిటి ? ఆయన క్రొత్త విలువల్ని సృష్టించలేదా ? ఆయన చేసినదాన్నే పూర్వకాలంలో అయితే 'రాజద్రోహం' అనీ 'పిరికిపాడి తత్త్వం' అనీ పిలిచేవారు. నేటికాలపు పరిస్థితుల్లో, వాటినే 'దేశభక్తి' అనీ 'అహింసాతత్త్వం' అనీ వ్యవహరిస్తున్నాము. పూర్వం దేశభక్తి అంటే కేవలం రాజభక్తే; ఆ రెంటికీ అవినాభావ సంబంధం. పూర్వం అహింసాతత్త్వం వ్యక్తిగతమైన, ఆధ్యాత్మికమైన గుణం. వాటికీ గాంధీగారు సంఘంలో రూపొందించిన క్రొత్త నైతిక విలువంకీ సంబంధం ఏమీ లేదు; ఆయన క్రొత్తవాటికి పాత పేర్లయితే పెట్టారుగాని ! .... సరే స్వరాజ్యం వచ్చింది, కథ ముగిసింది. జీవితం గాంధీగారి విలువల్ని దాటి ముందుకు అడుగుపెట్టిన స. దనలు కనిపించాయి. 'ఆ చీకటిలో నాకు వెలుగు కనిపించటం దు'. అని ఆయు అన్నారు. మళ్ళీ అన్వేషణ ప్రారంభిస్తూ···అంతటితో ఆయన జీవితం గొప్పగా సమాప్తి చెందింది. అంటే గాంధీ అస్తమయం దేశ చరిత్రలో ఒక దశకు ముగింపు...."

"నీ వ్యాఖ్యానం ఎలా ఉన్నా గాంధీ తత్త్వానికీ, ఆయన సూచించిన ఆదర్శానికీ చావు లేదన్నమాట అంగీకరించవా ? వాటి ప్రయోజనం దేశానికి ఇంకా ఎంతో ఉందని గుర్తిస్తూ మనం జీవితాన్ని ఆ ధోరణిలో నడుపుకోవడం కర్తవ్యం కాదా ?"

"తత్త్వానికీ విలువలకీ ఒకవిధంగా చావు వుండని మాట నిజమే. అవి పుస్తకాల్లో ఉం యి, ఉపన్యాసాల్లో ఉంటాయి. ఆ పేర్లే మళ్ళీ మళ్ళీ వాడతూ వుండొచ్చుకూడా! కాని, మనుష్యుల ప్రవర్తనలో, అనుభూతిలో అవి ఎంతవరకు కన్పిస్తున్నాయి అనేది ప్రశ్న.... అవి ఎప్పుడు అనుభవంలో కనిపించకపోతే అప్పుడు జీవితం వాటిని దాటేసిందన్నమాటే ! ..... ఇక్కడ అంతిమ విజయం అంటూ కథలో లాగ ఒకటి లేదోయ్ శ్రీధర్. గాంధీగారి జీవితం స్వరాజ్

సమరం. అదంతా ఆయన విజయమే; కాని హిందూ ముస్లిం కలహాలు, రక్తపాతం, ఆయన పోయేముందు జరిగిన హింసా కాండ ఆయన అపజయానికి చిహ్నాలు మాత్రం కావు! జీవితం గాంధీగారిని దాటి ఇంకో మలుపు తిరిగింది అనుకోవాలి అంతే! ఇక మన కర్తవ్యం అంటావా, ప్రాతవిలువలతో కొత్త జీవితాన్ని సృష్టించటానికి వీలుకాదు ఎంత ప్రయత్నించినా! ఏ విలువల మాట జీవితం వినదు, జీవితం మారితే విలువలు మారాలి; అంటే క్రొత్త విలువలు పుట్టుకురావాలి! .... దేశంలో రాజకీయాల్లో ఇప్పుడు వస్తున్న మార్పు గమనిస్తే ఈ విషయం బాగా అర్థమవుతుంది..... ప్రకాశంగారిని ఎందుకు మద్రాసు ప్రధాని పదవినుంచి తొలగించారు అవకాశవాదులంతా కలసి? వాళ్లని అవకాశవాదులనీ స్వార్థపరులనీ మనం తిట్టిపోస్తున్నాం కాని, మనుష్యుల్ని, జీవితాన్నీ, మార్పునీ చూచి ఏవగించుకుంటే లాభమేమిటి! ప్రకాశంగారిలో చేవ వుంటే మళ్లీ ప్రధాని అవుతారు, లేకపోతే లేదు! జీవితస్వరూపంలో వచ్చిన ఈ మార్పుని మొదట గుర్తించకపోతే, నీ కర్తవ్యాన్ని వ్యక్తిగతంగా ఏమని నువ్వు నిర్ణయించుకుంటావ్? ఆ కర్తవ్యాన్ని ఏవో ప్రాత విలువలతో ముడిపెట్టుకోవటం జీవితానికి ద్రోహం చెయ్యటమే!"

"రాజా! నీ వేదాంతం నాకు కేవలం వితండవాదంగానే కన్పిస్తోంది! ..... దీన్ని గూర్చి ఆలోచిస్తే గాని నాకేం అర్థమవదు.... కాని, నువ్వు నిజంగానే చెడిపోతున్నావంటే మాత్రం నేను నమ్మను."

"సరే నీ యిష్టం!..... పట్టి గుమాస్తాలా కాకుండా, జీవితాన్ని అన్వేషిస్తూ అంగీకరిస్తూ ఉండాలోయ్! లేకపోతే రానురాను నువ్వు యంత్రంలా తయారవుతావ్."

"నన్నేమీ ఎత్తి పొడవక్కర్లేదు, ముందు నీ సంగతేమిటో కాస్త జాగ్రత్తగా చూచుకో."

అలా నాగరాజు దగ్గరనుండి వచ్చేస్తూ మనసులో ఏదో బెంగ, అసంతృప్తి అనుభవించాడు తను. ఆ పరధ్యానమే కారణం కాబోలు అద్దం జారి పడిపోవ నికి .....

ఆఫీసులో ఫైళ్లు ముందేసుకుని కూర్చున్నా, నాగరాజు వాదనే మళ్లీ మళ్లీ గుర్తువచ్చి మనస్సు ఎదురు తిరుగుతోంది. శ్రీధర్‌కు పనిమీద లక్ష్యం కుదరటంలేదు.

సెక్షను చప్రాసీ ఉత్తరాలు పట్టుకొచ్చాడు. శ్రీధర్‌కు రెండు ఉత్తరాలున్నాయి. కార్డు తండ్రి వ్రాసింది. అంతా క్షేమంగా ఉన్నారనీ, అన్నయ్య చిన్నకూతురు సీతకు జ్వరం వస్తూ ఉండి కొంత నెమ్మదించిందనీ వ్రాశా డాయన. డబ్బుకు ఏమైనా యిబ్బందిగా ఉంటే తెలియచెయ్యమని వ్రాశాడు. రెండవ ఉత్తరం తార దగ్గరనుంచి వచ్చింది. పాపాయి స్వరాజ్యానికి విరేచనాలు. డాక్టరు శ్రీదేవి దగ్గర కాక డాక్టరు మధుసూదనం దగ్గర మందిప్పిస్తున్నారట. తను కూడా టానిక్కులేవో తీసుకోవాలట. వెంటనే ఒక వంద రూపాయిలు పంపించమని వ్రాసి ముగించింది.

వంద రూపాయిలు ఎక్కడున్నాయి? తనకు వెం జీతమే వందకు మించటంలేదు! మామగారు యివ్వలేక కాదు, అల్లుడి ప్రయోజకత్వాన్ని నిర్దాక్షిణ్యంగా బయటకు లాగి దాసోహ మనిపించాలనే ప్రయత్నమే ఇందులోనూ కనిపిస్తోంది!

అదృష్టవశాత్తు నాన్నగారు అముక్క వ్రాశారు. డబ్బు అవసరం ఉంటే తెలియజెయ్యమని. శ్రీధర్ ప్రక్కసీటులోని తోటి గుమాస్తా నడిగి కార్డు అరువు తీసుకొని వెంటనే వ్రాశాడు. "వీలుంటే వంద రూపాయలు పంపించండి ..... తార కూడా తనకు కొంత కావాలని వ్రాసింది, పంపిస్తాను" కార్డు పోస్టుకు పంపించాడు.

ఇంతలో సెక్షను సూపర్నెంటు నుంచి కబురు వచ్చింది. కొన్ని అర్జెంటు ఫైల్సు సిద్ధం చెయ్యలేదేమని ప్రశ్నించా రాయన. శ్రీధర్ ఆఫీసు పనిలో మునిగిపోయాడు.

సాయంత్రం ఆఫీసునుంచి బయటపడి కాఫీ త్రాగి, మెరీనా వైపు నడుస్తూంటే, నాగరాజు వాదం, మాయలత, క్రితంరోజు పార్టీ జ్ఞాపకం వచ్చి హృదయంలో అవ్యక్తమైన వేదన ప్రారంభమైంది. నిన్నటి అనుభవం అంతటితో మరచిపోవా లనుకున్నాడు. ఈ బాధ దాన్ని అంత సులువుగా మరచిపోవటానికి వీల్లేదనే గుర్తు చేస్తోంది. మరచిపోక చేసే దేమిటో అర్థం కావటంలేదు! ఈ మధుర వేదనకూ, జ్ఞాపకానికీ ఆధారం ఒక్క అబద్ధమేనా? తనకు డబ్బులేదని మొదటే తెలిస్తే మాయలత అసలు అసలు మాట్లాడి ఉండదేమో!

తన దగ్గర విరివిగా పచ్చనోట్లు ఉంటే తప్ప తను మాయలతతో మాట్లాడటానికే వీలుండదంటాడు నాగరాజు. ఆ హెచ్చరికలో అతిశయోక్తి లేదని తనకూ తెలుసు! కాని ఊరికే తెలియటంవల్ల లోపలి వాంఛ, జ్ఞాపకం, వేదన అదృశ్యమైపోవే! తుచ్ఛమైన డబ్బు, అర్థంలేని తాహతు, యివేనా ఆధారాలు మధురానుభూతికీ, స్నేహానికీ, ప్రేమకూ, ఆకర్షణకూ!

నిజమే! తార ఉత్తరం వ్రాసిన కారణం మాత్రం— ఒక పచ్చనోటు కోసమే కదా!

తనిలా బాధపడటం దేనికి? తన పరిస్థితిలో గాంధీగారు ఏం చేసేవారు? స్త్రీల దాక్షిణ్యం కోసం, తుచ్ఛమైన వ్యామోహంతో యిలా పరితపించట మేమిటి? మనస్సుని నిగ్రహించి, దరిద్రనారాయణులైన తోటి మానవుల్ని సానుభూతితో చూడటం నేర్చుకుంటే అంతకన్న తృప్తి, ఉదాత్తత ఉంటుందా?

"బాబూ" అంటూ ఆరేళ్ల కుర్రవా డొకడు, దీన మొఖంతో దీనంగా యాచిస్తూ శ్రీధర్ వైపు వచ్చాడు.

జేబు తడిమి, ఒక అర్ధణా తీసి తృప్తిగా వాని చేతిలో వేశాడు శ్రీధర్. తను జీవితాన్ని ఈవిధంగానే ఎదుర్కొంటాడు! నిరాడంబరంగా జీవిస్తాడు! ఇదే గాంధీ మార్గం. క్రితంరోజు లాగ కృత్రిమ జీవితంలో ఒక పాత్రను అభినయించవలసిన అవసర మేమిటి తనకు? నాగరాజు తన్ను గూర్చి అబద్ధం చెప్పినప్పుడే కుండ బ్రద్దలు కొట్టినట్లు తను నిజం చెప్పవలసింది. నాగరాజూ, స్నేహితులూ, ఆ పార్టీ

ఏమైనా వుంటే తనకేం ? తన ఆదర్శాల విషయంలో తను కఠినంగా ఉండక తప్పదు ! ఈ నిశ్చయం శ్రీధర్‌కు కొంత తృప్తి కలిగించింది.

శనివారంనాడు తండ్రి దగ్గరనుంచి మనియార్డరు వచ్చింది. ఈ అయిదు రోజుల్లోనూ శ్రీధర్ తన మన స్సుని త్రవ్వి పోశాడు. తనని తాను నిర్దాక్షిణ్యంగా వేధించు కున్నాడు. కలుపు మొక్కల్ని తొలగించినట్లు బలహీనతలని దూరం చెయ్యటానికి ప్రయత్నించాడు.

తారకు డబ్బు పంపించగూడదన్న నిర్ణయానికి వచ్చాడు. అలా చెయ్యటంతో ఆమెకు తనమీద నిజంగా ఎటు వంటి ప్రేమ ఉందో తెలిసివస్తుందనుకున్నాడు.

సాయంత్రం ఆఫీసు ముగిసేవేళ అవుతూవుండగా నాగరాజు వచ్చాడు. సాధారణంగా ఆదివారాలు తప్ప నాగరాజు వచ్చి కలుసుకోడు. ఆఫీసు కెప్పుడూ రాలేదు కూడా.

"ఏమిటి విశేషం ? ఇలా అనుకోకుండా ప్రత్యక్ష మయ్యావ్ !" అన్నాడు శ్రీధర్.

"నీతో అర్జంటు పని ఉండే వచ్చాను. అలా వెళ్దాంరా చెబుతాను."

కాఫీహోటల్లో ప్రవేశించి కాఫీ త్రాగుతుండగా చెప్పాడు నాగరాజు. "నేను పరీక్ష ఫీజు కట్టాలి. మావాళ్ళింకా డబ్బు పంపలేదు. నువ్వేమైనా సర్దగలవా ఒక ఎనభై రూపా యలు ? సోమవారం కావాలి !"

'నా దగ్గర లేదు' అన్నమాట నోటి చివరిదాకా వచ్చి ఆగిపోయింది శ్రీధర్‌కు. తను ఏ పరిస్థితుల్లోనూ ఇకమీద అబద్ధ మాడగూడదని ఈమధ్యనే చేసుకున్న నిర్ణయం గుర్తు వచ్చింది.

"నా దగ్గర అంత డబ్బు ఎలా ఉంటుందనుకున్నావ్?" అని ఎదురుప్రశ్న వేశాడు శ్రీధర్.

"ఏమైనా బాంక్‌లో దాచావేమో, కనీసం నీ భార్య తాలూకైనా ఏదో కొంత లేకపోతుందా అన్న ఆశ !"

"నన్నే అడగటం దేనికి ?"

"నీకన్నా స్నేహితు లెవరూ కన్పించలేదు మరి అడగ టానికి !" నవ్వుతూ అన్నాడు నాగరాజు.

"నేను సర్దలేకపోతే ఏమౌతుంది ?"

"ఏమిటోయ్ యీ యక్షప్రశ్నలు ! అసలు నీకౌతుందో లేదో చెప్పకుండా తమాషా చేస్తున్నావ్. ఏమౌతుంది ? చివరి ప్రయత్నంగా మా ప్రొఫెసరుగారినే అడుగుదా మనుకున్నాను. లేకపోతే యీ పరీక్షకు వెళ్లటంలేదు, అంతే !"

"నీ ఫ్రెండు సిసీలియా నడగవా ? ఆమెకు చాలా డబ్బుందిగా."

నాగరాజు శ్రీధర్ వైపు ఆశ్చర్యంగా చూశాడు. ఆ చూపులో నాగరాజు కొంత బాధపడినట్లు అనిపించింది శ్రీధర్‌కు.

"ఉహూఁ .... అడగను" అన్నాడు రాజు.

"ఏం ఎందు కడగకూడదు ? నీకు జీవితమే ముఖ్యం, నైతికమైన విలువలు కావు గద !"

"అవును, అందుకే నా కిష్టంలేని పని చెయ్యను. ఆమెను డబ్బడగటం నా కిష్టంలేదు, అడగను, అంతే ! నాకు జీవితం ముఖ్యమని అన్నాను గాని డబ్బని అనలేదే ! ఏం చక్కగా అర్థంచేసుకున్నావోయ్ !"

శ్రీధర్ మాట్లాడకుండా కాఫీ పూర్తిచేశాడు. హోటలు బిల్లు నాగరాజే చెల్లించాడు. బయటికి వచ్చిన తర్వాత శ్రీధర్ నాగరాజు భుజంమీద చేయివేసి అన్నాడు :

"నువ్వడిగిన ఎనభై రూపాయలు యిప్పుడే యిస్తా ననుకో, మళ్లీ ఎప్పుడిస్తావ్ ?"

"డబ్బు రాగానే ! పది పదిహేను రోజుల్లో."

శ్రీధర్ పర్సులోని డబ్బుతీసి ఎనభై లెక్కపెట్టాడు.

"నీ దగ్గర యింత సిద్ధంగా ఎలా ఉంది ? ఎక్కడిదీ డబ్బు ?" అన్నాడు నాగరాజు.

"ఇవ్వాళే మా నాన్నగారు పంపారు. తారకు పంపాలి అని మొదట అనుకున్నాను, ఇప్పుడు పంపటంలేదు. నువు వాడుకో వీలైనప్పుడు యివ్వు."

"ఇది నిజంగా అదృష్టమే !"

* * *

పై శుక్రవారం శ్రీధర్‌కు టెస్టింగ్ ఆర్డర్ వచ్చింది. అతను పనిచేస్తున్న సెక్షనుకు అతని స్థానంలో యింకొక సెక్షను నుంచి ఒక గుమాస్తాను బదిలీ చేశారు. ఆ సెక్షను రద్దుచేసి అందులోని గుమాస్తాలను మిగతా సెక్షనులకు పంపివెయ్యటంతో అలా జరిగింది.

అనుకోకుండా ఉద్యోగం పోవటంతో మతి పోయిన ట్లయింది శ్రీధర్‌కు. శనివారం ఛార్జి అప్పగించేశాడు.

లాడ్జికి వెళ్లి పడకమీద పడుకుని ఆలోచించాడు. కాలెండరులో సినిమాతార తనను చూచి నవ్వుతోంది ! ఇప్పుడు తను చెయ్యగలిగిందేమిటి ?

ఉద్యోగం పోవటంతో అత్తవారు తనమీద విజయం సాధించినట్లే ! వాళ్ళు కోరుకుంటున్నదీ అంతే ! ఇప్పుడు తను వెళ్లి వాళ్ల పంచను చేరాలని వాళ్ల అభిమతం ..... అలా జరగకూడదు ! ఇంకో ఉద్యోగంకోసం ప్రయత్నం చెయ్యాలి !

ఆలిండియా రేడియోలో శ్రీధర్ మిత్రు డొకడు పనిచేస్తున్నాడు. ఉద్యోగంకోసం అక్కడేదో ఖాళీ ఉన్నట్లు అతను చెప్పాడొకసారి. శ్రీధర్ వెళ్లి అతన్ని కలుసుకున్నాడు. అప్లికేషన్ వ్రాసి ఆఫీసులో యిమ్మనీ, ఒక వారం రోజుల్లో ఏమైందీ తెలుపుతాననీ అన్నాడు ఆ మిత్రుడు.

వారం గడిచింది. రేడియోలో ఆ ఉద్యోగం శ్రీధర్‌కు లభించలేదు. మద్రాసులో ఉద్యోగం లేకుండా సోమరిగా ఉండటం కష్టమనిపించింది శ్రీధర్‌కు. ఒకరోజు తాంబరం వెళ్లాడు.

నాగరాజు గదిలో పడుకుని చదువుకుంటున్నాడు.

"క్లాసులికి వెళ్లలేదా ?"

"పరీక్షలకి చదువుకోటానికి సెలవు లిచ్చారు .... ఏంయిలా వచ్చావే, ఆఫీసు లేదా ?"

"ఉద్యోగం పోయి రెండు వారాలు కావస్తోంది. ఉస్టింగ్ నచ్చింది."

"అయితే యిప్పుడు ఏం చెయ్యదలుచుకున్నావ్?"

"రోజా ప్రయత్నం చేస్తూనే ఉన్నాను, ఎక్కడైనా ఖాళీలు ఉన్నాయేమోనని. లాభం కనిపించలేదు. రేపో, ఎల్లుండో గది ఖాళీచేసి మదనపల్లి వెళ్ళిపోదా మనుకుంటున్నాను.'

"వెళ్లి ?"

"వెళ్లి బహుశా వ్యవసాయం చేస్తాను. మరేం చెయ్యమంటావ్ ? .... ఇంకా నిర్ణయించుకోలేదు."

నాగరాజ్ పైకప్పుకేసి చూస్తూ, ఏమిటో ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోయాడు. శ్రీధర్ టేబిల్‌మీద ఉన్న పుస్తకం తీసి పేజీలు తిరగేస్తున్నాడు కొంతసేపు.

"ఎలా ఉంది నీ చదువు ? క్లాసు వస్తుందా ?"

"ఏమి చదువో ! నాలుగు రోజులైంది సీరియస్‌గా చదువు ప్రారంభించి ..... క్లాసు వస్తుందనే అనుకుంటున్నాను."

"నీకు యితర వ్యాపకాలు జాస్తి అయినవి నే ..... సిసీలియా ఏమంటోంది ?"

"ఏమంటోంది ! .... సిసీలియాకు వివాహం నిశ్చయమైంది తెలుసా ? నాలుగు నెలల్లో మిసెస్ జేకబ్ కాబోతోంది.

నాగరాజ్ మంచంమీద నుంచి లేచి అటు నిటు తిరుగుతున్నాడు.

"అదేమిటి ? నువ్వు చేసుకోవని చెప్పేశావేమిటి ? ఆమె నిజంగానే ఒప్పుకుందా యింకొర్ని చేసుకోవటానికి ?" శ్రీధర్ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడు.

"నేను వివాహం చేసుకోనని ఆమెతో ఎలా చెప్పటమా అని ఆలోచిస్తూ సందేహిస్తూ ఉండగానే, ఆ ముక్క కాస్తా ఆవిడే ముందు తేల్చేసింది !"

"నేను నమ్మను ! కళ్లారా చూశాను ఆమె నిన్నెలా ఆరాధిస్తోందో !.... నువ్వు అబద్దాలు చెబుతున్నావు నన్ను తృప్తిపరచడానికి .... కదూ !"

"కాదోయ్ ... ఇదుగో నువ్విచ్చిన డబ్బు .... తిరిగి యిచ్చేస్తున్నా" నాగరాజ్ పెట్టెతీసి ఎనిమిది పదులు లెక్కపెట్టి శ్రీధర్ కందించాడు. "కావలిస్తే యీ డబ్బు నడుగు సాక్ష్యం, జరిగిన కథేమిటో చెబుతుంది ! ఇందులో ఒక విధంగా ఓటమి నాదే. సిసీలియాదే గెలుపు!"

"కథేమిటి ? ఈ డబ్బు సాక్ష్యమేమి?"

"హాస్టలుకి నువ్వు వచ్చావు చ డు, అప్పుడే మా స్నేహంలో చివరి అంకం ప్రారంభం కావటం! స్టేషనులో దీపాలు ఆరిపో న సమయంలో నన్ను ఆవతలికి తీసుకుపోయి సిసీలియా యుద్ధం ప్రకటించింది. తనకు నెల తప్పిందని చెప్పింది. అసలు తత్త్వమేమిటో కథ మొదటినుంచి చెబితేగాని నీకు బోధపడదు లే!!...

"ఏడాది క్రితం మా స్నేహం, అంటే ప్రణయం, ప్రారంభమైనప్పుడు యిద్దరిమధ్యా ఒక చిన్న నాటకం జరిగింది. మర్యాద ప్రకారం నేను ఆమెను పెళ్లి చేసుకొమ్మని అడిగాను, ఆమె 'ఇప్పుడు కాదు' అని బదులు చెప్పింది. ఇదొక లాంఛనం అనుకో, ఇందులో మే మిద్దరం దొంగలమే ! తర్వాత మా ప్రణయానికి అంతరాయం లేకుండా 'అవసరమైన జాగ్రత్త' వహించే బాధ్యత మగవాడినైన నాదే నంటూ కూడా సున్నితంగా తేల్చేసింది. నే నంగీకరించాను. కాని, దురదృష్టవశాత్తు ఒక్కసారి పొరపాటు జరగనే జరిగింది. ఆమెకు నెల తప్పింది. హాస్టలుడే నాటికి వారం రోజుల పూర్వమే సూచనగా వివాహ ప్రసక్తి తీసుకుని వచ్చింది. మావాళ్ళకు వ్రాసి వ్యవహారం తేల్చుకుంటానని చెప్పాను, కాలయాపనచేసి అసలు సంగతేమిటో గ్రహించటానికి. నిజానికి నేనూ సందిగావస్థలోనే ఉన్నాను. హాస్టలు డే ఫంక్షనులో పార్టీ తర్వాత కాబోలు అడిగితే 'ఉత్తరం రాలేదు; శనివారం లోగా చెబుతాను' అన్నాను. స్టేషనుకు వెళ్లాక ఆ చీకట్లో ప్రక్కకు తీసుకువెళ్లి ఒకే సాధింపు ప్రారంభించింది. నేను నమ్మదగినవాణ్ణి కాదట; తగిన జాగ్రత్త తీసుకోలేదట; తనకు నెల తప్పినా పట్టనట్లే ప్రవర్తిస్తున్నానట; పెళ్లి చేసుకుంటాననే నమ్మకం లేనేలేదట..... ఆ ధోరణిలో చాలా నిష్ఠూరంగా మాట్లాడింది. ఆ ధోరణి ఆమె స్వభావానికి విరుద్ధం ! ఏ ఉద్దేశంతో అలా మనసు విరిగేటట్లు మాట్లాడిందో నాకు అర్థంకాలేదు. బహుశా అది తన పరిస్థితికి సహజమైన ఆదుర్దానేమో అని కూడా అనుకున్నాను. ఎటూ నిర్ణయించలేక నిర్ణయాన్ని పై శనివారానికే వాయిదా వేశాను. నేను దేనికైనా సిద్ధంగానే ఉన్నాను, వివాహానికి తప్ప ! మొదటినుంచీ ఆమె ధోరణి కూడా అంతే, కాని, హాస్టలుడే రాత్రి ఆమె ప్రవర్తన నన్ను బాగా తికమక పెట్టింది. చివరకు శనివారంనాడు నేను ఆమె దగ్గరకు వెళ్లగానే, డొంకతిరుగుడు లేకుండా సూటిగా తన భారం వదిల్చే ఉపాయం చూడమని చెప్పింది. వివాహం సంగతే ఎత్తలేదు ! 'వివాహం చేసుకుందాం' అని కదిలించాను, నేనే. 'మొదట ఈ బాధ్యత నిర్వర్తించు, తర్వాత తీరిగ్గా ఆలోచిద్దాం ఆ సంగతి' అన్నదామె! ఆమె అలా అనటమే నాకు అనుకోకుండా బాధ కలిగించింది ఆశ్చర్యంగా. బహుశా అది నాలోని 'అహం' తిన్న దెబ్బ ! ....

"ఏమైతేనేం, ఒక డాక్టరు దగ్గరకు వెళ్లాం, ఏదో కథ చెప్పాము; నమ్మకపోయినా నమ్మినట్లు నటించి ఒక వంద రూపాయిలు ఫీజు తెస్తే చేస్తానన్నది ఆ డాక్టరు. నా దగ్గర యిరవై మాత్రమే ఉంది, ఆరోజే పరీక్ష ఫీజు కట్టేశాను.... వెంటనే నీ దగ్గరకు వచ్చాను, నువ్వు సర్దావు. మరునటిరోజు అంటే ఆదివారమే సిసీలియా చికిత్స పూర్తయిపోయింది.... పోతే, తన ఎంగేజ్‌మెంట్ సంగతి నాలుగు రోజుల క్రితమే ఉత్తరం మూలంగా తెలిపింది సిసీలియా. అందులో 'మా స్నేహాన్ని యింకోవిధంగా మార్చటం తన కిష్టం లేదంటూ' వ్రాసింది. చూశావా ఆ గడుసుదనం ! అంటే ఆ వాక్యానికి అర్థం ఏమిటీ ? నేను పెళ్లి ప్రపోజ్ చేసినట్లూ, తను నిరాకరించినట్లూ పైకనిపించే అర్థం ... పెళ్లికంటె కూడా

'స్నేహమే' ఎక్కువ అంటూ నన్ను తృప్తిపరచటానికి అందులోనే ధ్వని! ఇంకా ఆలోచిస్తే అసలా వాక్యం ఎందుకు వ్రాయవలసి వచ్చింది అని తర్కిస్తే, పూర్తిగా మా 'స్నేహాన్ని' భవిష్యత్తులో కూడా విరమించుకోవటం తనకు యిష్టంలేదని కూడా సూచన కాబోలు! ఆవిడ వ్రాసిన ఉత్తరాలన్నీ అంతే! పైకి స్నేహాన్ని మించిన వాచ్యార్థం ఎక్కడా ఉండదు వాటిలో! కానీ, అన్నీ అగాధపు అర్థం వచ్చి ప్రణయలేఖలు! అందుకే జీవితంలో ఈసారి గెలుపు ఆమెదే అంటాను ...."

శ్రీధర్ విషయమంతా కుతూహలంగా విన్నాడు. నాగరాజు ముగించాక కొన్ని క్షణాలు మాట్లాడలేక పోయాడు. అతనిలో ఉన్నట్టుండి బాధ అవమానం ఉవ్వెత్తుగా లేచాయి.

"ఛీ! ఛీ!! ఇదా జీవితం? దీన్నా నువ్వు గెలుపూ ఓటమీ అంటూ ఉండటం! నువ్వు .... నువ్వు .... యింత పాపాన్నీ, ఘోరాన్నీ చేసి యింకా యిలా నెమ్మదిగా చెబుతున్నావా? .... థూ! ఎంత ద్రోహం చేశావ్ మన స్నేహానికీ .... నాకూ .... నన్ను మీ పాపంలో పాలు పంచుకునేలా చేశావ్? నన్నిందులోకి మోసంచేసి లాగటానికి ఏమిటి నీకు అధికారం? .... నువ్వు చెడిపోతూ నన్నూ అందులో భాగస్వామిని చెయ్యటానికి నీ కెంత సాహసం! .... ఛీ! నన్ను మోసంచేశావ్! పరీక్షకోసమని చెప్పి డబ్బు తీసుకున్నావ్ .... నువ్వూ ఇంకొకర్తె కలిసి చేస్తున్న భ్రూణహత్యలో నాకూ భాగం యివ్వటానికే డబ్బు తీసుకుంటూ నాతో చెప్పకుండా. ఏమిటీ ద్రోహం?.... మళ్ళీ యీ పాపిష్ఠి డబ్బు .... సాక్ష్యం .... అంటూ జంకు లేకుండా ఈ కాలుష్యం నా చేతికి.... నాకు .... ఎందు కిస్తావ్?... వద్దు నాగరాజ్, నేను చాదస్తపు మనిషినే .... క్షమించు .... మనకు పొత్తు కలియుటమే పొరపాటైంది .... కాదు, నువ్వు పూర్తిగా మారిపోయావు, నువ్వు నాకు తెలిసిన నాగరాజువి కావు ... ఇంక మన మెప్పుడూ కలుసుకోము జీవితంలో .... నేను వెళ్తాను!"

పట్టరాని ఆవేదన, కోపము, దుఃఖము శ్రీధర్ కంఠంలో, మాటల్లో పొంగులు వారాయి. నాగరాజు ఆశ్చర్యంతో నోట మాట రాక అలానే నిలిచిపోయాడు. శ్రీధర్ రియాక్షన్ యిలా ఉంటుందని కలలోనైనా ఊహించలేదు నాగరాజు. ఊహిస్తే అసలు విషయమే చెప్పేవాడు కాడేమో.

శ్రీధర్ లేచాడు. తన వేదనని వెళ్ళగక్కుతూనే జేబు నుంచి నాగరాజు యిచ్చిన నోట్లనుతీసి టేబిల్‌మీద గిరవాటు పెట్టాడు. ఒక్క క్షణం ఆగాడు. కళ్ళు తుడుచుకొని, నిగ్రహించుకొని వెళ్ళిపోవడానికి ముందుకు అడుగులు వేశాడు.

నాగరాజు అతని చెయ్యి పట్టుకున్నాడు. "నన్ను క్షమించు శ్రీధర్! నేను తెలిసి నీకు బాధ కలిగించలేదు."

"దేవుడే క్షమిస్తాడు .... నన్ను వదులు .... నేను వెళ్తాను." చెయ్యి విడిపించుకొన్నాడు శ్రీధర్.

"ఏమిటి శ్రీధర్! ...." నాగరాజు అతనితో వాదించి నచ్చచెప్పాలి అనే ప్రయత్నం ప్రారంభించాడు. కాని శ్రీధర్ ఆగకుండా గబగబా నడిచి వచ్చేశాడు.

5

సాయంకాలపు వెలుగు క్షీణిస్తోంది.

మదనపల్లి జిల్లాబోర్డు హైస్కూలు కెదురుగా ఉన్న చెఱువుగట్టుమీద కూర్చున్నాడు శ్రీధర్. చెఱువు బొత్తిగా ఎండిపోయింది. నేల చీలికలు చీలికలుగా, ముక్కలైపోయిన పలకలా ఉంది.

మేనెల ఆఖరివారం వచ్చినా మేపవి వాన తెరలు, ఏటా వచ్చేవి, రాలేదు. ఎత్తయిన ప్రదేశం కావటంతో మదనపల్లిలో ప్రకృతి సహజసుందరంగా ఉంటుంది. కాని, ఆఏడు పళువుచెట్లు కూడా ఎండిపోయి కొన ప్రాణంతో ఉన్నాయి.

శ్రీధర్ మద్రాసునుంచి తిరిగివచ్చిన ఇరవై రోజులకు అన్నయ్య కూతురు సీతకు జ్వరం తిరగబెట్టి అకస్మాత్తుగా మరణించింది.

ఆ చెఱువూ, చెఱువుగట్టూ శ్రీధర్ హైస్కూలు జీవితంతో అంకితమైపోయిన ప్రదేశాలు. పదేళ్ళ వయస్సులో హైస్కూలు ప్రవేశించినప్పుడు, ఆ చెఱువులో ఒకమూల శవాల్ని దహనం చేసేవారని తెలిసినపుడు, మృత్యువును గూర్చీ, దయ్యాలను గూర్చీ తనలో కలిగిన ప్రశ్నలూ, భయాలూ, ఊహలూ, అనుభవాలూ యిప్పుడు జ్ఞాపకం వస్తున్నాయి.... వర్షాకాలంలో చెఱువు నిండి అలలతో గట్టుని తాకుతూ గలగల శబ్దం చేస్తూఉంటే, చెఱువుగట్టుమీద నిల్చుని దక్షిణపు దిక్కు చూస్తూ ఆలోచించి ప్రశ్నించుకునే శ్రీధర్‌కు దెయ్యాలమాట పట్టి అబద్ధమే అనిపించేది .... కాని, చెఱువులో నీళ్ళు తగ్గిపోయిన తర్వాత, ఎప్పుడైనా కామగచెట్లు గుంపుగా ఉన్న ఆ మూల ఏదో మంట కనిపిస్తే, అనురసంధ్య వేళ ఏదైనా దీపంవంటి వెలుగు కనిపిస్తే, దెయ్యాల ఉనికి మాట వాస్తవమే ననిపించి ఝల్లున గుండె జలదరించేది.

చీకటిపడుతున్నవేళ ఫుట్‌బాల్ ఆట పూర్తిచేసుకుని యింటికి వెళ్ళేముందు కొంతసేపు ఒకరిద్దరు మిత్రులతో చెఱువుగట్టుమీద విశ్రాంతిగా, నిశ్శబ్దంగా కూర్చోవటం అలవాటైంది అతనికి. ఒకసారి స్కూల్లో 'ప్రార్థన' ను గూర్చి ఉపన్యసిస్తూ థియోసఫిస్టు శేషాద్రిగారు సూర్యాస్తమయవేళ నిశ్శబ్దంగా ధ్యానముద్ర వహించటం అలవాటు చేసుకొమ్మని చెప్పారు. శ్రీధర్ వీలున్నప్పుడల్లా అలా చెయ్యటం ప్రారంభించాడు. ఆ అలవాటు మూలాన్నే యిప్పటికీ మదనపల్లిలో చీకటి పడేవేళ ఆ చెఱువుగట్టుమీద కూర్చోవటం ఒక విశిష్టమైన అనుభవం అతనికి.

మనస్సుని స్వేచ్ఛగా గాలిపటంలా వదిలిపెట్టి కూర్చుంటే ఆ రోజుల్లో ఒక ప్రశాంతమైన ఆనందంతో మనస్సు నిండిపోయేది. కూర్చున్న దగ్గరి మట్టీ, చెఱువులో నీటి కదలికా, అటు ఇటు తిరిగే పల్లెటూరి జనం, ఆకాశంలో అస్తమయం వల్ల కలిగే రంగుల మార్పులూ, క్రమంగా చీకటి ముసుగులో నిశ్శబ్దంలో లీనమౌతున్న ప్రకృతీ, ప్రతి వస్తువూ, దృశ్యమూ ఆనందహేతువులుగానే ఉండేవి..... వర్తమానం అనే ప్రాంగణంలో ఉత్సాహంగా కాలి మునివ్రేళ్ళమీద నిల్చుని

భవిష్యత్తు వైపు చూస్తూ జీవిత దేవాలయంలో ప్రవేశం కోసం ఎదురుచూస్తున్న రోజులవి ..... అది ఒక స్వచ్ఛంద మనఃస్థితి.

ఆంజనేయస్వామి కోవెలలో గంటలు మ్రోగేవి. చెఱువు గట్టు దిగి, రోడ్డు దాటి, స్కూలు ఆవరణ గ్రౌండు దాటగానే ఏటి ఒడ్డున ఉంది ఆంజనేయస్వామి కోవెల. అది వారాలు అక్కడ జనం ఎక్కువగా ఉంటారు. అది తను నిత్యమూ యింటికీ, స్కూలుకీ నాలుగుసార్లు తిరిగే దారి. అప్పటి జీవితానికి మరొక స్మృతిచిహ్నం ఆ కోవెల. ఒకసారి ఆ కోవెల ప్రక్కనున్న కోనేటిలో పదహారేళ్ళ హైస్కూలు అమ్మాయి శవం తేలింది. శ్రీధర్ అప్పుడు రెండవఫారం చదువుతున్నాడు, ఆ అమ్మాయి స్కూలుఫైనలు క్లాసులో ఉండేది. బడిపిల్లలందరూ గుంపులు గుంపులుగా వెళ్లి చూశారు. ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకోవటానికి కారణం గర్భవతి కావటమేనని అనుకున్నారు కూడా. ఆ సంఘటన అప్పట్లో అత న్నేవిధంగానూ కదలించలేదు.... ఇప్పు డాలోచిస్తుంటే తెలుస్తోంది, ఆ రోజుల్లో జీవితంలోని అపస్వరాలు తను అసలు గమనించ లేదు !....

మృత్యువుకు అర్థం ఏమిటి ? జీవితం ముగియటం, ఈ లోకంలో అనుభూతి ఆఖరు కావటం .... తర్వాత యితర లోకాలు వున్నాయో లేవో అది తేలని విషయం. విశ్వాసాలు రకరకాలుగా ఉంటాయి. దివ్యజ్ఞాన సమాజంవాళ్లు ప్రయోగాలు చేశామంటారు. రెండేళ్లు వాళ్ల కాలేజీలో చదివినా లెక్చరరు శేషాద్రిగారితో వెళ్లి మాట్లాడినా, శ్రీధర్‌కు ఆ విషయాలను గూర్చి ఏమీ సరిగా తెలియలేదు.... "The wages of sin is death" అని లయోలా కాలేజీలో ఆధ్యాత్మిక ప్రసంగాల్లో కేథలిక్కు ఫాదర్ నొక్కి చెప్పేవాడు.... కోనేటిలో పడి మరణించిన అమ్మాయి పాపానికి ఫలితమే మృత్యువు అని అన్వయించినా, ఆ వాదన యిప్పుడెవరూ ఆమోదించటంలేదు ! సంఘంలో దృక్పథం, విలువలూ మారుతున్నాయి. నాగరాజు వంటి అధునాతనుల వాదన ప్రకారం వీరికి జీవితాన్ని శిక్షించి నాశనంచేసే అధికారమే లేకపోతే పాపానికీ, మృత్యువుకీ సంబంధం, అన్వయం ఎక్కడ ? ....పోనీ ఆ వాదం ఎలా ఉన్నా, సీతవంటి ముగ్ధ ప్రకృతులు ఆకస్మికంగా అదృశ్యమై పోవటంలో ఏం న్యాయం ఉంది ? వాళ్ళు ఏ పాపమూ చెయ్యలేదే !

నైర్మల్యము, ముగ్ధత్వము, మంచితనము, సౌందర్యము —వీటికి సృష్టిలో రక్ష లేకపోవటం ఎందుచేత ? పాపం పెరిగి విలువలు తారుమారౌతున్న అసురసంధ్యయొక్క లక్షణమే యిది అని సరిపెట్టుకోవాలా ? .....

ఇక్కడిదాకా వచ్చి శ్రీధర్ ఆలోచన ఎప్పుడూ ఆగిపోతోంది. అతని ప్రశ్నకు సరియైన సమాధానం లభించదు. ఇది ఇప్పుడే కాదు, గాంధీ చనిపోయిన సాయంత్రమూ, నాగరాజుతో స్నేహబంధం త్రెంచుకొని వచ్చేసిన సమయంలోనూ, సీత మరణించినరోజూ, అతణ్ణే బాధించి పీడించిన ప్రశ్నే !

సీతకు శ్రీధర్ దగ్గర చాల చనవు. దానికి ఆ చలాకీతనం, ఆ అప్యాయతా వయస్సుకు మించినవి. అతనిమీద దానికి సర్వాధికారం ఉండేది. తెల్లగా స్వచ్ఛంగా, పాల నురగలా ఉండే సీత వెన్నెలలా మరపించి, స్వప్నంలా అదృశ్యమై పోయింది.

ఒకసారి సీత మారాముచేస్తూ తల్లిమీద అలిగి తల్లి నేదో తిట్టింది. అంతలో శ్రీధర్ అక్కడికి రాగా, వదినె "చూడు సిరీ, యిది ఎలాంటి పాడు మాటలు నేర్చుకుని వచ్చి తిట్టుతోందో ! బొత్తిగా భయమూ, భక్తీ లేకుండా పోయినై. గట్టిగా రెండు దెబ్బలు పడనీ" అంటూ శిక్షించమని తన్ను పురమాయించింది. "ఏమిటి సీతా ?" అని గద్దిస్తూనే సీతను దగ్గరికి తీసుకోబోయాడు. "ఫో, నా యిష్టం" అంటూ సీత తిరస్కరించింది పారిపోబోయింది. అప్పుడు తను రెక్క పట్టుకుని ఆపి, దాన్ని వీపుమీద చిన్నగా చరిచాడు.... "ఇంకొకటి" అంటోంది వదినె .... సీతకు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఏడుపు పైకి పెగలకుండా పెదవులు బిగబట్టి అలాగే నిలిచిపోయింది. సీతను చప్పున ఎత్తుకున్నాడు. అప్పుడు సీత ముఖాన్ని దాచుకుంటూ తన భుజం తడిపివేసింది. ఆపిల్ల ఏడుపుశబ్దం పైకి రాకపోవటం ఆశ్చర్యం కలిగించింది..... మరునాటిరోజు అనునయంగా సీతకు తల్లి చెబుతోంది : "నువు తప్పు చెయ్యకపోతే ఎవరైనా ఎందుకు దండిస్తారే ?" అంటూ. సీత వాదిస్తోంది : "తప్పుమాట అనొద్దు అనకూడదా ? బాబాయితో నన్ను కొట్టమని చెప్పావు !" అంటూ తల్లిని నిలవదీస్తోంది. "అమ్మ చెబితే మాత్రం నువ్వెందుకు కొట్టాలి నన్ను ?.... నన్నింకా యింకా కొట్టమని చెబుతోందే అమ్మ !... నేనంటే మీకు యిష్టంలేదు !" అని తనతోనూ వాదించింది. సీత తర్కానికి తనూ, వదినా యిద్దరూ విస్తుపోయారు. "ఎక్కడ నేర్చానే యీ గడుసు మాటలు !" అన్నది వదినె ... సీతకు ఆ వయస్సులోనే అంత భావ పరిపక్వత, నైశిత్యం, ఆత్మాభిమానం ఎలా వచ్చాయో ! సీతలో ఒక అసాధారణ వ్యక్తిత్వం ఉందనీ, సీత జీవితం భవిష్యత్తు గొప్పగా ఉంటాయనీ కలలు కన్నాడు తను. ఆ సీత బ్రతికి బట్టకట్టలేదు !...

పాలందగ్గర మామిడితోటలో గొయ్యి తీశారు. ఇరుగ్గా ఉన్న ఆ గోతిలో సీత బంగారు దేహాన్ని బోరగిలపెట్టి ఆ మిగిలిన ఒక్క వస్త్రాన్నీ తీసేశారు. "వస్త్రం తియ్యొద్దు" అన్నాడు తను. "అలా కాదు, ఎలా వచ్చినవాళ్ళు అలా పోవాలని శాస్త్రం. బట్ట ఉండకూడదు, తీసెయ్యండి" అన్నాడు ఒక వృద్ధుడు.

సీత జ్ఞాపకం మళ్ళీ మళ్ళీ రేగుతున్న గాయం. సీతను గూర్చిన ఆలోచన గొంతుక నొక్కేస్తుంది. స్థిమితంగా కూర్చుండనీదు. ఏం చెయ్యాలో తెలిని ఆవేదన మనస్సును కాల్చివేస్తుంది.....

వెలుగునీడలు .... వెలుగు క్షీణించి అదృశ్యమై పోయింది. నీడ దట్టమై పరివ్యాప్తమయిన చీకటి ప్రారంభమైంది.

శ్రీధర్ యింటికి తిరిగి వచ్చాడు.

అతనికి అప్పుడే శ్మశానం నుండి తిరిగి వచ్చినట్లుగా ఉంది.

బావి దగ్గర నీళ్ళు చేది శిర స్స్నానం చేశాడు. కాని తాపం ఏమాత్రం తగ్గినట్లనిపించటంలేదు.

తువ్వాలుతో తడి ఒత్తుకుంటూ ఉంటే వదిన రుక్మిణమ్మ చూచి అన్నది : "ఇప్పుడు తలస్నానం చేశావేమిటి ? చలితే వేన్నీళ్ళు పెడుదునే !"

"చన్నీళ్ళు పోసుకోవటమే బాగుంది వదినా !"

సీత పోయిన దగ్గరనుండి ఆమె ముఖంలో చిరునవ్వే లేదు. మౌనంగా తన పని తను చేసుకుంటూ ఉంటుంది. నాలుగు మాటలు మాటాడేచోట ఒక్కమాటే అంటుంది. ఆమెలోని ఈ మార్పువల్ల శ్రీధర్ ఆమెను పూర్వంలా తనకు కావలసినవన్నీ అడగలేక పోతున్నాడు. అన్నీ తనే చేసుకుంటున్నాడు.

గదిలోకి వెళ్ళి బట్టలు వేసుకుని, తల దువ్వుకొంటున్నాడు శ్రీధర్. రుక్మిణమ్మ వచ్చి వాకిట్లో నిలబడ్డది.

"తార దగ్గరనుంచి ఉత్తర మేమైనా వచ్చిందా ? ఎప్పుడొస్తుందట ?" అన్న దామె.

"ఏమో తెలీదు" అన్నాడు తిరిగి చూడకుండానే. "నువ్వెప్పుడు వెళ్దాం అనుకుంటున్నావ్ ?"

"ఏమీ అనుకోవటంలేదు."

"ఆ దీపంలో నూనె ఉందా ?"

శ్రీధర్ దీపం కదిలించి చూచి "ఉంది, నిన్ననే పోశాను" అన్నాడు. రుక్మిణమ్మ వెళ్ళిపోయింది. కుర్చీలో కూర్చుని ఏదైనా పుస్తకం కోసం వెదికితే, టాగూరు 'గీతాంజలి' కనిపించింది. ఆత్మశాంతికి ఆ పుస్తకం తరచూ పనికివస్తూ ఉంటుంది అతనికి.

పుస్తకం తెరవగానే—"మృత్యువు నీ ద్వారం దగ్గర నిలబడి తలుపు తట్టుతుంది, నువ్వు యివ్వగలిగిం దేమిటి ?" అన్న వాక్యాలు కనిపించాయి. ఆ మాటలు తనను వెక్కిరిస్తున్నాయా అనిపించింది.....

ఊహించుకోవటానికి ఉదాత్తంగా, ప్రశాంత గంభీరంగా, మధురంగా ఉండే భావనకూ ప్రత్యక్షానుభవానికీ ఏమిటి సంబంధం ? మృత్యువును అతిథిగా ఎదుర్కొని మన్నించమనడం ఎంత హాస్యాస్పదంగా ఉంది ! కవిత్వంలో మృత్యువును గూర్చిన స్వప్నాలు రంగులతో తీర్చి దిద్దుకోవచ్చునేమో, సీత మృతిని గూర్చి అలా సరిపెట్టుకోవటానికి వీలౌతుందా ?

భక్తి మధురమూ, ప్రేమ మధురమూ అయిన భావ కవిత్వం దోహదంగా, ఒక ఆదర్శం అతనిలో వేరూని, పెరిగి పెద్ద వటవృక్షమే అయింది. దాని నీడలో నిలుచున్నాడు. కాని చల్లని నీడ బదులు వడగాలి సోకుతోంది ..... వృక్షం వృక్షమే 'అస్తి—నాస్తి' విచికిత్సలో పడిపోయే ప్రమాదం, నిలువ నీడలేని పరిస్థితీ ఎదురవుతోంది.

"చిన్నాన్నా, నిన్ను తాతయ్య రమ్మంటున్నారు." అన్నది శ్యామల గదిలోకి వస్తూ.

శ్యామలకు పదమూడేళ్ళు. ఫోర్తుఫారం చదువుతోంది.

శ్యామల అతని దగ్గరకు వచ్చి టేబిల్‌మీద మోచేతులాన్చి వంగి ఏదో పుస్తకం చూస్తూ నిల్చుంది. శ్రీధర్ కదల్లేదు, 'గీతాంజలి' వైపు చూస్తూనే ఆలోచిస్తూ ఉన్నాడు.

కొంతసేపటికి శ్యామల అతని వైపుకు తిరిగి "తా, పిలుస్తున్నారు" అన్నది.

"ఎందుకూ ?"

"ఏమో వెళ్ళి అడగరాదూ తెలుస్తుంది." అంటూ శ్యామల నవ్వింది అతని పరధ్యానానికి.

శ్రీధర్ లేచి వీధి గుమ్మం ప్రక్కనున్న గదివైపు వెళ్ళాడు.

శ్రీధర్ తండ్రి రామలింగయ్యకు వయస్సు ఎక్కువ లేకపోయినా దేహారుగ్మతవల్ల ఎప్పుడూ ఆ గదిలోనే ఉంటాడు. కాలకృత్యాలు తీర్చుకోవటానికీ, భోజనానికీ తప్ప ఆయన గది విడిచి కదలడు.

"అమ్మాయి తార ఎప్పుడు వస్తుంది ? బిడ్డకు అయిదో నెల ప్రవేశించిందేమో !"

"తెలీదు.... అవును, అయిదో నెల."

"వెంకయ్యగారికి జాబులు వ్రాసే సంప్రదాయం ఉన్నట్లే లేదు ! వాళ్ళేమనుకుంటున్నారో అమ్మాయైనా నీకు వ్రాయలేదా ?"

"లేదు... ఈ నెలలో వస్తుందేమో."

"నువ్వు వెళ్ళి తీసుకువస్తే బావుండదూ ! ఎప్పుడు వెళ్ళాలనుకుంటున్నావ్ ?"

"నేను వెళ్ళదలచుకోలేదు."

ఆయన నిదానించి శ్రీధర్ వైపు చూశాడు. తర్వాత క్రింద ఉన్న చేతి కర్రను మెల్లగా వంగి తీసుకున్నాడు. పరిస్థితిని అర్థంచేసుకోవటానికి ఆయన చేస్తున్న ప్రయత్నానికి అది సూచన :

"ఉద్యోగం లేకుండా ఖాళీగా ఉన్నావనేనా నీ సందేహం! దానికేమిటి ? ఎప్పుడు ప్రాప్తమో అప్పుడే వస్తుంది ! కాలం కలిసిరావాలి ..... అయినా ఉద్యోగం లేకపోతే మనకు జరగని దేమిటి ? అలాంటి సంకోచాలు నీ కనవసరం....."

శ్రీధర్ హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. కొడుకు ఆలోచనల్నీ, మర్మవేదనల్నీ యింత చక్కగా అర్థం చేసుకోగల తండ్రు లెంతమంది ? .... తనెంత అదృష్టవంతుడు !

రామలింగయ్య రెండుసార్లు వివాహం చేసుకున్నాడు. ఆయన మొదటి భార్య కొడుకు నరసింహాలు. నరసింహాలికి పదకొండోయేట మాతృవియోగం కలిగింది. తర్వాత ఏడాది తిరక్కుండానే జానికమ్మని చేసుకున్నాడు రామలింగయ్య. ఆమె బిడ్డ శ్రీధర్. రెండో భార్య అయినా జానికమ్మ సవతి కొడుకు నరసింహాల్ని కన్నకొడుక్కంటే ఎక్కువగా చూచేది. శ్రీధర్‌కు తొమ్మిదేళ్ల వయస్సులో జానికమ్మ మరణించింది. మళ్లీ యింట్లో ఆడదిక్కు లేకపోవటంతో, రావ

లింగయ్య ఈసారి యువకుడైన నరసింహులికి వెంటనే వివాహం చేశాడు. క్రొత్త కోడలు రుక్మిణమ్మ, వదినెగానే, శ్రీధర్‌కు తల్లిలేని లోటు తీర్చింది. అప్పటి కామె వయస్సు పద్దెనిమిదేళ్లే అయినా ఆరిందాలాగా సంసారభారం సమర్థంగా సంతోషంగా మోసింది. శ్రీధర్‌ని కన్నబిడ్డలా ఆదరించింది. ఆ యింట్లో ఆడవాళ్ల సంప్రదాయం అటువంటిది! ఈ విష యాలు గుర్తు వచ్చినప్పుడు శ్రీధర్ వదినెనూ, తన తల్లినీ ఆదర్శమహిళలుగా భావించి, మనస్సులోనే నమస్కరించి గర్విస్తూ ఉంటాడు.

"నరసింహులు ఎడ్లు కొంటానికి డబ్బు తక్కువ పడిందంటున్నాడు. నీదగ్గరేమైనా ఉందా ?:' అన్నాడు రామ లింగయ్య.

సందేహిస్తూ తల అడ్డంగా ఊపాడు శ్రీధర్.

"అవును, ఎలా ఉంటుంది ? అక్కడి దక్కడే సరి పోయి ఉంటుంది. నువ్వు వచ్చేముందు నేను పంపిన పందా లారకు పంపావా ?"

"లేదు !"

రామలింగయ్యకు సందేహం కలిగింది.... ఒక్కొక్కసారి ఆయన శ్రీధర్‌ను ఇంకా చిన్న కుఱ్ఱవాడిగానే చూస్తూ ఉంటారు. విద్యార్థిదశలో ఎలా నిశితంగా పరీక్షించేవాడో అలానే పరీక్షిస్తూంటాడు అనుమానం వచ్చినప్పుడు. సాధారణంగా ఆయనకు కొడుకు మీద నమ్మకమే ఎక్కువ..కాని మద్రాసులో, కోడలు కాన్పుకు వెళ్ళినరోజుల్లో, ఏమీ తోచక ఏదైనా దా తాగేడేమో నా కొడుకు అని లీలగా అనుమానం తగిలింది ఆయనకు. తాను తీసుకరాలేదని చెల్లమంటే శ్రీధర్ పలికిస్తున్న ముఖభావం కూడా ఆ అనుమానాన్ని కొంత బలపరిచింది..

"ఆయితే ఏలా ఖర్చయిందీ ?"

"ఒక స్నేహితుడు తన అవసరానికి చేబదులుగా తీసుకున్నాడు."

"ఇంకా తిరిగి యివ్వలేదా?"

"లేదు."

"ఇస్తాడని నమ్మకమేనా?

"ఆc!"

"అయితే ఒక టెలిగ్రాం యివ్వు వెంటనే పర్తమని."

తండ్రి ధోరణిలో శ్రీధర్ వెంటనే గుర్తించాడు ఆయ నకు తనమాట మీద ఏదో అపనమ్మకం కలిగిందని.. లేకపోతే అంత నిర్ప ధంగా టెలిగ్రాం యివ్వమని చెప్పేవాడు కాదు!

రాత్రి ఆలోచన తెమల్చేదు శ్రీధర్‌కు. తను జీవితంలో ఏ మెట్టులోవున్నాడో ఆలోచించుకోలేక పోతున్నాడు.. తండ్రి చేత దండింపబడుతూ యదార్థం చెప్పలేని పసిపిల్లవాడా? కాదే! తనకు వివాహమైంది, పితృత్వం కూడా సిద్ధించింది... కాని భార్యను అదుపులో పెట్టుకోగల శక్తి ఏదీ తనకు?..ఆదర్శాలతో తన వ్యక్తిత్వాన్ని రూపొందించుకోవాలను కుంటున్నాడు. తండ్రికి తెలివివెన్నో తనకు తెలుసు.. కాని తండ్రిముందు నోరు విప్పి యథార్థాన్ని చెప్పే ధైర్యమే లేదు!..ఏమిటీ దైన్యం? ఏమిటీ అయోమయత్వం?

యథార్థమే అంటావా కొన్ని విషయాలు విపులీకరించి చెప్పటానికి మనస్సురాదు. ఒకవేళ చెప్పినా అవి పైవాళ్లకు అర్థంకావు. నాగరాజా సంగతి ఏమని చెప్పను? అతను డబ్బు ఎగవేశా డని చెప్పటానికి ఇష్టంలేదు. తనే డబ్బు తిరగ్గొట్టానని చెబితే, అది ఒక పిచ్చివాని చేష్టలా కనిపిస్తుందే తప్ప తన అంతర్యం అర్థంకాదు ఎవరికీ!

తను జవాబు చెప్పలేక పోవటం, డబ్బు సంగతి తేల్చకపోవ టం తండ్రికి సందేహాన్ని ఎక్కువే చేస్తుంది మరి! తన బాధ్యత యిప్పుడెలా నిర్వర్తించాలి?

ఎక్కడైనా బదులు తెస్తే బాగుంటుందేమో!

ఎవరి నడిగితే బాగుంటుందో చాలసేపు తర్కించి, చివరకు మేనత్త మంగమ్మ నడిగి చూద్దామని, ఆమె తప్పకుండా సర్దు తుందనీ నిశ్చయించుకున్నాడు శ్రీధర్.

శ్రీధర్ మేనత్త మంగమ్మను ఆ ఊళ్లోనే యిచ్చారు. పుట్టింటిమీద అధికారం వదులుకోవటం ఆమె కెప్పుడూ యిష్టంలేదు. రామలింగయ్యగారి యిద్దరి భార్యల జీవిత కాలంలోనూ మంగమ్మ మాటే జరిగింది. తనకు పిల్లలు లేకపోవటంతో మంగమ్మ మొదటినుంచీ నరసింహుల్ని తన యింట్లో పెట్టుకోవాలనే ఉద్దేశంతో ఉండేది. నరసింహులు విషయంలో కల్పించుకుని, తన భర్త తమ్ముని కూమార్తె నిచ్చి చేయాలనే ఏర్పాటు ఆమె స్వతంత్రించి చేసింది. కాని రామ లింగయ్య అలా జరగనివ్వలేదు. రామలింగయ్యకు మంగమ్మ భర్త అయిన ఓబయ్యమీద గాని అతని తమ్మునిమీద గాని సదభిప్రాయం లేకపోవటమే అందుకు కారణం. మంగమ్మకు తన మాట నెగ్గకపోవటంతో అన్నగారిమీద కోపం వచ్చింది. ఆ కోపం క్రొత్త కోడలుగా వచ్చిన రుక్మిణిమీద క్రమంగా కేంద్రీకృతమైంది. ఉన్నదానికీ, లేనిదానికీ రుక్మిణమ్మను దూరుతూ యాగీచేసి, చివరకు అన్నగారి యింటి గడప తొక్క టమే మానేసింది మంగమ్మ.

నరసింహులికి వివాహమై రుక్మిణమ్మ యింటికి వచ్చే నాటికి శ్రీధర్ పదేళ్లవాడు. మంగమ్మ క్రమంగా తన ఆస క్తినీ, అభిమానాన్నీ శ్రీధర్ వైపు మళ్లించుకొన్నది. అన్నగారి యింటికి వెళ్లటం మానుకున్నప్పటికీ, శ్రీధర్‌ని బలవంతం చేసి తన యింటికి రప్పించుకోవటం మానలే దావిడ. స్కూలు వదిలే సమయానికి స్వయంగా అక్కడికి వెళ్లేది. హైస్కూలు దగ్గరే సంత కావడంతో, ప్రతి మంగళవారం స్వయంగా సంతకు వెళ్లే అలవాటున్న మంగమ్మ, వస్తువులు కొని పాలేరు చేతికిచ్చి పంపి, తను స్కూలు దగ్గరకు వెళ్లేది మిఠాయి తీసుకుని శ్రీధర్ కోసం. వీలైతే శ్రీధర్‌ను వెంట బెట్టుకుని ఇంటికి తీసుకువెళ్లేది. శ్రీధర్ కాస్త పెద్దవాడైన తర్వాత, అత్తయ్యను స్కూలు దగ్గరకు రావద్దని చెప్పే శాడు. శనివారమో, ఆదివారమో సెలవు రోజున తనే మంగమ్మ ఇంటికి వెళ్లేవాడు.

రుక్మిణమ్మను గూర్చి ప్రశ్నించటం, ఆమెను సూటిగానూ, వ్యంగ్యంగానూ విమర్శించటం చేసేది మంగమ్మ శ్రీధర్ మనస్సు శ్రీధర్‌ను తనవైపు త్రిప్పుకోవటానికి. కాని మారుమాట లేకుండా అంతా విని, విన్నదాన్ని అక్కడే గాలికి వదలిపెట్టి యింటికి వెళ్లేవాడు శ్రీధర్. వదినె అతనికి ఏ లోపమూ రానివ్వటంలేదని అతనికి ప్రత్యక్షంగా తెలుసు. అయితే ఒకరిముందు యింకొకరి ప్రసక్తి తెచ్చేవాడు కాడు. అది అతనికి సహజంగా వచ్చిన గుణం.

హైస్కూలు చదువు ముగించుకొని కాలేజీలో ప్రవేశించాక శ్రీధర్‌లో వ్యక్తుల్ని గూర్చిన విమర్శ, మంచి చెడ్డలు, నిజానిజాలు విశితంగా తర్కించటం ప్రారంభమైంది. అతనికి అత్తయ్య నోరు మంచిదికాదనే విషయం క్రమంగా మనస్సులో గోచరమవటమే కాకుండా, వదినెమీద గౌరవభావం కూడ ప్రస్ఫుటమైంది. అంతటితో మేనత్త యింటికి రాకపోకలు చాలవరకు తగ్గించేశాడు.

మద్రాసులో ఉద్యోగం ముగించుకొని మదనపల్లి వచ్చిన తరువాత శ్రీధర్‌ను ఉగాది పండుగనాడు తన యింటికి రమ్మని కబురుపెట్టింది మంగమ్మ. శ్రీధర్ ఆరోజు వెళ్లకుండా శ్రీరామనవమికి వెళ్లాడు. మంగమ్మ రుక్మిణిని ఆడిపోసింది. శ్రీధర్ కోపం తెచ్చుకున్నాడు. అతనికోసం తెచ్చి ఉంచిన క్రొత్త బట్టలు అందజేస్తూ కన్నీళ్లు పెట్టుకున్నది. వయోవృద్ధ, సంతాన విహీన అయిన మేనత్త తనమీద ఎన్నో ఏళ్లుగా అభిమానం చూపిస్తూంటే తను చూపిస్తున్న కొదా సీన్యం ఒక ఆర్భాట్యంగా, హృదయంలేనితనంగా తోచింది శ్రీధర్‌కు. ఇకనుంచి ఆమె మనస్సుకు నొప్పి కలిగించకూడదని నిశ్చయించుకున్నాడు ఆరోజు .....

నిశ్చయించుకున్నాడే కాని శ్రీరామనవమి తర్వాత మళ్లీ యిప్పటిదాకా మంగమ్మ యింటికి వెళ్లనేలేదు శ్రీధర్.

రామలింగయ్య డబ్బును గూర్చి ప్రశ్నించిన మరునటి రోజు ప్రొద్దున తొమ్మిది గంటలవేళ మేనత్త యింటికి వెళ్లాడు శ్రీధర్. తలవని తలంపుగా వచ్చిన శ్రీధర్‌ను ఆప్యాయంగా పలుకరించింది మంగమ్మ. తారా, పాపాయీ ఎలా ఉన్నారని ప్రశ్నించింది. తార ఎప్పుడు వస్తుందని అడుగుతూ, వీలైతే తను కూడా బందరు రావాలనుకుంటున్న కోరికను వ్యక్తపరచింది.

సీత పోవటంతో ఎవరి మనస్సులూ సరిగా లేవనీ, అందువల్లనే తను బందరువెళ్లే విషయం కూడా ఇంకా ఏమీ నిర్ణయించుకోలేదనీ సమాధానం చెప్పాడు శ్రీధర్.

"ఎవరు చేసుకున్నంత వారికీ, ఎవరి సంసారాలు వాళ్లవి! నువ్వు నీ భార్యనీ, పిల్లనీ యింకా తీసుకురాకపోవట మేం బాగు లేదు నీకి ! దక్కని పిల్లని గూర్చి ఆలోచించటం మానేసి నీ కూతురు ఎలా ఉందో దాన్ని గూర్చిన వివరాలు చెప్పు కుంటావా ! నా ఎనరాయ అన్నావు. నా పోలిక లేమైనా వచ్చా యుంటావా లేదా ? ఏ మేనత్త పోలికలు రాకుండా ఉంటాయా పిల్లకి ! అన్నప్రాసనం నీ కూతురే నా కళ్లల్లో మెదులుతూం

దశేవఖ ..... ఎలా ఉంటుందా, ఎప్పుడు చూద్దామా, ఎత్తుం ముద్దాడుదా నా అనే తప్ప నా బతుక్కి మరో ఆశ లేదు !"

" కర్మ కాదు అత్తా ! సీతలాంటి పిల్లలు నాటికి కోటికి ఒక్కరు ..... దాని గుణం, చక్కదనం, తెలివి అన్నీ అపురూపమే !"

"ఆఁ ! వచ్చినవాళ్ల కళ్లు చాలడేసీ ! ఏమైనా కన్న తల్లి దండ్రి బుద్ధులు సరిగా లేకపోతే పిల్లలు బ్రతకరు సరే ! .... నువ్వు ఉగాదినాడు రాకపోతే నా మనస్సు ఎంతగా నొచ్చిందనో ! ఆ రోజల్లా ఏడుస్తూనే ఉన్నాను .... నన్నేడిపించిన పాపం వూరికేనే పోతుందా ?"

శ్రీరామనవమి తర్వాత రోజునే సీత పోయింది. ఆ విషయాన్ని గుర్తుకుతెస్తూ రుక్మిణమ్మను గూర్చి అంటున్న మాటలకు శ్రీధర్‌కు బాధ కలిగింది. కాని, వచ్చిన కార్యం గుర్తుకు తెచ్చుకుని మౌనంగా ఉన్నాడు.

వ్యవసాయం సంగతులు గుచ్చి గుచ్చి అడుగుతోంది మంగమ్మ. తగిన తగనట్లు, తనకు తెలిసినంతవరకు సమాధానా లిస్తూ కూర్చున్నాడు వంటింట్లో శ్రీధర్.

మంగమ్మ అప్పటికప్పు డొక పిండివంట చేసి భోజనానికి లెమ్మన్నది. భోజనంచేస్తూ శ్రీధర్ తనకు వంద రూపాయిలు కావలసిన సంగతి బయటపెట్టాడు.

"నా దగ్గర అంత ఉందో లేదో నాయనా !.... చూస్తాను .... నువ్వివ్వాళ్ళకు అడక్క అడక్క నోరు విడిచి అడిగితే లేదంటానా ? నాదగ్గర లేకపోతే మీ మామయ్య నడిగి రేపు సర్దుతాను.... ఊరినుంచి రాత్రికి వస్తా రాయన...." అన్నదామె.

భోజనం తర్వాత డబ్బు తెచ్చి యిచ్చింది. అందులో రూపాయనోట్లు, చిల్లర చాలభాగం ఉంది.

"పదులూ, అయిదులూ లేవా అత్తా ?"

"లేవు."

ఆ డబ్బుని జేబు రుమాల్లో ముడివేసుకుని బయల్దేర బోయాడు శ్రీధర్.

"ఇప్పుడే వెళ్లకపోతేనేం ? పక్కవేస్తాను, కాస్సేపు పడుకుని మూడు గంటలకి కాఫీ త్రాగి వెళ్దుగానిలే .... ఎండగా ఉంది" అన్నది మంగమ్మ.

"లేదు, యిప్పుడే వెళ్ళాలి .... పనుంది."

"ఎందుక్కావలసి వచ్చిందో డబ్బు ! ఇదిగో చూడు సిరీ ! దీన్ని తీసుకెళ్లి మీ యింటిలో అవసరాలకి వాడితే మాత్రం నన్ను చంపుకుతిన్నంత ఒట్టు ! నీ సొంతానికి కావలసి వస్తేనే పట్టుకెళ్లి ఖర్చుపెట్టుకో, లేకుంటే యిట్లా యిచ్చేసి వెళ్ళు."

"లేదత్తా, యిది నా సొంతానికే ! ఒక స్నేహితుడికి బాకీపడ్డాను, పంపాలి ! ఆలస్యమైతే పోస్టాఫీసులో మని యార్డరు తీసుకోరు, వెళ్ళిరానా మరి !" అన్నాడు శ్రీధర్.

"అలాగే ! రోజా తీరిక చూసుకుని ఒకసారి వచ్చి పోతూ ఉండగూడదా సిరీ !"

"సరేలే అత్తా !" అని చిరునవ్వు నవ్వి ఆమెను సంతృప్తిపరచి బయలుదేరాడు శ్రీధర్.

సరాసరి కోమటి కొట్టుకు వెళ్లి చిల్లర యిచ్చేసి అన్నీ అయిదు రూపాయల నోట్లుగా మార్చుకొని, డబ్బుని ఒక మడతగా జేబులో పెట్టుకున్నాడు. అప్పటికి కాని ఆదుర్దా తీరలేదు..... తర్వాత యింటికివెళ్లి పెట్టెతీసి ఆడబ్బు భద్రపరచి గదిలో మంచంమీద పడుకున్నాడు ఆలోచిస్తూ.

డబ్బు సమస్య తీరింది కాని అతనికి తను చేసిన పని సంతృప్తి నివ్వలేకపోయింది.

మంగమ్మత్త మాటలన్నీ జ్ఞాపకం వచ్చాయి. చివర ఆమె పెట్టిన ఒట్టు, దానికి తనిచ్చిన సమాధానమూ గుర్తు వచ్చి మనస్సును బాధించటం ప్రారంభించాయి .... తను అబద్ధం చెప్పేశాడు, తడుముకోకుండా, ఆలోచించకుండా ! మౌనం వహిస్తే పోయేది, కాని, తనకా నిబ్బరం లేకపోయింది.

మౌనం వహిస్తే మాత్రం ఎట్లా సరిపోయేది ఆమె ఒట్టు పెట్టిన తర్వాత ?.... నిజానికి, ఈ డబ్బు నాగరాజు యివ్వవలసిన దానికి ప్రతియే కావటంవల్ల, ఒకవిధంగా తను చెప్పినట్లు, మంగమ్మత్త డబ్బు 'స్నేహితుడి కిచ్చినట్లే' అని దానికి సమాధానం .... వ్రతభంగం చేసుకుని యిలా సర్దుకోవటం దేనికి ? గాంధీగారు పాలు త్రాగనని శపథం చేసుకుని, తర్వాత మేకపాలు మాత్రం త్రాగినట్లు !..... బలహీనతలు ఎవరికైనా తప్పవు !.... కాని తన బలహీనత అలాంటిది కాదే ! .... తనకు తెలీకుండానే జరిగిపోతున్నాయి తను చేసే పనులు; మాటలూ అలానే జారిపోతున్నాయ్ ....

ఆలోచించకుండా ఆరోజు నాగరాజుతో ఉద్రేకంతో "మైలపడిన డబ్బు నా కక్కరలేదు" అని ఎలా అన్నాడో, ఈరోజు కూడా ఆలోచించకుండానే అబద్ధమాడి డబ్బు సంపాదించాడు ....

కాదు .... కాదు .... తను అబద్ధమేమీ ఆడలేదు ! తన అవసరానికి, బాకీ తీర్చటానికి అని కదా కారణాలు చెప్పాడు మంగమ్మతో. ఒకవిధంగా రెండూ నిజమే మరి ! తండ్రికి తనమీద కలిగిన అపోహ తీర్చటమే తన 'అవసరం', ఆయన యిచ్చిన డబ్బును తిరిగి యిచ్చెయ్యటమే బాకీ తీర్చటం, సరిపోలేదా ?

శ్రీధర్ ఆలోచనలు గుడిసుళ్ళ తిరుగుతూనే ఉన్నాయి, సత్యం—అసత్యం, ఏదో నిర్ణయించటానికి ...... ప్రవాహంలో కొట్టుకుపోయే మనిషికి ఏ పూచికపుల్ల దొరికినా అండ దొరికినట్లే ఏదో ఒక యుక్తిలో, తర్కంలో, తనని తను సమాధానపరచుకో ప్రయత్నించాడు శ్రీధర్ చాలసేపు. కాని ఎటూ తేలలేకపోయాడు.

(సశేషం)

ప్రజాస్వామ్య తత్త్వము

శ్రీ నాగళ్ల గురుప్రసాదరావు

శ్రీ కల్లూరి బసవేశ్వరరావు

(వెనెల సంచిక తరువాయి)

రాజనీతి విశారదులు ప్రజాస్వామ్యమును రెండు విధములుగా విభజించిరి. అందొకటి అపరోక్ష ప్రజాస్వామ్యము (Direct Democracy), రెండవది పరోక్ష ప్రజాస్వామ్యము (Indirect Democracy). అపరోక్ష ప్రజాస్వామ్యములో ప్రజలే సర్వతంత్ర స్వతంత్రాధికారులు. ప్రజా ప్రతినిధుల ద్వారాకాక, తామే సకల ప్రభుత్వ వ్యవహారములను చక్కదిద్దుకొందురు. ప్రజలందరును ఒకచోటగూడి, ఆయా సమస్యలను గూర్చి చర్చలు చేసి చేసి, విగ్గుతేల్చి, యొక కొన్ని నిర్ణయములు చేసికొందురు. ఇటువంటి అపరోక్ష ప్రజాస్వామ్యము ప్రాచీనకాలమున యవన నగరరాజ్యములలో వర్ధిల్లినది. ఉపనిషత్తుల యందలి యొకకొన్ని వాక్యములను బట్టి యిట్టి ఏలుబడి భారతవర్షమునందు స్థైతము పెంపొందినదను భారతీయేతిహాస వేత్తలు కలరు. దానిని కాదను వారును మన్నారు. మధ్య యుగములో ఇటలీ నగర రాజ్యములలో అపరోక్ష ప్రజాస్వామ్యము ప్రయోగింపబడినది. ఈ అపరోక్ష ప్రజాస్వామ్యము పెంపొందవలయునన్నచో దేశములు భౌగోళికముగా చిన్నవియై యుండవలయును. జనసంఖ్య పరిమితమై యుండవలయును. నవీన మహాజాతీయ రాజ్యములలో ఈ రెండు పరిస్థితులు లేనగూడుట లేదు. అందుచే అపరోక్ష ప్రజాస్వామ్యము అంతగా పునరుద్ధరింపబడలేదు. అయినను ప్రజా ప్రతినిధులైన పాలకులు నిరంతరము ప్రజలకు పూచీపడి యుండునట్లుగా, ఒక కొన్నిపద్ధతులు రూపొందినవి. వానినే "ప్రజా నిర్దేశము" (Referrendum), "ప్రజోపపాదనము" ((Initiative), "పునరామంత్రణము" (Re-call) అని యందురు. శాసన సభాసభ్యులు తాము అంగీకరించిన చట్టములను ప్రజల ముందుంచెదరు. ప్రజలా చట్టములను అంగీకరింపవచ్చును. లేక తిరస్కరింపవచ్చును. దీనిని ప్రజానిర్దేశమందురు. కొన్ని వేళలలో ప్రజలే చొరవ చేసికొని, తమ అభిమతములకు శాసనరూపమిచ్చి, వానిని పాలకులకు పంపెదరు. దీనిని ప్రజోపపాదనమందురు. ప్రభుత్వ మనాచారములను అవలంబించినప్పుడు దానిని తొలగించు తెన్నునకు పునరామంత్రణమని పేరు. స్విట్జర్లాండు నేడి పోకడలు పొవు చున్నది. ఇతర ప్రజాస్వామిక దేశములలో ప్రత్యేక త్రివిధము లయిన ఆచారములను అనుష్ఠింపరాదా? ఈ ప్రశ్న అడగదగినదే. ఇతర దేశములలో జనసంఖ్య బహుళమనియు, ప్రజల చిత్త సంస్కారము తగిన పాకములో పడలేదనియు, అందుచే అపరోక్ష ప్రజాతంత్ర పద్ధతులు (Direct Democratic Methods) ప్రయోగించుటకు వలను పడదనియు కొందరు వాదింతురు. కాని ప్రజలలో రాజకీయ చైతన్యము పెరిగిన తరువాతనైనను, ఏదో యొక రూపములో ఈ పద్ధతులు ప్రవేశపెట్టుట, ప్రజాస్వామ్య పరిపూర్ణ వికాసమునకు పట్టుగొమ్మగా నుండును.

ప్రాతినిధ్య ప్రజాస్వామ్యము

ఇక రెండవది యయిన పరోక్ష ప్రజాస్వామ్యమునే ప్రాతినిధ్య ప్రజాస్వామ్యము (Representative Democracy) అనియు అందురు. ఈ పద్ధతి ప్రకారము ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకొందురు. ఆ ప్రతినిధులు ప్రభుత్వ వ్యవహారములను నడుపుదురు. జె. ఎస్. మిల్ ప్రాతినిధ్య ప్రజాస్వామ్యమును ఈవిధముగా నిర్వచించెను. "ప్రజలందఱుగాని లేక వారిలో అధిక సంఖ్యాకులుగాని, తాము ఆయా కాలములలో ఎన్నుకొన్న ప్రతినిధుల ద్వారా పరిపాలనాధికారమును నిర్వహించు ప్రభుత్వమే ప్రాతినిధ్య ప్రజాస్వామ్యము." (It is a system of Government in which the whole people or some numerous portion of them, exercise the governing power through deputies periodically elected by themselves).

ప్రాతినిధ్య ప్రజాస్వామ్య రథమునకు నాలుగు చక్రము లుండును. అవి యివి. వోటర్లు, రాజకీయ పక్షములు, శాసన సభలు, మంత్రిమండలి. ఈ ప్రజాస్వామ్యములో వయసు వచ్చిన స్త్రీ పురుషులకు వోటుచేయు హక్కుండును. మూడేండ్లకో, ఐదేండ్లకో యొకసారి ఎన్నికలు జరుగును. రాజకీయ పక్షములు తమ ఎన్నికల ప్రణాళికలను ప్రజలముందుంచును. తమ యభ్యర్థులను ఎన్నికలలో నిలబెట్టును. ఎన్నుకొనబడిన

అభ్యర్థులు శాసనసభా సభ్యు లగుదురు. ఈ శాసనసభలలో ఏ రాజకీయపక్షమునకు అధిక స్థానములు లభించునో, అది ప్రభుత్వమును ఏర్పరచును. ఈ తీరుగా ఏర్పడిన ప్రభుత్వము శాసనసభకు, దాని ద్వారా ప్రజలకు బాధ్యత వహించును. ప్రజల విశ్వాసమును పోగొట్టుకొన్ననాడు, శాసనసభలో విశ్వాస రాహిత్య తీర్మానమును సభ్యులు ప్రవేశపెట్టి, ప్రభుత్వమును అధికంపించి, గద్దె దింపెదరు. ఇటువంటి ప్రాతినిధ్య ప్రజా స్వామ్యముయొక్క ప్రముఖ గుణములను ఈ క్రింది తీరుగా క్రోడీకరించవచ్చును.

1. రాజకీయ సమత (Political equality): ప్రాతినిధ్య ప్రజాస్వామ్యములో పౌరులందఱకును సమాన రాజకీయస్వత్వము లుండును. ఈ విషయములో జాతి మత తార తమ్యమునకు తావులేదు. విద్యావంతునకు, విద్యాహీనునకు మధ్య వివక్షణ చూపరు. ప్రతి పౌరునకు వోటు చేయుటకు, ఎన్నికలలో అభ్యర్థిగా నిలుచుటకు హక్కున్నది. అంతేగాక ప్రతి పౌరుడు రాజకీయానుభవమును ఆర్జించుటకు, ప్రభుత్వ నిర్వహణములో భాగస్వామి యగుటకు ఏ యాటంక ముండదు. 2. స్వేచ్ఛామయ చర్చలు (Free Discussions): ఈ ప్రభుత్వములో ప్రజల స్థాయినుండి, ప్రభుత్వ స్థాయి వఱకు స్వేచ్ఛామయమయిన విమర్శ ప్రతివిమర్శలకు వీలుండును. రాజకీయ పక్షములు, వివిధ సంఘములు, పత్రికలు సాధారణ పరిస్థితులలో నిరాటంకముగా ఈ చర్చలను కొనసాగించును. 3. సమావేశ స్వత్వము (Right to Assemble) ప్రాతినిధ్య ప్రజాస్వామ్యములో ప్రజలు అనేక సంఘములను, వివిధ సంస్థలను ఏర్పఱచుకొనవచ్చును. కార్మిక సంఘములు, వృత్తి శ్రేణులు, యువజన సంఘములు నుండును. ఈ సంఘములు తమ భావములను ప్రచారము చేసికొనవచ్చును. సభలను, సమావేశములను పెట్టుకోవచ్చు. ప్రభుత్వమునకు వ్యతిరేకముగా శాంతియుతముగా ఉద్యమములను నడుపుకొనవచ్చు. 4. అధిక సంఖ్యాకుల ప్రభుత్వము (Majority Rule) ప్రాతినిధ్య ప్రజాస్వామ్య మనగా అధిక సంఖ్యాకులు నిర్వహించు ప్రభుత్వము. ఆచరణ దృష్టితో చూచినపుడు ఎక్కువమంది కోనన్న దానిని కాదన వీలులేదు గదా ? అట్లని అల్పసంఖ్యాకులకు రక్షణ లేదని భావింప రాదు. వారి అభిప్రాయములను, అభీష్టములను అధిక సంఖ్యాకులు మన్నింపవలసి యుండును. 5. ప్రత్యామ్నాయ ప్రభుత్వము (Alternate Government): ఈ వ్యవస్థలో సాయుధ విప్లవములు లేకుండ, శాంతియుతముగా, దురాచారముల కొడిగట్టిన ప్రభుత్వమును పడగొట్టి, ప్రజలు మఱియొక ప్రభుత్వమును ఏర్పఱచుకోగలరు. 6. శాసనబద్ధమయిన పాలనము (Rule of law): ప్రాతినిధ్య ప్రజాస్వామ్యమునకు శాసనబద్ధమైన పరిపాలన యొక ముఖ్య లక్షణము. శాసనముల ముందు పాలకులు, పాలితులు సమానులే. వీరిలో హెచ్చుతగ్గు లుండవు. అయినవారికి ఆకులలో కానివారికి కంచములలో వడ్డించుట యుండదు. శాసనములను ఉల్లంఘించుటకు, పరిపాలకులకు అధికారములేదు. స్వతంత్ర ప్రతిపత్తిగల న్యాయస్థానములు శాసనములను, శాసనాధికరణములను—ఇంతయేల రాజ్యాంగమును—వ్యాఖ్యానించి, హద్దులు మీరెడి ప్రభుత్వమును అదుపులో నుంచును.

తాత్త్వికముగా పరామర్శించినపుడు ప్రాతినిధ్య ప్రజా స్వామ్యమునకు వ్యక్తి వికాసమే పునాది. వ్యక్తి వికాసమునకు తోడ్పడు భావ ప్రకటన స్వేచ్ఛ, ఆర్థిక సమానత్వము, మత స్వాతంత్ర్యము, అధికార వికేంద్రీకరణము ఈ ప్రజాస్వామ్యమునకు గీటురాళ్లు. మానవతకు, స్వేచ్ఛా వికాసములకు పెద్ద పీట వేసిన ఈ ప్రజాస్వామ్యము సర్వ మానవుల సర్వతో ముఖాభ్యుదయమునకు సర్వదా తోడ్పడు ననుటలో సందేహ మేమియును లేదు.

దోషాల పరిశీలనము

పోయిన రెండు వందల యేండ్ల నుండి, ప్రాతినిధ్య ప్రజాస్వామ్యము వివిధ దేశములలో క్రమక్రమముగా వృద్ధి పొందినది. దాని వృద్ధిని, దాని కార్యకలాపములను నిశితముగా పరిశీలించిన రాజనీతి వేత్తలు కొందఱు దానిలోని లోపాలను వివరించి యున్నారు. వారిలో హెన్రీ మెయిన్, లెకీ, లార్డ్ బ్రైస్, కోల్ మొదలయినవారు ముఖ్యులు. వారు వర్ణించిన లోపాలను కొన్నిటిని స్థూలముగా పరిశీలింపవలయును.

ప్రజాస్వామ్యములో ప్రజలే సంపూర్ణాధికారులు. వారు తమ ప్రతినిధులను ఎన్నుకొని, తమ సర్వాధికారములను వారికి బదిలీ చేయుచున్నారు. తరువాతి ఎన్నికల దాక ఆ ప్రతినిధులు తమ యధికారమును దుర్వినియోగ పఱచినను, కర్తవ్య నిర్వహణమునట్ల ఏవఱుపాటు చూపినను, ఆ ప్రజలు తమ ప్రతినిధులను ఏమియు చేయలేరు. ఎన్నికలలోపల పునరామంత్రణము (Re-call) నకు అవకాశము పూజ్యము. అందువల్లనే రూసో ప్రాతినిధ్య ప్రజాస్వామ్యమును పరిహసించెను. ఈ ప్రజాస్వామ్యములో ప్రజలు ఐదేండ్ల కొక్కసారి, ఎన్నికలప్పుడు మాత్రమే తమ యధికారమును చలాయింతురని రూసో యభిప్రాయము. నిక్కచ్చిగా చెప్పవలయు నన్నచో, ప్రజలచే ఎన్నుకొనబడిన ప్రతినిధులు ప్రజా ప్రతినిధులు కానేకారు. వారు కేవలము రాజకీయ పక్ష ప్రతినిధులు మాత్రమే. ఆ ప్రతినిధులు ప్రజలకు పూచీపడి యుండవలసిన యక్కఱ లేనేలేదు. వారికి వారి రాజకీయ పక్షమే ముఖ్యము. వారు మున్ముందుగా తమ రాజకీయ పక్షమునకు బాధ్యులై యుందురు. పాలకులు కూడ ఇంతే. కావున ప్రజాస్వామ్య మనగా, నిజమయిన ప్రజల రాజ్యమని యనుకొనుట పొరపాటు. ఆచరణలో ప్రజాస్వామ్యము ఒకానొక రాజకీయ పక్షము ఏర్పఱుచుచున్న ప్రభుత్వము. ఈ రీతిగా ఏర్పడిన పక్ష ప్రభుత్వానికి ప్రజలలో ఎక్కువమంది అనుకూలవఱగ నున్నచో కొంతవఱకైన, అది ధర్మసమ్మతమై యుండు నేమో ! కాని, జరుగుచున్నట్టి దేమి ? ఎన్నికలప్పుడు మూడు నాలుగు రాజకీయ పక్షములు తమ యభ్యర్థులను నిలబెట్టును.

ఎన్నుకొనబడినవారు శాసనసభాసభ్యు లగుదురు. ఈ మూడు నాలుగు రాజకీయ పక్షములలో ఏ పక్షమునకు శాసనసభలో ఎక్కువ స్థానములు లభించునో, అదే ప్రభుత్వమును ఏర్పఱచును. అయినచో ప్రజలలో ఎక్కువమంది యీ రాజకీయ పక్షమునే యభిమానించి, దానికే వోట్లు ప్రకుమ్మరించిరని యుందమా! అదియు సందేహాస్పదమే. అధికారమును పొందిన రాజకీయ పక్షమునకు వచ్చిన వోట్లకంటె ఎక్కువ వోట్లు ప్రతిపక్షములకు లభింపవచ్చును. అనగా అధికారమును కైవసము చేసికొన్న రాజకీయ పక్షానికి సభ్య బల మున్నప్పటికి, ప్రజలలో దాని పలుకుబడి యల్ప మన్నమాట. అట్లయినను, ఆ రాజకీయ పక్షము, తానే ప్రజలలో ఎక్కువమందికి ప్రాతినిధ్యము వహించుచున్నానని యనుకొనుట—హాస్యాస్పద మగుట యట్లుండనిండు—భ్రాంతియే యగును. పోనీ! శాసనసభల వ్యవహారములు రాజకీయ పక్ష పరిధులను దాటిపోవునా? పోవు. పోజాలవు. అచటి చర్చ లన్నియు పాక్షికదృష్టితో జరుగును. నిర్ణయము లన్నియు పక్షపాత దృక్పథముతో చేయబడును. అధికార పక్షమునకు చెందిన సభ్యు లందఱును అతివిధేయులై, శాసనసభా నాయకుని మాటను సుగ్రీవాజ్ఞగా తల దాల్చి, ప్రభుత్వము ప్రవేశపెట్టిన శాసనముల కనుకూలముగా వోటు చేయుదురు. శాసనసభలో వోటు చేయునప్పుడు స్వకీయ పక్షము ఆదేశము ప్రకారము శాసనసభాసభ్యుడు పోవలసినదే. పోనిచో, క్రమశిక్షణచర్య తీసికొనబడును. మఱొక తమాషా యేమనగా, అధికార పక్షమువారగు సభ్యులందఱును ఏకాభిప్రాయులై యుండ నక్కఱలేదు. వారియందు కూడ ఎక్కువమంది యభిప్రాయమునకే మన్నన లభించును. ఇటువంటి ప్రజాతంత్ర వ్యవస్థలో పాలకులు తమ రాజకీయ పక్షములోని అధిక సంఖ్యాకుల బలమును పొందినచో, వారి మాటకు తిరుగుండదు. అప్పుడు పాలకులు, తమ నిర్ణయాలకే, పక్ష నిర్ణయా లనురంగువేసి, శాసనసభామోదమును పొంది, వానినే ప్రజానిర్ణయాలని ప్రకటింతురు. కాగా సారాంశ మేమి? ప్రజాస్వామ్యము పేరుతో ఈనాడు చెల్లుచున్నట్టిది కేవలము ఏక రాజకీయ పక్ష స్వామ్యము కాదా? రాజకీయ పక్ష స్వామ్యమువలె కన్పట్టినను, అది కేవలము మంత్రిమండలి (Cabinet) ప్రభుత్వము కాదా? అందుచేతనే కొందఱు రాజనీతికోవిదులు ప్రాతినిధ్య ప్రజాస్వామ్యమును ఆచరణలో మంత్రిమండలి నిరంకుశత్వముగా (Cabinet Dictatorship) వర్ణించిరి.

ప్రజాస్వామ్యము గుంపున కిచ్చిన విలువను గుణమున కీయదు (Democracy attaches undue importance to quantity rather than to quality). వందమంది సభ్యులున్న శాసనసభలో 51 ఓట్లకున్న విలువ 49 ఓట్లకు లేదు. ఇది కేవలము అంకెల గారడి. ఈ సంఖ్యేంద్రజాలమువల్ల, ఎక్కువమంది వెల్లడించిన యభిప్రాయాలలో పస లేకపోయినను, వానికే యామోదముద్ర లభించును. అల్పసంఖ్యాకులగు ప్రతిపక్షమువారు ఎంత సహేతుకముగా, ఎంత ఆచరణయోగ్యముగా, ఆలోచించినను, వాదించినను, వారి యోచనలకు చోటులేకుండ పోవును. అంతేగాక, స్వకీయ పక్షము మెప్పు పొందుటకో, లేక తమ సిద్ధాంతములను ప్రజల తలపై రుద్దుటకో, పాలకులు శాసనసభలో తమ కున్న మూక బలిమిని వినియోగించి, తొందరపాటుతో ప్రమాదకారులగు శాసనములుకూడ చేయువచ్చు. దానికి తగినట్లు రాజ్యాంగమును సవరింపవచ్చును. అందుచేతనే కొందఱు రచయితలు ప్రజాస్వామ్యములో అనాలోచితమైన, పటిష్ఠ చర్చాహీనమయిన శాసనముల గుంపు బహుళముగా అవతరించునని అనుచున్నారు. (In Democracy there is a large and increasing mass of hasty and ill-digested ligislation.)

ప్రజాస్వామ్యము అధిక ధనవ్యయముతో కూడియున్న ప్రభుత్వము. ఎన్నికల జాతరలకు, శాసనసభ్యుల జీతవాతములకు, పాలకుల సంబళములకు ఎంతో డబ్బు దుబారా యగును. రాజకీయపక్షములకు, అభ్యర్థులకు ఎంతో సొమ్ము ఖర్చగును. అందుచే రాజకీయపక్షములు సొమ్మునంచులకై పడరాని పాట్లు పడక తప్పదు. ఈ ముల్లె వేటలో అధికార పక్షమునకు అవకాశ మెక్కువ. పాలకులు తమ రాజకీయ పక్షమునకు సొమ్ము రాబట్టుకొనుటకై అక్రమ మార్గములను అనుసరింతురు.

అమెరికా, ఇంగ్లాండు, ఫ్రాన్సు, కెనడా వంటి పాశ్చాత్య దేశములలో ప్రజాస్వామ్యము పనిచేయుచున్న తీరును పటిష్ఠముగా పరిశీలించిన లార్డ్ బ్రైస్ "నవీన ప్రజాస్వామ్య దేశములు" అను ప్రామాణిక గ్రంథమును రచించెను. ఆ గ్రంథములో "రాజకీయరంగములో ధన బలము" అనునొక యధ్యాయము కలదు. రాజకీయ రంగములో ధన లోభము ఎట్టి అకార్యాచరణమునకు, ఎట్టి అధర్మ ప్రయోగములకు, ఎట్టి అవినీతిచేష్టలకు త్రోవదీయునో ఆయన రుజువుచేసెను. వోటర్లు, శాసనసభా సభ్యులు, ప్రభుత్వోద్యోగులు, న్యాయ శాఖోద్యోగులు ధనాశతో, స్వలాభాపేక్షతో అధర్మము నాచరింతురు, ప్రోత్సహింతురు అని యాయన తీర్పు. ప్రజాస్వామిక దేశములలో సర్వ సామాన్యముగా సాక్షాత్కరించుచున్న ఈ క్రింది దోషములను గూడ ఆయన గ్రంథస్థము చేసెను. 1. పరిపాలనమును భంగింపజేసి, శాసనములను నిరోధించు ధనశక్తి. (The power of Money to pervert administration or legislation) 2. రాజకీయములను లాభకరమయిన వ్యాపార ప్రవృత్తిగా చేయుట. (The tendency to make politics a gainful profession.) 3. పరిపాలనములో దేనికిని కొఱగాని దుబారా. (EXtravagance in administration.) 4. సమానత్వ సిద్ధాంతమును కలుషితము చేయుట. పరిపాలనా దక్షతకున్న విలువను లెక్కచేయక

పోవుట. (The abuse of the doctrine of equality and failure to appreciate the value of administrative skill.) 5. రాజకీయ పక్షముల అనుచిత మయిన అధికార ప్రాబల్యము. (The undue power of party organisations.) 6. శాసన సభాసభ్యులు, రాజకీయోద్యోగులు శాసన నిర్మాణ వేళలలో వోట్లకొఱకు పన్నాగములు పన్నుట, వోట్లకై ఆజ్ఞోల్లంఘనములను సహించుట. (The tendency of legislators and political officials to play for votes in the passing of laws and in tolerating breaches of order.)

కొందఱు రచయితలు ప్రజల మనస్తత్త్వమును సవిమర్శకముగా పరిశీలించి, ప్రజాస్వామ్యమును దుయ్యబట్టిరి. సామాన్యముగా ప్రజలు ఎట్టివారై యుందురు? వారొక గుంపు (Crowd). గొఱ్ఱెలమంద, తోడేళ్లమూక, బరితెగి విచ్చలవిడిగా పెచ్చరిల్లు బందిపోటులు. వారిలో మూఢత్వము కరుడుగట్టి యుండును. హాసము మెండు. జ్ఞానము హుళక్కి. వివేకము శూన్యము. ఓర్పు నాస్తి. ఇట్టి మూక గుండెను కాచి వడపోసిన నాయకుడు వారిని తేలికగా రెచ్చగొట్టగలడు. వారిని స్వప్రయోజనమునకై కీలుబొమ్మలుచేసి ఆడింప గలడు. అంతేగాక మూకపోకడ గల ప్రజలు పరిపాలనా దక్షత గల శాసన నిర్మాతలను, రాజనీతి విశారదులగు పాలకులను ఎన్నుకొనలేరు. ఈ ప్రజలకు ఉత్తమపౌరుల కుండదగిన చిత్తసంస్కారము, శక్తియుక్తులు, శిక్షణ, సద్గుణములు నుండవు. దీనివలన ప్రజాస్వామ్యములో పాలకులు అశక్తులో, అశక్తదుర్జనులో కాక తప్పదు. ఫాగెట్ అను ఫ్రెంచి రచయిత "ప్రజాస్వామ్యము అశక్తతా పూజనము" అని పేర్కొనెను. (Democracy is the cult of incompetence) లెకీ కూడ ఈ యభిప్రాయముతో ఏకీభవించి ఈవిధముగా వ్రాయుచున్నాడు. "ప్రజాస్వామ్యము అల్పుల, అజ్ఞానుల, అశక్తుల—ఇట్టివారే తప్పక యెక్కువమంది యుందురు—ప్రభుత్వము". (Domocracy is the Government of the poorest, the most ignorant, the most incapable who are necessarily the most numerous.)

ప్రజాస్వామ్యము "అశక్తుల ప్రభుత్వము" అను వాద మీనాటిది కాదు. అది యవన తత్త్వవేత్తయగు ప్లేటో నాటి నుండి యున్నది. ప్రజాస్వామ్యమును గూర్చి ఈవిధముగా భావించువారిని అప్రజాస్వామికవాదులు (Non-democrats) అని పేర్కొందము. ఈ యప్రజాస్వామికవాదుల తర్కము ఈవిధముగా నుండును. మానవులలో అందఱియందు గుణములు, అభిరుచులు, శక్తియుక్తులు ఒకే పాకమున నుండవు. (భగవద్గీత యందలి క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగయోగము, గుణత్రయ విభాగయోగము, దైవాసుర సంపద్విభాగయోగము చూడుడు.) అందుచే వారిలో తారతమ్య ముండక తప్పదు. అసమానత యుండకపోదు. వారివారి గుణ కర్మలను బట్టి కొందఱు కర్షకు లగుదురు. మఱికొందఱు వర్తకు లగుదురు. ఇంక కొందఱు యుద్ధవీరు లగుదురు. కొందఱేమో ధర్మ ప్రచారకు లగుదురు. సమాజము శక్తిమంతమై, సౌష్ఠవముగా నుండవలయు నన్నచో, మానవులు తమ తమ అభిరుచులకు, గుణగణములకు అనురూపమయిన కర్మలలో ఉత్తమ శిక్షణ పొంది, నైపుణ్యమును గడించి, వానికి తమ జీవితములనే యంకితము చేయవలయును. ఆవిధముగనే ప్రభుత్వము సక్రమముగా నడువవలయునన్నచో ఉత్తమ పాలకులు కావలయును. ప్రతి వ్యక్తియు ఉత్తమపాలకుడు కాలేడు. గుణగరిష్ఠులగు కొలదిమంది మాత్రమే పాలకులుగా నుండుటకు అర్హులు. అట్టివారికి అవసరమయిన శిక్షణమును, కలిగించినచో వారు సక్రమముగా విధులను నిర్వహింతురు. కాని ప్రజాస్వామ్యములో ప్రజలందఱు ప్రభుత్వ వ్యవహారములలో పాల్గొనవలెనని వాంఛింతురు; లాగాటపడుదురు. కాని యీ యారాటమునకు తగినట్లుగా ఆత్మాధికారముండదు. ప్రజాస్వామికవాదు లీ లోపమును విస్మరించుచున్నారు కావున, తమ సంస్కార పరిపాకముచే, గుణసంపత్తిచే పరిపాలకులుగా నుండదగిన కొలది మందిని తొలగద్రోసి, ప్రభుత్వము ప్రజలచే నడుపబడవలయునని యనుకొనుటచే, తుదకు ప్రజాస్వామ్యము ఆచరణములో అజ్ఞానుల రాజ్యముగా, అశక్తుల విధానముగా అవతరించును.

ఇట్టి అప్రజాస్వామికవాదమును లేవనెత్తిన ప్లేటో తన "ఆదర్శరాజ్యము" లో తత్త్వవేత్తలే పరిపాలకులై యుందురని యన్నాడు. ఆయన పాలకులకు తత్త్వవేత్తల లక్షణములను వివరించెను. వారి శిక్షణయందు విధి నిషేధములను అనుశాసించెను. ఆదర్శరాజ్యములో తదన్యులను అనర్హులనుగా వర్ణించెను. ఈనాటి అప్రజాస్వామికవాదులలో సమ సమాజ వాదులు (Communists) ప్రముఖులు. సమసమాజవాద దేశములలో కమ్యూనిస్టుపార్టీలోని అగ్రనాయకులు వినా ఇతరులు పాలకులుగా నుండుటకు అయోగ్యులు గదా! పైన ఉదాహరించిన అప్రజాస్వామికవాదుల సిద్ధాంతమును ప్రజాస్వామికవాదులు ఈవిధముగా పూర్వపక్షము చేసిరి. పాలకులకు ప్రత్యేక నైపుణ్యము, సముచిత శిక్షణము నుండవలయు ననుటలో సత్యము లేక పోలేదు. కాని మానవులలో జన్మతః కొందఱు పాలకులై, మఱికొందఱు పాలితులై యుండక తప్పదనుట అశాస్త్రీయము. ఈ సిద్ధాంతము అశాస్త్రీయ మగుటయే కాక లోప భూయిష్ఠము, అనర్థదాయకమును. అప్రజాస్వామికవాదుల మాటలే నిజమైనచో, పాలక పాలితుల నడుమ నుండవలసిన సౌహార్దము చెడి, సంబంధములును బెడిసిపోవును. పాలకు లెంతగా సుశిక్షితులైనను, సర్వ ప్రజల అభీష్టములను, అభిరుచులను ఎఱుగగలిగిన సత్తువ వారికుండదు. అంతేగాక పాలకవర్గములో అధికార వ్యామోహము, అహంకారము మిన్నుదన్నకమానవు. తమ చేతలను, కూతలను పాలితులు కాదన రాదని పాలకులు భావింతురు. వారు ప్రజలలోని విమర్శన

ప్రవృత్తిని, ప్రభుత్వ విభిన్నదృష్టిని చూచి సంతోషింపరు. సహింపరు. సర్వవేళల ప్రజలు తమకు విధేయులై యుండు నట్లు జాగ్రత్తపడుదురు. అట్టి విధేయతా ప్రవృత్తిని పెంపొందించుటకై పాలకులు ప్రజలలో "బుద్ధి శుద్ధి" (Brain wash) ఉద్యమమును ప్రారంభింతురు. ప్రచారమును ముమ్మరముగా కొనసాగించి, విద్యా విధానమును స్వానుకూలముగా సంస్కరించి, సాహిత్యమునకు చిక్కములు పెట్టి వారి కార్యమును నిర్వహింతురు. ఈవిధముగా అప్రజా స్వామికుల తత్త్వమును పూర్వపక్షముచేసి, ప్రజాస్వామిక వాదులు తమ సిద్ధాంతము నిట్లు వక్కాణింతురు. ఈనాడు లభించుచున్న శాస్త్ర విజ్ఞానము మానవుడు జన్మతః హేతుశీలి యని నిర్ధారించుచున్నది. ఏది కారణమో, ఏది కార్యమో, ఏది ధర్మమో, ఏది అధర్మమో విచారణ చేయగలిగిన శక్తి మానవునిలో ప్రకృతిసిద్ధముగా నున్నది. ఈ శక్తియే యతనిని సత్యాన్వేషకు వొసర్చినది. కనుక మానవుడు సృష్ట్యాది నుండియు సత్యాన్వేషణము చేయుచున్నాడు. నూతన సత్యము లను కనుగొనుచున్నాడు. ఈ సత్యాన్వేషణయొక్క పరమాశ యము స్వేచ్ఛా సంపాదనము. మానవు డేపని చేసినను, ఎట్టి సమాజమును నిర్మించికొనినను, ఎట్టి ప్రభుత్వమును ఏర్పఱచుకొనినను వాని లక్ష్యము స్వేచ్ఛా సముపార్జనమే. స్వేచ్ఛయనునది సర్వుల అనుభవముల కందవలసినట్టిది. అది సమాజములో కేవల మొక వర్గమునకో యొక వర్ణమునకో పరిమితమై యుండరాదు.

ఇంతవఱకు మానవు డనేక విధములయిన ప్రభుత్వము లను ప్రతిష్ఠించుకొన్నాడు. వానిలో రాచఱికము (Monarchy), శిష్టగణ రాజ్యము (Aristocracy), నిరంకుశ ప్రభుత్వము (Dictator ship), ప్రజాస్వామ్యము (Democracy) చెప్పుకొనదగినవి. మొదటి మూడురకాల ప్రభుత్వములలో సర్వ మానవులకు స్వేచ్ఛ యుండదని చారిత్రకానుభవము రుజువుచేయుచున్నది. ఒక్క ప్రజాస్వామ్యమే ప్రతి వ్యక్తి యొక్క స్వేచ్ఛను అంగీకరించును. అతని హేతుశీలము నకు, స్వతంత్రాలోచనమునకు విలువయిచ్చును. ప్రజా స్వామ్యములో ప్రతి వ్యక్తి తన యభిప్రాయములను నిరాటంకముగా తెలియజేయును. తన యెదుటి వానికి కూడ ఈ యవకాశము కల్గించి, దానికి తగిన సహన శీలమును అలవఱచుకొనును. ప్రజాస్వామ్యములో ప్రతి వ్యక్తియు సామాజిక విషయములను గూర్చి ఆలోచించుటకు, ఇతరులతో చర్చలు చేయుటకు, ప్రభుత్వ నిర్ణయముల చేతలో భాగస్వామి యగుటకు సంపూర్ణావకాశ ముండును. కనుకనే ప్రజాస్వామ్యమును సమర్థించుచు, ప్రొఫెసర్ సీల్డ్ ఈ విధముగా వ్రాయుచున్నాడు. "పౌరులలో ఒకవిధమయిన చిత్తప్రవృత్తిని, మనఃపరిపాకమును సృజించుటకు ప్రజా స్వామ్యము సాధనమయి యున్నది. ఇదే తుదకు దానిని సమ ర్థించుటకు వీలు కల్గించుచున్నది. చిత్త స్వాతంత్ర్యము, ఇతరులపట్ల ఓర్మిని కూర్మిని చూపుట, సామాజిక వ్యవహార ములలో ఆసక్తి కలుగుట, వానిని గూర్చి ఆలోచించుచు ఇతరులతో చర్చించుట, సమస్త సంఘమువట్ల బాధ్యతా దృష్టి పెరుగుట—ఇవి ప్రజాస్వామ్యమువలన కలుగు మేళ్లు. ఇవిగాక అనుకూలములైనవో, ప్రతికూలములైనవో యగు ఆనుషంగిక లాభములు కలుగవచ్చును గాక. కాని యీ మేళ్లే ప్రజాస్వామ్యవాది నమ్మికకు మూలాధార మగుచున్నవి."

(The ultimate justification for democracy is as a means to producing certain states or altitudes of mind in the citizens, independence of mind, respect and tolerance for others, interest in public affairs, willingness to think about them and discuss them, and a sence of responsibility for the whole community. There may be other incidental advantages, positive or negative, but these by themselves constitute an ample basis for the d mocrat s belief."

ప్రజాస్వామ్యము వర్ధిల్ల వలెనన్న...

సిద్ధాంతరూపములో ఇంత యుదాత్తమయిన ఈ ప్రజాస్వామ్యము ఆచరణలో ఇన్ని వెర్రితలలు వేసినదేమి ? ఈ ప్రశ్న పుట్టుట సహజమే. ప్రజాస్వామ్యము వర్ధిల్ల వలయునన్నచో, సమాజములో కొన్ని అనుకూల పరిస్థితు లుండవలయును. ఈ పరిస్థితులు దేశ కాలములనుబట్టి మారవచ్చును. అయినప్పటికిని, సర్వసాధారణముగా, ప్రజాస్వామ్య ప్రయోగములకు సహాయకారులగు పరిస్థితులు కూడ సమా లోచనీయమే. 1. ప్రజాస్వామ్యము చక్కగా పనిచేయ వలయునన్నచో, ప్రజలకు దేశ వ్యవహారములలో గాఢమయిన అనురక్తి యుండవలయును (A keen interest in public affairs). ప్రజలందఱకు కాకపోయినను, వారిలో ఎక్కువమందికైనను తమచుట్టు ఏమి జరుగు చున్నదో, ప్రభుత్వ విధానము లేమిటో, వాని ఫలితము లెట్లుండునో తెలిసికొనవలయునను ఆపేక్ష యుండవలయును. వారిలో ఉదాసీనత, అలస భావము నుండరాదు. అంత మాత్రాన ప్రజాచైతన్యమునకు హద్దు లుండవని అర్థము గాదు. అది ఏనాడును అతి తీవ్రముగా నుండరాదు. లక్ష్యము లేకుండ కట్టలు త్రెంచుకొని పోగూడదు. కొన్ని కొన్ని సందర్భ ములలో ప్రజాచైతన్యము ఎంతగానో యురవళ్లు పరవళ్లు త్రొక్కును. ఒక సామాన్య శాసనమును ప్రభుత్వము ప్రవేశ పెట్టక పోయినను, ఒక రాజకీయ పక్షము అధికారము చేపట్టకపోయినను, ప్రజలు అసహనశీలురై దౌర్జన్యమునకు దిగ దురు. దౌర్జన్యయుతమయిన హింసాకాండ ప్రజాస్వామ్యమునకో

మవ్వు. ప్రజాచైతన్యము ఆటవిక పద్ధతుల స్వరూపములో బహిర్గతము కారాదు. 2. ప్రజలు రాజకీయ చైతన్యములో రాణింపవలయు నన్నచో వారు ఒక కనిష్ఠ స్థాయిలో విద్యావంతులై యుండవలెను (A minimum standard of education). ఉచిత నిర్బంధ విద్యతోపాటు, వయోజనులకు కూడ విద్యాగంధము ఉండవలయును. అంతేగాక ఆ విద్యాప్రవృత్తి ప్రజలలో స్వేచ్ఛామయ జీవన విధానము పట్ల వలపు కలిగించునదై యుండవలయును. ప్రజలు తమ హక్కులను కాపాడుకొనుటకు, విధులను నిర్వర్తించుటకు, స్వతంత్రముగా ఆలోచించుటకు, ధర్మాధర్మ విచారణ చేయుటకు విద్య తోడ్పడవలయును. 3. రాజకీయ చైతన్య పూరితులు, విద్యావంతులు అయిన ప్రజలకు, స్వేచ్ఛామయమయిన చర్చలు చేయుటకు, నిర్నిరోధముగా ఆత్మభావములను వెల్లడించుటకు అవకాశము లుండవలయును (Scope for free d scussion and free expression of opinion). అందుల కవసరమయిన పత్రికా స్వాతంత్ర్యమును, గ్రంథకర్తృ స్వాతంత్ర్యమును ప్రజాస్వామ్యము కల్పింపక తప్పదు. స్వేచ్ఛా చర్చలవల్ల ప్రతి వ్యక్తియు తన యభిప్రాయములను నిర్భయముగా వ్యక్తీకరించును. అంతేగాక యితరులు తమ యభిప్రాయములను ప్రకటించుటను అత డామోదించును. దీనికి తగిన సహనశీలము ప్రజాస్వామ్యములో ప్రతి వ్యక్తికిని అలవడవలయును. మఱి వా క్పథా స్వాతంత్ర్యములకు ఏనాడు హద్దుపద్దు లుండగూడదా ?—యను ప్రశ్న యుదయింప వచ్చును. దేశ సమైక్యమును, దేశ శాంతి భద్రతలను, దేశ పురోగమనమును విచ్ఛిన్నముచేయు అరిష్టశక్తులకు భావ ప్రకటన స్వాతంత్ర్యమును కట్టబెట్టుట యుచితమా ? ప్రజాస్వామ్యమును అధిక్షేపించుచు, ఆ వ్యవస్థను కూలద్రోయుటకు కంకణము కట్టికొన్న రాజకీయ పక్షములకు ఈ స్వాతంత్ర్యము కల్పింపవలయునా ? అటువంటివారిని ఏదో యొక రూపంతో గిఱిగీసి నిలబెట్టుటయే యుచితము. 4. సమాజమునందలి ఆర్థిక పరిస్థితులు (Economic conditions) ప్రజాస్వామ్య వికాసమునకు దోహదము చేయవలయును. దుర్భర దారిద్ర్యముతో మునిగి ప్రజలు అలమటించు సమాజములో, ఓట్లు, ఎన్నికలు, రాజకీయస్వేచ్ఛలు మున్నగువానికి చోటుండదు. అవి యట యర్థరహితములు. ప్రజాస్వామిక విధానములు జయప్రదములు కావలయునన్నచో, ప్రజల ప్రాథమిక వాంఛలు నెఱవేఱవలయును. సమాజములో ఒకచో కుబేర సంపత్తి గూడుకట్టుకొని, కొలదిమంది మాత్రమే ఇతరుల నోళ్లు గొట్టి స్వర్గసౌఖ్యము లనుభవించు, అధిక సంఖ్యాకులు 'అన్నమో రామచంద్రా!' యని యలమటించు, ఆర్థిక పరిస్థితి పనికిరాదు. ప్రభుత్వ వ్యవహారములలో భాగస్వాములు కాగలిగిన ప్రజలు, జాతి సంపదను గూడ అనుభవించుటకు, ధర్మసమ్మతమయిన యవకాశము కలిగియుండవలయును. ఈ లక్ష్యసిద్ధికై ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్విరామముగా శ్రమింపవలయునని అందఱు నంగీకరింతురు. కాని ఆ లక్ష్యమును సాధించు టెట్లు ? ఆ లక్ష్యమును సాధించుటకై యనుసరింపదగిన విధానములను గూర్చి తీవ్రమయిన విభేదము లుత్పన్నము లయినవి. కొందఱు ప్రజాస్వామ్య విజయమునకు ధనికవాద—ఆర్థిక వ్యవస్థ అత్యావశ్యకమని భావింతురు. మరికొందఱు సామ్యవాద—ఆర్థిక వ్యవస్థ శరణ్య మందురు. ధనికవాద—ఆర్థిక వ్యవస్థ స్వరూప స్వభావము లేవి ? సామ్యవాద—ఆర్థిక విధానము మంచి సెబ్బఱలేవి? ఈ రెండు సిద్ధాంతములను తఱచి తఱచి చూడవలసిన, నిగ్గు తేల్పవలసిన యక్కఱ ఈ వ్యాసమునకు లేదు.

చరిత్ర నేర్పుచున్న పాఠముల నుండి, నీతుల నుండి యదార్థమును గ్రహింపవచ్చును. సామ్యవాద—ఆర్థిక వ్యవస్థను అనుసరించు సమ సమాజవాద దేశములలో (ఆర్థికాభివృద్ధి అధికమగుచున్నను ?) ప్రజల నానావిధ స్వాతంత్ర్యములు నమసిపోయినవి; నమసిపోవుచున్నవి. ఇక పరిపూర్ణమయిన ధనికవాద—ఆర్థిక వ్యవస్థ యీనాడు ఏ ప్రజాస్వామిక దేశములోను లేదు. ఈ వ్యవస గల ప్రజాస్వామిక దేశములలో సైతము ప్రభుత్వము ఆర్థికరంగములో జోక్యము—మితముగా—కలుగజేసికొనును. కనుక ఈ విషయములో సిద్ధాంతముల పట్ల, ప్రత్యేకమయిన యార్థిక వ్యవస్థల పట్ల, మరులుగొనక ప్రజాస్వామికవాది వాస్తవిక దృష్టితో, సమరస చింతనములో వ్యవహరించి, ప్రజల జీవన ప్రమాణమును పెంచుచు, వారి స్వేచ్ఛకు అంతరాయములు కలిగింపని ఆర్థిక పరిస్థితులను సృష్టించుకొనవలయును. ఈ ఆర్థిక పరిస్థితులను గూర్చి ఆలోచించునపుడు, వ్యక్తిగతమయిన ఆదాయమున కొక పరిమితి యుండవలయునా ? మూలాధార పరిశ్రమ లన్నియు ప్రభుత్వ యాజమాన్యమునందుండవలయునా ? స్వేచ్ఛా వ్యాపార రంగమును ప్రభుత్వ మెంతవఱకు అనుశాసింపవలయును ? ఇత్యాది జటిల సమస్యలు ప్రజాస్వామికవాదికి ఎదురుపడును. ఈ సిద్ధాంతముల మోహముతో, వివాదముల వలపుతో, ప్రత్యేకార్థిక వ్యవస్థల పక్షపాతముతో యోచించుట మొదలిడినచో, యీ సమస్యలకు సముచితమయిన పరిష్కార సూత్రములు లభింపవు. బహు జనాంగీకారమును పొందెడి, ప్రజాస్వామ్య వ్యవస్థకు భంగము కలిగింపని, ప్రజా స్వాతంత్ర్యములను మంటగలుపని, పరిష్కారముల కొఱకు అన్వేషణము కొనసాగవలయును. 5. ప్రజాస్వామ్యము యొక్క విజయము

నకు ఉత్తమ నాయకత్వము ప్రప్రధాన మయినట్టిది. ప్రజాస్వామ్య రథము కుంగిపోకుండ, సాగిపోవుటకు అవసరమయిన అంగములలో రాజకీయ పక్షము లొకటి. రాజకీయ పక్షముల మూల సిద్ధాంతములు, నిర్వహణము, నిర్మాణ కార్యక్రమములు ప్రజాస్వామ్య సూత్రములకు అనుగుణముగా నుండవలయును. రాజకీయ పక్షములు ఆవిధముగా నుండవలయు నన్నచో ధర్మాధర్మ వేత్తలగు రాజకీయ నాయకుల యక్కఱ యెంతేని యున్నది. అధికార వ్యామోహము, ధనదాహము, సంకుచిత దృష్టి నిండిన నాయకులు ప్రజాస్వామ్యమునకు చీడపురుగు లని, చెడలని చెప్పకతప్పదు. ఆత్మ సంయమనము, ఆవరి గ్రహము, పరార్థదృష్టి, త్యాగశీలము, అకుంఠిత కార్యదీక్ష, చిత్తౌన్నత్యము, చిత్తశుద్ధి, సత్య తత్పరత, నైతిక విక్రమము, విశాలదృష్టి గలిగి మానవత మూర్తీభవించిన నాయకులు, రాజకీయములను వాణిజ్య వ్యాపారములుగా మార్చక, అధికార సాధనములుగా చేయక, వానిని మానవసేవా సాధనములుగా భావింతురు. ఒక రాజకీయ రంగమునందననేల ? సర్వ రంగములందును మేలినాయంకరము అత్యావశ్యకమే. నాయకుల కే లక్షణము లుండదగునని ప్రజలు భావింతురో, అట్టి లక్షణములను వారు కూడ కలిగియుండవలయును. 6. సమాజములో అనేక సంఘములు, వివిధ సంస్థలు నుండును. ఉదాహరణమునకు కార్మిక సంఘములు, పారిశ్రామిక సంస్థలు, విద్యార్థి సంఘములు మున్నగునవి. ఈ సంఘములలో ఒకటి గాని, రెండు గాని, అధికారమును కైవసము చేసికొని, ప్రభుత్వ కార్యకలాపములను తమ యిచ్ఛ వచ్చినట్లుగా రూపొందింపరాదు. ఆవిధముగా చేయుట ప్రజాస్వామ్యమునకే విరుద్ధము. మాక్లైవర్ అను రచయిత ఈ విషయమును గూర్చి, ఈవిధముగా వ్రాయుచున్నాడు. "బాధ్యతారహితమయిన అధికారమును పొందిన ఏ వర్గ మైనను—అది శ్రీమంతుల వర్గము కావచ్చు, లేక నిఱుపేదలది గావచ్చు, వామపక్షము గావచ్చు లేక దక్షిణపక్షము గావచ్చు—ప్రజాస్వామిక స్వేచ్ఛలను పాతాళమున కణగద్రొక్కును. అటువంటి వర్గము సమాజమును విచ్ఛిన్నమును చేయును. సమాజ వ్యవహారములలో సమస్త వర్గములు సమానముగా పాల్గొనుట నది తిరస్కరించును." (Any group endowed with irresponsible power. no matter whether it be of the rich or of the poor. of the right or of the left is suppressive of democratic liberties. Any such group drives a wedge through the community, denies the equal participation of all groups in the affairs of the community."

(సశేషము)

పొగయక రాజ కోక్యు మొగి భోరన మంటలు విస్ఫులింగముల్
నెగసి, రయంబునన్ గలయ నిండి, ఛటచ్ఛట భుగ్భుగద్ధగ
ద్ధగయని మండి పంచశరు దగ్ధము సేయుచ యాతిణాంబులో
మగిడి పురారి నేత్రశిఖ మల్లె మహాశనిపాతభీమ మై.

(నన్నెచోడ—కుమార)

నీళ్ళు

శ్రీ పెదిభొట్ల సుబ్బరామయ్య

"దీన్నిండా తప్పులే.... మళ్ళీ వ్రాసుకురా .... నీకు తెలియకపోతే నీ సీనియర్‌ని కన్సల్టు చెయ్యి. మరో అర గంటలో యిది కావాలి ...." అన్నాడు ఆఫీసరు, జోగినాధం అంతకుముందు తయారుచేసిన డ్రాఫ్టు మళ్ళీ అతని చేతికి అందిస్తూ.

జోగినాధం వినయంగా "అలాగేనండి" అంటూ ఆ కాయితం అందుకున్నాడు. గది దాటి యివతలికి వచ్చేసరికి అక్కడే లోపలికి వెళ్ళేందుకు కాబోలు నిరీక్షిస్తూ నిలబడి వున్న కుసుమ అతనికి కనిపించింది. ఆమె ఆఫీసరుగారి మాటలు వినే ఉండాలి. అందుకు నిదర్శనం ఆమె అతనివంక చూసి నవ్విన నవ్వు.

ఉమాపతి తన సీటులో తీరికగా కూర్చుని ఉండి కళ్ళెగరవేసి "ఆ కాయితం మళ్ళీ నీ చేతుల్లోకే వచ్చిందేమిటయ్యా మహానుభావా ?" అని అడిగాడు.

జోగినాధం మొహం తుడుచుకుని సిగ్గుపడుతూ "దీన్నిండా తప్పులున్నాయిట .... మళ్ళీ రాసుకు రమ్మన్నారు." అని చెప్పాడు.

ప్రక్కనే కూర్చుని ఏదో ఫైలు తిరగేస్తున్న లక్ష్మీపతి తల ఎత్తి చూసి "ఉద్యోగంలో చేరి నెలా పదిహేను రోజులే కదా అయింది ? ఏవో చిన్న చిన్న తప్పులుంటే తాను దిద్ది ఫైసిప్పు కివ్వగూడదూ ? అంతా పోషులే బ్రదర్ ..... ఆ కుర్చీ అటువంటిది" అన్నాడు.

ఉమాపతి "సరే .... ఇకనేం ? ఆ కాయితం యిలా తీసుకురా .... గబగబా ఏదో గిలికి యిచ్చి పెందలాడి బయట పడిపోదాం .... అన్నట్టు యివాళ సినిమా ప్రోగ్రాం కూడా ఉంది." అన్నాడు.

జోగినాధం ఆ కాయితం ఉమాపతికి అందించి అతని ముందు కుర్చీలో కూర్చుని "మీ యిద్దరూ సినిమాకు వెడుతున్నారా ?" అని అడిగాడు.

ఉమాపతి, లక్ష్మీపతి వంక చూశాడు. లక్ష్మీపతి కూడా ఆ ప్రశ్న విని జోగినాధంవైపు చూశాడు. అతడు విసుగుతో జోగినాధాన్ని ఉద్దేశించి "నీ ప్రవర్తన నాకేం నచ్చడం లేదోయ్.... మనం ముగ్గురం ఒకే రూములో ఉంటూ ఒకే హోటల్లో భోజనం చేస్తున్నాము.... అయినా నువ్వు ఆదే మిటో అంటే అంటనట్టు ప్రవర్తిస్తూ ఉంటావు. మొన్న నొకసారి కూడా యిలాగే సినిమాకు పోదాం రమ్మంటే రానంటే రాను పొమ్మన్నావు. అలా స్నేహపూర్వకంగా అడిగినప్పుడు మొహంమీద కొట్టినట్టు రాను పొమ్మంటే ఎలా ఉంటుందో ఆలోచించావా ?" అన్నాడు.

ఉమాపతి "ఎందుకులే బ్రదర్ ! అతని తీరు తెలిసి వచ్చింది కదా ! ఇక ఏమీ మాట్లాడక వూరుకో" అని తాను పనిలో మునిగిపోయాడు.

జోగినాధం యిరుకున పడ్డాడు. అతి కష్టంమీద గొంతు పెగుల్చుకుని "క్షమించండి" అనగలిగాడు. ఉమాపతి వినిపించుకున్నట్టు లేదు.

మరో అయిదు నిముషాల్లో ఉమాపతి తాను తయారు చేసిన కొత్త డ్రాఫ్టు జోగినాధం ముందుపడేసి లేచినుంచుని జేబులు సర్దుకుని లక్ష్మీపతి నుద్దేశించి "త్వరగా తెములవోయ్" అన్నాడు. లక్ష్మీపతి ఫైలు మడిచి అవతల పడేసి "నేను సిద్ధమే" అంటూ లేచి మళ్ళీ జోగినాధం వంక చూసి "మరి ఈయనగారి మాటేమిటి?" అని అడిగాడు. ఉమాపతి జేబుల్లో చేతులుంచుకుని జోగినాధం వంక తిరిగి "ఏమంటావు?" అని అడిగాడు.

అతడు కాయితం మడత పెడుతూ లేచినుంచుని "నేనెందుకు లెండి బాబూ! మీరిద్దరూ వెళ్ళిరండి. నేను రూములోనే వుంటాను." అన్నాడు.

ఉమాపతి కొద్దిగా కోపం తెచ్చుకుని అడుగులు ముందుకు వేశాడు. లక్ష్మీపతి సీటులో నుంచి లేచి యివతలికి వస్తూ "ఏం? మాతో రావడం యిష్టం లేదా నీకు?" అని అడిగాడు.

జోగినాధం నీళ్ళు నవులుతూ "సతీ! వాదగ్గర డబ్బు...." అంటూ ఆగిపోయాడు.

అంతలోనే అందుకుని లక్ష్మీపతి "భలేవాడివే జోగినాధం! నీదగ్గర డబ్బు వుంటేనేమిటుకు నిన్ను టిక్కెట్లు కొననిస్తామా? మరేమిటో అనుకున్నాను. అదా నీ సందేహం? ఉఁ! ఇకనైనా బయలుదేరు. డబ్బు మాదగ్గర వుందిలే.." అన్నాడు.

జోగినాథం "అది కాదండీ బాబూ! మీకెలా చెప్పాలో అర్థం కావడం లేదు. నేను రానుగాని, నన్ను విసిగించక మీరు వెళ్లిరండి.."అన్నాడు విసుగుతో.

ఉమాపతి విస్ఫారమాడుతూ "అదయ్యా! సంగతి.. డబ్బును గురించి ఎంతమాత్రం కాదు. కేవలం 'యీ జులాయి వెధవలతో ఎందుకు తిరగాలి'..అని ఆతని బాధ. అతను బుద్ధిమంతుడు. జాగ్రత్తపరుడు..సినిమాలూ షికార్లూ అతనికి గిట్టవు. కాబట్టి యికమీదటనైనా మనం అతన్ని పిలిచి అవమానం చెందనక్కరలేదు. అర్థమయిందా? పోదాంపద.." అన్నాడు.

లక్ష్మీపతి "అదీ నిజమే. ఇవాళ మనం సినిమాకు తీసుకు వెడతామంటే వెంటనే వస్తే.. మళ్లీ తనెప్పుడైనా ఆమాట అనవలసివస్తుందేమోనని దిగులు కూడా ననుకుంటాను". అంటూ జేబులోనుంచి తాళంచెవులు తీసి బల్లమీదికి విసిరి "అయ్యా! జోగినాథం గారూ, ఇవిగో రూము తాళాలు.. మేము వెళ్తున్నాం.." అన్నాడు.

మరుక్షణంలో వారిద్దరూ చేతులు కలుపుకుని బయటికి వెళ్లిపోయారు. జోగినాథం మనస్సు చివుక్కుమన్నది. లక్ష్మీపతి ఎంత మాట అన్నాడు! తమతో కలసి సినిమాలకూ షికార్లకూ రానంత మాత్రంతో అంత మాట అనడమేనా?

*　　*　　*　　*

అతడు చుట్టూ చూశాడు. అప్పటికే అంతవరకూ అక్కడవున్న యితర గుమాస్తాలు కూడా వెళ్ళిపోయారు. మూలగా కుసుమ ఒక్కతే మాత్రం తనసీటులో కూర్చుని ఏదో కాయితం టైపు చేస్తున్నది. జోగినాథం వుండి వుండి ఆమెవైపు చూస్తూ ఆఫీసరు గదిలోనుంచి పిలుపు కోసం ఎదురు చూస్తున్నాడు.

అంతలో అతనికి దూరంగా కిటికీలో ఎత్తుగా ఉంచబడిన నీళ్ల కూజా కనిపించింది. నీళ్ళు మరింత చల్లగా వుండటం కోసం దానిచుట్టూ జనపనార తాడు అల్లివుంచారు. దాని పక్కనే రెండు గాజు గ్లాసులున్నాయి.

జోగినాథం నెమ్మదిగా లేచివెళ్లి శుభ్రంగా తళతళలాడుతున్న గ్లాసును చేతిలోకి తీసుకుని దాన్ని నీళ్లతో నింపి చెయ్యి పైకెత్తి ఒక్క నిముషం సేపు దానివంక కన్నార్పకుండా చూశాడు. గ్లాసులో నీళ్ళు తెల్లగా మిలమిల లాడుతున్నాయి. ఆటువైపు నుంచి ప్రసరిస్తున్న వెలుగు కిరణాలవల్ల అవి క్షణక్షణానికీ మరింత మెరిసి పోతున్నాయి. అతడు నెమ్మదిగా ఆగ్లాసు నోటిదగ్గర వుంచుకుని గుక్క తర్వాత గుక్కగా నింపాదిగా తాగాడు. తర్వాత గ్లాసు అక్కడ వుంచి మూతి తుడుచుకుంటూ తలతిప్పి చూసేసరికి తనవంకనే కన్నార్పకుండా చూస్తున్న కుసుమ కనిపించింది. అతడు సిగ్గుపడిపోయి త్వరత్వరగా తన సీటులోకి వెళ్లి కూర్చున్నాడు. కుసుమ అంతవరకూ యీతంతు అంతా తనపని ఆపుకుని మరీ చూసింది కాబోలు. అతడు కుర్చీలో కూర్చోగానే మళ్లీ టైపుశబ్దం ప్రారంభమైంది.

కొద్ది నిముషాల తర్వాత ఆఫీసరుగారి గదిలో బెల్ మ్రోగింది. కుసుమ గబగబాలేచి లోపలికి వెళ్లి మళ్లీ వెంటనే తిరిగివచ్చి జోగినాథంతో "మిమ్మల్ని పిలుస్తున్నారు.."అన్నది.

జోగినాథం కాయితం చేతిలోకి తీసుకుని ఒక్క ఉదుటున లేచి వెళ్లి ఆఫీసరుగారి ముందు నిలబడ్డాడు. ఆయన అతని చేతిలో కాయితం అందుకుని చూసి తలఎత్తి "ఊ! ఎవరిని కన్సల్టు చేశావు?" అని అడిగాడు.

జోగినాథం నెమ్మదిగా "ఉమాపతి వ్రాసి యిచ్చాడండీ.." అని చెప్పాడు.

ఆయన చురుకుగా చూసి"అలాగా! చూడు జోగినాథం! నువ్వు ఆలా ఉన్న విషయం చెప్పినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. కాని ఒక్కసంగతి గుర్తుపెట్టుకో. అతను గ్రాడ్యుయేటు. పైగా అనుభవం ఉన్నవాడు. అత నీవాడ నీకు స్నేహితుడు కాబట్టి సహాయం చెయ్యడం బాగానే ఉంది. కానీ ఎన్నాళ్లిలా? నువ్వు కొత్తవాడివి. పైగా నీకు చదువు తక్కువే అయినా నువ్వు కొంచెం చొరవ తీసుకుని పనిలో అభివృద్ధి చూపించాలి. వారిమీదా వీరిమీదా కొత్తల్లో ఆధారపడటం తప్పేమీ కాదు. వాళ్ళ సహాయం చెయ్యటమూ తప్పు కాదు. కాని నువ్వు కూడా స్వతంత్రించి కొంచెం యింప్రూవ్‌మెంట్ సాధించాలి. నాలుగు వాక్యాలు స్వంతంగా తప్పులులేకుండా వ్రాయడం బ్రహ్మ విద్యేమీ కాదు. సరే.. నువ్వెళ్ళు..ఆ టైపిస్టును రమ్మని చెప్పు..ఈ కాయితం యివాళ వెళ్లిపోవాలి.." అన్నాడు.

జోగినాథం తలుపుతీసి యివతలికి వచ్చి కుసుమ నుద్దేశించి "మిమ్మల్ని పిలుస్తున్నారండీ.." అని చెప్పాడు. ఆమె లేచి ఆఫీసరు గదిలోకి వెళ్లింది.

జోగినాథం టైపు మెషిను దగ్గర నిలబడ్డాడు. కన్నార్పకుండా దానివంకకే చూశాడు. కుసుమ లోపల ఆఫీసరుగారి గదిలో "అలాగేనండీ.. యిప్పుడే చేసియిస్తాను." అంటున్నది.

అతడు టైపుమెషిను దగ్గరగా జరిగి ఒకవిధమైన చాపల్యంతో వ్రేలు కదిపి ఒకమీటనొక్కాడు. లోపల కాయితం చుట్టివున్న సిలిండరు 'ధన్'మని పెద్దశబ్దం చేస్తూ మరో వైపుకు కదిలింది. అతడు అదిరిపడ్డాడు.

అంతలో కుసుమ చేతిలో కాయితంతో వచ్చి"అదేమిటి? టాబ్యులేటర్ నొక్కారా? అలాచేస్తే మెషిను పాడైపోతుంది. మీరిలా కూర్చోండి.. మీ కాయితమే యిది. ఇప్పుడే ఆఫీసర్గారికి అందించాలి.. ఆ తర్వాత యిద్దరం కలిసే వెడదాం.." అంటూ కూర్చుని తనపనిలో నిమగ్నురాలయింది. జోగినాథం "అలాగే నండి"అంటూ తలుపుతీసి ఒక కుర్చీలో కూర్చున్నాడు. ఆతనితో కుసుమ యిదే మొదటిసారి మాట్లాడటం.

జోగినాథం కనురెప్పపాటు అయినా లేకుండా చూస్తూ కూర్చున్నాడు. అతనికి కుసుమ నైపుణ్యం అబ్బురం కలిగించింది. ఆమె పలుచని బంగారు రంగు కళ్ళు టైపుమెషీను మీద వేగంగా అందంగా కదులుతున్నాయి. ఆ కళ్ళలో ఏదో మంత్రశక్తి ఉన్నట్టు అనిపించిందతనికి. తాను పుట్టినప్పటి నుంచీ పద్దెనిమిదేళ్ల వరకూ— అంటే స్కూల్‌ఫైనల్ ప్యాసయ్యే వరకూ— ఉన్నది గుంటూరు జిల్లాలో ఒకమారుమూల పల్లెటూళ్ళో. తాను ఎనిమిదవ తరగతి తరకూ చదువుకున్నది పక్కవూరిలోని మిడిల్‌స్కూల్లో. ఆ వూరు కూడా పెద్దదేమీ కాదు. తన మిడిల్‌స్కూల్ చదువు పూర్తికాగానే తనతల్లి యింక చదువు మానుకోమన్నది. కాని, ఆ సంవత్సరం నుంచి స్కూల్‌ఫైనల్ వరకూ పై తరగతులు కూడా ఏర్పాటు చేసి ఆస్కూల్‌ను హైస్కూలుగా మార్చారు. ఆ సదుపాయం రావడంతో అతని తల్లి మనసు మార్చుకుని ఉరువిడిచి ఎక్కడికీ పోనక్కర లేదుకదా అనే ఆలోచనతో మళ్లీ ఫోర్తుఫారంలో చేరమన్నది. ఆ విధంగా అతడు, రెండు నెలల క్రిందట యీ ఉద్యోగం వచ్చేవరకూ, రైలుప్రయాణం కూడా ఎన్నడూ చేయలేదు. ఇప్పుడు మెషీను ముందు కూర్చుని 'చకచక' టైపు చేస్తున్న కుసుమను చూస్తూవుంటే ఎంతో గొప్పగా వింతగా వుంది.

ఆమె ఆ కాయితం పూర్తిచేసి ఆఫీసరు గదిలోకి వెళ్ళింది. జోగినాథం లేచి మంచినీళ్ల కూజా దగ్గరికి వెళ్లి మూతతీసి లోపలి నీటివంక ఒక్కక్షణం చూశాడు. అలా చూస్తూ వుండగానే— తనవూరిలో.. తన చిన్నచెల్లెలు దాహంతో బాధపడుతూ కూర్చునివుంది. ఎండ నిప్పులు చెరుగుతున్నది. వెచ్చని గాలి రివ్వున వీస్తున్నది. యింటి ముందు బయట ప్రదేశంలో దూరంగా సుడిగాలి గిరున తిరుగుతున్నది. తన తల్లి సగం మాత్రమే నిండిన బిందెను బుజాన పెట్టుకుని ఎండలో యింటికి నడిచి వస్తున్నది. అన్నంతింటూ కూడా నీళ్లను పొదుపుగా వాడుకోవాలి అక్కడ.. స్నానం చేసేందుకు సరేసరి..ఆ ఉప్పు నీళ్లకు కూడా రేషనింగే— అతని కళ్ళు చెమర్చాయి. వెంటనే గ్లాసు నీళ్లతో నింపుకుని గడగడ త్రాగాడు.

తర్వాత వెనుదిరిగి చూసేసరికి ఎంతసేపటి నుంచీ తనను గమనిస్తున్నదో కుసుమ— అక్కడే చేతులు కట్టుకుని నిలబడి వుంది. ఆమె హఠాత్తుగా అతని చేతివంక చూసి "అరె! మీ చేతికి ఆరువ్రేళ్లున్నాయే!"అన్నది ఆశ్చర్యంగా.

జోగినాథం తన ఎడమచేతిని చూసుకుని నవ్వాడు.

కుసుమ "రండి.. అయిదున్నర దాటింది.. ఇళ్లకు చేరుకుందాం.." అంటూ దారితీసింది.

జోగినాథం ఆమె ననుసరించి మెట్లు దిగుతూవుండగా ఆమెమళ్లీ "చేతికి ఆరువ్రేళ్లుంటే అదృష్టం అని అంటారే.. నిజమేనా అండీ?"అని అడిగింది. అతడు నిట్టూర్చి "ఆఁ!! ఏం అదృష్టమో!"అన్నాడు.

ఇద్దరూ మెట్లు దిగి వీధిలోకి వచ్చి నడవటం ప్రారంభించారు. పేవ్‌మెంట్ మీద జోగినాథం కుసుమ పక్కగా నడుస్తున్నాడు. అతని కిది పూర్తిగా కొత్తఅనుభవం.. అతని కిప్పుడు పందొమ్మిదో యేడు. ఇంత వరకూ అతడు పధ్నాలుగేళ్ల తన చెల్లెలితో తప్ప పరాయి ఆడపిల్లతో ఎన్నడూ మాట్లాడి ఎరుగడు. ఇప్పుడు కుసుమ వంటి అందమయినదీ, నాగరికురాలూ అయిన పడుచు వెంట నడవటం అతనికి చాలా యిబ్బందిగానే వున్నా ఒక వింత ఆనందాన్ని కూడా యిస్తున్నాదని చెప్పకతప్పదు.

ఆమె నడుస్తూనే "ఏమండీ! ఇందాక పతిద్యయం మీమీద అలిగి వెళ్ళినట్టున్నారే!..."అన్నది.

"అవునండీ! పోయినవారంలో కూడా ఒకసారి యిలాగే జరిగింది. వాళ్ళిద్దరూ సినిమాలకూ, సర్కసులకూ పోతూ నన్నుకూడా రమ్మంటారు. నాదగ్గర వాటన్నిటికీ డబ్బెక్కడ వుంటుంది చెప్పండి.. మావూళ్లో యింటిదగ్గర మా అమ్మా, యిద్దరు చెల్లెళ్లూ వున్నారు. పెద్ద చెల్లెలికి పధ్నాలుగేళ్ళు.. దానికి పెళ్లి కావలసి వుంది.. చిన్న చెల్లెలు ఆరేళ్లది.. మాకు ఆస్తిపాస్తులేవీ లేవు. పైగా మావూళ్ల సంగతి తెలుసుగా మీకు? అక్కడ మంచినీళ్లు కూడా 'బిందె యింత'అని కొనుక్కోవాలి.. అందువల్ల నేను జీతం అందుకోగానే నాకోసం అతి తక్కువ డబ్బు వుంచుకుని మిగిలిన దంతా అక్కడికి పంపుతాను. అలాంటప్పుడు నాకు వీళ్లతో తిరగడం ఎలా సాధ్య పడుతుంది చెప్పండి.."అంటూ ఆగాడు జోగినాథం. కుసుమ జాలిగా అతని వంక చూసింది.

అతడు మళ్లీ "నాదగ్గర డబ్బు ఉండదని తెలిసి కూడా నన్ను తమతో రమ్మని బలవంతం చేస్తారు. అన్నిటికీ తమ డబ్బు పెట్టుకుంటా మంటారు. అదినాకు బొత్తిగా యిష్టం వుండదు. అలా అని చెబితే వాళ్లకు కోపం పొడుచు కొస్తుంది.."అన్నాడు.

కుసుమ నవ్వి "బాగానేవుంది.." అన్నది.

జోగినాథం "మీ రెప్పుడూ మా ప్రాంతాలకు రాలేదు కదండీ. అక్కడ నీటిచుక్క కనిపించదు. అన్ని కాలాల్లోనూ ఒకటే కరువు. బావులన్నీ ఎక్కడో పాతాళంలోకి వెళ్లి సొరంగాల్లాగా వుంటాయి. తొంగిచూస్తే అడుగున ఏమీ కనిపించదు. పెద్ద తాడు బొక్కెనకు కట్టి లోపలికి వొదులుతూ వుంటే ఎంతకూ నీళ్లు తగలవు. చివరకు బొక్కెన రాళ్లమీద పడి శబ్దం వినిపిస్తుంది. ఇక నీళ్లు ఎక్కడో చిన్నిగుంటలా కొద్దిగా వుంటాయి. బొక్కెనను అక్కడికి జరిపి నీళ్లు రాబట్టుకోవాలి.. మా ప్రాంతాలలో బొక్కెనలెలా వుంటాయో తెలుసా మీకు? కిరసనాయిలు డబ్బా లుంటాయి చూశారూ. వాటిని సగానికి తెగగొట్టి అతుకు వేసి నీళ్లను తోడుకు వచ్చేందుకు వీలుగా తయారుచేస్తారు. మధ్యాహ్నం పూట సూర్యుడు నడినెత్తి మీద వున్నప్పుడు మాత్రం బావిలోపల ఎక్కడో నీళ్లు తళతళా లాడుతూ కొంచెంగా కనిపిస్తాయి. అందరూ రాత్రి

వేళల్లో వెళ్ళి మరునాటికి కావలసిన నీళ్ళు తెచ్చుకోవలసిందే. తెల్లవారితే జల ఉండదు.. చుక్కగూడా మిగలదన్న మాట.." అంటూ ఆగి మళ్లీ నిట్టూర్చి "అందుకే నాకు మావూరంటే బొత్తిగా యిష్టంలేదు... మావాళ్లను కూడా యిక్కడికి తీసుకు వొచ్చేద్దా మనిపిస్తూ వుంటుంది అప్పుడప్పుడు.. అయినా నాకిక్కడ వొచ్చేది చాలవొద్దూ.."అన్నాడు.

కుసుమ అతడు చెప్పినదంతా కళ్ళు పెద్దవి చేసుకుని ఆశ్చర్యంగా విన్నది. అతడు మళ్లీ "రెణ్ణెల్ల క్రిందట నేను ఉద్యోగంలో జాయినయేందుకు వచ్చేటప్పుడు రైలు కృష్ణానది మీది నుంచి పరుగెత్తుతూ వుండగా చూసి ఆశ్చర్యంతో బొమ్మలా అయిపోయాను. మీరు నమ్మరేమో! అన్ని నీళ్ళు ఒక్కచోట చూడటం అదే నాకు మొదటిసారి.. చిన్నప్పుడెప్పుడో సముద్రం చూశానుగాని అది ఉప్పు నీళ్ళు కదా! ఇంత నదీ, యిన్ని నీళ్లా వున్నప్రాంతం సంపన్నం కాకుండా ఎలా వుంటుంది చెప్పండి? నీళ్ళు పుష్కలంగా ఉన్న చోటే నాగరకత.. మా ప్రాంతాలలో మనుష్యులు వొంటినిండా పోసుకునేందుకూ, కడుపునిండా తాగేందుకూ పుష్కలంగా నీళ్ళులేకనే చిక్కి పోతున్నారని నాకప్పుడప్పుడు అనిపిస్తూ వుంటుంది. ఇక్కడ నాకు చాలా హాయిగావుంది. రోజూ ఉదయం లేచీలేవగానే కృష్ణకు వెళ్లి స్నానం చేస్తాను. సాయంకాలం ఆఫీసు నుంచివెళ్లి వెళ్లగానే బావి దగ్గర మళ్లీ స్నానం చేస్తాను. ఇప్పుడెంతో హాయిగా ఆరోగ్యంగా వున్నాను.. అంతా నీళ్లలోనే వుంది సుమండీ.." అని ఒక్కక్షణం ఆగి "నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తి అయితే మాకూ నీళ్లకరువు తప్పుతుందనీ, మెట్ట పొలాలన్నీ మాగాణీ భూములవుతాయనీ అనుకుంటున్నారు. అది ఎప్పటికో.." అన్నాడు నిట్టూర్చి.

కుసుమ నవ్వి "అయితే మీనిర్వచనం ప్రకారం నీళ్లే నాగరికతకూ సౌభాగ్యానికీ మూలకారణం అన్నమాట.." అన్నది.

జోగినాథం తలవూపుతూ "అంతేనండీ.. నిస్సందేహంగా అందులో మీకేమీ అనుమానం అక్కర్లేదు.. అది కరెక్టు.." అన్నాడు.. కుసుమ ఆమాటలు విని మళ్లీ నవ్వింది.

అప్పటికి వారు చాలాదూరం నడచివచ్చారు. కుసుమ ఒకచోట ఆగి "ఇదే మాయిల్లు.. రండి.. ఒక్కనిముషం కూర్చుని పోదురుగాని.." అన్నది.

జోగినాథం "ఎందుకులెండి.. యిప్పుడు.."అంటూ ఏదో చెప్పబోయి ఆమెవంక చూసి ఆగి "సరే పదండి.."అన్నాడు. ఆమె నవ్వుతూ మెట్లెక్కి తలుపుతట్టి "మా అన్నయ్య యింట్లోనే వున్నాడనుకుంటాను.. మిమ్మల్ని పరిచయం చేస్తాను.." అన్నది.

ఆరేళ్ళ పలుచని ఎర్ర తేలువంటి పిల్ల తలుపు తెరిచి లోపలికి పరుగుతూ "అక్కయ్య వొచ్చింది.."అంటూ రాగం తీసింది. కుసుమా, జోగినాథం గుమ్మం లోపలికి వెళ్లేసరికి కిటికీ పక్కగావున్న కుర్చీల్లో ఒకదాన్లో ఎవరో కూర్చుని పేపరు చూస్తున్నారు. కుసుమ ఆటుతిరిగి "అన్నయ్యా! నువ్వెంత సేపయింది వచ్చి?"అని అడిగింది. ఆ వ్యక్తి పేపరు తప్పించి "ఇప్పుడే.. పది నిముషా లయివుంటుందేమో.."అంటూ జోగినాథం వంక చూశాడు. కుసుమ "వీరు మా ఆఫీసులోకి పని చేస్తున్నారు.. మిస్టర్ నాథ్ గారు.. ఇయన మాఅన్నయ్య కామేశం.. ఇక్కడ కాలేజీలో లెక్చరరు.."అని ఒకరి కొకరికి పరిచయం చేసి "మీరు కూర్చుని మాట్లాడుకుంటూ ఉండండి.. నేనిప్పుడే అయిదు నిముషాల్లో కాఫీలు పట్టుకొచ్చేస్తాను" అంటూ లోపలికి వెళ్లింది.

ఆ ఇద్దరూ ఎదురెదురుగా కూర్చున్నారు. ఆయనకు యిరవై అయిదేళ్లకు మించి వుండదు వయస్సు. సన్నగా, ఎర్రగా వున్నాడు. కళ్ళకొక రిమ్‌లెస్‌జోడు ఉంది. ధరించిన దుస్తులు చాలా నాగరికమైనవీ, ఖరీదైనవీనూ.. ఆయన పేపరు పక్కన వుంచి జోగినాథం ఉద్యోగాన్ని గురించీ, అతని చదువును గురించీ ఏవేవో ప్రశ్నలు వేశాడు.

కొద్ది నిముషాల్లో కుసుమ దుస్తులు మార్చుకుని చేతుల్లో కాఫీ కప్పులతో వచ్చింది. తానొక కుర్చీలో కూర్చుని ఆయిద్దరికీ కాఫీలు అందించి అన్నగారివంక తిరిగి "వీరు యివాళ చాలా చిత్రమైన విషయం చెప్పారన్నయ్యా. అది మీ కాననిస్టు లెవరూ యింతవరకూ కనిపెట్టలేదని బల్ల గుద్ది మరీ చెప్ప గలను.." అన్నది.

ఆయన తలఎత్తి చూసి నవ్వుతూ "ఏమిటో అది.." అన్నాడు. కుసుమ జోగినాథం వంక తిరిగి "చెప్పనా?"అని అడిగింది. జోగినాథం బిడియపడుతూ "ఎందుకు లెండి.? నాదంతా ఏదో పిచ్చివాగుడు.." అన్నాడు.

ఆమె "అలా కాదు .... చెప్పితీరాలి . .... అన్నయ్యా ! వీరంటారు కదా, నీళ్లే సర్వ నాగరికతకూ, సౌభాగ్యానికీ కారణంట ...... నీళ్ళు దొరకనిచోట్లా లేక తక్కువగా ఉన్న చోట్లా నాగరికత అభివృద్ధి చెందదనీ, ప్రజలు సంపన్నంగా ఉండరనీ కూడా వారి సిద్ధాంతం ..... ఇప్పుడు చెప్పు.... మీ ఎకనమిక్స్‌లో ఈ విషయం యింతకుముందు ఎవరైనా చెప్పారా? అన్నది.

ఆయన నవ్వాడు. కాఫీ కప్పు ఎదురుగా టీపాయ్ మీద ఉంచి "అది మంచి పాయింటే ..... మీరు చెప్పింది సబబుగానే ఉంది. కాదనను...." అన్నాడు.

కుసుమ జోగినాథం వైపు "చూశారా ? మీరు గెలిచారు" అన్నట్టు చూసింది.

కామేశం మళ్లీ తల పంకించి "కాని యిందులో ఒక తమాషా ఉంది ..... మీరు చెప్పినట్టు నదు లెక్కువగా ఉన్న చోట్లా, వర్షాలు ఎక్కువగా కురిసేచోట్లా తప్పకుండా అభ్యుదయం ఉంటుంది. కాని అవి విపరీతంగా ఉన్నా బాధే ...., ఉదాహరణకు చూడండి .... ఇప్పుడు నదులకు వరదలు వొస్తున్నాయి. పంటలన్నీ గంగపాలై పోతాయి. లెక్కలేనంత మంది ప్రజలు నిర్వాసితులై పోతారు .... అకాలంలో వర్షాలు

కురిశాయనుకోండి .... అప్పుడూ పంటలు ధ్వంసమే ..... కాబట్టి ఎటూ గట్టిగా రూలింగ్ యిచ్చేందుకు వీలులేదు ...." అంటూ ఆగి, "అన్నట్టు మీ వూరేది ?" అని అడిగాడు.

జోగినాథం చెప్పాడు. కుసుమ అందుకుని "వాళ్ల వూరును గురించి యిప్పుడు నాకు చెప్పారన్నయ్యా! అటువంటి వూళ్ళు కూడా ఉంటాయా అని ఆశ్చర్యపోయాను. నీళ్ళు కూడా కొనుక్కుంటే గాని దొరకవుట అక్కడ ..... తాగేందుకూ, వొంటికి పోసుకునేందుకూ అన్నిటికీ నీటి కరువుట" అన్నది.

ఆయన అందులో విచిత్ర మేముంది ? అలా ఎన్నో వూళ్ళున్నాయి మన దేశంలో .... అన్నట్టు ఈ సందర్భంలో మా స్నేహితు డొకాయన చెప్పిన విషయం ఒకటి గుర్తు వస్తున్నది. ఆయనను అటువంటి వూళ్లో ఎవరో భోజ నానికి పిలిచారుట ..... అదే మొదటిసారి ఆయన ఆవూరికి వెళ్లడం ..... భోజనం చేస్తూ వుండగా "మంచినీ ళ్లేవిటు"ని ప్రక్కవారిని అడిగాడట ..... వాళ్ళు ఆయన విస్తరి ముందున్న ఒక చిన్న గాజుగ్లాసును చూపించి "అవిగో అవే మంచినీళ్ళు" అన్నారట ... ఆయన గ్లాసులో తెల్లగా తేనె కలిపినట్టున్న ఆ ద్రవం చూసి అంతవరకూ ఏదో డ్రింకు అనుకున్నాట్ట ..... తీరా చూస్తే అవే మంచినీళ్ళు....." అన్నాడు.

కుసుమా, జోగినాథం ఒక్కసారిగా నవ్వారు. తర్వాత జోగినాథం లేచి "ఇక వెళ్ళి వస్తానండీ......" అన్నాడు. అన్నా చెల్లెళ్లిద్దరూ అతన్ని గుమ్మందాకా సాగనంపి ఉండిపోయారు.

అతడు నెమ్మదిగా నడిచి రూము చేరుకుని తాళం తీశాడు. లోపలికి వెళ్ళి చీకటిపడుతున్నందున లైటువేసి స్నానానికి సిద్ధమైనాడు. చిన్న కొల్లాయి గుడ్డ ఒకటి కట్టుకుని భుజంమీద మరో టవల్ వేసుకుని బావిదగ్గరికి చేరుకున్నాడు. మొదట ఒక పెద్ద బాల్చీ నిండా నీళ్లు తోడుకుని నూతి పళ్లెంమీద కూర్చున్నాడు. హాయిగా, ప్రశాంతంగా ఒక దాని తర్వాత ఒకటిగా మూడు పెద్ద బొక్కెనల నీళ్ల పోసుకున్నాడు.

ఇంట్లో మరో భాగంలో అద్దెకున్న ఒక గుమాస్తా భార్య నీళ్లకోసం చేతిలో బిందెతో తమ వాటా గుమ్మంలో నిరీక్షిస్తూ నిలబడివుంది. అత డామెను చూడనేలేదు. ఆమె లోలోపల "అతడు తనను చూసి కూడా త్వరగా తెమలక బాధపెడుతున్నాడ" ని అనుకుంటున్నది.

జోగినాథం నెమ్మదిగా అరగంట తర్వాత నూతి పళ్లెం దిగి యివతలికి వచ్చాడు. ఇంటి యజమానురాలు అంతసేపటినుంచీ యీ తంతు అంతా చూస్తూనే ఉంది. ఆమె నెమ్మదిగా అతన్ని మందలిస్తూ "అలా పనివేళా గంటల తరబడి నూతి పళ్లెంమీద కూర్చుండిపోతే ఎలా చెప్పు నాయనా ? ఆవిడ యిందాకటినుంచి నీళ్లకోసం తొందర పడుతూ నీ కారణంగా అక్కడే నిలబడి ఉంది .... చూడ లేదూ ?" అన్నది.

జోగినాథం నాలిక కరచుకుని ప్రక్కకు తిరిగిచూసి "పొరపాటయి పోయిందండీ...." అన్నాడు.

అతడు తర్వాత రూములో కొద్దిసేపు విశ్రాంతిగా కూర్చున్నాడు. ఆవేళ జరిగిందంతా మననం చేసుకున్నాడు. తన రూమ్ మేట్స్ యిద్దరితోనూ తాను అలా వ్యవహరించడంలోని ఉచితానుచితాలు బేరీజు వేసుకుని ఆలోచించాడు. చివరకు తానేమీ తప్పు చెయ్యలేదని నిర్ణయించుకున్నాడు. అయినా ఆ యిద్దరూ తనకు మంచి మిత్రులు. అటు ఆఫీసులోనూ వాళ్ళు చేస్తున్న సహాయం అమూల్యమైనది. ఇద్దరూ చక్కగా చదువుకున్నవాళ్ళు. డబ్బున్నవాళ్ళు. వాళ్లకు తనమీద అంత అభిమానం ఉండటం తన కెంతో మంచిది. దాన్ని తాను పోగొట్టుకోకూడదు.

ఉమాపతి గోదావరిజిల్లావాడు. మంచి సంపన్న కుటుంబంలో పుట్టినవాడు. అతని తండ్రికి పిత్రార్జితమైన తోటలూ, పొలాలూ, దొడ్లూ పుష్కలంగా ఉన్నాయి. అతను బుద్ధిగా చదువుకున్నాడు. ఏ క్లాసులోనూ తప్పలేదు. డిగ్రీ రాగానే చిన్నదే అయినా దొరికిన ఉద్యోగంలో వెంటనే చేరాడు. అతడు యింటికి నయాపైసా కూడా పంపనక్కర లేదు. ఇక లక్ష్మీపతి ఉన్నాడంటే అతని తండ్రి మొదట్లో బాగా కష్టాలు పడ్డవాడు. అయితేనేం ఆయనకు డబ్బు విలువ, తత్వమూ బాగా తెలుసు .... కొంత డబ్బు సంపాదించిన తర్వాత యిక మన తెలివితేటలూ ప్రమేయమూ లేకుండానే ఆ డబ్బు అదిగా పెరిగిపోతుందనీ అందులకి అతిశయోక్తి ఏమాత్రమూ లేదనీ ఆయన దృఢవిశ్వాసం .... కావలసిందల్లా కొంచెం లౌక్యమనీ, డబ్బు మదుపు పెడితే అది పెరిగేచోట్లూ, తరిగే చోట్లూ ఉన్నాయనీ, పెరిగేచోట్లు గమనించి మదుపుపెట్టే మాత్రపు తెలివితేటలు చాలుననీ, యిక ఆవైపు కూడా అప్పుడప్పుడు తప్ప చూడనక్కర లేదనీ ఆయన అంటూ ఉంటాడు. ఆయన అలాగే చేసి ఆస్తులు అలాగే పెంచాడు కూడా. లక్ష్మీపతి ఆయనకు ఒక్కడే కొడుకు. ఇంట్లో అతని మాటకు ఎదురన్నది లేదు.

జోగినాథం మనస్సులో కుసుమ మెదిలింది. ఆ అమ్మాయి ఎంతో అందంగా ఉంటుంది. దబ్బపండు వంటి శరీరచ్ఛాయ ఆమెది. ఆమె నాజూకైన సన్నని బంగారపు వుల్లలవంటి వేళ్ళు టైపు మెషీను మీద చకచక కదులుతూ ఉంటే చూసేందుకు ఎంతో అద్భుతంగా ఉంటుంది. ఆమె కన్నులు చెంపకు చేరెడేసి ఉండి తళతళ లాడుతున్న నీళ్లను గుర్తుకు తెస్తాయి. ఆమె అన్న కామేశం అంత చిన్న వయస్సులో కాలేజీ లెక్చరరు అయినాడంటే ఎంతో తెలివి గలవాడయి ఉండాలి. ఆయన కూడా స్ఫురద్రూపి.

జోగినాధనికి తన చెల్లెలు గుర్తుకు వచ్చింది. ఆ అమ్మాయి కూడా ఒక వన్నె తక్కువగా కుసుమ రంగే. అయినా నీళ్ల కరువు మూలంగానూ, తగిన పోషణ లేకనూ ఆపిల్ల జబ్బుపడి లేచిన దానిలా ఉంటుం దెప్పుడూ.... కాని ఆ అమ్మాయి తెలివితేటలూ, హొర్నూ, పనిపాటలలో నేర్పూ

చెప్పుకోదగ్గవి. దానికి పెళ్లిచేసి ఒక యింటిదాన్ని చేస్తే తమ బాధ్యత సగం తగ్గుతుంది. దానికి ఎక్కడ వ్రాసిపెట్టి ఉందో మరి..... అది కాస్తా అయితే తన తల్లినీ, చిన్న చెల్లెలినీ తీసుకుని యిక్కడికి మకాం మార్చేయవచ్చు. అప్పటికి తమ శని తప్పినట్టవుతుంది. అయినా ఆడపిల్ల పెళ్లి మాటలతో, ఆలోచనలతో అవుతుందా ? దాని కెంత కష్ట పడాలి ? కట్నం పేచీ లేకుండా ఎక్కడైనా సంబంధం కుదిరితే బాగుండిపోను .... అయినా తన పిచ్చి గాని, కట్నం లేకుండా ఎవడు పెళ్లికి ఒప్పుకుంటున్నా డీ రోజుల్లో !

అతడు లేచాడు. రూముకు తాళంవేసి వీధిలోకి వచ్చి నడవటం ప్రారంభించాడు. అక్కడొకటీ, అక్కడొకటీ వీధి దీపాలు వెలుగుతున్నాయి. దూరంగా ఎక్కడో రైలు 'గుప్పు గుప్పు' మని పొగ వొదులుతూ పరుగెత్తి పోతున్నది.

జోగినాథం కామేశ్వరి గురించే ఆలోచిస్తున్నాడు. అతన్నీ, తన చెల్లెలినీ మనసులో పక్కపక్కనే నిలబెట్టుకుని మాటిమాటికీ ఆలోచనలో మునిగిపోతున్నాడు. చివరకు హోటలు ముందుకు వచ్చేసరికి తటాలున ఏదో నిశ్చయానికి వచ్చాడు.

అతడు హోటల్లో ఒక బల్లముందు కూర్చుని ఆకు కడుగుతూ ఉండగా పక్కనే ఉన్న యిద్దరు సర్వర్లు "మంచినీళ్ల పంతులుగారొచ్చారు ...." అనుకుని నవ్వుకున్నారు. తర్వాత వారిలో ఒకడు ఏకంగా ఒక జార్ నిండా నీళ్ళుతెచ్చి జోగినాథం పక్కనే బల్లమీద ఉంచి వడ్డన ప్రారంభించాడు. అతడు భోజనం చేసినంతసేపూ వా రిద్దరూ ప్రతి పూటా చేసినట్టే ఆపూట కూడా అత డెన్ని గ్లాసుల నీళ్ళు తాగాడో లెక్కపెట్టారు. చివరకు లెక్క ఎక్కడో తప్పింది. ఒకడు పదిహేను గ్లాసులనీ, మరొకడు పధ్నాలుగు గ్లాసులు మాత్రమే నని కొంచెంసేపు తమలో తాము తర్కించుకుని తర్వాత నవ్వుకున్నారు.

జోగినాథం భోజనం ముగించి చెయ్యి కడుక్కుని రూము చేరుకున్నాడు. లైటువేసి పక్కమీద వాలి కాయితమూ కలమూ తీసుకుని ఇంటికి ఉత్తరం రాశాడు. మామూలు యోగక్షేమాలతోబాటు అతడు కుసుమ అన్నగారి విషయం కూడా అందులో ప్రస్తావించి "కులగోత్రాల వంటి చిక్కులు రాకుండా ఉంటే, ఆయన ఒప్పుకుంటే నిజంగా మన చెల్లాయి అంత అదృష్టవంతురాలు ఎక్కడా ఉండదనే నా విశ్వాసం.... నేను రేపే అన్ని వివరాలూ తెలుసుకుని మళ్లీ నీకు వ్రాస్తాను....." అని వ్రాశాడు.

తర్వాత కాయితం, కలం ప్రక్కనే ఉంచి ఆవులించి చిటికెవేసి వెల్లకిలా పడుకుని పైకప్పువంక చూస్తూ ఉండి పోయాడు. అంతలోనే అతని కళ్లు మూతలు పడ్డాయి.

పది గంటలు దాటిన తర్వాత సినిమా నుంచి వచ్చిన యిద్దరు మిత్రులూ గాఢంగా నిద్రపోతున్న జోగినాథం వంక చూసి నవ్వుకున్నారు. ఉమాపతి మెల్లిగా "తలుపు బార్లగా తీసిపెట్టి ఎలా దిట్టంగా నిద్రపోతున్నాడో చూడు ...." అన్నాడు లక్ష్మీపతితో.

లక్ష్మీపతి కిటికీ పక్కగా పడివున్న కార్డును చేతిలోకి తీసుకుని చూసి "ఇది నీదేనయ్యా .... ఇవాళే వచ్చినట్టున్నది" అన్నాడు. ఉమాపతి దాన్ని అందుకుని చదివి అవతల పడేస్తూ "నాన్నగారు వ్రాశారు ..... మళ్లీ వరద లొస్తున్నాయట. ఈఏడు కూడా పంటల రాలుబడి తక్కువగా ఉంటుందేమో నని వ్రాశారు. అది ప్రతి రెండు మూడేళ్లకూ మామూలే. వరద రావడం నిండు పంటను ఊడ్చిపెట్టి పోవడం..... మా పొలాలు కొన్నిటికి పరవాలేదు కాని, కొన్ని మాత్రం బాగా దెబ్బతింటాయి" అంటూ నిద్రపోతున్న జోగినాథం వంక చూసి మళ్లీ "ఈ గురువుగారి కేమో నీళ్ల కరువు. త్రాగేందుకూ నీళ్లచుక్క కూడా లేక నీళ్ల అవస్థపడుతూ ఉంటారు. మాకేమో వరదలు .... ఎంత తమాషాగా ఉందో చూడు" అన్నాడు.

లక్ష్మీపతి ఏమీ మాట్లాడలేదు. నిశ్శబ్దంగా దుస్తులు మార్చుకుని జోగినాథంవైపు చూస్తూ ఉమాపతితో "ఉత్తరం రాస్తున్నాడయ్యా యింటికి...." అని మళ్లీ ఏదో రహస్యం చెబుతున్నట్టు నెమ్మదిగా "పోయిన నెలలో అనుకుంటాను..... అంటే యిక్కడికి వచ్చిన పది పదిహేను రోజులకు అతను యింటికి వ్రాసిన ఉత్తరం ఒకటి నేను చదివాను. తప్పే అనుకో. అయినా ఎంత తమాషాగా ఉందో తెలుసా ! అబ్బ ! దారుణం : ఒక మతి చలించినవాడు రాసినట్టున్నది ఆ ఉత్తరం ....ఇక్కడ ఒంటినిండా పుష్కలంగా కావలసినన్ని నీళ్ళు పోసుకుంటున్నాననీ, కరువుతీరా నీళ్ళు తాగుతున్నాననీ, తన వొంటి రంగు మారి ఆరోగ్యం కూడా పూర్వం కంటె ఎంతో బాగున్నదనీ వ్రాశాడు. పైగా నీళ్ళు తాగేటప్పుడు తల్లినీ, చెల్లెళ్లనూ తలుచుకుని తలుచుకుని మరీ తాగుతాట్ట .... అదిగాక అంతకుముం దెప్పుడో వాళ్ల వూళ్లో చిన్న చెల్లెలు నీళ్ల బిందె దొర్లించి కష్టపడి తెచ్చుకున్న నీళ్లన్నిటినీ నేలపాలు చేసిందని తల్లి ఆ చిన్నపిల్లను చావ బాదిన వృత్తాంతం అతను నాకు చెప్పాడు. ఉమాపతీ ! అది నువ్వు విన్నట్టయితే నిలువునా వొణికిపోయి ఉండేవాడివి ...." అన్నాడు.

జోగినాథం నిద్రలో మరోవైపుకు తిరిగి పడుకున్నాడు. ఉమాపతి మెల్లిగా ఆ ఉత్తరం అందుకుని మడత విప్పాడు. ఇద్దరూ మోకాళ్లమీద కూర్చుని ఆ ఉత్తరాన్ని చివరి వరకూ చదివి మొహాలు చూసుకున్నారు. తర్వాత దాన్ని యథాపూర్వకంగా మడిచి యథాస్థానంలో ఉంచి ఇవతలికి వచ్చారు.

ఉమాపతి నెమ్మదిగా గొంతు తగ్గించి "అంటే మనం వెళ్లిన తర్వాత కుసుమ వెంట వాళ్ల యింటికి వెళ్లాడన్న మాట." అన్నా డొక విధంగా చూస్తూ.

లక్ష్మీపతి "అంతే అయిఉండాలి మరి ...." అని బదులు పలికాడు.

* * * *

మరునాడు ఆఫీసులో జోగినాథం సాయంకాలం నాలుగు గంటలు దాటేవరకూ కుసుమను పలకరిద్దామని ఎంతగానో ప్రయత్నం చేశాడు. కాని, వీలుపడలేదు. నలుగురూ అక్కడే ఉండటమూ, పైగా కుసుమ చాలా హడావిడిగా పనిలో మునిగిఉండటమూ అందుకు ముఖ్య కారణాలు.

నాలుగున్నరకే అతడు తన పని పూర్తిచేసుకుని తీరికగా కూర్చున్నాడు. ఉమాపతికి ఆరోజున అసలు పని లేనట్టే లెక్క. అతని సీటు తీరే అంత. పని బహు కొద్దిగా మాత్రమే ఉంటుంది. లక్ష్మీపతి మాత్రం ఏవేవో ఫైళ్ళు తిరగవేస్తూ రిఫరెన్సులకోసం తంటాలు పడుతున్నారు.

జోగినాథం నీళ్ల కూజావంక చూశాడు. మళ్లీ అటూ యిటూ చూశాడు. నెమ్మదిగా లేచి కూజా దగ్గరికి వెళ్లి నీళ్ళు గ్లాసులోకి వంచుకున్నాడు. చేతితో గ్లాసు పైకెత్తి పట్టుకుని ఒక్క క్షణం చూసి తర్వాత గడగడ త్రాగాడు.

అది గమనించి శర్మ అనే మరో గుమాస్తా ఏమీ పని లేక తీరికగా కూర్చుని ఉండి, నవ్వి, "మన కూజాలో నీళ్లన్నీ ఒక్క జోగినాథంగారే కాజేస్తున్నారండీ .... అదేమి చిత్రమో ప్రతి అరగంటకూ ఆయనకు దాహమవుతూ ఉంటుంది" అన్నాడు.

వైనతేయరావు అనే మరో గుమాస్తా ఫైలులో నుంచి తల పైకెత్తి చూసి "బహుశా అదేదో జబ్బయి ఉంటుంది" అని మళ్లీ తల దించుకున్నాడు.

జోగినాథం నవ్వేందుకు ప్రయత్నించాడు. ఉమాపతీ, లక్ష్మీపతీ, ఒకరి వంక ఒకరు చూసుకున్నారు.

ఇంతలో టైపు మెషీను చప్పుడు ఒక్క నిముషం ఆగినట్టు కాగా జోగినాథం తల ఎత్తి చూశాడు. కుసుమ బల్ల మీద చెయ్యి ఉంచుకుని తీరికగా, విశ్రాంతిగా కూర్చునిఉంది. జోగినాథం నెమ్మదిగా ఆమె దగ్గరికి వెళ్లి గొంతు తగ్గించి "ఏమండీ .... మీతో కొంచెం మాట్లాడాలి ...." అన్నాడు.

ఆమె నవ్వి "మాట్లాడండి....." అన్నది.

అత డామె ముందు కుర్చీలో కూర్చుని ఏదో చెబుదామని నోరు తెరిచేసరికి తన కొంప ఏదో మునిగినట్టు ఆఫీసరు గదిలో బెల్ 'గర్' మని మ్రోగింది. ఆమె హడావిడిగా లేచి "తర్వాత మాట్లాడుకుందాం .... ఆఫీసరు పిలుస్తున్నారు. అన్నట్టు యివాళ మేము సినిమాకు వెడదా మనుకున్నాం .... మీరూ రండి, మా అన్నయ్య సంతోషిస్తాడు. పైగా మీరు మాట్లాడనూ వచ్చు....." అంటూ హడావిడిగా ఆఫీసరు గదిలోకి వెళ్లింది.

జోగినాథం కొద్ది క్షణాలు అలాగే కూర్చుండిపోయాడు: ఇవాళ ఏది ఏమయినా సరే వారితో యీ విషయం ప్రస్తావించి వివరాలు తేల్చుకుని ఉత్తరం వ్రాయాలి. నిజంగా యీ సంబంధం కుదిరితే అమ్మ ఎంతగా సంబరపడిపోతుందో!

కుసుమ మరో అయిదు నిమిషాలకు గాని యివతలికి రాలేదు. వస్తూనే ఒక కాయితం చూపించి జోగినాథంతో "ఇదుగో యీ ఒక్కటీ అందజేస్తే వెంటనే మనం వెళ్లిపోవచ్చు ...." అంటూ చకచక పనిచెయ్యసాగింది.

జోగినాథం 'అలాగే' అని తలవూపి లేచి నెమ్మదిగా నడిచి యివతలి వరండాలో నిలబడి జేబులో చేతులుపెట్టి వెదికాడు. రెండు రూపాయ నోట్లు కనిపించాయి. అతడు తేలికగా నిట్టూర్చి మళ్లీ తన సీటులోకి వచ్చి కూర్చున్నాడు. ఉమాపతి లక్ష్మీపతితో ఏదో రహస్యం మాట్లాడుతున్నాడు.

ఉన్నట్టుండి ఉమాపతి శర్మ అనే గుమాస్తాతో "మీ రిందాక జోగినాథం నీళ్ళు తాగడం గురించి మాట్లాడారు చూశారూ! మీరా విషయంలో మరికొంత తెలుసుకోవడం అవసరం .... వాళ్ళ ప్రాంతంలో పూళ్లన్నీ ఎప్పుడూ కరువుతో కొట్టుకుపోతూ ఉంటాయి. ఎక్కడా నీళ్ల చుక్క కూడా దొరకదు. కడుపునిండా తాగేందుకు, ఒంటినిండా పోసుకునేందుకూ నీళ్లుండవు. తాగేందుకు బిందెడు నీళ్ళు మూడణాలు పెట్టి మరీ కొనుక్కోవాలి. అటువంటి వూరి నుంచి వొచ్చినవాడికి ఇక్కడ పుష్కలంగా నీళ్ళు దొరికేసరికి కోతికి కొబ్బరికాయ దొరికినట్టేకదా" అన్నాడు.

జోగినాథం "అవును. భగవంతుడి దయ అలా ఉంది. మాకు నీళ్ళు లేవు.... మీరేమో వరదల్లో మునిగిపోతున్నారు" అన్నాడు.

ఉమాపతి "భగవంతుడి దయ అనకు .... అధర్మం పెరిగిపోతే అంతే ..... నీటిచుక్క దొరకదు...." అన్నాడు.

జోగినాథం ఉడుకుమోతుతనంతో "వరదలు రావడానికి కారణం అధర్మం కాక మరేమిటో...." అన్నాడు.

లక్ష్మీపతి అందుకుని "అలా కాదు. మీది మరీ దారుణం ..... నువ్వే చెప్పావు ఒకసారి గుర్తుందా ? మీ చిన్న చెల్లాయి నీళ్లబిందె దొర్లించడం సంగతి" అన్నాడు.

శర్మ, వైనతేయరావూ ఒక్కసారిగా "ఎవరా చెల్లాయి? ఏమా కథ ? అది చెప్పండి ముందు" అన్నారు.

లక్ష్మీపతి జోగినాథం వంక తిరిగి "చెప్పనా ?" అని అడిగి తర్వాత అతని సమాధానం కోసం ఎదురు చూడకుండానే ప్రారంభించాడు. "అతనే చెప్పాడు వొచ్చిన కొత్తల్లో .... ఒకసారి వాళ్ల యింట్లో జరిగిన విషయమే .... రాత్రి అంతా కష్టపడి బావికీ యింటికీ తిరిగి ఒక బిందెడు మంచి నీళ్లు సంపాయించుకున్నారుట. మర్నాడు ఉదయం వాళ్ల చెల్లెలు—చిన్నపిల్ల—గ్లాసు ముంచుకోబోగా ప్రమాదవశాత్తూ బిందె దొర్లిపోయింది. నీళ్లన్నీ నేలపాలై పోయాయి. ఆడపిల్ల భయంతో బిగుసుకుపోయి నిలబడిపోయింది. తల్లివచ్చి రెక్క పుచ్చుకుని గొడ్డును బాదినట్టు చావగొట్టిందట .... ఇలా అని అతనే చెప్పాడు నాకు. కావలిస్తే అడగండి...."

జోగినాథం వంచిన తల ఎత్తలేదు. ఉమాపతి "ఇక ఇతను స్నానం ప్రారంభించాడా .... అది గంటల తరబడి సాగుతుంది!.... ఒక్కొక్క బొక్కెనే తోడుకుని 'యిది చెల్లెలికి....', 'యిది అమ్మకు', 'యిది చిన్న చెల్లాయికి' అని గొణుక్కుంటూ ఒంటిమీద పోసుకుంటాడండీ .... తాగేటప్పుడూ అంతే .... గ్లాసు పైకెత్తి పట్టుకుని చూస్తాడు మీరు గమనించారో లేదో. ఆ చూడటం నలక లున్నాయేమోనని మాత్రం కాదు .... కళ్ళు మూసుకుని ఏమిటో గొణుక్కుని మరీ తాగుతాడు. రోజూ తెల్లవారుతుండగానే కృష్ణకు బయలుదేరి పోతాడు. సాయంకాలంపూట యింట్లో దాని ఉండనే ఉంది. ఇక హోటల్లో సర్వర్లందరూ యితని కేం బిరుదు యిచ్చారో తెలుసా! 'మంచినీళ్ల పంతులుగారు'. మొన్న నేను విన్నాను." అన్నాడు.

శర్మ "ఇది వింత కేసే" అన్నాడు.

వైనతేయరావు వంకరగా నవ్వి గంభీరంగా "ఇదొక మానసిక వ్యాధి అయిఉంటుంది" అన్నాడు.

జోగినాథానికి కోపం ముంచుకు వచ్చింది. వీళ్లందరూ తనను గేలిచేసి ఏడిపించేందుకు ప్రయత్నిస్తున్నారనే విషయం స్పష్టంగా తెలిసిపోయింది. ఆ క్రౌర్యం అతడు భరించలేక పోయాడు. అందర్నీ నిప్పులు చెరిగే కళ్లతో చూశాడు. కుసుమ అన్నీ విన్నది కాబోలు సానుభూతితో చూస్తున్నది.

వైనతేయరావు ఊరుకోకుండా "ఏది ఏమయినా అలా బొత్తిగా" అని ఏదో అనబోతూఉండగా, జోగినాథం పెద్దగా "ఇక తమరేమీ మాట్లాడకండి సార్. ఇప్పటికే చాలా అసహ్యంగా మాట్లాడారు .... మిమ్మల్ని అర్థంచేసుకోగలను లెండి .... అంత బొడ్డూడని పసివాణ్ణేమీ కాదు...." అన్నాడు.

శర్మ అనే గుమాస్తా కలగజేసుకుని "అదేమిటండీ .... మిమ్మల్ని యిప్పుడేమన్నామనీ మీకు అంత కోపం? ఏదో నీళ్లు ఎక్కువగా తాగుతారనీ ...." అంటూఉండగా ఇక జోగినాథం ఊరుకోలేకపోయాడు. విసురుగా సీటులో నుంచి లేచి "ఆపం డిక .... మీరింకా అలాగే మాట్లాడుకుంటూ పోతే ఏం చేస్తానో నాకే తెలీదు." అంటూ ఉద్రేకంతో ఊగి పోతూ "అవునండీ .... నేను నీటిచుక్క దొరకని వూళ్లో పుట్టి పెరిగాను. ఇక్కడ నీళ్లు చూసేసరికి కోతికి కొబ్బరి కాయ దొరికినట్టు అయింది. విపరీతంగా తాగుతున్నాను. అంతేకాదు..... కావలిస్తే మూర్ఖవాడిలా పొట్ట పగిలేట్టు నీళ్లు తాగుతాను. పిచ్చివాడిలా గంటల తరబడి స్నానం చేస్తాను. లేకపోతే ఏదన్నా మంచి ముహూర్తం చూసి కృష్ణలో పడి చస్తాను. అయితే మాత్రం? మీకెందుకు?" అన్నాడు.

తర్వాత కణతలు పట్టుకుని సీటులో కూర్చుండి పోయాడు. అంతటా నిశ్శబ్దమైపోయింది. ఎవరూ పెదవి కదపలేదు. కుసుమ టైపు చేయడంలో మునిగిపోయిఉంది. జోగినాథం యింత జరిగిన తర్వాత ఎప్పుడో అక్కడినుంచి పారిపోయి ఉండేవాడు. కాని, యివాళ కుసుమతో, ఆమె అన్నగారితో మాట్లాడాలి. అది తప్పదు.

ఒక పావుగంట తర్వాత చాలామంది యిళ్లకు వెళ్లి పోయారు. కుసుమ టైపు మెషిను మీద కవరువేసి సిద్ధమై జోగినాథం వంక చూసింది.

అతడు లేచి నిలబడి రుమాలుతో మొహం తుడుచుకుని ఆమెవెంట బయలుదేరాడు. ఇద్దరూ మెట్లు దిగుతూ ఉండగా ఆమె జోగినాథంతో "మీరెందు కలా యిరిటేట్ అవుతారు?" అన్నది.

జోగినాథం వెంటనే సమాధానం చెప్పలేదు. కాని, ఒక్క క్షణం ఆగి "అలా మనిషిని నిస్సహాయంగా చేసి వెర్రి వాణ్ణి చేస్తుంటే ఎలా సహించడం చెప్పండి? ఏమయినా కారణం ఉందా అంటే ఏమీలేదు. నా చేతికి ఆరు వేళ్లున్నాయి కదా! అది పట్టుకుని నన్ను నలుగురిలో ఎగతాళి చేస్తుంటే ఎలా ఉంటుంది చెప్పండి? అవును నిజమే .... మా వూళ్లో, మా ప్రాంతమూ పట్టి దౌర్భాగ్యపువే. నీళ్ల కరువు ఉంటే దౌర్భాగ్యం కాక మరేమిటి? అయినా మధ్య నేనెందుకు వెర్రివాణ్ణవుతాను. 'ఇదొక మానసిక వ్యాధట'. ఆ వైనతేయరావు పిలక నాచేతిలో ఉంది. ఏమనుకుంటున్నాడో ఏమో? బోడిపేరు వాడూనూ .... ఈసారి యిలా ఏమన్నా వాగితే ఆఫీసరుతో చెప్పేస్తాను...." అన్నాడు.

కుసుమకు నవ్వు వచ్చింది కాని ఆమె నవ్వలేదు. అతడు ఆఫీసరుకు చెబుతా నన్నప్పుడు, తోటి పిల్లవాడిమీద కోపగించి మేష్టారితో రిపోర్టు చేస్తానని బెదిరించే బడి పిల్లవాడు గుర్తుకువచ్చా డామెకు.

ఇద్దరూ కుసుమ ఇంటిముందు ఆగేసరికి లోపలి నుంచి గోలగా నవ్వులు వినిపిస్తున్నాయి. కుసుమ తలుపు తట్టి అతనివైపు చూసి "ఎవరో బంధువులు దిగినట్టున్నారు" అన్నది.

తలుపు తెరిచిన చిన్నపిల్ల మామూలుగానే "అక్కయ్య వొచ్చిందో" అని రాగంతీస్తూ లోపలికి వెళ్లింది.

హాల్లో చాపమీద కూర్చుని క్యారమ్సు ఆడుతున్న వ్యక్తులను చూడగానే కుసుమ ఆనందంతో పరుగెత్తుకు వెళ్లి "అరె! నువ్వెప్పుడొచ్చావ్ వసంతా?" అని అడిగింది. జోగినాథం గుమ్మం దగ్గరగా నిలబడి ఉండిపోయాడు. ఆ వసంత అనబడే అమ్మాయి "ఇప్పుడే .... ఒక అరగంట అయిందేమో.. లోపల అమ్మ ఉంది...." అన్నది.

జోగినాథం ఆశ్చర్యపోతూ చూశాడు. అంత అందమైన స్త్రీని అతడు ఇంతవరకూ చూడలేదు. ఆమె ఎడమ చేతి కొక వాచీ, కుడిచేతికి మూడో నాలుగో బంగారు గాజులూ ఉన్నాయి. ఆ బంగారురంగు ఆమె ఒంటిమీద బొత్తిగా కనిపించకుండా ఉంది. నల్లని చిలిపి ముంగురులు కొన్ని నుదుటిమీద పడుతూవుంటే వాటిని ఎడమచేతి వ్రేళ్లతో పైకి తోసుకుంటున్న దామె. నవ్వుతున్నప్పుడలా

బుగ్గలు ఎంతో అందంగా సొట్టలు పడుతున్నాయి. ఆమె వయస్సు పదహారేళ్లకు మించి ఉండదు.

కుసుమ జోగినాథంతో "సారీ! యిలా రండి మీరు..... కూర్చుని ఉండండి, యిప్పుడే వస్తాను..." అన్నది.

కామేశం ఆ మాటలు విని తల తిప్పి చూసి "అరె! మీరా వచ్చారా? గుడ్. ఇలా కూర్చోండి...." అంటూ మళ్లీ తన ఆటలో లీనమై పోయాడు.

కుసుమ కొద్ది నిముషాల్లో యివతలికి వచ్చింది. జోగినాథం అక్కడే వారి ఆట చూస్తూ కూర్చుని ఉన్నాడు. కుసుమ ముందుకు వచ్చి "అన్నయ్యా! యివాళ మరి సినిమా ప్రోగ్రాం ఏలారా?" అని అడిగింది.

కామేశం "దానికేం?" అన్నాడు. అంతలో లోపలి నుంచి ఒక ముప్ఫయి అయిదేళ్ల స్త్రీ వచ్చి "అవును..... దానికేం? మీరు సినిమా మానుకోవడ మెందుకూ?

అందరూ సరదాగా వెళ్లిరండి .... నేను యింటిదగ్గర వంటా వార్పూ చూసుకుంటాను" అన్నది.

కుసుమ "ఇంకా టైముందిగా .... రెండాట లాడి పోదాం .... నేనూ అన్నయ్యా ఒక పార్టీ ...." అన్నది.

వసంత కాయిన్స్ తీస్తూ "అలా వీల్లేదు. నేనూ మీ అన్నయ్యా ఒక పార్టీ" అన్నది.

కుసుమ "నెరజాణవే నువ్వు..... అప్పుడే అన్నయ్యను కలిపేసుకుంటున్నావ్. అగవమ్మా కొంచెం గుర్రాన్ని కళ్లెయ్. కోర్సు పూర్తికానీ...." అన్నది.

జోగినాథం చిత్రమైన అవస్థలో పడ్డాడు. అంతలో మళ్లీ కుసుమ అతన్ని ఉద్దేశించి "సరే రండి .... పార్ .... మీరూ నేనూ ఒక పార్టీట .... కూర్చోండి" అన్నది.

అతడు సిగ్గుపడుతూ "నాకు బొత్తిగా రాదండీ .... ఎలా రి.... అన్నాడు.

కామేశం "ఫరవాలేదు .... ఇక్కడ అందరూ ఇంట ర్నేషనల్ ప్లేయర్స్ .... ఎవరికీ బాగా రాదు.... ఏదో సరదాగా ఆడుకుంటాం కానీ మరోకటి కాదుగదా! రండి రండి.." అన్నాడు.

జోగినాథం బిడియపడుతూ కూర్చున్నాడు. టాస్ వేయగా కుసుమకు అనుకూలంగా పడింది. ఆమె జోగినాథానికి స్ట్రయికర్ అందించి "ఊఁ! కానివ్వండి" అన్నది

జోగినాథం ఎడమచేతితో స్ట్రయికర్‌ను బలంగా కొట్టాడు. వసంత ఆశ్చర్యంతో కళ్లు పెద్దవిచేసి "మై గాడ్! ఈయన ఎడమచేతి వాటం .... పైగా ఆరువేళ్ళున్నాయి" అన్నది.

కుసుమ "అన్నట్టు మరిచేపోయాను. వసంతా! వీరు మిస్టర్ నాథ్ అని మా ఆఫీసులో పనిచేస్తున్నారు" అని పరిచయం చేసింది. వసంత చేతులు జోడించింది.

ఆమె మళ్లీ జోగినాథంతో "ఈమె మా మేనత్త కూతురు. పేరు వసంత..... సెకండియర్ బి. ఎస్‌సి. ఫుల్‌టీ మిసెస్ కామేశం .... అంటే మాకు కాబోయే వదినగా రన్నమాట. వాళ్లకు తొందరగానే ఉంది గాని మా మామయ్య అండ్ కో పెద్దవాళ్లందరూ 'ఆఁయ్! తొందర పనికిరాదు. ముందర పిల్ల చదువు పూర్తి కావాల్సిందే. అందాకా అలా ఉండండి, వేరువేరుగా కలలు కంటూ' అని మందలించారు. అదన్నమాట అసలు విషయం" అన్నది.

వసంత బుగ్గలలో గులాబులు విచ్చుకున్నాయి. కొంచెం ఎర్రబడిన మొహంతో ఆమె కుసుమను మోచేత్తో పొడిచి మెల్లగా "ఛీ వూరుకోవే!" అన్నది.

కామేశం నవ్వి జోగినాథంతో "మావాళ్ల మరీ చాలు గాయి పిల్లలండీ బాబూ!" అన్నాడు.

జోగినాథం దిగాలుపడి పోయాడు. ఒక్కసారిగా మని షిలో సత్తువ సన్నగిల్లి నీరసం ఆవరించింది. ఆట ఆడుతూనే వున్నాడు కాని మనసంతా చికాకై పోయింది. సినిమా రీలులో లాగా తన వూరూ.. చెల్లాయిలూ, తల్లీ, గడ్డి కూడా మొలవని చవిటినేలా, రాళ్లు పగిలే ఎండలూ, నెప్పుని యీదురు గాలి, నీళ్లులేని బావులూ, నీళ్లకోసం పాట్లూ, ఎక్కడ చూసినా నీరసంగా నిస్తేజంగా వుండే జనమూ.. మనసులో తిరిగి పోయారు.

ఒక ఆట పూర్తిఅయింది. కుసుమ "కాబోయే దంపతులు గెలిచారు.. సరే యిక యిదికట్టి పెడదాం.. టైమవుతున్నది. అన్నయ్యా! నువ్వు తయారేనా?" అన్నది.

కామేశం లేచి "జస్ట్ వన్ మినిట్" అంటూ లోపలికి వెళ్లాడు. జోగినాథం కూడా లేచి చొక్కా గుండీలు సర్దుకుంటూ "నేనుకూడా వెళ్లి వస్తానండీ.." అన్నాడు.

కుసుమ ఆశ్చర్యపోయి "అదేమిటండీ.. మీరు కూడా వస్తానన్నారుగా.. పైగా మా అన్నయ్యతో ఏదో మాట్లాడా లన్నారు కదా?" అన్నది.

జోగినాథం ఏం చెప్పాలో తెలియక "ఏమీ లేదులెండి" అని వూరుకున్నాడు. కుసుమ "మరి?" అని రెట్టించి అడిగింది.

జోగినాథం యిక అక్కడ నిలబడలేక పోయాడు. "ఏమీ లేదులెండి.. కాలేజీ విషయాలేమైనా చెబుతారేమోనని కాస్సేపు తీరికగా మాట్లాడుదా మనుకున్నాను. వీలైతే నైట్ కాలేజీలో చేరుదామని వుందనుకోండి.. అంతకంటె మరేమీ లేదు. మరోసారి మాట్లాడుతాను లెండి.. అదేమి పెద్ద ముఖ్య విషయం కాదుగా! వెళ్లి వస్తానింక.." అంటూ వీధిలోకి వచ్చేశాడు. కుసుమ అలాగే ఆశ్చర్యంతో నిలబడిపోయింది.

అతడు నేరుగా రూముకు వచ్చేశాడు. తలుపులు తెరిచే వున్నాయి. ఉమాపతి, లక్ష్మీపతి, చెరోక పక్కా పడుకుని కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటున్నారు. వాళ్ళిద్దరూ ఒకచోట చేరితే యిక కబుర్లకూ నవ్వులకూ లోటుండదు. ఏవేవో కాలేజీ కబుర్లు చెప్పుకొని విరగబడిన నవ్వుకుంటూ వుంటారు.

ఠ

జోగినాథం రావడం చూసి యిద్దరూ కబుర్లు ఆపేశారు. అతడు లోపలికి వెళ్లివెళ్లటంతోనే పక్కమీద వాలిపోయి కళ్లు మూసుకున్నాడు. ఉమాపతి లక్ష్మీపతి వంక చూసి కన్నుగీటుతూ "ఏమిమాకు వెళ్లలేదా గురువుగారూ?" అని అడిగాడు జోగినాథాన్ని. జోగినాథం "లేదంటూ" తల అడ్డంగా వూపాడు.

తర్వాత అతడు లేచాడు. క్రితం రాత్రి తాను యింటికి వ్రాసిన ఉత్తరం యివతలికి తీసి దాన్ని ముక్కలు ముక్కలుగా చింపి కిటికీలో నుంచి విసిరి వేశాడు. ఆ కాయితపు ముక్కలు గాలి విసురుకు చెల్లాచెదరై ఎటెటో ఎగిరి పోయాయి.

ఒక అరగంట దాదాపు నిశ్శబ్దంగానే గడిచింది. తర్వాత ఉమాపతి లేచి "నాకు ఆకలి వేస్తున్నది బాబూ, హోటలుకు వచ్చేవాళ్లు రావచ్చు.." అన్నాడు. జోగినాథం కదలలేదు. లక్ష్మీపతి లేచి చొక్కా తొడుక్కుని "ఉఁ! పోదాం పద.." అన్నాడు.

ఇద్దరూ గడిదాటి బయటికి వచ్చారు. ఉమాపతి ఆగి అనుమానంగా "మనం తప్పు చేస్తున్నా మనిపిస్తున్నదోయ్.. అతని సంగతి మనకు తెలుసుకదా! కేవలం అమాయకుడు. ఒకసారి వెళ్లి 'రమ్మ'ని పిలుద్దాం. రాకపోతే సరే.. యిద్దరం వెళ్లిపోదాం.. అప్పుడు మన తప్పేమీ వుండదు.." అన్నాడు.

తర్వాత మళ్లీ యిద్దరూ లోపలికి వెళ్లి జోగినాథాన్ని తట్టి లేపారు. అతడు కళ్లు తెరిచిచూసి "ఏమిటండీ?" అని అడిగాడు.

ఉమాపతి "మీరు వచ్చినప్పటి నుంచీ ఎన్నడూ యిలా మేము వేరుగా వెళ్లలేదు. మీరూ రండి భోజనానికి.."అన్నాడు.

జోగినాథం కళ్లలో ఎందుకో నీటిపొర నిలిచింది. అతడు గద్గదస్వరంతో "నా కీపూట ఆకలి లేదండీ.. నిజం.. మీరిద్దరూ వెళ్లిరండి.." అన్నాడు.

ఉమాపతి అతని నుదుట చేయి ఉంచిచూసి "ఒళ్లు కొంచెం వేడిగానే ఉంది. అయినా అన్నం మానటం మంచిది. కాదేమో!" అన్నాడు.

జోగినాథం తలవూపి "కాదులెండి.. నేనీపూట ఏమీ తినలేను. మీరిద్దరూ వెళ్లిరండి.."అన్నాడు. దానితో వారిద్దరూ మరేమీ మాట్లాడకుండా వీధిలోకి వెళ్లిపోయారు.

జోగినాథానికి ఎందుకో ఏడుపు పొంగి వచ్చింది. అతడింతవరకూ ఎన్నడూ తల్లినీ చెల్లెళ్లనూ వొదిలి వున్నవాడుకాదు. ఈ రెణ్ణెల్ల నుంచీ అతడు ఎన్నో పర్యాయాలు ఏడుపును దిగమింగుకున్నాడు. కాని యివాళ ఆఫీసులో జరిగిన ఉదంతం అతన్ని కలతపెట్టింది. కాని అతడు దాన్ని అట్టే లెక్కచేయలేదు. దాని తర్వాత కుసుమ యింట్లో జరిగినదంతా అతన్ని చాలా క్షోభ పెట్టిం . తాను చిన్నటినుంచీ చాలా ప్రేమగా కట్టుకున్న పేకమేడలు ఒక్కసారిగా కూలిపోయినట్టయింది. అతడు లోలోపల దుఃఖంతో దిగులుతో మెలికలు తిరిగి పోతూ అలాగే పడుకున్నాడు. అంతలోనే అతనికి గాఢంగా నిద్ర పట్టింది.

*   *   *

అతడు కళ్లు విప్పిచూసే సరికి రూములో చిన్న బల్బు వెలుగుతున్నది. ఎక్కడా ఏ అలికిడీ లేదు. ఉమాపతి, లక్ష్మీపతి యిద్దరూ గురకలు పెడుతూ నిద్రపోతున్నారు.

అతడు లేచి బల్లమీదవున్న ఉమాపతి రిస్టువాచీ చేతిలోకి తీసుకుని చూశాడు. అయిదు గంటలకు యిరవై నిముషాలు తక్కువ.. ఇక కదిలితే మంచిది. తెల్లగా తెల్లవారిన తర్వాత నదికి బయలుదేరి వెళ్లటం యిక మానుకోవాలి. లేకపోతే నీళ్లతో చిక్కే.. త్వరగా వెళ్ళి వాళ్లు లేవకముందే రూముకు చేరుకోవడం మంచిది. క్రిందటిరోజు ఆఫీసులో జరిగిన ప్రహసనం మళ్లీ జరగదని హామీ ఎక్కడా లేదు కదా! అతడు త్వరత్వరగా రూము తలుపులు దగ్గరకు లాగి మెట్లు దిగి వీధిలోకి వచ్చాడు. క్రింది మెట్లు దిగుతూ వుండగా ఎందుకో గుండె జలదరించింది.

వీధి చివర ఒక కుక్క అరుస్తున్నది. ఏయింటి పెరటిలోనో దాక్కునివుండి గుడ్లగూబ ఒకటి వుండి వుండి కూత పెడుతున్నది. వీధులలో అక్కడొకరూ, అక్కడొకరుగా జనం పలుచగా తిరుగుతున్నారు.

జోగినాథం మనసులో తనవూరూ, నెర్రెలు విచ్చిన పొలాలూ, రాత్రిళ్లు నిద్రలేకుండా నీళ్లు మోస్తూ తిరుగుతున్న తల్లిచెల్లెలూ, నీళ్లబిందె దొర్లించి చావు దెబ్బలుతిన్న చిన్నచెల్లెలూ, నిస్తేజంగా నీరసంగా వుండేజనమూ, వెచ్చని హోరుగాలీ, రాళ్లుసగిలే ఎండలూ, గిర్రున సినిమారీలు లాగా తిరిగిపోయాయి. లోలోపల "నాగార్జునసాగర్ పూర్తి అయితే మాకూ యీబాధలు తప్పి బోలెడన్ని నీళ్లు వస్తాయి.." అనుకున్నా డతడు.

నదిమెట్లు క్రింద రొద చేస్తూ ప్రవహిస్తున్నది. దూరంగా వంతెన మీద ఏదో రైలు చప్పుడు చేస్తూ పోతున్నది. చల్లని, జీవంపోసే గాలి హాయిగా తెరలుతెరలుగా వీస్తున్నది. మెట్ల దగ్గర అప్పుడే నలుగురైదుగురు మనుషులు స్నానం చేస్తున్నారు. వారిలో ఒకాయన ఏవేవో మంత్రాలు చదువుతున్నాడు. పలుచని వెలుతురు మందంగా వ్యాపిస్తున్నది.

జోగినాథం చొక్కా విప్పి తువాలు కట్టుకుని నెమ్మదిగా నీళ్లలోకి దిగాడు. చల్లని నీళ్లు మంచులాగా మోకాళ్లకు పైగా తగిలేసరికి శరీరం పులకరించి నట్టయింది. మరొక అడుగుముందుకు వేసి మెట్టు దిగాడు. హాయిగా, "ఎంత బావుంది!" అనుకున్నాడు. మరొక అడుగు ముందుకు.. తానిలా హాయిగా మనసు తీరా స్నానం చేస్తూవుంటే తనవూళ్లో తన వారెలా వున్నారో అనే బాధ అతని మనసులోకి వచ్చింది. అమ్మ

రాత్రి అంతా నీళ్లకోసం తిప్పలుపడి యిప్పుడే కొద్దిగా నడుం వాల్చి వుంటుంది..

మరోక మెట్టు క్రిందికి.. అతని మనసులో తనవూరూ, తనయిల్లూ, యింటి వెనక ఎండిన పున్నాగ చెట్లూ, పొలాలూ, నీళ్లులేని బావులూ, అన్నీ మళ్లీ సినిమారీలు లాగా తిరిగిపోయాయి. మరి "నాగార్జునసాగర్ పూర్తి అయితే మాకూ యిబ్బందులు తప్పుతాయి. అప్పుడు కావలసినన్ని నీళ్ళు.." అనుకున్నాడు. మరోక అడుగు ముందుకు వేశాడు. మెట్ల మీద నిలబడ్డవారు ఆందోళనతో అతని వంక చూస్తున్నారు.

అంతలో అతని కాళ్ళు తేలిపోయాయి. అతని గుండెలు ఝల్లు మన్నాయి. "అరె! భగవంతుడా! ఏమయి పోతున్నాడు తాను? ఎందుకలా యీ నీళ్ళు తనను లాక్కుపోతున్నాయి? గుండ్రంగా రంకుల రాట్నం తిరిగినట్లవుతున్నదేమిటి? కాళ్లకు మెట్లు అందవేం? ఆ మనుషులు కనిపించరేం? తన కళ్లకీ నీళ్ళు అడ్డు వస్తున్నాయెందు చేత?

దూరం నుంచి కేకలు లీలగా వినిపించాయి. నీళ్ళు తన చుట్టూ ఒక గోడ కట్టినట్టుగా ఏర్పడి వొడ్డునున్న వారిని చూసేందుకే వీలు లేకుండా చేశాయి.

అతడు గొంతు పెద్దది చేసి అరిచాడు. వెంటనే అతని గొంతులోకి నీళ్ళు పోయాయి. రెండవసారి మళ్లీ అలతోపాటు కొంచెం పైకి వచ్చినందువల్ల కాబోలు అతనికి దూరంగా మనుష్యులు కనిపించారు. అతడు చేతులెత్తి నమస్కారం చేసి "బాబోయ్ రక్షించండి..! అని అరిచాడు. దానితో మరి కాసిని గుటకలు వేశాడు. అతని మనసులో క్షణంలో సగంలో మళ్లీ సినిమా రీలులో లాగా తనవూరూ, తల్లి చెల్లెళ్లూ, నీళ్ల లేని బావులూ, నెర్రెలువిచ్చిన పొలాలూ, వెచ్చని హోరుగాలి.. తన స్నేహితులిద్దరూ, కుసుమా, కామేశం.. కాంతి వేగంతో మనసులోకి వచ్చి వెళ్లిపోయారు.

అంతలోనే అతడు మూడవసారి పైకి లేచాడు. మళ్లీ చేతులెత్తి ఒడ్డున ఉన్నవారి నుద్దేశించి "బాబోయ్! రక్షిం.." అన్నాడు. అంతే. ఆ చేతులు నీరసంగా వాలిపోయాయి. పగబట్టిన పాముల సమూహంలా నీళ్లు అతన్ని 'రివ్వు'న లోపలికి లాక్కుపోయాయి. కొద్ది క్షణాల్లోనే ఒడ్డున ఉన్నవారికి అక్కడ ఏమీ కనిపించలేదు.

నది తన దోవన తాను భీకరంగా పరవళ్లు తొక్కుతూ ప్రవహించి పోతున్నది. ఎక్కడో కొన్ని వందలమైళ్ళ దూరంలో మారుమూల పల్లెటూళ్లో పూరియింట్లో నిద్రలోవున్న తల్లి ప్రేగు కదిలింది.

ఎవ్వనివాకిట నిభమదపంకంబు రాజభూషణ రజో రాజి నడగు
నెవ్వని చారిత్ర మెల్లలోకములకు నొజ్జయై వినయంబు నొఱపు గఱపు
నెవ్వని కడకంట నివ్వటిల్లెడుచూడ్కి మానిత సంపద లీనుచుండు
నెవ్వని గుణలత లేడు వారాసుల కడపటి కొండపై గలయ బ్రాకు
నతడు భూరి ప్రతాప మహాప్రదీప దూరవిఘటిత గర్వాంధకార వైరి
వీరకోటీర మణిఘృణి వేష్టితాంఘ్రితలుడు కేవల మర్త్యుడే ధర్మసుతుడు!

(తిక్కన — విరాట)

నాగభూమి :
నాడు - నేడు

తిరుమల రామచంద్ర


నాగరాష్ట్రం భారతదేశంలోని రాష్ట్రాలన్నిటికన్న చిన్నది. ఇది మన దేశం ఈశాన్య సరిహద్దులో బర్మా లోయ—అస్సాం కొండల మధ్యన, బ్రహ్మపుత్ర—ఎగువ బర్మాల మధ్యన ఉంది. నాగపర్వత ప్రాంతం, ట్యుయెన్‌సాంగ్ సరిహద్దు డివిజను, ఈశాన్య సీమా ప్రాంతం కలిపి ఈ నాగరాష్ట్రం ఏర్పడింది.

1947 లో స్వాతంత్ర్యానంతరం నాగపర్వత ప్రాంతం-తత్పరిసర ప్రాంతం, ఈశాన్య సీమా ప్రాంతంతో కలిపి "నాగా అనాది ప్రాంతం" అని భారత ప్రభుత్వం పేరు పెట్టింది. తర్వాత దానిని "ట్యుయెన్‌సాంగ్ సరిహద్దు డివిజను" అని పేరు మార్చింది. భారత రాజ్యాంగం ఆరవ అనుబంధం ప్రకారం ఈ ప్రాంతానికి ప్రత్యేక సౌకర్యాలు కలిగించినా, ఇది అస్సాం రాష్ట్రంలో భాగంగానే ఉండేది.

ప్రతి వర్గం సర్వతోముఖాభివృద్ధి భారత ప్రభుత్వం ఉద్దేశం గనుక నాగజాతివారికి సాధ్యమైనంత హెచ్చుగా స్వయంనిర్ణయాధికారం ఇవ్వడం కూడ దానికి అభిమతమే, కనుక, నాగజాతి నాయకుల అభ్యర్థన మేరకు నాగ ప్రాంతాని-



చాంగ్ నృత్యం



బాధ్యతాయుత ప్రభుత్వం గల ప్రాంతంగా చేయడానికి నిర్ణయించడంవల్ల 1957 లో పార్లమెంటు నాగా పర్వత—టుయెన్‌సాంగ్ ప్రాంతం చట్టం ఆమోదించింది. అప్పటి నుంచి అస్సాం గవర్నరే రాష్ట్రపతికి ప్రతినిధిగా భారత ప్రభుత్వం అన్యప్రాంత వ్యవహారాలశాఖ కింద ఈ ప్రాంతాన్ని పరిపాలించేవాడు.

1960 జులై 26 వ తేదీన నాగా పీపుల్స్ కన్వెన్షన్ అధ్యక్షుడు డాక్టర్ ఇమ్‌కోంగ్లిబా ఆవో నాయకత్వాన 15 మంది నాగా నాయకులు అప్పటి భారత ప్రధాని శ్రీ జవాహర్‌లాల్ నెహ్రూను కలుసుకుని 16 అంశాల మెమోరాండంను అందజేసి తమకు రాష్ట్రప్రతిపత్తి కావాలని కోరారు. దాని ఫలితంగా నాగా పర్వతాలు—టుయెన్‌సాంగ్ ప్రాంతాలతో "నాగా

నాగభూమి : నాడు - నేడు



అంగామీ నృత్య నిపుణులు

ల్యాండ్" అన్న పేరుతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడింది. అస్సాం గవర్నరే ఈ రాష్ట్రానికి గవర్నరుగాను, అస్సాం హైకోర్టు అధికారాలే దీనికి వర్తించేట్లు నిర్ణయమైంది. భారత ప్రభుత్వం నాగాల్యాండ్ అనే 16 వ రాష్ట్రం నెంకొల్పడానికి నిర్ణయించిందని అప్పటి ప్రధాని శ్రీ జవాహర్‌లాల్ నెహ్రూ 1960 ఆగస్టు 1 వ తేదీన పార్లమెంటులో ప్రకటించారు. రెండు సంవత్సరాల తర్వాత 1962 ఆగస్టులో ఆయన లోక్‌సభలో నాగాల్యాండ్ బిల్లు ప్రతిపాదించాడు. 1963 డిసెంబరులో నాగరాష్ట్రం కోహిమా రాజధానిగా ఏర్పడింది. రాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్ అధికారరీత్యా ప్రారంభోత్సవం జరిపారు.

నాగాల జనసంఖ్య దాదాపు ఆరు లక్షలు. వీరిలో 3,70,000 మంది నాగరాష్ట్రంలోను, తక్కినవారు ఈశాన్య సరిహద్దులోని తిరప్ డివిజన్‌లోను, మణిపూర్ రాష్ట్రంలోను నివసిస్తారు. నాగరాష్ట్రం వైశాల్యం 6366 చదరపుమైళ్ళు. జనసాంద్రత చదరపుమైలుకు 62.5 మంది. దిమాపూరు ప్రాంతం తప్ప తక్కిన ప్రాంతమంతా పర్వతమయం. ఈ పర్వతాల ఎత్తు సముద్రమట్టానికి 2,000 అడుగులు మొదలు 10 వేల అడుగుల వరకు ఉంటుంది. నాగ గ్రామాలు హెచ్చుగా కొండలమీదనే ఉంటాయి. కనుక నాగస్త్రీలు నీటికోసం కొండచరియలకు దిగి వెదురు గొట్టాలతో నీరు మోసుకుని వెళ్ళుతుంటారు. వర్షపాతం సంవత్సరానికి దాదాపు 160 పదునులు. పంటలు సులభంగా పండుతాయి.

నాగాలకు ఈ పేరు ఎందుకు వచ్చిందో చెప్పడం కష్టం. మన పురాణాల్లోను, బౌద్ధ జాతక కథలలోను నాగజాతివారొ కనిపిస్తారు. కాని, వారికీ వీరికీ ఏమీ సంబంధం కనిపించదు. నాగాలు ఎలాటి అరమరలు లేక నగ్నంగా తిరిగే అలవాటు కలవారు కాబట్టి నగ్నశబ్దం నుంచి అయినా నంగా, నాగా అని ఈ పేరు ఏర్పడి ఉండవచ్చు.

ఈ నాగాలలో కోన్యాక్, మాంగ్సేన్, అంగామీ, అవో, రెంగ్మా, సేమా, చాంగ్, లోథా, మిష్మి, ఖాసీ, మికీర్, కచారి, అభోర్ డాఫ్లా, కెంగ్యూ మొదలయిన 16 తెగలవా రున్నారు. వీరి సంస్కృతి ఇండోనేసియా—మలయా సంస్కృతితో కలుస్తుంది. వీరి భాషలు టిబెటో—బర్మీ కుటుంబానికి చెందిన వని భాషా శాస్త్రజ్ఞులు అన్నారు.

నాగా ప్రాంతం ప్రకృతిసౌందర్యం నాగజాతి నవాల సౌందర్యంలాగే వర్ణనాతీతం. పట్టు తివాచీలు పరచినట్లుండే పచ్చని పచ్చికబయళ్ళు, రంగురంగుల రకరకాల పూలచెట్లు విచ్చలవిడిగా పెరిగి పండిన ఫలవృక్షాలు, ఈనగాచి కుప్పలు తిప్పలుగా పడి చీకిపోతున్న ఫలాలు, ఆకాశమంటే వృక్షపంక్తి— కన్నులవిందు కలిగిస్తూంటాయి. అడవి ఏనుగులు, ఖడ్గ మృగాలు, ఎలుగుబంట్లు, పులులు, చిరుతలు మొదలయిన క్రూరమృగాలతో భయంకరంగానూ ఉంటుంది.



నాగుల స్వాగత నృత్యం



నాగ రాష్ట్రావతరణోత్సవంలో రాష్ట్రపతి రాకకోసం వేచిఉన్న నేటి నాగకన్యలు

నాగాలలో సంతాన వృద్ధి చాల తక్కువ. రాష్ట్రం జన సాంద్రతే దీనికి నిదర్శనం. బాల్య వివాహాలు అసలే ఉండవు. స్త్రీలకు, పురుషులకు సమాన ప్రతిపత్తి ఉంది. స్త్రీలు కూడ పురుషులలాగ బలిష్ఠులై ఎంతటి శ్రమకైనా ఓర్చు కుంటారు. నాగాలు చాలా స్వతంత్రబుద్ధి గలవారు. ఇవ్వ కాలు ఉండవు. వీరిలో అతిథి మర్యాద హెచ్చు. బంధువులను చూడడానికి వెళ్లినా వట్టి చేతులతో వెళ్లరు.

పూర్వస్థితి

మన దేశంలోని దొమ్మరులు, ఏనాదులలాగ నాగాలలో మగవారు నడుముకు మూతక దుప్పటులు చుట్టుకుంటారు. దీనిలోనే కత్తులు, బాకులు చెక్కుకుంటారు. ముందు వెనుక వేలాడే కౌపీనం ధరిస్తారు. **ఎలుగుబంటితోలు** సంచిలో అవసరమైన సామానులు **వేసుకొని భుజంమీద** వేలాడ వేసు కుంటారు. పిల్లవాడు రెండు నెలలవాడు కాగానే నడుమును చిన్న పటకాతో బిగిస్తారు. మూడు సంవత్సరాలు కాగానే కత్తి వేలాడే చిన్న కొయ్య చట్రాన్ని పిల్లవాని నడుముకు కడు తారు. ఈ చట్రం బిగించేరోజు పండుగ గూడ చేసు కుంటారు. స్త్రీల వస్త్రధారణ కూడా అత్యల్పం. నడుము నుంచి మోకాళ్లవరకు చిన్న తుండుగుడ్డను చుట్టుకుంటారు. నాభిపై భాగమంతా నగ్నమే. పూసలపేర్లు పయోధరాలను కొంత కప్పుతాయి. కంచుకంవంటిదికాని, వస్త్రవల్కలాల

వంటిది కాని, ఎలాటి ఆచ్ఛాదనా ఉండదు. కొన్ని తెగలలో యువతులు పాలిండ్లను గుడ్డ పేలికలతో బిగించుకుంటారు. పచ్చంటే పడి చస్తారు ఆడవాళ్ళు. ముఖం, పాలిండ్లు, చేతులు, మెడ, పిక్కలపై పచ్చ పొడిపించుకుంటారు. స్త్రీలు వళ్లకు దాచిపొడి రాచుకొనడంవల్ల పండ్లు నల్లబడి ఉంటాయి. చెవులకు బరువైన ఇత్తడి ఉంగరాలు వ్రేలాడగట్టుకుంటారు. పిల్లలు గడ్డి పావడలు ధరించడమూ, ఆకులు కుట్టి ధరించడమూ కద్దు. పురుషులు రకరకాల రంగు రంగు ఈకలతో, ఆకులతో తలలను అలంకరించుకుంటారు. నాగాలు పిల్లలను కొట్టనే కొట్టరు. చాలా ప్రేమతో పెంచుతారు.

నాగ గ్రామాలు కొండలపైనే హెచ్చుగా ఉంటాయి. అవి దగ్గర దగ్గరగా ఉండవు. కొండచరియలలో ఒకే వరుసలో ఎదురు బదురుగా ఇండ్లు కట్టుకుంటారు. ఇవి కొట్టాల వంటివి. నేలకు నాలుగైదడుగుల ఎత్తున లావుపాటి గుంజలు నాటి, వాటిపైన వెదుళ్లతో ఇళ్లు కట్టుకుంటారు. తర్వాత రైలుపెట్టెలలో లాగ బాసడెత్తు మన్ను, కంకర పోసి ఇండ్లలో నేలను సిద్ధపరచుకొంటారు. ప్రతి ఇంట్లో రెండు గదులుంటాయి. ముందరిగది మధ్యన నిప్పు నిరంతరం మండుతూ ఉంటుంది. ఇండ్లపైకి ఎక్కడానికి చిన్న నిచ్చెనలు వేసి ఉంటాయి. గుంజలు నాటిన స్థలంలో పందులు, పశువులు పొర్లాడుతూ దుర్భరమైన కంపు. ఇండ్లముందు అర్ధచంద్రాకారంగా కట్టిన అరుగులపై ఆడవారు ముచ్చట్లాడుతారు.

గ్రామాలచుట్టూ వెదురుకంచెలు వేసుకుంటారు. ఊరి సింహద్వారం తలుపులు పికాండమైన పెద్ద చెక్కలతో చేస్తారు. పూర్వపురోజుల్లో ఈ ద్వారంకావలాకు యువక వీరుల ఇండ్లు ద్వారం పక్కనే ఉండేవి.

16 నాగ తెగలలోను ర రకాల ఆచార వ్యవహారాలున్నాయి. కాని అందరిలోను ప్రధానంగా కనిపించే సామాన్య స్వభావం ధైర్యసాహసాలు, అతిథి సత్కారం, సంగీత నృత్యా



లోథా నర్తక బృందం



సేమా నృత్యం

లలో ఆసక్తి, నిరంతరోత్సాహం, ఇంతయినా కాయకష్టానికి వెనుకాడక పోవడమూను.

నాగాల ఆహారపద్ధతి విచిత్రంగా ఉంటుంది. వరి, జొన్న ప్రధానాహారధాన్యాలు. తిండిగింజ లయిపోతే పండ్లతో, అడవిగడ్డలతో గడుపుతారు. ఆవు మాంసం కూడా నిషిద్ధం కాదు. తొండలు, కప్పలు, ఏనుగులు, అడవిదున్నలు తింటారు. కొండముచ్చు మాంసం చాల ఇష్టం. కుక్క మాంసం మరీ యిష్టం. కాని, స్త్రీలకు కోడిగుడ్లు, పాలు నిషిద్ధాహారం. పురుషులకు కూడా నిషిద్ధమే. కనుక ఆవులను—మిథాన్‌లను—బలులకు వాడుతారు.

నేత, సేద్యం నాగాలలో ప్రధాన వృత్తులు. నేతరాని నాగస్త్రీయే ఉండదు. ప్రతి యింటిలోను మూరెడు వెడల్పు మగ్గాలుంటాయి. మగ్గం అవతలి కొనను వెదురుగోడకు బిగించి ఇవతలికొనను నడుముకు బిగించుకుని దుప్పట్లు నేస్తారు. వాటిని మరొక్కదానితో కలిపి దుప్పట్లు కుట్టుకుంటారు. ప్రతి ఇంటికీ అవసరమైన గుడ్డలు వారే నేసుకుంటారు. వెదురుచాపలు కూడా నేస్తారు. రాట్నాలకంటే కదుర్లు వాడడమే విశేషం.

నాగాలు సేద్యాన్ని "ఝూమ్" అంటారు. నాగ ప్రాంతంలో వర్షపాతం విస్తారం గనుక నీటికోసం తాపత్రయంలేదు. వ్యవసాయభూములు గ్రామానికి చాల చేరువనే ఉంటాయి. అడవిని తగులబెట్టి, ఆ బూడిదను భూములలో చల్లి పారలతో తిరుగగొట్టి వాన పడగానే విత్తుతారు. రెండేళ్ల కొకమారు భూమిని మారుస్తారు. కోతలప్పుడు మహానందంతో ఉంటారు. సారాయి, బియ్యపు సారాయి చాల యిష్టం. ఈ సమయంలో ఆనందంతో నృత్యాలు చేస్తారు.

నాగాలకు వేట చాలా యిష్టం. వేటలో వారు చూపే క్రౌర్యం భయంకరం. వివిధ నృత్యాలు, ముఖ్యంగా యుద్ధ నృత్యాలు వీరిలో విశిష్టమైన కళ. నాగాలు తరచు యుద్ధాలు చేసే వీరజాతి గనుక రణభేరిని అతి విచిత్రంగా సిద్ధపరు

స్తారు. 25 అడుగులు పొడవైన పెద్ద మాను మొదలును తొలిచి రెండు కొనలు చర్మంతో కప్పి వాడుతారు. దీనిపైన దెబ్బ వేస్తే కొన్ని మైళ్ల వరకు వినిపిస్తుంది. 1879 లో జరిగిన తిరుగుబాటులో ఈ రణభేరి నినాదం విని ఆంగ్లేయులు దద్దరిల్లిపోయారు.

నాగాలలో కుల కట్టుబాట్లు తక్కిన అనాదిజాతులలో లాగ చాల దృఢమైనవి. ఉమ్మడి గ్రామ కార్యానికి ప్రతి వారూ కలిసి రావలసిందే. కలిసిరానివారికి జరిమానాలు పడతాయి. పరాయి గ్రామస్థులు వచ్చినప్పుడు పందిని చంపి ముఖ్య భాగం వారికి ఇవ్వడం ఆచారం. ఉమ్మడి అతిథి అభ్యాగతులను ఆదరించడానికి విడిగా చందాలు పోగుచేస్తారు. ఈ చందా సొమ్మును "సారు" అంటారు. స్త్రీలకు వారసత్వం లేదు. పురుషసంతానం లేక కుమార్తెలే ఉంటే లాంఛనంగా ఆస్తి తండ్రినుంచి ఖరీదు చేసినట్లు తతంగం జరుపుతారు. ఈవిధంగా సంక్రమించిన—విక్రయమూలంగా సంక్రమించిన—ఆస్తిని స్త్రీలు తమ ఇష్టప్రకారం వాడుకోవచ్చు. వితంతువుకు ఇల్లు, ధాన్యం జీవితాంతం ఉంటాయి. వితంతువుకు సంతానం వుంటే, వారి పోషణకూ ఆస్తి కేటాయిస్తారు. దత్తు అనేది లేదు.

పది సంవత్సరాల వయస్సు రాగానే బాలబాలికలు తల్లిదండ్రుల ఇండ్లలో పడుకోరు. వీరు ఉండడానికి ప్రతి గ్రామంలోను విడివిడిగా ఇండ్లు ఉంటాయి. వీటిని "మోరంగ్" అంటారు. వీటి పోషణ భారం గ్రామం ఉమ్మడిది. ఇలాటి గృహాలు ఆదిమజాతి అన్నిటిలోను ఉన్నాయని మానవజాతి శాస్త్రజ్ఞులు అంటున్నారు. ఇక్కడ బాలబాలికలకు క్రమశిక్షణ, పనిపాటలలో శిక్షణ ఇస్తారు; వీరులనుగా, వీరబాలికలనుగా తీర్చి దిద్దుతారు. ఈ మోరంగ్ నిర్వహణాధికారులలో పెద్దవానిని "ఉంగ్రు" అని, రెండవ అధికారిని "తోంగ్ను"



ఝలియాంగ్ ఆనంద నృత్యం



పాఠశాలలో బృందనృత్యం చేస్తున్న నేటి నాగ బాలికలు

అని, మరమ్మతులు మొదలయిన పనులు చేసేవారిని "తింగ్ యూర్" అని, మధువును సమకూర్చేవారిని "ఖరూటిర్" అని వ్యవహరిస్తారు.

అన్ని అనాది తెగలలో ఉన్నట్టే వీరికి ప్రమాణాలపైన చాల గురి. నేరం చేయలేదని ప్రమాణంచేస్తే వదలివేస్తారు. పులితలపై (పుర్రెపై) చేసే దాన, మనిషి పుర్రెపై చేసే ప్రమాణం చాల విలువైనవి. దానచేసిన వెలరోజులలో ఏమైనా విపత్తు కలిగితే అబద్ధా లాడినట్టు నిదర్శనం. వీరు స్నేహ మంటే ప్రాణమే యిస్తారు. ఈ స్నేహం తరతరాల వరకూ సాగుతుంది. దీనిని "అతోంబు" అంటారు. స్నేహచిహ్నంగా బాకు, బల్లెం మార్చుకుంటారు. దానిన వ్యాపారం కూడ రిలో పూర్వం ఉండేది.
వి

ప్రపంచంలోకెల్లా నిరాడంబరమైన వివాహాలు నాగా వివాహాలే. నిశ్చితార్థం రోజున పెళ్లికొడుకు కొన్ని పందులను మామగారికి ఓలిగా ఇవ్వాలి. పెళ్లికుమార్తె పెండ్లికి ముందు అప్పుడప్పుడు అత్తవారింటికి వచ్చి పనిపాట్లలో సహాయం చేయాలి. సంవత్సరం ఈవిధంగా జరిగిన మీదట ఇద్దరు, బంధువులు వారిని ఆలు మగలుగా గుర్తించి వేరే ఇల్లు కట్టించి కాపురం పెట్టిస్తారు. ఇంటికప్పుకు మామగారు పందెడు గడ్డి ఇవ్వాలి. తక్కిన సామగ్రిని ఉమ్మడి గ్రామస్థులు ఇస్తారు. పెండ్లికుమార్తె చెచ్చెలులు కొత్త వస్త్రు దంచి బియ్యం తెచ్చి యిస్తారు. వివాహానికి ముందే సాళ్ళత్యులలోని పూయింగ: వంటిది వీరిలోను ఉంది కాబట్టి, ఈ పద్ధతికి తలిదండ్రులో అడ్డుచెప్పరు కాబట్టి, దాంపత్య జీవితాలు పోయిగానే గడు

వ్తాయి. అయినా సరిపడకపోతే మరొక పెండ్లి చేసుకో వచ్చు. తప్పెవరిదని నిర్ణయమైతే వారు పందులను జుల్మానాగా చెల్లించాలి. ఆరు సంవత్సరాల వరకు సంతానం కలుగక పోతేను, ఆడపిల్లలు మాత్రమే కలిగినా భార్యకు విడాకు లివ్వవచ్చు. వితంతువులు, విధురులు మూరు మనువుకు సంవత్సరం వేచిఉండాలి. పిల్లలు వయస్సు వచ్చి చెవులకు ఇత్తడి కుండలాలు పెట్టుకుంటే పెళ్ళికి సిద్ధం అని అర్థం. యువకులకు ఆహ్వాన మన్నమాట. నాగాలలో విడిగా వ్యభిచార మనేది లేదు. చీకటితప్పులకు అంత పాటింపులేదు. ఈడువచ్చిన యువతులకు పసిబాలురను కట్టబెడుతారు. కనుక, ఆ పసిభర్త ప్రయోజకు డయ్యేవరకు భార్య కాచుకో అక్కరలేదు.

నాగాలు యోధేయజాతి గనుక ఈటెలు, బల్లేలు కత్తులు, వెదురుబద్దలు, మొదలయిన ఆయుధాలు విసరడంలో సమర్థులు. పూర్వం విరోధులయెడ అతి క్రూరంగా ప్రవర్తిస్తూ, వారి తలలు నరికి గ్రామ ద్వారానికి తోరణాలు కట్టేవారు.

నాగాలకు దేవుళ్ళమీద, దయ్యాలమీద భక్తి ఎక్కువ. వారిపురాణగాథలు వింతగా ఉంటాయి. నీటిదేవునికి నిప్పుదేవునికి యుద్ధం జరిగిందట. నిప్పుదేవుడు ఓడిపోయి వెదురు బొంగులో దాక్కున్నాడట. త్వరలో మళ్ళీ పోరాటం జరుగుతుందట. అప్పుడు జలదేవుని దే డిదే పైచేయి అవుతుందట. దానితో నిప్పుదేవునికి కోపం వస్తుందట. బ్రహ్మపుత్రానది మూలస్థానం నుంచి పొగలు రేగుతూ మంటలు చెలరేగి నాగలోకాన్ని ఆక్రమిస్తాయట. దానితో ప్రళయం ఏర్పడుతుందట.

వెదురు రాపితే నిప్పు పుడుతుందనే విషయంపై ఈ గాథలు బయలుదేరి ఉంటాయి. వీరికి లలాటలిఖితంపై నమ్మకం హెచ్చు. అంతరిక్షంలోని దేవుడు "లుంకిజింగ్‌బా." ఇతడే మానవుల లలాటంపై వ్రాసేవాడు. భూమిదేవత "లిజాబా". మృత్యుదేవుడు "మెరాజింగ్". లిజాబా సృష్టికర్త. లిజాబా భూమిని చదునుచేస్తూ ఉన్నాడట. అంతలోకే యుద్ధం ప్రారంభమైందని వార్త వచ్చిందట. లిజాబా పని వదలి యుద్ధరంగానికి పరువెత్తాడట. చదునుచేసే పని సగం ఆగిపోయిందట. కనుకనే నాగా ప్రాంతం పర్వతమయమయిందట. నాగాలు లిజాబాను ఏటా కొలుస్తారు. సోదెంపైన, మంత్రాలంపైన నాగాలకు విశ్వాసం మెండు.

వీరి మరణానంతర యాత్ర ప్రాచీన ఈజిప్టువారి సిద్ధాంతాన్ని పోలివుంటుంది. చనిపోయినవారి ఆత్మలు చాల దూరం ప్రయాణం చేయవలసివుంటుందిట. దారిలో ఆ వ్యక్తి తోగడ చంపిన మానవుల, మృగాల ఆత్మలు అతనిని ఎదుర్కొంటాయి. వాటితో పోరాడడానికి కుక్క అవసరం. కనుక నాగాలు మరణాసన్నుని మరణానికి కొన్ని నిముషాల ముందు కుక్కను చంపుతారు. దాని ఆత్మ అతనికంటె ముందు వెళ్ళి విరోధి ఆత్మ



గడ్డిమోపు మోసుకుని వెళ్లుతున్న
నాగజాతిలోని రేంగ్మా తెగ మహిళ



కదురుతో దారం వడుకుతున్న నాగజాతి ఇల్లాలు

లను తరిమివేస్తుందట. స్వర్గానికి, భూమికి మధ్య "బుంగ్రిట్ జా" అనే నది పారుతుంటుంది. స్వర్గానికి పయనించే ఆత్మ ఆ నదిలో దిగి కాళ్ళు చేతులు కడుగుకొని దాటితే ఇక తిరుగు లేదు. నాగాలు శవాన్ని వెంటనే దహనం చేసేవారుకారు. ఇండ్లలో పొయ్యిమీది అటకలపై ఎండబెట్టేవారు. క్రైస్తవ మత ప్రచారంతో ఈ పద్ధతులు నేడు మారిపోయాయి. వేష భాషలు కూడా మారాయి.

నాగాలకు అల్లోపతి మందులంటే నేటికీ వైరస్యమే. ఏ వ్యాధి అయినా దానంతట అదే మానవలసిందే. ఆంధ్ర ప్రదేశ్‌లోని అనాది జాతులలాగే అడవిమూలికలు, కషాయాలు


వాడుతారు. పోరాటంలో గాయపడ్డవారికి పూర్వం పచ్చి దోసకాయ, కుక్కమాంసం పథ్యం పెట్టేవారు. మొదటిది రక్తస్రావం ఆపడానికట. రెండవది బలంకోసమట. (పాత వివరాలు విశేషంగా తెలియగోరేవారు వాన్‌బారన్ హైమెన్‌డార్ఫ్ రచించిన "న్యాక్‌డ్ నాగాస్" అనే గ్రంథం, శ్రీ ఠక్కర్ బాపా "ఆదిమజాతియాఁ", శ్రీ వెన్నెలకంటి రాఘవయ్యగారి "అడవిపూలు" చదవగోరినాము.)

నేటి పరిస్థితి

ఇదంతా స్వాతంత్ర్యానికి పూర్వం. నేటి పరిస్థితి వేరు. పూర్వపు దురాచారాలు, తలలు తరిగి కసితీర్చుకోడాలు, అనాగరిక పరిస్థితి చాలవరకు మారాయి. 15 సంవత్సరాల క్రితం నాగా ప్రాంతంలో 150 మైళ్ల పొడవు బాటలే ఉండేవి. ఈ ప్రాంతంలోని 858 గ్రామాలకు వెళ్లడానికి కాలినడకన సాధ్యమే కాని, బండిమీదో, జీపుమీదో వెళ్లడం సాధ్యమయ్యేదికాదు. నేడు 2000 మైళ్ల మేర రోడ్లు వచ్చాయి. అన్ని ప్రధాన ప్రాంతాలకూ జీపుమీద వెళ్లవచ్చు. తృతీయ ప్రణాళిక అంతానికి ప్రయాణ సౌకర్యాలు, మరింత తేలికగాను, అనుకూలంగాను ఏర్పడగలవు.

విద్యారంగంలోను రాష్ట్రం ముందంజవేస్తున్నది. ఇదు సంవత్సరాలలో రాష్ట్రమంతటా—ప్రతి గ్రామంలోను ప్రాథమిక పాఠశాల నెలకొనగలదు. ఇప్పుడున్న మొత్తం 716 విద్యాసంస్థలలో రెండు శిక్షణ సంస్థలు, రెండు డిగ్రీ కళాశాలలు, 28 హైస్కూళ్లు ఉన్నాయి. వీటిలో విద్యార్థుల మొత్తం సంఖ్య 69 వేలు—రాష్ట్రం జనాభాలో 19 శాతం.

విద్యార్థులు కష్టపడి చదవడం మాత్రమే కాక తీరిక వేళలలో తమ తలిదండ్రులకు, తమ గ్రామీణులకు వ్యవసాయంలోను, ఇళ్లు నేయడంలోను, అందమైన గుడ్డలు, నెక్‌టైలు నేయడంలోను తోడ్పడుతారు. చేతిపనులు హెచ్చుగా లేకపోయినా, నేత తరతరాలుగా ఇక్కడ కుటీర పరిశ్రమగా, చాల నాణెంగా అభివృద్ధి చెందింది. ప్రభుత్వం ఈ పరిశ్రమకు అవసరమైన ముడి సరుకును సరఫరా చేస్తున్నది. నాగజాతి చేతి పనులలో తయారయిన వస్తువుల విక్రయశాలలను ఢిల్లీ,



నాలుగడుగుల గుంజలమీాద వెదుళ్లతో కట్టిన నాగాల ఇల్లు. ఎక్కడానికి కుడివైపున చిన్న నిచ్చెన

కలకత్తా, గౌహతి నగరాలతో నెలకొల్పడానికి ఆలోచనలు జరుగుతున్నాయి.

నాగారాష్ట్రంలో ప్రధాన వృత్తి వ్యవసాయం. కోహిమా జిల్లాలోని అంగామీ నాగాలు కొండ చరియలపై అంతస్థులు అంతస్థులుగా వరిమళ్లను తీర్చే వ్యవసాయ కళకు సుప్రసిద్ధులు. "ఝుమ్" వ్యవసాయం బలంగా ఉన్న తక్కిన రెండు జిల్లాలలోను అంతస్థుల పద్ధతి వ్యవసాయాన్ని ప్రవేశ పెట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. విశాఖ జిల్లా మన్య ప్రాంతంలోను ఇలాటి వ్యవసాయం ఉంది. దీనిని "పోడు" వ్యవసాయం అంటారు. రాష్ట్రంలోని జనాభాలో నూటికి 80 శాతం కన్నా హెచ్చుమంది వృత్తి వ్యవసాయమే. ప్రకృతి అనుకూలం. వర్షపాతం విపరీతం. భూమి



గడ్డిపావడలతో, గరిక పూలతో వనకన్యలలాగఉండే కోన్యాక్ నాగకన్యలు.

సారవంతమైంది. అయినా, సేద్యానికి తగినంత భూమి లేనిదాని వల్ల వ్యవసాయం స్వయంపోషకంగా లేదు. వ్యవసాయ పద్ధతిలోనూ మార్పులు అవసరం. అతి ప్రాచీనంగా వస్తున్న ఝూమ్ పద్ధతిని అనుసరించి గాలికి విత్తడం తప్ప మరొకటి జరిగేదికాదు. కనుక ప్రభుత్వం 1963 లో ఎంతో శ్రమపడి 2,17,000 ఎకరాల అదనపు భూమిని సాగుకు తెచ్చింది. సాగుకు యోగ్యమైన, భూమి ఏడు లక్షల ఎకరాల మేర లభించగలదని అంచనా వేశారు. 1957 లో రెండు కోట్ల రూపాయలు బంజరుభూములను సాగుచేయడానికి, మేలిరకం విత్తులు సరఫరా చేయడానికీ, వంటకాలువల నిర్మాణానికి ఖర్చు చేశారు. మొకొక్‌చంగ్, టుయెన్‌సాంగ్ జిల్లాలలో ఆధునిక వ్యవసాయ పద్ధతులను నేర్పడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం మేలిరకం విత్తులు మొదలయిన వాటికోసం పెద్ద ప్రయోగాత్మక క్షేత్రం ఏర్పాటు చేసింది. 75 శిక్షణ కేంద్రాలు కూడ ఏర్పాటుచేశారు. నాగాలకు ఎంతసేపటికీ పారలతో భూమిని తిరగవేయడం తప్ప నాగలితో దున్నడమనేది తెలియదు. ప్రభుత్వం ఎద్దులు కట్టిన నాగళ్లతో దున్నడాన్ని, అవసరమైతే ట్రాక్టర్లను వాడడాన్ని ప్రవేశపెట్టింది.

రాష్ట్రంలోని 16 అభివృద్ధి బ్లాకులలో వాటిగింటిని గిరిజన సంక్షేమ బ్లాకులుగా మార్చారు. నాలుగవ పంచవర్ష ప్రణాళిక పూర్తయ్యే వేళకు తక్కిన బ్లాకులు కూడ గిరిజనాభివృద్ధి బ్లాకులుగా మార్చివేస్తారు.

ప్రభుత్వం జరూరుగా పరిష్కరించవలసిన సమస్య ప్రజారోగ్యం. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెటులో పెద్ద మొత్తం దీనికోసం కేటాయించారు. పది సంవత్సరాల క్రితం కొన్నే ఆస్పత్రులు ఉండేవి. ఇప్పుడు అన్ని సౌకర్యాలూ గల 24 ఆస్పత్రులున్నాయి.

నాగ గ్రామాలన్నీ తరచు కొండలమీదే ఉండడంవల్ల నాగ మహిళలు మంచినీటికోసం చరియలకు దిగిరావలసి వస్తుందని ఇదివరకే తెలిపాను. నీరు మోయడంతోనే సరిపోతుంది వారికి. ఆరోగ్యానికి మంచినీటి సరఫరా ముఖ్యాంశం గనుక, వారికి తీరిక కలిగించి ఆ సమయాన్ని ఇతర వ్యాపకాలకు వినియోగించడానికి వీలుగా కుళాయిలతో మంచినీటి సరఫరా ఏర్పాటుచేశారు. దీనికోసం 12 లక్షల రూపాయలు వ్యయమయ్యాయి. గ్రామా లన్నింటికీ కుళాయిలు వేయడానికి పథకాలు తయారయ్యాయి.

జలవిద్యుచ్ఛక్తికి నాగరాష్ట్రంలో చాల అవకాశాలున్నాయి. గడచిన రెండు సంవత్సరాలలో ఎనిమిది పట్టణాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయబడింది. విద్యుచ్ఛక్తి రావడంతో కొత్త పరిశ్రమలు—ముఖ్యంగా అంగబలం తక్కువగా ఉన్న ప్రాంతాలలో—అభివృద్ధి చెందగలవని ప్రభుత్వం అంచనా కడుతున్నది.

దిమాపూర్ నుంచి కొహిమాకు వెళ్లుతున్నప్పుడు రహదారి పొడవునా అడవులే కనిపిస్తున్నా నాగరాష్ట్రంలో రిజర్వు అడవి 127 చదరపుమైళ్ల మేర మాత్రమే ఉంది. అడవులే ప్రస్తుతం రాబడికి ప్రధానం గనుక అడవుల పెంపకంలో ప్రభుత్వం చాల శ్రద్ధ వహిస్తున్నది. అన్ని రకాల కలప, వెదురు, గడ్డి అడవులు, వనమూలికల అడవులు ఉన్నాయి.

ఈ ప్రాంతంలో ఫలవృక్షాల సాగుకు కూడ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. అడవిరకం యాపిల్ మొదలయిన ఫల వృక్షాలు ఉండనే ఉన్నాయి. మేలురకం యాపిల్ పంటకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

నాగజాతివారు ఇంతవరకు విడిగా ఉన్నారు, వెలుపలి ప్రపంచంతో వారికి సంబంధం తక్కువ. దానికి తోడు తెచ్చిపెట్టుకున్న పెద్దరికంతో కొందరు విదేశీయులు, దారితప్పినకొందరు వారి మనస్సును విద్వేషపూరితం చేశారు. ఇప్పుడు మన ప్రధానమైన సమస్య శాంతి భద్రతలు స్థాపించి, ఈ చిన్న రాష్ట్రాన్ని సర్వతోముఖంగా అభివృద్ధిపరచడమే.

64 ప్రారంభంలో నాగరాష్ట్రం శాసనసభకు ఎన్నికలు జరిగాయి. శ్రీ షీలో ఆవో ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పడింది. అయినప్పటికి అసంతృప్తి చెందిన నాగవిద్రోహులు దౌర్జన్యచర్యలు ఆపలేదు. నాగభూమి సమస్యా పరిష్కారానికి కొన్ని మాసాలుగా విద్రోహ నాయకులకు, షీలో ప్రభుత్వ ప్రతినిధులకు, శాంతి సంఘం ప్రతినిధులకు మధ్య నాగభూమి భవిష్యద్రాజ్యాంగ ప్రతిపత్తి విషయంలో సంప్రతింపులు జరుగుతున్నాయి. ఇవి ఎప్పుడు సఫలమవుతాయో, ఈసమస్య ఎప్పుడు పరిష్కారమవుతుందో చెప్పలేము.

(ఫొటోలు హిందుస్తాన్ స్టాండర్డ్, పి. ఐ. బి.ల సౌజన్యంతో.)

కంటికి నిద్రవచ్చునె ? సుఖంబగునే రతికేళి ? జిహ్వకున్
వంటక మిందునే ? యితర వైభవముల్ పదివేలు మానసం
బంటునె మానుషంబుగలయట్టి యట్టి మనుష్యున కెన్నడేనియున్
గంటకుడైన శాత్రవు డొకండు తనంతటివాడు గల్గినన్ ?

(శ్రీనాథుడు—కాశీఖండం)

ఫుల్ స్టాప్

శ్రీ వి. ప్రేమ్‌చంద్ కిషన్‌రావు

సంపూర్ణ శ్లేషాలంకారానివో, ఉపమాలంకారానివో నాకవసరం లేదు.
మైలున్నర సమాసానివయినా మహాగొప్ప సంధివయినా నాకు ఖాతర్లేదు.
చేవలేనిపదానివో చైతన్యస్రవంతివో నాకెందుకు?

ద్రాక్షాపాకమ వయితే దయచూపించేది లేదు.
నారికేళపాకమ వయితే దాసోహ మనేది లేదు.
మేలిమి వచనమయితే మరలిపోయేది లేదు.
తేలిక వచనమయితే కాలరాచేది లేదు.
నిన్ను ఆపడం నా ధ్యేయం. నీ వెవరవయితేనేం?

నీ లిమిటేషన్స్ నిక్కనబరచడం నా బతుకు.
కాలానికి కళ్ళున్నాయని చెప్పడం నావిధి.

నా కళ్ళముందు పడకముందే అనుభవించాల్సిందంతా అనుభవించు.
మత్తేభంలా నడుస్తావో, శార్దూలంలా ఘీంకరిస్తావో ఘీంకరించు.
మందారదామంగా విరుస్తావో, చంపకంగా పూస్తావో పూయి.
ముత్యాలసరంగా మెరుస్తావో, మత్తకోకిలగా కూస్తావో కూయి.

వచనంగా వందపేజీల్దాకా కామాలతో కాళ్ళరిగేదాకా తిరుగు.
సెమికోలన్లతో, డాష్‌మార్కులతో నీ ఇచ్చవచ్చినట్లు బ్రతుకు.

ఇన్ని అయ్యాక కూడా ఇంకా రానంటావా? చీకటిపడలేదంటావా?
తమ్ముడూ, నాచేతిలో అధికారం లేదు.

ఫుల్ స్టాప్

ఇంకా తిరిగితే అర్థం అయోమయ మవుతుంది.
భావాలు కుత్తుకలు కరుచుకుంటాయి.
పుస్తకం ఉక్కిరిబిక్కిరవుతుంది.
క్రొత్తపుస్తకం మొదలెట్టాల్సొస్తుంది.

అందుకే ఇలారా! నిన్ను గర్భంలో దాచుకుంటాను.
నిన్ను చదివేసిన పాదాల్లో వదిలేస్తాను.

మరలేసిన పేజీల్లో చెఱవేస్తాను.
మంచి భావానివయితే నీ జ్ఞాపకాల్ని
ముందుపేజీల్లో మననిస్తాను!

నే నెవ ర్నంటావా? నీకు తెలీదూ?

నేను ఫుల్ స్టాప్ ని.
గమనానికి ప్రస్తావనని.
గమనానికి పరిసమాప్తిని.



చర్చ :

అప్పకవి పూర్వుల నివాసము

మేనెల భారతిలో 'అప్పకవి ఇంటిపేరు' అను వ్యాసమును చదివితిని. ఏప్రిల్ నెల భారతిలో 'అప్పకవి పూర్వికుల నివాసము' అను నా వ్యాసమును చదివి శ్రీ.వి. రాజగోపాలరావు గారు పై వ్యాసములు వ్రాసియుండిరి.

అప్పకవి ఇంటిపేరు 'కాకునూరి' వారు. 'ఈ గ్రామ మెచ్చట గలదు? అను స్థల నిర్ణాయక చర్చ నుద్దేశించి "అప్పకవి పూర్వికుల నివాసము", వ్రాయబడినదే. కాని, "ఈపే రెట్లు వచ్చినది ?" అని నామ నిర్ణాయక చర్చ నుద్దేశించి వ్రాసినది కాదు. ఒక స్థలమును చర్చించి 'ఫలాని చోట గలద' ని చెప్పుటకు పీఠికలో చెప్పబడిన పరిసర గ్రామములు, పొలిమేరలు, శాసనాద్యాధారములు మొదలగువానిచేతనే యని యంద తెలిగించినదే. అప్పకవి పూర్వికులలో ప్రసిద్ధ వ్యక్తిగా పేరు బడసినవాడు సోమాహ్వయుడు

> "......శ్రీ భరద్వాజమౌని
> యమ్మహా గోత్రాబ్ధి నవతరించి,
> తమ్ములును దాను నన్యోన్యతను దనర్చి
> తమ్ములను బోరునని సోముఁ దన్త్రరించు,
> నొర సోమాహ్వయుడు కాకునూరి ఘనుడు."
>
> (పీఠిక 71)

ఇతడు తిమ్మనసుతుడు. అప్పకవి పితామహానకు పితామహుడు. మధురయందు వేదశాస్త్ర పురాణాది వాదముల పండిత సమూహములను కాకునూరింటి చేసిన కారణమున కాకునూరింటివాడని ఘనత గాంచినట్లు పీఠిక 72 వ పద్యమునం దున్నమాట వాస్తవమే. కాదన్నవా రెవరు ? ఇతని తల్లి దండ్రులును, ఇతడును ప్రప్రథమమున నెక్కడ నివసించెనో మనకు దెలియరాదు. ఇక నితడు విద్యాభ్యాసమునకు కాశికేగి బ్రహ్మేంద్రునొద్ద సకల శాస్త్రములు చదివి తిరిగి వచ్చెను. వచ్చి యెక్కడ నివసించెను ? పీఠిక 73 వ పద్యము చివరి చరణమున—

> "మనియె నిలఁ గాకునూరి తిమ్మన సుతుండు
> సోము డభినవచూత సద్గ్రామమునను"

అని యుండుటవలన, మనుట = జీవించుట, బ్రతుకుట, నివసించుట—అను నర్థముల ననుసరించి, యితడు మొదట అభినవచూత సద్గ్రామము (శేమామిడి) నందు నివసించి యుండవచ్చును. ఎవరి నాశ్రయించెను ? తెలియదు. ఇతని శాస్త్ర పాండిత్యమునకు మెచ్చి యే యాస్థానాధీశ్వరుడైనా చేరదీసెనా? లేక యితడే యేదో నొక యాస్థానమును జేరి తదధీశ్వరుని తన ప్రజ్ఞా పాండిత్యములచే మెప్పించి యగ్రహారాది సన్మానము లొందెనా ! ఏదియు స్పష్టముగా దెలియదు. కాని, యిచ్చట నొక యూహ చేయువచ్చును. పీఠిక 73 వ పద్యము రెండవ చరణమున—"బ్రహ్మరాక్షసిచేతఁ గ్రమము చెప్పంబడి కట్టిన గండభాగంబు నొందె." యని గలదు. (బ్రహ్మరాక్షసులతోడఁ గ్రమము చెప్పుచు బండి గట్టిన గండభాగంబు మోదె—పాఠాంతరము.) ఈ పంక్తులనరసి ఇతడు మంత్రశాస్త్ర వేత్త, మరియు నుపాసకుడు అని రూఢి పరచవచ్చును. కావున చరిగొండసీమలో నా కాలమున నున్న నొకానొక యాస్థానాధీశుని కుటుంబమునకు కలిగిన బ్రహ్మరాక్షసి బాధను తొలగించుటచే నాత డొక గ్రామమును సర్వాగ్రహారముగాఁ జేసి దాని కితని బిరుదనామమైన 'కాకునూరి' అని యుంచి యితనికి దానమిచ్చియుండును. కాని యా గ్రామపు పూర్వనామము కూడ తెలియరాదు. ఇట్లు అతని బిరుదనామమే గ్రామమున కుంచబడి "కాకునూరు" అని కాగా, దానియందు పిదప నివసించిన సోముని పుత్ర పౌత్రాదులకు 'కాకునూరి' వారనే పేరు స్థిరపడియుండును.

ఇట్టి 'కాకునూరు' ఎచ్చట గలదు ? లక్ష్మణరావు పంతులుగారు బాపట్ల తాలూకాలోనో, నూజివీడు తాలూకాలోనిదో కావచ్చునని యూహించిరి. కాని ఇది మహబూబ్ నగరంజిల్లా షాద్‌నగర్ బ్లాకులోనిదే తప్పనిసరిగా అయియుండవచ్చునని నా యనుభవమును పురస్కరించుకొని పీఠిక 73 వ పద్యములో చెప్పబడిన గ్రామము లన్నియు—

> "నిడుదవెల్లిని బొడ్డినేపల్లి నవదళ
> పురిని మాన్య క్షేత్రముల్ గడించె.
>
> ....
>
> సోము డభినవ చూత సద్గ్రామమునను." పీఠిక 73.

నిడుదవెల్లి, బొడ్డినేపల్లి (బోదనాంపల్లి), నవదళపురి (తొమ్మిది రేకుల), అభినవచూత సద్గ్రామము (శేమామిడి)—ఇవి కాకునూరికి 4, 5 మైళ్ళ లోపుననే యుండుటచేత ఆ 'కాకునూరి గ్రామము షాద్‌నగర్ బ్లాకులోనిదేనని తెలిపి చారిత్రకుల పరిశోధనకు వదలితిని.

ఇక శ్రీ రాజగోపాలరావుగారు తాముచూపిన రెండు ముద్రిత ప్రతులలోను—1. వావిళ్ల ప్రతి. 1901లో బ్రహ్మశ్రీ యద్దన

పూడి సంజీవయ్యగారిచే పరిష్కృతము.—2. స్టార్ ఆఫ్ ఇండియా ప్రెస్ మద్రాసువారిచే ముద్రితము—అన్ని గ్రామములును తు. చ. తప్పక యుండి ఒక 'నవదళ' పురి గానిపించక, దానికి బదులు నివరళపురి యున్నట్లు తెలుపుచు నిది గమనార్హమని వ్రాసియున్నారు. కాని 'నవదళ' పురి అని నేను క్రొత్తగాఁ గల్పించినవాడను కాను. వావిళ్లవారు 1962 లో శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారు, శ్రీమాన్ ఉత్పల వెంకనర్సింహాచార్యులుగారు పరిష్కర్తలుగా, మరియు విద్వాన్ శ్రీ రావూరి దొరసామిశర్మ ఎం. ఏ. గారు పీఠికాకర్త, పరిష్కర్తలుగా ముద్రించిన అప్పకవీయ ప్రతిని శ్రీ రాజగోపాల రావుగారు చూచిన, అందులో పీఠిక 73 వ పద్యమున 'బొద్దినేపల్లి నవదళపురిని' యని యున్నట్లు కాంచెదరని మనవి. ఈ ప్రతిలో పాఠాంతరముగా క్రింద 'నివరళ' అని కూడ వ్రాయబడినది. కాని 'నివరళ' అను దానికంటె 'నవదళ' పదమే సమంజసమైనదని మిగిలిన గ్రామము లన్నియు దగ్గర దగ్గరలోనే యుండుటచే భావించుచున్నాను. 'నవదళ' పురి—క్రొత్త రేకుల లేక తొమ్మిది రేకుల—కావచ్చును. ఈ రెంటిలో 'తొమ్మిది రేకుల' అను గ్రామ మిచ్చట నుండుటచే దానికి 'నవదళపురి' సంస్కృతీకరణమై యుండుననియు, కొన్ని వ్రాతప్రతులందు లేఖకుల పొరపాటున 'నవదళ' కు బదులు 'నివరళ' అని వ్రాయబడగా, వారు చూచిన రెండు ప్రతులను ముద్రించిన వారి కట్టి వ్రాతప్రతులే లభ్యములు కాగా, ముద్రిత ప్రతులలో 'నివరళ' అని యుండుట దోషము కాదు. నూతన గ్రంథమున పరిష్కర్తలకు 'నివరళ', నవదళ' అని యున్న రెండు ప్రతులను లభించుటచే, వారు ఈ రెంటిలో అర్థవంతమైనది 'నవదళ' పదమే యగుట దానినే పద్యమున నుంచి పాఠాంతరముగా నివరళ అని యిచ్చి యున్నారు. ఇదిగాకను 'నివరళ' అను పదమునకు శబ్దార్థము గూడ సరియైనది స్ఫురించుటలేదు. కావున 'తొమ్మిది రేకుల' కు 'నవదళపురి' సంస్కృతీకరణమై యున్నదని తెలుపుచు, అప్పకవి పూర్వికుల నివాసము షాద్‌నగర్ బ్లాకులోని 'కాకునూరి' గ్రామమే యని తలంచుచు సహృదయ చారిత్రకుల పరిశోధనకు వదలుచున్నాడను.

వేములవాడ: గుండి వెంకటాచార్యులు.

అంతరాక్కర యతిస్థానము

ఏప్రిల్ (1965) భారతిలో శ్రీ బండి నాగరాజ గారు 'జాతి పద్యము: అంతరాక్కర' యతిస్థానమును గురించి కొంత చర్చచేసినారు. కాని, దానిలో నన్నిచోడుని (చంపకమాలా గర్భిత) అంతరాక్కర లక్షణమును చేర్చియుండలేదు.

ఇప్పుడా లక్ష్యమును పరిశీలించి, లక్షణ సమన్వయము చేయ వీలున్నదేమో చూతము.

మురిసి మ్రొగ్గెడి రూపులు
  మ్రొగ్గి జీర్ణనం
దిరిగి త్రెళ్లెడు రూపులు
  ద్రెళ్ళి నేలపైఁ
బొరలి పోయెడి రూపులుఁ
  బోయి క్రమ్మరన్
మరలి మ్రగ్గెడి రూపులు
  నయ్యెనయ్యెడిన్.1

అన్ని పాదములలో మొదటి ఏడక్షరములను తొలగించినయెడల చంపక మాలాశేషము అంతరాక్కరగా మిగులును. గర్భకవిత్వోదాహరణమని చోడకవి చెప్పలేదు. కాని, లక్షణమట్లున్నది.

గర్భకవి అంత రాక్కరలో యతి, 'త్రిగణాంతమున' లేదు. 'ఏ కో నాక్షర త్రిగణ మంతరకున్—యతి' అన్నట్లే. ఒక్క అక్షరము లోపముగా ఉన్నది. అనగా త్రిగణాంతమున లేకపోయినను, దానికి నందున్న యక్షరము మీద యతి చెల్లినది.

(1) 'పొరలి పోయెడి రూ
  పులు బోయి క్రమ్మరన్'
(2) 'పొరలి పోయెడి రూపులు
  బోయి క్రమ్మ'రన్'
(3) 'పొరలి పోయెడి
  రూపులు. బోయి క్రమ్మరన్'

పై (2), (3) పాదములలో అంతరాక్కర గణములు నాలుగింటికి బదులు అయిదుగా విభాగమగుచున్నవి. పై పెచ్చు పాదాంతములో ఒక్క గురువు మిగులుచున్నది కాని (1) మొదటి పాదములో సూర్య, చంద్ర, ఇంద్ర, ఇంద్ర గణములు నాలుగు చక్కగా సరిపోవుచున్నవి. పై పెచ్చు గురువు రెండవ చంద్ర గణములో లీనమై పోయినది. అయిదవ గణము మిగులలేదు.

కాగా, గర్భాంత రాక్కరలో చంద్రగణము లాక్షణికులు పేర్కొన్నట్లు నాల్గవ గణముగా లెక్కింపబడదనుట నిర్వివాదము. రెండవ గణముగా చంద్రగణము సార్థకమగుచున్నది. అందువల్ల యతిస్థానముల మార్పు కూడ కలిగినట్లున్నది.

ఉలవాడ: దేవరపల్లి వేంకటకృష్ణారెడ్డి.

చ. మురిసెడి రూపులున్......
  తిరిగెడి రూపులుం......
  బొరలెడి రూపులుం......
  మరలెడి రూపులు......
    (కుమా. ఆ. 11, ప. 131)

భారతదళంచే ఎవరెస్ట్ అధిరోహణం

ప్రపంచంలోకల్లా అత్యున్నతమైన ఎవరెస్ట్ శిఖరాన్ని భారతీయ పర్వతారోహక బృందం మే నెలలో నాలుగుసార్లు అధిరోహించి అపూర్వ విజయం సాధించింది. ఈ బృందానికి నాయకుడు లెఫ్టినెంట్ కమాండర్ ఎం. ఎస్. కోహ్లీ. శిఖరం ఎత్తు 29, 028 అడుగులు. భారతీయుదళం నాలుగుమార్లు ఎవరెస్టును అధిరోహించడంతో 1963 లో మూడుసార్లు అధిరోహించిన అమెరికాను మించిన ప్రతిపత్తి సంపాదించింది. ఎవరెస్టును తొలిసారిగా భారతీయ పర్వతారోహకుల బృందం తొలిజట్టు మే నెల 20 వ తేదీ ఉదయం 1—30 కు అధిరోహించింది. ఈ జట్టులో కెప్టెన్ ఎ. ఎస్. ఛీమా, శ్రీ నవాంగ్ గోంబూలు ఉన్నారు. రెండవజట్టు మేనెల 23 వ తేదీన మధ్యాహ్నం 12—30 గంటకు అధిరోహించింది. ఈ జట్టులో శ్రీ సోనం గ్యాట్సో, శ్రీ సోనం వాంగ్యాల్ ఉన్నారు. మూడవజట్టు మేనెల 24 వ తేదీ ఉదయం 10—45 కు అధిరోహించింది. ఈజట్టులో శ్రీ సి. పి. వోహ్రా, శ్రీ అంగి కామి ఉన్నారు.

నాలుగవజట్టు మే 29 వ తేదీ ఉదయం అధిరోహించింది. ఈ జట్టులో కెప్టెన్ హెచ్. ఎస్. అహ్లువాలియా, హెచ్. సి. ఎస్. రావత్, సర్దార్ ఫూదోర్జి ఉన్నారు.

భారతప్రభుత్వం, వివిధ దేశాలు భారత పర్వతారోహక సంస్థలు సాధించిన ఈ ఘన విజయాలను ప్రశంసించాయి.

గురజాడ అముద్రిత రచనలు

హైదరాబాద్‌లో స్థాపితమైన గురజాడ స్మారక పరిశోధన కేంద్రం కార్యవర్గం మే నెలలో శ్రీ రాపీ ధర్మారావు అధ్యక్షతన సమావేశమై శ్రీ గురజాడ అప్పారావు రచనలకు, లిఖితప్రతులకు సమగ్రమైన కేటలాగును సిద్ధం చేయడానికి, అముద్రిత రచనలను ముద్రించడానికి నిశ్చయించింది.

శ్రీ గురజాడ లిఖితప్రతులలో ఆయన వ్రాయ సంకల్పించిన కళింగదేశ చరిత్రకు సంబంధించిన అంశాలు వ్రాసుకున్న పుస్తకాలూ ఉన్నాయి. కొన్ని శాసనాల నకళ్లు, సమకాలీన చరిత్రవేత్తలు, సాహిత్యవేత్తల నుంచి వచ్చిన లేఖలు, డైరీలు, నోటుపుస్తకాలు, క్రైస్తవుల ప్రతులు, కళ, సంగీతం, చరిత్ర, సాహిత్యం, భాష మొదలయినవాటికి సంబంధించి విమర్శిస్తూ పలువురు ఆయనకు వ్రాసిన లేఖలు ఉన్నాయి.

రచయితల సహకారసంఘం

రాష్ట్రవ్యాప్తంగా రచయితల సహకార సంఘాన్ని నెలకొల్పాలని ప్రభుత్వం ఉద్దేశిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ సహకార శాఖామంత్రి శ్రీ తోట రామస్వామి మే నెలలో హైదరాబాదులో పత్రికా ప్రతినిధులతో అన్నారు.

రెండు లక్షల రూపాయలతో ఒక నమూనా ముద్రణాలయం నెలకొల్పడం, నిర్వహణ విషయంలో సహకరించడం కూడ ప్రభుత్వోద్దేశ్యం. హైదరాబాదులో ఉన్న రచయితల సహకార సంఘాన్ని రాష్ట్రవ్యాప్తంగా శాఖలతో అభివృద్ధి చేయదలచామని ఆయన అన్నారు.

కోల్హువాలోని అశోక స్తంభం అశోకునికంటె ప్రాచీనం

ఉత్తర బిహార్‌లోని ముజఫ్ఫర్ నగర్ సమీపంలో ఉన్న కోల్హువాలో ఉండే అశోకస్తంభాన్ని అశోకునికంటే రెండు శతాబ్దాలకుముందు నెలకొల్పివుంటారని శ్రీ నాగేంద్ర నాథ్ కాష్య అభిప్రాయ పడుతున్నారు. ఈస్తంభాన్ని వైశాలీ పౌరులు బుద్ధభగవానుడు మహా పరినిర్వాణం చెందిన వెంటనే (క్రీస్తుకు పూర్వం 544వ సంవత్సరంలో) నెలకొల్పారని శ్రీ కాష్య అంటున్నారు. ఈస్తంభం 30 అడుగుల ఎత్తున అఖండంగా ఉంది.

తథాగతుడు వైశాలీనగరానికి పెక్కుసార్లు వచ్చి భిక్ష పుచ్చుకున్నాడు. పౌరులను తన ఉపదేశామృతంతో ఆశీర్వదించాడు. దానికి కృతజ్ఞతగా వైశాలీపౌరులు ఈస్తంభం నెలకొల్పారని ఈయన వాదం.

ఈస్తంభంమీద ఎలాటి శాసనమూ లేదు. తక్కిన అశోకస్తంభాలకన్నా ఇది భిన్నంగా ఉంది. పారుగున చంపారన్

జిల్లాలోని లౌర్యనందనగఢ్, లౌర్యఅరేరాజ్ లలో ఉన్న రెండు అశోకస్తంభాలు నిర్మాణంలో కోల్హువా స్తంభంకంటే భిన్నంగా ఉన్నాయి. వీటిపైన శాసనాలూ ఉన్నాయి.

ఈ కోల్హువా స్తంభం పునాది ఎన్ని అడుగుల లోతున ఉందో తెలియదు. 19వ శతాబ్దంలో పురాతత్త్వ పరిశోధకుడు కన్నింగ్‌హామ్ 1862లో 14అడుగుల వరకు తవ్వి చూచాడు. కాని, అడుగు దొరకలేదు. కాని, 7వ శతాబ్దిలో భారతదేశానికి వచ్చిన చైనాయాత్రికుడు హుయాన్‌త్సాంగ్ కథనంబట్టి ఈస్తంభం 50 అడుగుల యెత్తుదని తెలుస్తున్నది. ఉత్తర బిహార్‌లో తరచు వరదలవల్ల ఈస్తంభం పూడి పోయివుంటుంది. కనుకనే ఎత్తు తగ్గిపోయివుంటుంది. కన్నింగ్‌హాం నాలుగు ఏనుగులతో దీనిని పడగొట్టి తీసుకుని వెళ్లి మరొకచోట స్థాపించడానికి ప్రయత్నించాడని, కాని సాధ్యం కాలేదని స్థానికులు అంటున్నారు.

చౌకగా ప్రాచీనగ్రంథాల ప్రచురణ

మహాభారతం, భగవద్గీతలాంటి ప్రాచీన గ్రంథాలను చౌకగా ప్రచురించడానికి, శిష్ట వ్యవహారికంలో వ్యాస పురాణాలను ప్రచురించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిశ్చయించినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖామంత్రి శ్రీ అలపాటి వెంకట రామయ్య మే నెలలో హైదరాబాదులో తెలిపారు. భగవద్గీతను నాలుగణాలకు అందజేయదలచామని ఆయన అన్నారు.

ఈ విషయాన్ని పరిశీలించడానికి పురాతత్త్వశాఖ డైరెక్టర్ శ్రీ ఎన్. రామేశన్, శ్రీయుతులు పైడి లక్ష్మయ్య, నీలం రాజు వెంకటశేషయ్య, గుర్రం మల్లయ్య, దేవరపల్లి వెంకట కృష్ణారెడ్డి గార్లతో ఒక సంఘం నియమించబడింది. ఈ విషయమై పరిశోధన జరుపడానికి శ్రీయుతులు రాళ్లబండి సుబ్బారావును కొండవీటి వేంకటకవిని నియమించారు.

ఈ పథకానికి 70 లక్షల రూపాయలు కేటాయిస్తారని, 10 సంవత్సరాలలో ఈ పథకం పూర్తవుతుందని మంత్రి తెలిపారు.

భారతీయ భాషల ఉత్తమగ్రంథాల తెలుగు అనువాదాలకు బహుమతి

ఇతర భారతీయ భాషలనుంచి తెలుగులోకి అనూదితమైన ఉత్తమ గ్రంథాలకు బహుమతులిచ్చే పథకంక్రింద 1964—65 కు జరిగిన మొదటి బహుమతి పోటీలో కింద పేర్కొన్న మూడు పుస్తకాలకు చెరి 1116 రూపాయల చొప్పున బహుమతి ఇవ్వడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిశ్చయించింది.

(1) శ్రీ పి. సూర్యనారాయణశర్మ (మద్రాసు) తమిళమునుంచి అనువదించిన "శ్రీ శివభక్త చరితము" (2) శ్రీ దాశరథి కృష్ణమాచార్య (ఆకాశవాణి, మద్రాసు) ఉరుదూనుంచి అనువదించిన "గాలిబ్ గీతాలు" (3) శ్రీ కొండవీటి వేంకటకవి (పొన్నూరు) హిందీనుంచి అనువదించిన పద్య కావ్యం "నైషాద చరిత్ర (రెండవ భాగం)".

1961 జనవరి 1 వ తేదీనుంచి 1965 డిసెంబర్ 31 లోగా ఇతర భారతీయ భాషలలో నాలుగు శాఖలలో ప్రచురించిన ఉత్తమ గ్రంథాల మేలి తెలుగు అనువాదాలకు చెరి 1116 రూపాయల బహుమతి ఇవ్వాలని కూడా రాష్ట్ర ప్రభుత్వం నిశ్చయించింది. నాలుగు సారస్వత శాఖలివి : (1) సాహిత్యం (కథ, నవల, నాటికాది కాల్పనిక శాఖ మినహా) (2) లలిత కళలు (సంగీతం, నాట్యం, చలన చిత్రం, చిత్ర రచన, శిల్పం) (3) విజ్ఞానశాస్త్రం (భౌతిక, జీవశాస్త్రాలు) (4) ఇంజనీరింగు, సాంకేతికశాస్త్రం.

ముద్రితమైన పుస్తకాలు మాత్రమే పోటీకి అర్హమైనవి. పోటీకి పంపే గడువు 1955 డిసెంబర్ 31. పోటీకి పుస్తకాలను, ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయానికి (హైదరాబాద్, 22) పంపాలి. ఈ పోటీకి సంబంధించిన నియమ నిబంధలను విద్యాశాఖ డైరెక్టర్‌నుంచి పొందవచ్చు.

వివిధ దేశాలలో లిపి పరిణామం

మానవాళి చరిత్రలో క్రమ పరిణామం చెందుతూ వచ్చిన లిపి చరిత్రకు ఎంతో ప్రాధాన్యం ఉన్నది. ప్రజల జీవన విధానం పైనా, ఆర్థిక కళారంగాలపైనా దీని ప్రభావం శాశ్వతమైనది. లిపి పరిణామ చరిత్ర ఒక క్రమంలో వివరించడానికి వీలులేదు. భిన్న ప్రాంతాలలో విభిన్న కాలాలలో లిపి స్వరూపాలు ఏర్పడ్డాయి.

అయిదు లక్షల సంవత్సరాల క్రితమే మానవులు రాతి పనిముట్లతో పాటు రకరకాల, సాధన సామగ్రులు, పాత్రలు ఆయుధాలు వాడకం చేసినట్లు ఇటీవలి పరిశోధనలబట్టి తెలుస్తున్నది. అప్పటి చెక్క పనిముట్లు మొదలైనవి నశించి పోయ్యాయి.

అప్పటికే వాగ్రూపంలో స్థిరపడుతున్న భాషకు శాశ్వత స్థానం కల్పించడం కోసం లిపి ఏర్పరచేందుకు గట్టి ప్రయ

త్నాలు జరిగాయి. వ్రాతపూర్వకంగా అభిప్రాయ ప్రకటనకు కొన్ని సంకేతాలు చెక్కడం వాడకంలోకి వచ్చింది. లిపి ఏర్పడడానికి పూర్వపు స్థితి ఇది. అయితే ఆ తర్వాత చాలాకాలంపాటు లిపితోపాటు మరికొన్ని ఇతర ప్రయోజనాల నిమిత్తం ఈ సంకేతాలు వాడకంలో ఉంటూ వచ్చాయి. ఇసుకనేలలపైన కొన్ని రకాల గీతలు, గుర్తులు పెట్టేవారు. పశువులు ఎవరివైనదీ గుర్తించేందుకు వాటి చెవులపైన వాతలు, గీతలు పెట్టేవారు. పచ్చ బొట్లు పొడిపించడం కూడా కద్దు. ఎవరెవరికి ఎన్ని పశువులు ఉన్నదీ లెక్కగట్టడానికి గులకరాళ్ళు లేదా పిడకలు ఉపయోగించేవారు. చిన్నచిన్న గులకరాళ్ళు దగ్గర పెట్టుకుని జూదం వంటి ఆటలు కూడా ఆడేవారు. ఇతరులు వెళ్ళిన లేదా వెళ్ళవలసిన దారి సూచిస్తూ మార్గ మధ్యంలో చెట్టుకొమ్మలను రెండిటిని కలిపి ముడిపెట్టడం లేదా ఒకే కొమ్మను వెనక్కు విరిచి కట్టడం జరుగుతుండేది.

ఇటువంటి సంకేతాల తర్వాత వాడకంలోకి వచ్చింది లిపి. లిపులన్నీ మొదట్లో బొమ్మల రూపంలో ఉండేవి తాము తరచు చూచే వస్తువుల బొమ్మలనే వ్రాస్తుండేవారు. దీన్నే చిత్ర లిపి అని అంటారు. ఇటువంటి లిపి చిత్రాలను చూచి భాష సహాయం లేకనే వాటి అర్థం సులభంగా గ్రహించవచ్చు. కొన్ని మాటలన్న కాక కొన్ని సన్నివేశాలను గురించి తెలియపరుస్తాయి ఈ చిత్రాలు.

ప్రాచీన సంకేతాలు

సెమిటిక్ జాతుల సంస్కృతి వర్ధిల్లిన ప్రాంతంలో నీరు అనే పదానికి కెరటం ఆకారంలో ఉండే సంకేతంగా ఒక్కటి ఉండేది. ఆ తర్వాత గ్రీకు, లాటిన్ భాషలలో ఈ సంకేతమే 'ఎమ్' అన్న అక్షరంగా స్థిరపడ్డది. ఇటువంటి ప్రాచీన సంకేతాలు అడవిజంతువుల వేట వృత్తిగా జీవించేవారి అభిప్రాయ ప్రకటనకూ ఇతర అవసరాలు తీర్చుకోడానికీ అనువుగా ఉండేవి. ఏ దారి ఎటు వెళ్ళేదీ గుర్తించడానికి, వస్తు వాహనాల యాజమాన్యం ఎవరిదైందీ తెలియచేసేందుకూ, వివిధ వస్తువుల ప్రమాణం చెప్పేందుకూ ఈ సంకేతాలు ఉపయుక్తం అయ్యేవి. ఇటువంటి సంకేతాలు కొన్ని కేవల కళాత్మక దృష్టితో సృష్టించడం కూడా జరిగింది.

తాము ఏ విషయాలను గురించి లేదా ఏ వస్తువులను గురించి చెప్పదలిచారో వాటి రూపాన్నిబట్టి యీ సంకేతాలను రూపొందించుకునేవారు. ఒక్కొక్కప్పుడు యీ సంకేతాలు ఒక నిర్దిష్టమైన రూపమంటూ లేక అయోమయంగా ఉండేవి. వాటిని రూపొందించిన వారికే సంగతి బోధపడాలి. మనం యిప్పుడు వాటికి భాష్యం చెప్పలేము. చరిత్ర ఉదయించక పూర్వంనాటి స్పెయిన్‌లోని శిలా వర్ణచిత్రాలు యిందుకు ఉదాహరణ. గుల్ల రాళ్ళమీద చిత్రించిన యీ సంకేతాలు, దక్షిణ అమెరికాలో శిలలు మలిచి రూపొందించిన శిల్పాలపై కానవచ్చాయి. ఒక వర్గం ప్రజలు ఉపయోగించిన భాష యీ సంకేతాలు. వంశ పారంపర్యంగా వచ్చిన భాష యిది. దానితో, యీ సంకేతాలు ఒక స్థిరత్వాన్ని సంతరించుకున్నాయి. అభివృద్ధి చెందిన ఏ లిపికైనా యిట్టి స్థిరత్వం అవసరం కదా! క్రెటన్ చిత్రాలు యించుమించు స్పెయిన్‌లోని శిలాశాసనాల కాలం నాటివి. అయితే, అవి ఎంతో అభివృద్ధిచెందిన సంస్కృతికి చెందినవి. వాటికి అదివరకే లిపి ఏర్పడిఉండదు.

మాట్లాడే రేఖాచిత్రాలు

రేఖాచిత్రాలను ప్రధానంగా జ్ఞాపకశక్తి సాధనాలుగా వినియోగించేవారు. ఈ సంకేతాలు అతి సరళమైనవి. భాషలో మాటలవలెనే, యివి కూడా బహు అర్థాలను స్ఫురింపజేస్తాయి. అంటే, యీ సంకేతాలు ఏదో ఒక వస్తువును గురించి గాక, అదే రకానికి చెందిన అన్ని వస్తువులకూ ప్రాతినిధ్యం వహిస్తాయి. ఉదాహరణకు, 'చెట్టు' రేఖాచిత్రం ఉందనుకోండి. అది ఏదో ఒక చెట్టును స్ఫురింపజేయడం గాక వృక్షజాలాన్ని స్ఫురింపజేస్తుంది. ఆయా సందర్భాలను బట్టి వివరాలను వూహించుకోవాలి. ఈవిధంగా బొమ్మలలో చెప్పిన సమాచారం, బొమ్మల రచనగా మారి సంకేతం ఏదో ఒక వస్తువుకు ప్రాతినిధ్యం వహించక వస్తువు పేరుకు అంటే మాటకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఉదాహరణకు, ఆజ్టెక్ శాసనంలో మాటలకు జాతుల పేర్లకు ప్రాతినిధ్యం వహించే సంకేతాలూ, చిత్ర దృశ్యాలూ ఉన్నాయి. అంటే, అది క్లిష్టమైన భావాలను సైతం వర్ణించగల రచనాపద్ధతికి దగ్గర పడుతోందన్నమాట. ఆజ్టెక్ శాసనాలు రేఖాచిత్ర రచనా నియమాలకు అనుగుణ్యంగానే ఉన్నాయి. అయితే క్యూనా ఇండియన్ల రచనలో ప్రధానాంశం మాటలవరుస. పంక్తులను ప్రాచీన ఆనాగరిక పద్ధతిలో, అంటే ఒకసారి కుడి నుంచి ఎడమకు మరోసారి ఎడమనుంచి కుడికీ వ్రాస్తారు. ఈ సంకేతాలు అసలు వ్రాతకు ఆదగ్గనగా వచ్చినప్పుడు, చిత్రాల ప్రాముఖ్యం తగ్గిపోతుంది. ఈస్టర్ దీవులలో రాతిపలకమీద రేఖాచిత్రాల సంకేతాల రాయాకు అవశేషాలు కొద్ది మాత్రమే ఉన్నాయి. ఇంకా, నిరక్షరకుక్షులుగానే ఉన్న సమాజాలలో, చిత్ర సంకేతాల పద్ధతి యీ శతాబ్దంలో కూడా అమలులో ఉంది.

గుర్తులూ సంకేతాలూ

ముఖ్యమైన సమాచారాన్ని, ముఖ్యంగా సంఖ్యాపరమైన సమాచారాన్ని జ్ఞాపక ముంచుకునేందుకు పెరూకు చెందిన ఇన్కా

జాతి ప్రజలు సంక్షిప్తమైన 'ముడుల' పద్ధతిని రూపొందించుకున్నారు. ఈ పద్ధతిలో బొమ్మలకు తావు లేనందున, యీ ముడులు ఏ వస్తువులకు సంబంధించిన సమాచారాన్నందజేయటానికి ఉద్దేశించబడినవో ముందుగానే తెలిస్తే తప్ప, భావం అర్థంకాదు. చాలా దేశాలలో దైనందిన వ్యవహారాలలో రైతు కుటుంబాలు వాడుకచేసే గుర్తుల కర్రపుల్లలు కూడా యీ రకానికి చెందినవే. రాతకోతలు తెలియకపోయినా, యివి రసీదులుగా పనిచేస్తాయి. ఈ గుర్తుల కర్రపుల్లలో ఉభయ పక్షాలూ చెరో సగం ముక్క దగ్గర ఉంచుకుంటే మోసానికి తావేలేదు.

ఈ గుర్తుగల కర్రపుల్లలలో కొన్నింటిపై వాటిని దగ్గర పెట్టుకున్న వ్యక్తు లెవరో తెలుసుకోవడానికి సంకేతాలు కూడా ఉంటాయి. వ్యాపార చిహ్నాలూ, పశువుల గుర్తులూ, వృత్తి గుర్తులూ—యీ మొదలైన అనేక రకాల సంకేతాలు వాటిపై ఉంటాయి. యజమాని ఎవరో తెలుసుకునేందుకూ, మూలం ఏమిటో తెలుసుకునేందుకూ, లేదా దానిని ధరించిన వ్యక్తి పేరు తెలుసుకునేందుకూ యీ సంకేతాలు ఉపయోగపడతాయి. మాటలలో వ్రాసిన పేరును గుర్తుంచుకోవడం కంటే, యీ సంకేతాలు వెల్లడించే పేరును జ్ఞాపకముంచుకోవడం తేలిక. ఈ సంకేతాలనుబట్టి వ్యక్తి పేరునూ, ప్రాముఖ్యాన్నీ తెలుసుకోవచ్చును. చెప్పిన మాటలకూ, చూపిన పత్రాలకూ విలువలేక, అవి వృధా అయిన సందర్భాలలో యీ సంకేత పతకాలూ లేక పతాకాలూ యీనాటికీ వ్యక్తిని పోల్చడానికి తిరుగులేని సాధనాలుగా ఉపయోగించబడుతున్నాయి. పెద్ద ప్రకటన చదవడానికి వ్యవధిలేక అతి ప్రమాద పరిస్థితిలలో, చటుక్కున సారం స్ఫురింపచేసే రేఖా చిత్ర వివరణ అవసర మవుతుంది. పరిపూర్ణత్వాన్ని పొందిన మన రాతకోతల పద్ధతి సర్వ ప్రయోజన సాధనకారి కాదనీ, దానికి పరిమితులుండి, కొన్ని సందర్భాలలో విప్రయోజక మవుతుందనీ చెప్పడానికి యింతకంటె ప్రబల నిదర్శనమక్కరలేదు.

తూర్పు ఆసియాలో అతి ప్రాచీన రచనలు

ఇటీవల కొన్నిదశాబ్దాల క్రితం సింధులోయలో జరిగిన త్రవ్వకాల ఫలితంగా అతిప్రాచీన సింధు నాగరకతకు సంబంధించిన అనేక విషయాలు వెల్లడి అయ్యాయి. ఆర్యులు భారతదేశానికి రాకపూర్వం క్రీస్తుపూర్వం క్రీస్తుపూర్వం 3వ శతాబ్దం నాటిదీ నాగరకత. ఈ సింధు నాగరతకూ పశ్చిమాసియా, ఉత్తరాఫ్రికా దేశాలలో చరిత్ర ప్రారంభమైనపాటి నాగరతకూ కొన్ని పోలికలు కన్పిస్తాయి. కాని దీనికది మూలంకాదు. సింధు లోయలో బయటపడిన కంచుపలకలు, ముద్రలు మొదలయిన వాటిపై కన్పించిన లిపి కొంతవరకు వర్ణచిత్రాలలోనూ మరి కొంతవరకు రేఖలలోనూ కూడుకున్నది. ఈ పలకలపైనా, ముద్రలపైనా అనాడు స్థానికంగా కన్పించిన పశు పక్ష్యాదుల బొమ్మలు, పౌరాణిక గాధలలో కొన్ని సన్నివేశాలను వివరించే చిత్రాలు కూడా వ్రాయడంబట్టి, చిత్ర లిపి క్రమంగా పరిణామం చెంది అప్పటికే రేఖాత్మకమైన లిపి ఏర్పడి వాడకంలోకి వస్తున్నట్లు స్పష్టం అవుతోంది. మరొక విచిత్రమైన విషయం ఏమంటే, ఈ శాసనాలలోని అక్షరాలకూ పసిఫిక్ మహాసముద్రంలోని ఈస్టర్ దీవిలో లభించిన అతి ప్రాచీన రచనలోని అక్షరాలకూ పోలికలు కన్పిస్తున్నాయి. అయితే ఈ రెంటినీ సరిపోల్చి పుట్టుపూర్వోత్తరాలు నిర్ణయించడానికీ, వీటిని అవగాహన చేసుకొనడానికీ ఇంతవరకు ఎవరికీ సాధ్యపడలేదు.

భారతీయ రచనలంటూ పేర్కొనదగినవి ఆ తర్వాత రెండువేల సంవత్సరాలకు గాని వెలువడలేదు. భారతదేశంలో రచనలు వెలువడేనాటికి అపూర్వమైన నాగరకత అభివృద్ధి చెందింది. పవిత్ర మత గ్రంథాలైన వేదాలు ప్రచారంలోకి వచ్చాయి. వేదాలు గురు శిష్య పరంపరగా ముఖతః వీని వల్లె వేయడం ఒక ఆచారమైంది. కొన్ని శతాబ్దాలు ఈ పద్ధతి అమలులో ఉన్నది. అయితే 15 వ శతాబ్దం నాటినుంచే దేశంలో రచనా పద్ధతులు వాడకంలోకి వచ్చిఉండాలి. బౌద్ధ, జైన మత ప్రవక్తలు తమ తమ ప్రబోధాలకు ప్రజలలో బహుళ ప్రచారం కల్పించడానికి లిపి సహాయంతో కొన్ని రచనలు చేశారు. అశోకచక్రవర్తి (క్రీస్తుపూర్వం 272—231) బుద్ధుని సూక్తులనూ, ప్రబోధాలనూ ప్రజలందరూ చదువుకోడానికి వీలుగా బహిరంగ ప్రదేశాలలో శిలలపైనా, స్తంభాలపైనా చెక్కించాడు.

అర్మాయియా దేశపు రచనాపద్ధతులు వాడకంలో ఉన్న ప్రాంతాలనుంచి వచ్చిన వర్తకుల మూలంగా సుమారు క్రీస్తుపూర్వం 600 నాటికి భారతదేశంలో రచనా పద్ధతి అంటూ ఒకటి క్రొత్తగా ఏర్పడింది. అప్పటికి పశ్చిమాసియా, ఉత్తరాఫ్రికాలలో అర్మాయియా భాష ప్రచారంలో ఉన్నది. అతి ప్రాచీన భారతీయ రచనలలో కుడినుండి ఎడమకు వ్రాసినట్లు కన్పిస్తున్నది. ఈ రచనా పద్ధతిని బట్టి ఈ లిపి సెమిటిక్ భాషల లిపి నుంచి పుట్టిఉండవచ్చునన్న దానికి వీలు కలుగుతోంది. భారత ఉపఖండంలోని భాషలకు సంబంధించి కొన్ని శతాబ్దాల కాలక్రమంలో రెండు రకాల లిపులు ఏర్పడ్డాయి.

ఈ రెండింటి అక్షరాలలో అనేక రకాల మార్పులు కూర్పులు ఎన్ని ఉన్నా ఈ రెండింటికీ బ్రాహ్మి లిపి మూలం. కొంతకాలం పాటు బ్రాహ్మీలిపితోబాటు ప్రాచీన ఖరోష్ఠి లిపి కూడా వాడకంలో ఉన్నది. కాని, ఆ తర్వాత బ్రాహ్మి లిపిదే పై చెయ్యి అయింది. వ్రాతకు ఉత్తర భారతదేశంలో చెట్ల మట్టలు, బెరళ్లు, దక్షిణభారతదేశంలో తాటిఆకులు ఉపయోగించడం వల్లా, ఉష్ణదేశం కావడంచేతా, యుద్ధాలమూలంగా తరచు పర్యసంపదలు నాశనం కావడంచేతా, ప్రాచీన రచనలు చాలా స్వల్పసంఖ్యలో మాత్రమే లభ్యమయ్యాయి. ఇటువంటి తాళ పత్ర గ్రంథాలకు అట్టలప్పుడే ఇరువైపులా చెక్కముక్క లుంటాయి. పత్రాం చివర ఒకవైపున రంధ్రంచేసి దారం గుచ్చి పత్రాలు కట్ట కట్టడం జరిగేది. భారతదేశంలో మహమ్మదీయులు మొగలాయీరాజుల కాలంలో కాగితం వాడకం లోకి తెచ్చారు.

భారత నాగరికత, మత ప్రభావాల మూలంగా చాలా కాలం క్రిందటే సుదూర దేశాలలో ప్రజలకు భారతీయ రచనలను గురించి తెలియవచ్చింది. ఉదాహరణకు క్రీస్తుశకం 4 వ శతాబ్దంలో గుప్తరాజుల కాలంనాటి రచనలకూ బ్రాహ్మి లిపి తూర్పు టర్కిస్తాన్‌లో లభించిన 6వ శతాబ్దంనాటి రచనలకూ దగ్గర పోలికలు కన్పిస్తున్నాయి. ఇదేవిధంగా టిబెట్టు లిపికి కూడా భారతదేశ లిపి మాతృక అనవచ్చును. అయితే బ్రాహ్మీలిపి ముందు తూర్పు టర్కిస్తాన్‌లో వాడకం జరిగి ఆతర్వాత దీని తాలూకు అపభ్రంశం టిబెట్టులో వాడకంలోకి వచ్చిందని చెప్పవలసి ఉంటుంది. 8 వ, 9 వ శతాబ్దాల నాటి టిబెట్టు దేశపు రచనల తాలూకు ప్రాచీన వ్రాతప్రతులు తూర్పు టర్కిస్తాన్‌లోని మత పీఠంలో లభించడమే ఈ వూహకు ప్రబలమైన ఆధారం. ఈ విషయాలు ఎలా ఉన్నా టిబెట్టులో బౌద్ధం ప్రచారంలోకి వచ్చిన కాలంలోనే బ్రాహ్మి లిపి వాడకంలోకి వచ్చిందని నిష్కర్షగా చెప్పవచ్చు.

భారతదేశంలో గుప్తుల కాలపు లిపి 9 వ శతాబ్దంలో నుంచి ప్రచారంలోకి వచ్చింది. దీనినే నాగరిలిపి అని అంటారు. దేవనాగరి దీని ప్రస్తుతపు వ్యవహారనామం. అక్షరాలపై ఉండే అడ్డుగీతలు దీని ప్రత్యేకత. అశేషంగా ఉన్న సంస్కృత మత వాఙ్మయం గ్రంథస్థం చెయ్యడానికి ఈ లిపి ఎంతగానో ఉపకరించింది. దేవనాగరిలిపి మాటికరణకు ఇటీవల కొంత ప్రయత్నము జరిగింది.

ఇండోచైనా, ఇండోనీషియాలలో ప్రాచీన రచనలు

క్రీస్తు శకారంభంలో, భారతీయ వర్తకులు ఇండోచైనా దేవులకు వెళ్లడం జరిగింది. వారి మూలంగా ఇండోచైనా ప్రజలకు భారతీయ రచనా పద్ధతులతో పరిచయం కలిగింది. ఆటు తర్వాత, బౌద్ధమతం వ్యాప్తిలోకి రావడంతో బౌద్ధమత గ్రంథాలలో ఉపయుక్తమైన "పాళి" లిపికి ఆదరణ లభించింది. బర్మా, లావోస్, కంబోడియాలలోని లిపులకు పాళీ మాతృక అయ్యింది. అయితే ఇటు భారతదేశంలో బౌద్ధ మతంతోపాటు పాళీ లిపికి కూడా క్రమంగా ఆదరణ పూర్తిగా నశించిపోయింది. బౌద్ధం మొదట మాన్ చక్రవర్తి పరిపాలనలో ఉన్న దక్షిణ బర్మా ప్రాంతంలో వ్యాప్తిలోకి వచ్చింది ఆటుతర్వాత ఉత్తర ప్రాంతాలలో బౌద్ధమతానికి ప్రాబల్యం వచ్చింది. బౌద్ధమతంతోపాటు పాళీ లిపికి కూడా ఈ ప్రాంతములలో ఆదరాభిమానాలు పెరిగాయి. కంబోడియా, లావోస్, థాయిలాండులలోని లిపులు పాళీ లిపి జన్యములే. అయితే కాలక్రమంలో ఇవి ఒకదాని నుంచి ఒకటి వేరవుతూ విభిన్న రూపాలు సంతరించుకొన్నాయి. జావా లిపికి కూడా భారతీయ లిపి జన్యమనే చెప్పవచ్చు. క్రీస్తు శకారంభం 732 నాటి అతి ప్రాచీన జావా "కవి" లిపిలో వ్రాసిన వ్రాతప్రతి పరిశీలిస్తే ఈ అంశం రూఢీ అవుతుంది. మధ్య సుమిత్రా నుంచి వ్యాప్తిలోకి వచ్చిన "బటక్" లిపికీ "కవి" లిపికీ దగ్గర పోలిక లున్నాయి. పైకి కన్పించే వ్యత్యాసం మరింత కుభ్రపరచిన నునుపైన బెరళ్లమీద వ్రాయడంవల్ల వచ్చిందే. బటక్ లిపిలో అక్షరాలకు కోణాకృతి రావడంవల్ల వీటికి ఏదో వ్యత్యాసము ఉన్నట్లు కన్పిస్తుంది. ఫిలిప్పైన్స్ దీవులవంటి మరీ మారుమూల ప్రాంతంలో కూడా ఇండోనీషియా లిపిలో వ్రాసిన అతి ప్రాచీన వ్రాతప్రతులు కన్పించాయి.

(ప్రపంచ వైజ్ఞానిక సాంస్కృతికసంస్థ ఏర్పాటుచేసిన ప్రదర్శన సందర్భంగా ప్రభుత్వం ప్రచురించిన ప్రత్యేకవ్యాసాల సారాంశం.)

తృతీయ అఖిలభారత తెలుగు రచయితల మహాసభలు

తృతీయ అఖిలభారత తెలుగు రచయితల మహాసభలు మేనెల 30 వ తేదీన తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం హాలులో ప్రారంభమై నాలుగు రోజులపాటు (మే 30, 31, జూన్ 1, 2) జరిగాయి.

30 వ తేదీ ఉదయం శ్రీ కల్లూరు సుబ్బారావు పతాకోత్సవం జరిపారు. సాయంకాలం మహాసభ కేంద్రమంత్రి శ్రీ డి. సంజీవయ్య అధ్యక్షతన ప్రారంభమయింది. ఆహ్వాన సంఘాధ్యక్షులు శ్రీ గాదిరాజు జగన్నాథరాజు స్వాగత వచనాలు పలికినమీదట కార్యదర్శి శ్రీ పోతుకూచి సాంబశివరావు రచయితల మహాసభ ఉద్దేశాలు తెలిపారు. పిదప శ్రీ విశ్వనాథ సత్యనారాయణ మహాసభను ప్రారంభిస్తూ, మాతృభాషలో కొంత పరిజ్ఞానం సముపార్జించుకొనేవరకు బాలబాలికలకు వేరొక ఇతర భాషనూ బోధించరాదని సలహా యిచ్చారు. అధ్యక్షులు శ్రీ డి. సంజీవయ్య తమ ప్రసంగంలో మారిన రాజకీయార్థిక పరిస్థితులను, దేశంలో జరుగుతున్న ప్రజాస్వామ్య ప్రయోగాలను రచయితలు అర్థంచేసుకోవాలని, విజ్ఞాన శాస్త్ర విజయాలను తమ రచనల ద్వారా వ్యాపింపజేయాలని సలహా యిచ్చారు. శ్రీ సింగరాజు సచ్చిదానందం రాష్ట్రపతి రాధాకృష్ణన్, శ్రీ పి. వి. రాజమన్నార్, గవర్నర్ శ్రీ వి. వి. గిరి మొదలయిన పెద్దలు పంపిన సందేశాలను చదివి వినిపించారు. శ్రీ సాంబశివరావు వందన సమర్పణతో రాత్రి 9—30కు శ్రీ చిత్తూరు సుబ్రమణ్యంపిళ్లె బృందంవారి పాటకచ్చేరి జరిగింది.

మే 31 వ తేదీ ఉదయం "సంఘము—రచయిత" అనే విషయంపై శ్రీ డి. ఆంజనేయులు అధ్యక్షతన చర్చ జరిగింది. శ్రీయుతులు సి. హెచ్. వి. వి. మూర్తిరాజు చర్చను ప్రారంభించారు. శ్రీపోమంచి యజ్ఞన్నశాస్త్రి పాల్గొన్నారు. మధ్యాహ్నం "ప్రాచీన సాహిత్యం ఆధునిక సాహిత్యానికి ప్రాతిపదిక" అనే విషయంపై గోష్ఠి శ్రీ పింగళి లక్ష్మీకాంతం అధ్యక్షతన జరిగింది. శ్రీయుతులు టి. కనకరాజు, ప్రసన్న, కనక్ ప్రవాసి పాల్గొన్నారు. సాయంకాలం "14, 15 శతాబ్దాలలో ప్రాచీన సాహిత్యం" అన్న విషయంపై జరిగిన చర్చకు శ్రీ చెరుకుమిల్లి జమదగ్నిశర్మ అధ్యక్షత వహించారు. కేంద్రప్రభుత్వం ఉపమంత్రి శ్రీ బి. ఎస్. మూర్తి ప్రారంభించారు. శ్రీయుతులు ముట్నూరి సంగమేశం, చల్లా రాధాకృష్ణశర్మ, శ్రీమతి లక్ష్మీకాంతమ్మ, శ్రీయుతులు గొర్రెపాటి వేంకటసుబ్బయ్య, గొల్లపూడి వాసుదేవశాస్త్రి, దివాకర్ల వేంకటావధాని, చిలుకూరి పాపయ్యశాస్త్రి, పైడిపాటి సుబ్బరామయ్య మొదలయినవారు ప్రసంగించారు. గోష్ఠిని శ్రీ సింగరాజు సచ్చిదానందం సమావేశపరచారు. పిదప శ్రీ విశ్వనాథ సత్యనారాయణకు సన్మానం జరిగింది. శ్రీ కనక్ ప్రవాసి ధన్యవాదాలతో గోష్ఠి సమాప్తమైంది. రాత్రి జరిగిన అష్టావధానంలో పదిమంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ మహీధర జగన్మోహనరావు సమావేశపరిచారు.

జూన్ 1 వ తేదీ ఉదయం "నా తొలి పలుకు" అనే విషయంపై శ్రీ శివశంకరస్వామి అధ్యక్షతన చర్చ జరిగింది. శ్రీమతి ఆద్దేపల్లి వివేకానందాదేవి ప్రారంభించారు. శ్రీమతి లత కుమారి వాసిరెడ్డి సీతాదేవి పాల్గొన్నారు. మధ్యాహ్నం డాక్టర్ భద్రిరాజు కృష్ణమూర్తి అధ్యక్షతన "విశ్వవిద్యాలయాలలో, విద్యాసంస్థలలో వ్యావహారికభాష" అనే విషయంపై గోష్ఠి జరిగింది. సాయంకాలం శ్రీ మొక్కపాటి నరసింహశాస్త్రి అధ్యక్షతన "ఆధునిక సాహిత్యం" పై చర్చ జరిగింది. శ్రీయుతులు ఆర్. ఎస్. సుదర్శనం, కె. ఎస్. సుబ్రమణ్యం, జడపి రామకృష్ణారావు, ఏ. ఆర్. కృష్ణ, పోతుకూచి సూర్యనారాయణమూర్తి మొదలయినవారు పాల్గొన్నారు. సాయంకాలం కవిసమ్మేళనం జరిగింది.

జూన్ 2 వ తేదీ ఉదయం "శాస్త్ర పారిభాషిక పదజాలానికి సంస్కృతం ఏవిధంగా దోహదకారి" అన్న విషయంపై చర్చ శ్రీ డి. టి. తాతాచార్యులు అధ్యక్షతన జరిగింది. శ్రీయుతులు కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, మారేమండ రామారావు, వి. ఎస్. సుదర్శనాచార్య మున్నగువారు పాల్గొన్నారు. మధ్యాహ్నము రచయితల మహాసభ సర్వసభ్య సమావేశం జరిగింది. సాయంకాలం జరిగిన ఉత్తరాపథ భాషల సాహిత్యగోష్ఠికి ఆంధ్రప్రదేశ్ న్యాయశాఖామాత్యులు శ్రీ పి. వి. నరసింహారావు అధ్యక్షత వహించారు. డాక్టర్ గోపాలరెడ్డి ప్రారంభించారు. మరాఠీ, హిందీ, బెంగాలీ కవులు పాల్గొన్నారు. రాత్రి శ్రీ గాదిరాజు జగన్నాథరాజు అధ్యక్షత సమాప్త్యుత్సవం జరిగింది. మహాసభలు సమాప్తమయ్యాయి.

వడిపీచు గాడ్పున కొడిలెల్ల దలలు
వడిజేయు బసవన కొడలెల్ల భక్తి.

(పాల్కురికి బసవపురాణం)

గ్రంథ విమర్శలు

చరిత్రగల సీమ

(రచన : శ్రీ వావింటపర్తి కృష్ణరావు, ప్రకాశకులు : శ్రీ ఎస్. ఎస్. కృష్ణమూర్తి, మూలపేట, నెల్లూరు, వెల: రూ. 3—25.)

నెల్లూరుజిల్లా శాసన సంపుటములు మూడు. ఇప్పుడవి సర్వ సాధారణముగా అందరికి లభించుటలేదు. తిక్కన గ్రంథాలయములో ఉన్నవైనను చాలా శిథిలావస్థలో "నన్ను ముట్టకు నా మాలకాకి" అన్నట్లు ఉన్నవి.

శ్రీ కృష్ణరావు ఆ కొరతను తీర్చుటకే కాబోలు మొదటి మెట్టుగా కృతిపతి శ్రీ ఆనం సంజీవరెడ్డిగారి ఆమోద ప్రోత్సాహములతో ఆత్మకూరు తాలూకా శాసనములను మాత్రమే చరిత్ర గల సీమగా ప్రత్యేకించి సంకలనము చేసినారు.

శ్రీ కృష్ణరావు ఈ సంపుటములో శాసనముల నన్నిటిని తెనుగు లిపిలో ఉచ్చారణ లోపము రానట్లు మార్చి ప్రకటించుటయేకాక, ద్రావిడ సంస్కృత శాసనములకు మూలముతో పాటు వివరణాదులను తెనుగులో నిచ్చుట నేర్పు కూర్పు.

ఇదివరలో సంపుటములన్నియు ఆంగ్ల వివరణాదులతో ప్రకటించుటవల్ల అవి అందరికీ అందుబాటులో లేవు. అరవము, ఇంగ్లీషురాని చదువరి కా శాసన సంపుటములవల్ల కొంతయినను ప్రయోజనములేదు. ఇప్పు డా చిక్కు తీర్చుట కే క్రొత్త పద్ధతి చరిత్రగల సీమలో ప్రవేశపెట్టబడినట్లున్నది.

ప్రస్తావనలో ప్రసిద్ధ రాజవంశ చరిత్రలను కదంబములో ఆత్మకూరు తాలూకా ప్రస్తుత చరిత్రనంతను తాలూకా చిత్రపటములతో వివరించుట మరియొక్క విశేషము.

అయినను ఒక్కలోటు మాత్రము కొట్టవచ్చినట్లు కనబడుచున్న దీ సీమలో.

నెల్లూరుజిల్లా ఉదయగిరి తాలూకా (నె. 6) జడదేవి శాసనములోని ఆత్మకూరు తాలూకాకు సంబంధించినదే కాబోలన్న పల్లవ రాజ్య చరిత్రను ఈ చరిత్రగల సీమలో సూచింపక పోవడము విచారకరము.

"......నందివర్మ......అమ్మరాజులు......పానుంగోటి మాడురేన్ని సుక సంకథా వినోదంబుల రాజ్యంబు సేయుచు.... పూంగినాంట్టిలోన....చంద్రువడియయు.....గుడిపాడును బ్రాహ్మణుల కగ్రహారంబుగా నిచ్చి" నట్లున్నది.

(నం. 3—పు. 1337—39)

"పూంగినాటి"లో అనగా ఆత్మకూరు పాకనాటిలో ఇప్పటికిని పునుగోడు (పానుంగోడు), చంద్రువడియు (చంద్రుపిడియ), గుడిపాడు (గుడిపాడు) గ్రామములన్నియు మారుపేర్లు కలవై యున్నవి. కాబట్టి క్రీ. శ. 12 శతాబ్దము (క్రీ. శ. 1102 లో చిత్రభాను సంవత్సరము)లో పల్లవ రాజధాని యైన "పానుంగోటి మాడురేన్ని" చరిత్రగల సీమలో గుర్తింపక పోవడము గొప్ప పొరపాటు.

ఇట్లే కొన్ని వివరణాదులు కూడ వివాదాంశములై యున్నను, మొత్తముమీద ప్రథమ ప్రయత్నములో గ్రంథకర్త చక్కని కృషి చేసినట్లు అంగీకరించక తప్పదు. తక్కిన తాలూకా లన్నిటికిని ఇట్టి సీమలను సిద్ధము చేయించుట కృతిపతి ధర్మము.

చరిత్రగల సీమలో ఆత్మకూరు తాలూకా చరిత్ర యంతయు బీజప్రాయముగా గర్భితమై ఉన్నందున పాఠకులు గ్రంథ ప్రకాశకులకు ప్రోత్సాహము కలిగించుటకూడ విధియై యున్నది. లేనిచో నెల్లూరుజిల్లా చరిత్ర రచన కొనసాగదు.

—"శ్రీలెన్న దేవ్"

పాలంకి కథానికలు

(అష్టాదశ కథల సంపుటి. రచన శ్రీ పాలంకి వెంకటరామ చంద్రమూర్తి. ప్రచురణ : శేషాచలం అండు కో. ప్రాప్తిస్థానం: ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, రాష్ట్రపతి రోడ్డు, సికింద్రాబాదు, 190 పేజీలు, వెల సాదా ప్రతి : 2 రూ. మేలు ప్రతి. 3 రూ.)

అనుభవానికి చెందకుండ అనుభూతికి అందకుండ అసంఖ్యాకంగా కథానికలు వస్తున్నవి. వీటిలో కొద్ది మాత్రమే చెరిగిపోని ముద్రవేస్తున్నవి. వారం వారం పత్రికలు లెక్కలేనన్ని రచనలను కథలపేరుతో పాఠకలోకాని కందిస్తున్నవి. కథల పేరుతో చెలామణి అవుతున్న యీ గాజుముక్కలలో విలువైన రత్నాలను ఏరుకోవటం కష్టసాధ్యమే. సూదికై గడ్డివామిని గాలించినంత శ్రమించవలసి వస్తున్నది. రచయితలూ, పాఠకులూ కేవలం 'కాలక్షేపాన్ని' మాత్రమే ఆశించి వ్రాస్తున్నందున, చదువుతున్నందున వాటికి వాఙ్మయంలో ఏ స్థానం ఇవ్వాలో నిర్ణయించటం సులభసాధ్యం కాదు.

'పాలంకి' వారు సుప్రసిద్ధ కథానికా రచయితలు. వారు కూడ ఊసుపోకనే కథానికా రచన నభిమానిస్తున్నారట. "కథ నాకు కాలక్షేపం కాదు; వినోదం విలాసం కాదు; నాలోని సంకుచిత స్వార్థ ప్రాకారాలు కూలిపోవటం కోసమే నా కథలు" అని ప్రసిద్ధ కథానికా రచయిత ఒకరు వక్కాణించారు. ఊసుపోకకై వ్రాసిన కథలను చదవటం కాలాన్ని, ధనాన్ని వ్యర్థం చెయ్యటమే అవుతుంది.

యువతీ యువకుల ప్రేమాయణమూ, వాటి చిక్కులు విడదీయుటమూ, అవకతవకలూ, పెండ్లి పందిటిలో కథలో అంతమవ్వటమే కాక క్రొత్త తరహాలో దైనందిన జీవిత సమస్యలనే యితివృత్తంగా కొందరు కథకులు కల్పనలు సాగిస్తున్నారు. ఈ కోవకు చెందినవారే 'పాలంకి' వారు. సప్త వర్ణాల కలయికతో ఏర్పడిన జీవిత చిత్రాన్ని ఆయా రంగుటద్దాలలో దర్శించి ప్రదర్శించటం కథానికా రచనకు జీవాన్ని

గ్రంథ విమర్శలు

చరిత్రగల సీమ

(రచన : శ్రీ వావింటపర్తి కృష్ణరావు, ప్రకాశకులు : శ్రీ ఎస్. ఎస్. కృష్ణమూర్తి, మూలపేట, నెల్లూరు, వెల: రూ. 3—25.)

నెల్లూరుజిల్లా శాసన సంపుటములు మూడు. ఇప్పుడవి సర్వ సాధారణముగా అందరికీ లభించుటలేదు. తిక్కన గ్రంథాలయములో ఉన్నవైనను చాలా శిథిలావస్థలో "పన్ను ముట్టకు నా మాలకాకి" అన్నట్లు ఉన్నవి.

శ్రీ కృష్ణరావు ఆ కొరతను తీర్చుటకే కాబోలు మొదటి మెట్టుగా కృతిపతి శ్రీ ఆనం సంజీవరెడ్డిగారి ఆమోద ప్రోత్సాహములతో ఆత్మకూరు తాలూకా శాసనములను మాత్రమే చరిత్ర గల సీమగా ప్రత్యేకించి సంకలనము చేసినారు.

శ్రీ కృష్ణరావు ఈ సంపుటములో శాసనముల నన్నిటిని తెలుగు లిపిలో ఉచ్చారణ లోపము రానట్లు మార్చి ప్రకటించుటయేకాక, ద్రావిడ సంస్కృత శాసనములకు మూలములతో పాటు వివరణాదులను తెలుగులో నిచ్చుట వేర్పు కూర్పు.

ఇదివరలో సంపుటములన్నియు ఆంగ్ల వివరణాదులతో ప్రకటింపబడుటవల్ల అవి అందరికీ అందుబాటులో లేవు. అర సము, ఇంగ్లీషురాని చదువరి కా శాసన సంపుటములవల్ల కొంతయినను ప్రయోజనములేదు. ఇప్పు డా చిక్కు తీర్చుట కీ క్రొత్త పద్ధతి చరిత్రగల సీమలో ప్రవేశపెట్టబడినట్లున్నది.

ప్రస్తావనలో ప్రసిద్ధ రాజవంశ చరిత్రలను కదంబములో ఆత్మకూరు తాలూకా ప్రస్తుత చరిత్రనంతను తాలూకా చిత్రపటములతో వివరించుట మరియొక్క విశేషము.

అయినను ఒక్కలోటు మాత్రము కొట్టవచ్చినట్లు కనబడుచున్న దీ సీమలో.

నెల్లూరుజిల్లా ఉదయగిరి తాలూకా (నే. 6) జడదేవి శాసనములోని ఆత్మకూరు తాలూకాకు సంబంధించినదే కాబో లన్న పల్లవ రాజ్య చరిత్రను ఈ చరిత్రగల సీమలో సూచింపక పోవడము విచారకరము.

"........నందివర్మ........అమ్మరాజులు..........పానుంగోటి మాడురేన్నీ సుక సంకథా వినోదంబుల రాజ్యంబు సేయుచు.... పూంగినాంట్లలోన....జద్రుపడియయు.....గుడిపాడును బ్రాహ్మ ణుల కగ్రహారంబుగా నిచ్చి" నట్లున్నది.

(నం. 3—పు. 1337—39)

"పూంగినాటి"లో అనగా ఆత్మకూరు పాకనాటిలో ఇప్పటికిని పునుగోడు (పానుంగోడు), చంద్రపడియ (చంద్రు పడియ), గుడిపాడు (గుడిపాడు) గ్రామములన్నియు మారుపేర్లు కలవై యున్నవి. కాబట్టి క్రీ. శ. 12 శతాబ్దము (క్రీ. శ. 1102 లో చిత్రభాను సంవత్సరము)లో పల్లవ రాజధాని యైన "పానుంగోటి మాడురేన్ని" చరిత్రగల సీమలో గుర్తింపక పోవడము గొప్ప పొరపాటు.

ఇట్లే కొన్ని వివరణాదులు కూడ వివాదాంశములై ఉన్నను, మొత్తముమీద ప్రథమ ప్రయత్నములో గ్రంథకర్త చక్కని కృషి చేసినట్లు అంగీకరించక తప్పదు. తక్కిన తాలూకా లన్నిటికిని ఇట్టి సీమలను సిద్ధము చేయించుట కృతిపతి ధర్మము.

చరిత్రగల సీమలో ఆత్మకూరు తాలూకా చరిత్ర యంతయు బీజప్రాయముగా గర్భితమై ఉన్నందున పాఠకులు గ్రంథ ప్రకాశకులకు ప్రోత్సాహము కలిగించుటకూడ విధియై యున్నది. లేనిచో నెల్లూరుజిల్లా చరిత్ర రచన కొనసాగదు.

—"కృష్ణదేవ్"

పాలంకి కథానికలు

(అష్టాదశ కథల సంపుటి. రచన శ్రీ పాలంకి వెంకటరామ చంద్రమూర్తి. ప్రచురణ : శేషాచలం అండు కో. ప్రాప్తిస్థానం: ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, రాష్ట్రపతి రోడ్డు, సికింద్రాబాదు, 190 పేజీలు, వెల సాదా ప్రతి : 2 రూ. మేలు ప్రతి. 3 రూ.)

అనుభవానికి వెందకుండ అనుభూతికి అందకుండ అనంత్యాకంగా కథానికలు వస్తున్నవి. వీటిలో కొద్ది మాత్రమే తెరిగిపోని ముద్రవేస్తున్నవి. వారం వారం పత్రికలు లెక్కలేనన్ని రచనలను కథలపేరుతో పాఠకలోకాని కందిస్తున్నవి. కథల పేరుతో చెలామణి అవుతున్న యీ గాజుముక్కలలో విలువైన రత్నాలను ఏరుకోవటం కష్టసాధ్యమే. మాదిక్కై గడ్డివామిని గాలించినంత శ్రమించవలసి వస్తున్నది. రచయితలూ, పాఠకులూ కేవలం 'కాలక్షేపాన్ని' మాత్రమే ఆశించి వ్రాస్తున్నందున, చదువుతున్నందున వాటికి వాఙ్మయంలో ఏ స్థానం ఇవ్వాలో నిర్ణయించటం సులభసాధ్యం కాదు.

'పాలంకి' వారు సుప్రసిద్ధ కథానికా రచయితలు. వారు కూడ పూసుపోకనే కథానికా రచన నభిమానిస్తున్నారట. "కథ నాకు కాలక్షేపం కాదు; వినోదం విలాసం కాదు; నాలోని సంకుచిత స్వార్థ ప్రాకారాలు కూలిపోవటం కోసమే నా కథలు" అని ప్రసిద్ధ కథానికా రచయిత ఒకరు వక్కాణించారు. పూసుపోకకై వ్రాసిన కథలను చదవటం కాలాన్ని, ధనాన్ని వ్యర్థం చెయ్యటమే అవుతుంది.

యువతీ యువకుల ప్రేమాయణమూ, వాటి చిక్కులు విడదీయటమూ, అపకలనకలూ, పెండ్లి పందిటిలో కథలో అంతమవ్వటమే కాక క్రొత్త తరహాలో దైనందిన జీవిత సమస్యలనే యితివృత్తంగా కొందరు కథకులు కల్పనలు సాగిస్తున్నారు. ఈ కోవకు చెందినవారే 'పాలంకి' వారు. సప్త వర్ణాల కలయికతో ఏర్పడిన జీవిత చిత్రాన్ని ఆయా రంగుటద్దాలలో దర్శించి ప్రదర్శించటం కథానికా రచనకు జీవాన్ని

కల్పించటం. వస్తువు ననుసరించి, పాత్రల మనస్తత్వాల్ని సంఘటనలను ఆలంబనంగా చేసుకొని సామాన్యంగా కథానికలు ఏర్పడుతూ ఉంటవి.

ఈ సంపుటంలోని కథానికలలో చాలవరకు సంవిధానాన్ని ఆలంబనంగా చేసుకొన్నవి (Stories of Technique) 'నా కెందుకు పోనిస్తూ'—'తనదాకా వస్తే'—'శాస్త్రి—రావు'—'త్రాసే నెగ్గింది' కథలు ఎన్నదగినవి. కథానికకు వలసినంత గాంభీర్యమూ, కథాకథన చాతురి వీటిలో లోపించినవి. 'స్కెచ్' లకు మల్లే మెరుపు మెరిసినట్లుగా ఒక్కసారి కథలు కంచికి వెళ్ళిపోతవి.

ముఖచిత్రం, 'సద్యః ఫలితం'—'వెంటబడ్డ వ్యక్తి'—'వసుంధరా విశ్వాసం'—'శోష్యం నిజమైంది' కథలలో ఆంగ్ల కథానికల ఛాయలూ, ప్రభావమూ కనిపిస్తవి. 'తనదాకా వస్తే' కథలో అభాండేశ్వరరావు, 'అపవాదమ్మ', 'ప్రచారిణమ్మ'—'సానుకూలమూర్తి' వంటి పేరులు ముచ్చటగా ఉండి కథలో పాత్రల స్వభావాన్నిబట్టి పేరు ఉంచటం జరిగింది. కీ. శే. వీరేశలింగంగారు తమ ప్రహసనాలలో 'వివేకారావు' 'అవివేకారావు' వంటి పాత్రోచిత నామధేయాలు వాడి హాస్యాన్ని కల్పించారు.

'జరిమానా' కథ పడ్డికాసులవాడి మాహాత్మ్యాన్ని చాటటమే ప్రధానాశయంగా వ్రాయబడింది. సంస్కరణకై సాహసించేవారిపట్ల తగినంత సానుభూతిలేక శంకించే మధ్యతరగతి మనస్తత్వంతోపాటు మూఢనమ్మకాల పట్ల రచయిత విపరీతమైన నమ్మకాన్ని వెల్లడించారు.

'శాస్త్రి—రావు' అనే కథ అన్నింటిలోనూ ఉదాత్తమైనది. సంస్కారం గురించి ఆలోచించేవాళ్ళు ఏవిధంగా వెనుకంజ వేసేదీ, సంఘ సంస్కర్త ప్రోత్సాహంతో వనాలను లేవిధంగా ముసుముందుకు సాగిపోయేదీ అందంగా చెప్పారు.

'పిలంకి' కథానికలు పిలకరణ్యనటం అతిశయోక్తి కాదు. కథకు చిట్టచివరి భాగంలో చిత్రమైన ముగింపు నివ్వటం వో హెన్రీ ప్రవేశపెట్టిన టెక్నిక్ 'వెధవడబ్బు', 'త్రాసే నెగ్గింది' వంటి కథలలో యీ టెక్నిక్. పాటించారు.

ప్రత్యుపకారం

(ప్రత్యుపకారం—కథానికల సంపుటి. ప్రచురణ : ఎం. శేషాచలం అండ్ కో, మద్రాసు—మచిలీపట్టణము — సికింద్రాబాదు. రచన : వి. ఎస్. అవధాని. 192 పేజీలు. వెల సాదా: రు. 2. మేలు రు. 3. ప్రాప్తిస్థానం : ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, రాష్ట్రపతిరోడ్డు, సికింద్రాబాదు.)

ఏమిటి చెప్పటం, ఎలా చెప్పటం అన్నవి కథానికకు రెండు కళ్ళు. "కాదేదీ కవిత కనర్హం ?" అన్నట్లే మనకు తారసిల్లే ప్రతి వ్యక్తిని గురించి కథ వ్రాయవచ్చు. "నన్ను గురించి కథ వ్రాయవూ !" అని అడిగిన బాలిక గురించి బుచ్చిబాబుగారు చిరస్మరణీయమైన కథ వ్రాశారు. మధ్య తరగతి సాంసారిక జీవితంలో వచ్చే ఒడిదుడుకులను కథలుగా మలచడంలో శ్రీ వి. ఎస్. అవధానిగారు మంచి నేర్పు చూపించారు. "రంగమ్మ నవ్వు", "వెంచులచ్చి" మిగిలిన కథలకన్న విచిత్రంగా ఉన్నవి. కథాసంవిధానంలో రచయిత నేర్పు అడుగడుగునా కన్పిస్తుంది.

స్టీవెన్సన్ చెప్పిన కథానికా లక్షణాలనుబట్టి చూస్తే 'చిన్న కథ' లోని వస్తువు పరిమాణంలో చిన్నది కానక్కరలేదు. 'కదులుతున్న కుదురు'—వంటి పెద్ద కథలూ, 'భ్రమలో విరహం' వంటి చిన్న కథలూ యీ సంపుటంలో ఉన్నవి. ఏ కథ కదే విశిష్టంగా ఉండి జీవితకోణాలను పలు దిక్కుల నుండి చూపిస్తుంది.

ప్రత్యుపకారం కథలో కథానాయకుడు రామారావు పరీక్ష ఫేలవుతాడు. ఇంటిల్లిపాదీ నిరసనగా చూస్తారు. కుటుంబమంతా కష్టదశలో ఉన్నప్పుడు ఖాజాబీ అనే వాళ్ల పనిమనిషి కూతురు వాళ్ళను ఆదుకొని ఉపకారం చేస్తుంది. దానికి ప్రత్యుపకారంగా రామారావు ఆమెను తీసుకొని బొంబాయి వెళ్లిపోయి కొత్త జీవితం ప్రారంభిస్తాడు. పాపం తెల్లనివన్నీ పాలనుకొనే లోకం వాళ్లిద్దరిమీద నిందలు వేస్తుంది. ఏమైతేనేం, నాయకుడు తెగించి నూతన జీవితం ప్రారంభించేస్తాడు. ఈ కథ పేరే యీ సంపుటానికి 'టైటిల్' గా ఉంచారు.

'హంసపాదు' కథలో కుమార్తెను పెళ్లి మార్కెట్లో బేరం పెట్టడానికి బాధపడే తండ్రి మనస్తత్వాన్ని చిత్రించారు. ఒంటెద్దుబండి కథలో స్వతంత్ర జీవనం ప్రారంభించాలని పట్నం వెళ్ళిన యువకుడు పల్లెలో అపోహలకు గురియైనా ప్రయోజకుడై [illegible]

'కదులుతున్న కుదురు' పెద్ద కథ. మధ్య తరగతి సాంసారిక జీవితాన్ని కదులుతున్న కుదురుతో పోల్చడం సమంజసంగానే ఉన్నది. ఆర్థికమైన ఒడిదుడుకులే ఒక్కొక్కప్పుడు మనుష్యుల మమతలకేవిధంగా కారణమౌతాయో వివరించారు. 'అద్యంతాలు' కథలో వైద్యం పేరుతో మోసంచేసే యువకుని జీవితం చిత్రించారు. ఆద్యంతాలు రెండూ కథకు అసంపూర్తిగా ఉన్నాయి. వ్రాసూ వ్రాస్తున్న కథను ముగింపు తెలియక ఏదోవిధంగా ఆపేసిన ట్లనిపిస్తుంది.

'సంక్రాంతి పురుషుడు—రైతు రామయ్య' కథలో రైతు జీవితంలోని వెలుగునీడలను అందంగా చూపించారు. ఈ సంపుటంలో ఉదాత్తమైన కథ ఇది. నైవేద్యం, జరుగుబాటు కథలలో విశిష్టతేమీ లేదు. 'రంగమ్మ నవ్వు', 'భ్రమలో విరహం', 'వెంచులచ్చి' కథలను కథ అనడం కన్నా ఒక విధమైన 'స్కెచ్' అనడం సరిగా ఉంటుందేమో !

'రంగమ్మ నవ్వు' లో "ఈవిధంగా ఒడిదుడుకులలేని దున్నపోతుల బండిలాగా సాగిపోతున్న రంగమ్మ జీవితంలో ఇన్నాళ్లకు 'నవ్వు' మొలిచింది !!" అని వ్రాయటం చిత్రంగా ఉన్నా, ఎబ్బెట్టుగా కూడా ఉన్నది.

ప్రజల్ని, న్యాయాన్ని, నమ్మి మోసపోయిన కరణంగారి కథే "కరణంగారి కథ."

సాంఘిక సమస్యలను వస్తువుగా వ్రాసిన యీ కథలు, చదివాక ఆయా సమస్యలకు పరిష్కారమార్గమేమీ కన్పించదు

కల్పించటం. వస్తువు ననునరించి, పాత్రల మనస్తత్వాల్ని సంఘటనలను ఆలంబనంగా చేసుకొని సామాన్యంగా కథానికలు ఏర్పడుతూ ఉంటవి.

ఈ సంపుటంలోని కథానికలలో చాలవరకు సంవిధానాన్ని ఆలంబనంగా చేసుకొన్నవి (Stories of Technique) 'నా కెందుకు పోనిమ్మూ'—'తనదాకా వస్తే'—'శాస్త్రి—రావు'—'త్రాసే వొగ్గింది' కథలు ఎన్నదగినవి. కథానికకు వలసినంత గాంభీర్యమూ, కథాకథన చాతురి వీటిలో లోపించినవి. 'స్కెచ్' లకు మల్లే మెరుపు మెరిసినట్లుగా ఒక్కసారి కథలు కంచికి వెళ్లిపోతవి.

ముఖచిత్రం, 'సద్యః ఫలితం'—'వెంటబడ్డ వ్యక్తి'—'వసుంధరా విశ్వాసం'—'జోస్యం నిజమైంది' కథలలో ఆంగ్ల కథానికల ఛాయలూ, ప్రభావమూ కనిపిస్తవి. 'తనదాకా వస్తే' కథలో అభాండేశ్వరరావు, 'అపవాదమ్మ', 'ప్రచారిణమ్మ'—'సాను కూలమూర్తి' వంటి పేరులు ముచ్చటగా ఉండి కథలో పాత్రల స్వభావాన్నిబట్టి పేరు ఉంచటం జరిగింది. కీ. శే. వీరేశలింగంగారు తమ ప్రహసనాలలో 'వివేకారావు' 'అవివేకారావు' వంటి పాత్రోచిత నామధేయాలు వాడి హాస్యాన్ని కల్పించారు.

'జరిమానా' కథ వడ్డీకాసులవాడి మాహాత్మ్యాన్ని చాటటమే ప్రధానాశయంగా వ్రాయబడింది. సంస్కరణకై సాహసించేవారిపట్ల తగినంత సానుభూతిలేక శంకించే మధ్యతరగతి మనస్తత్వంతోపాటు మూఢనమ్మకాల పట్ల రచయిత విపరీతమైన నమ్మకాన్ని వెల్లడించారు.

'శాస్త్రి—రావు' అనే కథ అన్నింటిలోనూ ఉదాత్తమైనది. సంస్కారం గురించి ఆలోచించేవాళ్లు ఏవిధంగా వెనుకంజ వేసేదీ, సంఘ సంస్కర్త ప్రోత్సాహంతో సనాతను లేవిధంగా ముందుముందుకు సాగిపోయేదీ అందంగా చెప్పారు.

'హెంకి' కథానికలు హెలకరణ్యసటం అతిశయోక్తి కాదు. కథకు చిట్టచివరి భాగంలో చిత్రమైన ముగింపు నివ్వటం వో హెన్రీ ప్రవేశపెట్టిన టెక్నిక్ 'వెధవసబ్బు', 'త్రాసే వొగ్గింది' వంటి కథలలో యీ టెక్నిక్. పాటించారు.

ప్రత్యుపకారం

(ప్రత్యుపకారం—కథానికల సంపుటి. ప్రచురణ : ఎం. శేషాచలం అండ్ కో, మద్రాసు—మచిలీపట్టణము — సికింద్రాబాదు. రచన : వి. ఎస్. అవధాని. 192 పేజీలు. వెల సాదా: రు. 2. మేలు రు. 3. ప్రాప్తిస్థానం : ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, రాష్ట్రపతిరోడ్డు, సికింద్రాబాదు.)

ఏమిటి చెప్పటం, ఎలా చెప్పటం అన్నవి కథానికకు రెండు కళ్లు. "కాదేదీ కవిత కనర్హం ?" అన్నట్లే మనకు తారసిల్లే ప్రతి వ్యక్తిని గురించి కథ వ్రాయవచ్చు. "నన్ను గురించి కథ వ్రాయవూ!" అని అడిగిన బాలిక గురించి బుచ్చిబాబుగారు చిరస్మరణీయమైన కథ వ్రాశారు. మధ్య తరగతి సాంసారిక జీవితంలో వచ్చే ఒడిదుడుకులను కథలుగా మలచడంలో శ్రీ వి. ఎస్. అవధానిగారు మంచి నేర్పు చూపించారు. "రంగమ్మ నవ్వు", "వెంచులచ్చి" మిగిలిన కథలకన్న విచిత్రంగా ఉన్నవి. కథాసంవిధానంలో రచయిత నేర్పు అడుగడుగునా కన్పిస్తుంది.

స్టీవెన్సన్ చెప్పిన కథానికా లక్షణాలనుబట్టి చూస్తే 'చిన్న కథ' లోని వస్తువు పరిమాణంలో చిన్నది కానక్కరలేదు. 'కదుల్తున్న కుదురు'—వంటి పెద్ద కథలూ, 'భ్రమలో విరహం' వంటి చిన్న కథలూ యీ సంపుటంలో ఉన్నవి. ఏ కథ కదే విశిష్టంగా ఉండి జీవితకోణాలను పలు దిక్కుల నుండి చూపిస్తుంది.

ప్రత్యుపకారం కథలో కథానాయకుడు రామారావు పరీక్ష ఫేలవుతాడు. ఇంటిల్లపాదీ నిరసనగా చూస్తారు. కుటుంబమంతా కష్టదశలో ఉన్నప్పుడు ఖాజాబీ అనే వాళ్ల పనిమనిషి కూతురు వాళ్లను ఆదుకొని ఉపకారం చేస్తుంది. దానికి ప్రత్యుపకారంగా రామారావు ఆమెను తీసుకొని బొంబాయి వెళ్లిపోయి కొత్త జీవితం ప్రారంభిస్తాడు. పాపం తెల్లనివన్నీ పాలనుకొనే లోకం వాళ్లిద్దరిమీద నిందలు వేస్తుంది. ఏమైతేనేం, నాయకుడు తెగించి నూతన జీవితం ప్రారంభించేస్తాడు. ఈ కథ పేరే యీ సంపుటానికి 'టైటిల్' గా ఉంచారు.

'హంసపాదు' కథలో కుమార్తెను పెళ్లి మార్కెట్లో బేరం పెట్టడానికి బాధపడే తండ్రి మనస్తత్వాన్ని చిత్రించారు. ఒంటెద్దుబండి కథలో స్వతంత్ర జీవనం ప్రారంభించాలని పట్నం వెళ్లిన యువకుడు పల్లెలో ఆపోహలకు గురియైనా ప్రయోజకుడై [illegible] తిరిగి వస్తాడు.

'కదుల్తున్న కుదురు' పెద్ద కథ. మధ్య తరగతి సాంసారిక జీవితాన్ని కదుల్తున్న కుదురుతో పోల్చడం సమంజసంగానే ఉన్నది. ఆర్థికమైన ఒడిదుడుకులే ఒక్కొక్కప్పుడు మనుష్యుల మమతలకేవిధంగా కారణమౌతాయో వివరించారు. 'ఆద్యంతాలు' కథలో వైద్యం పేరుతో మోసంచేసే యువకుని జీవితం చిత్రించారు. ఆద్యంతాలు రెండూ కథకు అసంపూర్తిగా ఉన్నాయి. వ్రాసూ వ్రాస్తూన్న కథను ముగింపు తెలియక ఏదోవిధంగా ఆపేసిన ట్లనిపిస్తుంది.

'సంక్రాంతి పురుషుడు—రైతు రామయ్య' కథలో రైతు జీవితంలోని వెలుగునీడలను అందంగా చూపించారు. ఈ సంపుటంలో ఉదాత్తమైన కథ ఇది. నైవేద్యం, జరుగుబాటు కథలలో విశిష్టతేమీ లేదు. 'రంగమ్మ నవ్వు', 'భ్రమలో విరహం', 'వెంచులచ్చి' కథలను కథ అనడం కన్నా ఒక విధమైన 'స్కెచ్' అనడం సరిగా ఉంటుందేమో!

'రంగమ్మ నవ్వు' లో "ఈవిధంగా ఒడిదుడుకులులేని దున్నపోతుల బండిలాగా సాగిపోతున్న రంగమ్మ జీవితంలో ఇన్నాళ్లకు 'నవ్వు' మొలిచింది !!" అని వ్రాయటం చిత్రంగా ఉన్నా, ఎబ్బెట్టుగా కూడా ఉన్నది.

ప్రజల్ని, న్యాయాన్ని, నమ్మి మోసపోయిన కరణంగారి కథే "కరణంగారి కథ."

సాంఘిక సమస్యలను వస్తువుగా వ్రాసిన యీ కథలు, చదివాక ఆయా సమస్యలకు పరిష్కారమార్గమేమీ కన్పించదు

సమస్యల గురించిన ఆలోచన, చిత్రణలో చేవ ఉన్న రచనా శక్తి పాఠకులను నిలిపి చదివిస్తాయి. పుస్తకానికి ఆకర్షణీయమైన 'గంగాధర్' గారి ముఖచిత్రమూ, రచయిత గురించిన చక్కని పరిచయమూ అందాన్నిచ్చాయి.

సుమసౌరభాలు

(పదిహేను కథానికల సంపుటి. సంకలనం : శ్రీ కె. ఆర్. కె. మోహన్. ప్రతులకు : శ్రీముఖ పబ్లికేషన్స్, ఫోర్టు రోడ్డు, మచిలీపట్నం—1. 244 పేజీలు, వెల : రు. 3—00 రు.)

"కథకు కాళ్ళులేవు—ముంతకు చెవులు లేవు" చెప్పటాని కొక కథ ఉన్నదా లేక కథ చెప్పాలనే కుతూహలం మాత్రమే ఉన్నదా అంటే యీ సంకలనంలోని రచయితలకు కథ చెప్పాలనే కుతూహలం మాత్రమే ఉన్నది. పత్రికా ప్రపంచానికి వీరిలో ఏ ఒకరిద్దరో తప్ప మిగిలినవారు సుపరిచితులు కారు. కొత్తగా కథారచన కుపక్రమించిన వీరి కథలలో కొత్తదనం మాత్రమేనా లేక విశిష్టతమైన ఉన్నదా అంటే ఉన్నదని చెప్పాలి. 'బంగారు సంకెళ్ళు' అనే కథ ఉత్తమ స్థాయిలో ఉన్నది. రచయిత ముక్కామల వెంకటేశ్వరరావుగారు లోక వృత్త పరిశీలనలో ప్రజ్ఞాపారంగతులుగా కన్పిస్తారు. మెరుపుల్లా తట్టి మేల్కొలిపే వాక్యాలు : "నేను చచ్చినా చావను", "వెలుగు చీకటి కౌగిలిలో వాలిపోయింది", "వైరాగ్యం రెక్క విదుపుతోంది", "ప్రాయశ్చిత్తం పెదలు తొక్కుతోంది" వంటివి ఆయన ప్రతిభకు నిదర్శనం.

ఈ సంకలనంలో ఉన్న కథలలోని వైవిధ్యం రచనా శైలిలో అంతగా కానరాదు. శరణార్థుల సమస్యపై వ్రాసిన కథ విస్మయాన్ని కల్పిస్తుంది. కథ ముగింపులో చిత్రమైన మార్పు మెచ్చుకోదగినది.

"నేను చేసిన పని" అనే 'రంగశ్రీ' గారి కథవలన పర్యవసానం ఏమిటో బోధపడదు. జబ్బుడైన భర్తను వదలి ప్రియునితో పారిపోతున్న ఒక అమ్మాయిని పోలీసులు అవినీతి చట్టం క్రింద 'అరెస్టు' చేసి అనవాయమైన ఆ స్త్రీ మానాన్ని అపహరిస్తారు. దీనివలన ఆ స్త్రీ పతిత అవుతుంది. ఈ కథలో ప్రస్తావికంగా "పవిత్ర సంఘం" అంటూ 'సంఘం' గురించి లేనిపోని ఆక్రోశాన్ని రచయిత వెలిబుచ్చారు. దీనికి సంఘం ఏవిధంగా జవాబుదారీ కాగలదు ? న్యాయచట్టం యీ సమస్యను తీర్చాలి. పోలీసుల కొక న్యాయచట్టం, ప్రజల కింకొక న్యాయచట్టం లేదని రచయిత గమనించాలి.

"కోర్టు చేయలేని న్యాయం" గురించి శ్రీ కంచి వాసుదేవరావుగారు చక్కగా వివరించారు. పాలం పాట గురించి నిష్కర్షగా తీర్పుచెప్పే న్యాయస్థానం, ఆ ఫలవృక్షానికి ఆలంబనంగా పెరిగిన జీవితాలనూ, ఆ చెట్టుతో ముడిపడిన కుటుంబ సభ్యుల మమతా మాధుర్యాలనూ అర్థంచేసుకోదని చక్కని సమస్యను లేకెత్తించారు.

"ప్రకృతి" కథలో రచయిత జీవితాన్ని గురించి నిర్వచించే సాహసానికి పూనుకొని అసందర్భమైన ఉదాహరణలిచ్చారు. "జీవితం సదిసముద్రంలోని చుక్కానిలేని నావ లాంటిది. మైలురాయి లాంటిది. విమానం ప్రొఫెల్లరు లాంటిది. పట్టాలమీద కదులుతోన్న రైలు లాంటిది. జీవితం రచయిత కలం లాంటిది." అంటూ ఒకదాని కొకటి అంగరంటని నిర్వచనాలను చేశారు.

ఈ సంకలనంలోని కథలన్నీ "అనగా అనగా" అని మొదలుపెట్టే విధంగా ప్రత్యక్ష రామాయణ కథనాన్ని ఆశ్రయించాయే గాని సంవిధానంలో కొత్త పుంతలను త్రొక్కలేదు. 'బంగారు సంకెళ్ళు' యీ విధానానికి అపవాదంగా నిలుస్తుంది. అన్ని కథలలోనూ వస్తు గాంభీర్యం ఉన్నది. దానితోబాటు కథలను 'ఎడిట్' చేసుకోలేని రచయితల అవరిణతి కూడ కన్పిస్తుంది. సంకలనాల ద్వారా వెలుగులోనికి వస్తున్న రచయితలలో అమూల్య రత్నాలను ఏరుకోవలసిన బాధ్యత పాఠకలోకం పైన ఉన్నది.

వక్రించిన సరళ రేఖలు

(రచన : శ్రీకె. ఆర్. కె. మోహన్. ప్రతులకు : శ్రీముఖ పబ్లికేషన్స్, ఫోర్టు రోడ్డు, మచిలీపట్నం—1. 184 పేజీలు. వెల : రు. 3.)

నవలా రచన గురించి ఎంత చెప్పినా కొంతే అవుతుంది. ఏమిచెప్పినా "ఏనుగును గురించిన గ్రుడ్డివాళ్ల వ్యాఖ్య" మాత్రమే అవుతుంది. జీవిత సత్యాలను ఆకర్షవంతంగా చిత్రించి జీవితాని కున్నంత విలువ నవలకు కూడ కల్పించగలిగితే నవలారచన సార్థకత పొందుతుంది. తెలుగుభాషలో మహోన్నత నవల ఇంకా అవతరించేవలసే ఉంది. గత శతాబ్దంలో మున్నెన్నడూ లేనన్ని నవలలు వచ్చాయి. సంఖ్యలోనే గాక వస్తు వైవిధ్యంలోనూ అపరిమితంగా నవలలు వచ్చి పడ్డాయి. ప్రతీ నవలా దాని విశిష్టతను నిరూపించుకోవటానికి ప్రయత్నించినా ఒకేవిధమైన సాంఘికేలి వృత్తాలూ, జీవిత నిర్వచనాలూ, క్రొత్తగా దిగుమతియైన 'ఫ్రాయిడియన్' మనస్తత్వ పరిశీలనమూ కుప్పతెప్పలుగా కనుపిస్తుంది.

మానవాతీతమైన అతీంద్రియశక్తి ఏదో మనిషిని చేయిపుచ్చుకు నడిపించి ఘటన కనుగుణంగా జీవితాన్ని వొడ్డుకు చేర్చటం ఈ నవలలోని యితివృత్తం. యాంత్రిక జీవితంతో అసహనం పెరిగిపోయి పుస్తకాన్ని త్వరగా ముగించాలని తహతహలాడే పాఠకుల అభిరుచిని గ్రహించి శ్రీ మోహన్ నవలను సంక్షిప్తంగా రచించారు. సంభాషణలకన్న కథానకమే అత్యధికంగా ఉన్న నవలలో సంఘటనలన్నీ ఘటన ననుసరించి నడిచినవి.

అక్కౌంటెంటు సుందరరామయ్య బాంకులో డబ్బు తీసుకొని రాబోతూ ఉండగా చేతి సంచిలోని డబ్బును ఎవరో అపహరిస్తారు. అపవాదుకు భయపడి, ముందు జరుగబోయే సంఘటనలను కుదురుగ్గా ఆలోచించుకోలేక భయపడి పారిపోతాడు. పరిస్థితుల నెదుర్కొలేక పారిపొయ్యే సామాన్య సంసారి అసమర్థతను చక్కగా వర్ణించారు. కూతురు కాపురం కోసం తోటి మనిషినుండి డబ్బును దొంగిలించి, తరు

వాత ఏర్పడిన విషాద పరిణామాలకు దిగ్భ్రాంతుడైన వెంకట్రావు పాత్ర విశిష్టమైనది. కుటుంబంలో ఒక మనిషిపై వచ్చిన అపవాదు ఆ కుటుంబాన్నంతటినీ వేధించి, వేటాడి సాధించే లోకనైజాన్ని అద్దంలో చూపించారు.

యువతీ యువకుల ప్రేమను సహజత్వానికి దూరంగా, ఏవో పుస్తకాలలో చదివి నెమరు వేస్తున్నట్లు, లేక ఏ సినిమా సంఘటననో మనస్సులో నిల్పుకొని వ్రాస్తున్నట్లుగా కల్పన చేశారు. అనూరాధ, మధుల ప్రేమా, పెళ్లి రెండూ కూడ వాస్తవానికి దూరం కావటమే కాక ఆదర్శప్రాయంగా కూడ లేవు.

నవలల్లో పాత్రలకు కష్టాలొస్తే ఏ కుట్టుమిషను కొనుక్కొనో, హోటల్ వ్యాపారం ప్రారంభంచో, సంగీతం పాఠాలు చెప్పికోనో స్వతంత్రంగా జీవయాత్ర సాగిస్తారు. ఈ నవలలో కూడ శాంతమ్మ, అనూరాధలు హోటల్ వ్యాపారంలోనూ, సంగీతపాఠాలు చెప్పుకొని జీవనయాత్ర సాగిస్తారు. ఇది అసంగతం. నవలలు చదివి నవలలు వ్రాయా లనుకొనే రచయిత అసమర్థత వెల్లడి అవుతుంది.

ప్రారంభించిన వ్యాపారాలు సినిమాల్లో గుర్రాలు పరుగెత్తినంత వేగంగా అభివృద్ధిచెందడం నవలల్లో సర్వ సామాన్యమైన విషయం. ఈ నవలలోనూ శాంతమ్మగారి హోటల్ వ్యాపారం, వెంకట్రావుగారి కాకిరాయి వ్యాపారం కూడ 'సినిమాటిక్' గా వృద్ధి పొందుతవి.

"కథలో సమస్యకు పరిష్కారం కన్పించక, ముగింపు తోచనప్పుడు ఎవరో ఒకర్ని ఆశ్రమానికి పంపించి దేశభక్తి గీతాలు పాడిస్తే సరి! Dirty Sentiment" అంటూ చలంగారు తెలుగు కథలలోని దౌర్బల్యాన్ని ఎత్తి చూపించారు. ఈ నవలలో వెంకట్రావు 'భువనేశ్వర్' వెళ్లి కాకిరాయి వ్యాపారం ప్రారంభిస్తాడు. శాంతమ్మ 'దక్షిణేశ్వర్'లో హోటల్ వ్యాపారం నడుపుతుంది. ఇవన్నీ చూస్తే రచయిత తాను చూచిన ప్రదేశాల సౌందర్యాన్ని, వివరణలనూ ఎలాగో ఒకలాగ నవలలో ప్రవేశపెట్టారేమో ననిపిస్తుంది. లేకపోతే వెంకట్రావు పుణ్యక్షేత్ర పర్యటనకు అన్ని వివరాలు ఇవ్వటం దేనికి ? ఆయా ప్రాంతాల క్షేత్ర మాహాత్మ్యాన్ని వర్ణించటంవలన నవల కేమిటి పుష్టి ? ఏం ప్రయోజనం ?

వ్యక్తుల కష్టాలు మబ్బుల్లా విడిపోవటానికి ఏదో ఒక పుణ్యక్షేత్రంలో వారి సమాగమాన్ని ఏర్పాటుచేసి వారి గత జీవితాన్ని గురించిన దీర్ఘోపన్యాస మిప్పించి తప్పుచేసిన ప్రతి పాత్ర పశ్చాత్తాపపడి, "సర్వేజనా సుఖినో భవంతు" అనేదాకా తృప్తిపడ దెందుకో యీ రచయితలకు ? అడుగడుగునా ఇట్టి లోపాలు కన్పించటంవలన, నవల చదవటం వలన పొద్దుపోక తప్ప విజ్ఞానం, వికాసం, సంస్కారం, జీవిత సమస్యల పట్ల ఏర్పడవలసిన గాంభీర్యం వంటి వేవీ కలుగవు.

సాంఘికేతివృత్తాన్ని తీసుకొన్న రచయిత నిర్వహణలో సమర్థులు కాలేదు. ఈ నవలలో పాత్రల చర్యలు కర్మ సిద్ధాంతంపైన ఆధారపడి వాటి ఇష్టం వచ్చినట్లు నడుస్తవి. రచయిత చెప్పినట్లు ససేమిరా వినవు.

నారాయణమ్మ

(జాతీయ ప్రబంధము. కృతికర్త : శ్రీ ముదివర్తి కొండమాచార్యులు. గూడూరు, నెల్లూరుజిల్లా. 111 పేజీలు, వెల : రు. 2—50.)

కరుణరస ప్రధానమగు జాతీయ ప్రబంధమిది. ఇట్టి గ్రంథములు తెలుఁగున పెక్కు లేవు. కొన్ని దశాబ్దముల క్రిందట కవికోకిల దువ్వూరి రామిరెడ్డిగారి "నలజారమ్మ అగ్నిప్రవేశము" కట్టమంచి రామలింగారెడ్డిగారి "ముసలమ్మ మరణము." రచించి యీ ప్రక్రియకు పుష్టిని చేకూర్చినారు. పాతివ్రత్యమున కీ దేశము ప్రఖ్యాతి వహించినది. పాతివ్రత్యము గూర్చి యీ దేశమున నే స్త్రీకిని ప్రబోధముచేయ నవసరములేదు. శ్రీ ముదివర్తి కొండమాచార్యులు 'నారాయణమ్మ' యను ప్రబంధము పాతివ్రత్య మాహాత్మ్యము నెలుగెత్తి చాటు చున్నది.

శ్రీ కొండమాచార్యులు కరుణరసభరితమగు నీ గాథను నడిపించుటలో మిక్కిలి సామర్థ్యమును వెలువరించినారు. వారు కరుణరస నిర్వహణమునందు దువ్వూరి, కట్టమంచి వారల కేమాత్రమును తీసిపోయెడివారు కారు. కాని, వస్తు నిర్వహణమునందు గమనింపవలసిన యంశ మొకటున్నది. దువ్వూరి, కట్టమంచివారలు రచించిన కావ్యములలో నాయిక ఆత్మత్యాగ మొనరించినది. పతి మరణమును భరింపలేక కాదు. లోకమునకు వాటిల్లిన ప్రమాదమునకు తా మాహుతియై లోకకళ్యాణ మొనరించుటకు.

ప్రబంధ మనగానే శృంగారరసము అంగిరస మగుట సహజవిషయము. ఆధునిక కాలమున అనగా ఇరువదియవ శతాబ్దమున నిందుకు భిన్నముగా కరుణరస ప్రధానముగా గూడ ప్రబంధములు రచించుట జరిగినది. నారాయణమ్మ యను నీ జాతీయ ప్రబంధ మీ జాతి కావ్యములలో మేల్తరము.

ప్రబంధమునకు తుష్టిఁ బుష్టిఁ జేకూర్చు వర్ణన లిందు సమృద్ధి. "కొండొకచోఁ జమురు నష్టి" వొనగూర్చు వర్ణనములు మాత్ర మత్యల్పము. గూడూరు పుర వర్ణనమునందు,

"వేయి కన్నులు విరియించి వేడ్క గనఁగ
చెవుల నొగ్గుచుఁ జెంతల జేరి వినఁగ
నాకమున నుండి గూడూరు నగరమునకు
రావలయు గాదె వేల్పుల రాయుడైన"

యని వర్ణించిరి. ఈ వర్ణనలయం దప్పటప్పట నేటి పోకడలో విచిత్రముగా తోచును. సీసపద్య రచన కవికి నల్లేరుపై బండి నడక. మంజరీ ద్విపద చదివిన వెంటనే కవి మిక్కిలి ప్రతిభావంతు డని తెలియగలదు. మొదటి ద్విపద ముగియుగానే కవిమణి లౌడునో" యనెడు సంబోధన గడుసరిదనమును వెల్లడించు చున్నది. "తెలిమల్లె తేనియలు, ఇమ్మల్లపుట్ట, సగ్గిన ముగ్గిన, జోబిళ్ల" మొదలగు పద ప్రయోగములు కవికి తెలుగు భాషపై గల మక్కువను జాటుచున్నవి. " కట్టా యెట్టి యవస్థ వచ్చె నిపుడీ కళ్యాణికంచు" అను పద్యము కట్టమంచి

వారి "కట్టా లక్కుటికంబులేక" యను పద్యమునుం దలపించుచున్నది.

"నమ్మేగన్న తల్లివో నారాయణమ్మ !
నా కల్పవల్లివో నారాయణమ్మ
నా కంటిపాపవో నారాయణమ్మ !
నా యింటి దివ్వెవో నారాయణమ్మ !"

యనెడు మంజరీ ద్విపద కావ్యమునకు మకుటాయమానము. శ్రీ పైడిరాజుగారి 'శ్రీ నారాయణమ్మ' చిత్రము చూడ చక్కనిది.

హిరణ్యహృదయము

(గ్రంథకర్త : శ్రీరావినూతల శ్రీపాదరావు. 200 పేజీలు. వెల : ఒక రూపాయి. ప్రాప్తిస్థానము : ఆంధ్ర బుక్‌హౌస్, సుల్తాన్ బజార్, హైదరాబాదు.)

పదేండ్లు శ్రమించి వ్రాసిన చిన్న కావ్య మిది. ఆంధ్ర కవుల ప్రశస్తియే యీ కావ్యమున గమనింపదగినది.

ప్రాచీన కాలమున అభ్యుదయ కవియగు పోతన భాగవతమును తనకోసమే వ్రాసికొంటిననియు, అందు ప్రహ్లాదాది చరిత్రలందు భగవదవతారము ఆత్మ సాక్షాత్కారమే కాని, వేఱుకాదని వివరించుట కావ్యమునందలి ఇతివృత్తము.

పూర్వ హృదయము, ఉత్తర హృదయమని కావ్యము రెండు భాగములుగా విభజింపబడినది.

"ఓణి సవరించి నెమ్మది రాణి యంత
జీవితేశుఁ బ్రబోధితుఁ జేయ బలికె"

అని వ్రాయుటలో సరస్వతీదేవిని వర్ణించుటయందలి యౌచిత్యమున కించుక భంగము కలిగిన దనిపించును.

సాహిత్యమున వివాదాస్పద స్థానము గలిగినట్టి నాచన సోమునికి 'సర్వజ్ఞ' పట్ట మీయుట గమనింపదగినది. "ఎడనీ పిచ్చి" యను ప్రయోగముల కల్పనలో జాతీయములు వాడినట్లుండినను గ్రామ్య ప్రతిపత్తి పౌరాణిక పాత్రలయందు అసంగతము.

కావ్యాంతమున కవుల ప్రశస్తి చేయబడినది. ఈ సందర్భమున జాషువా కవి చెప్పిన,

"అంద రందరు మహనీయులని తలంచి
ఒక నమస్కార మొనరించి యూరకుంటి."

అను వాక్యములు గమనింపదగినది.

హిరణ్య హృదయమునందు హిరణ్యకశిపున కేమాత్రము ప్రాముఖ్యము లేదు. కవుల ప్రశస్తి మాత్రమే యెన్నదగినది.

రంజని

(రచనల సంపుటి. ఎ. జీ. ఆఫీసు సాహితీ సమితి ప్రచురణ. 70 పేజీలు. వెల లేదు.)

ఈ దశాబ్దంలో పుస్తక ప్రచురణ, రచనలు సామాన్యులకు అందుబాటులోనికి వస్తున్నవి. ఎదుగురు తెలుగు ప్రజలు కూడివచోట సాహిత్య సౌరభాలు వెల్లివిరియటం హర్షింపదగినదే. ప్రతి 'ఆఫీసు' లోను ఇటువంటి సాహితీసమితులుండటం కోరదగినది. ఈ సంకల్పంలో రచనలు చేసిన వారందరిని రచయిత లనటం అతిశయోక్తి. ఐనా వారి ఉత్సాహం మెచ్చదగినది.

ఈ రచనలలో మనస్సును కదిలించే రచన ఒకటైనా లేదంటే వివిధమైన అపోహకూ తావుండదనుకుంటాము. ఈ కదంబంలో వాసన గలిగిన పువ్వులు కనుపించవు. ఈ రచనలలో కొన్నింటిని ఆకాశవాణి ప్రసారం చేసిందంటే ఆశ్చర్యం వేస్తుంది. ఈ సంకలనం మాటెలా ఉన్నా శ్రీ ఇనుకపల్లి దక్షిణామూర్తి, శ్రీ తల్లాప్రగడ భద్రిరాజు వంటి వారు పూనుకొని రచనాస్థాయిని పెంపొందించి ముమ్ముందు వారి సాహితీ సమితి ద్వారా ఉత్తమ సంకలనాలు వెలువరించగలరని ఆశింపవచ్చును.

—రామమోహన రాయ్.

దిగంతాలకు

(నవల. రచన : శ్రీ నందూరి విఠల్. ప్రచురణ : ఎం. శేషాచలం అండ్ కంపెనీ. పుటలు : 204. మూల్యం : రు. 2—50)

సమాజంలో నేటి పరిస్థితుల్ని, నాగరిక జీవనాన్ని ప్రతిబింబింపజేసే ప్రయత్నంలో ఈమధ్య తెలుగులో వచ్చిన నవలలు ప్రేమ శైథిల్యాన్ని, వివాహ వ్యవస్థ విచ్ఛిత్తిని ప్రధానాంశంగా చిత్రిస్తున్నాయి. ఈ ధోరణికి వరవడి పెట్టిన నవలలు 'చివరకు మిగిలేది', 'మెఱుపుల మరకలు' అనటంలో సందేహంలేదు. కాని ఆ రెండు నవలలకూ, గడచిన ఏడాదిలో ఆ ధోరణిలో వచ్చిన కొన్ని క్రొత్త నవలలకూ ఒక ముఖ్యమైన భేదం కనిపిస్తుంది. వ్యక్తి ప్రత్యేకతనూ, వ్యక్తి ధర్మాన్ని నిరూపిస్తూ, శిథిలమౌతున్న వ్యవస్థనూ మారుతున్న సమాజాన్ని చిత్రించటం—అంటే పైకి అవ్యవస్థగా కనిపించే జీవన ధోరణుల్లో కూడా సానుభూతితో చూస్తే, అర్థం చేసుకుంటే, వ్యక్తిగతమైన ఆత్మాన్వేషణా, ధర్మసాధనా అనివార్యంగానే ఉన్నాయని చూపించటం—బుచ్చిబాబు, గోపీచంద్ వ్రాసిన నవలల విశిష్టత. వ్యవస్థ మారుతున్న కల్లోల పరిస్థితిలో కూడా వ్యక్తిపట్ల, మానవునిపట్ల విశ్వాసం అందులో వ్యక్తమౌతుంది. అంతేకాదు, యాంత్రికమైన ధోరణిలో ఆలోచనారహితంగా, మూగగా సామాజికశక్తులకు లోబడి జీవించటంకంటె స్వధర్మాన్ని చేపట్టి వ్యక్తి ఆచరణ ద్వారా, అనుభూతిద్వారా, చేసే అన్వేషణలోనే, నేటి పరిస్థితుల్లో, జీవితగమ్యం చేరుకోవటానికి వీలౌతుందని సూచించబడింది. అందువల్లే వ్యక్తిధర్మం అనే ప్రధానమైన విలువతో జీవితాన్ని పరిక్రొత్తగా మనకు వ్యాఖ్యానించే సాహిత్యంగా ఆ నవలల్ని పరిగణించటానికి వీలవుతున్నది. కాని, ఈమధ్య వచ్చిన, వస్తున్న నవలల్లో సమాజంలోని అవ్యవస్థ, వివాహ విచ్ఛిత్తి, వ్యక్తిధర్మంతో, వ్యక్తి తాలూకు అన్వేషణతో కాదు, వ్యక్తిలో సంకల్పశూన్యతతో, అయోమయత్వంతో, ఆశయరాహిత్యంతో ముడిపెట్టబడి ఉంటున్నాయి! వ్యక్తి విశిష్టత కాదు, వ్యక్తిత్వ

శూన్యత ఇందులో ప్రధానంగా కనిపిస్తోంది. ఫలితం జీవితానికి అర్థంలేదు, జీవితంకంటె మరణం మేలు, జీవితంలో ఎంత దూరం వెళ్ళినా, ఏంచేసినా సాధించేది ఏమీలేదు. అనే నిస్పృహా అయోమయత్వం! ఇది ఒక ప్రత్యేక దృక్పథం ఎందుకు కాకూడదు? అని ప్రశ్నిస్తే ఈ రచయితల్లో ప్రతిభ లోపించటమే కారణం తప్ప, వీళ్ళకు అటువంటి ప్రత్యేక దృక్పథం అంటూ ఏమీ లేదని కూడా ఈ నవలలు వ్యక్తంచేస్తున్నాయి మరి!

జీవితంకంటె మరణం మేలు, జీవితంలో సాధించేది ఏమీలేదు అనే దృక్పథం సాహిత్యంలో క్రొత్తది కాదు. థామస్ హార్డీ నవలలు ఒక ఉదాహరణ. కాని, ఆ నవలల్లో విస్పష్టమైన అర్థస్ఫూర్తి దేనివల్ల కలుగుతోంది? అజ్ఞాతశక్తి, విధివిలాసం అనే ఒక ప్రతిపాదనవల్ల ఆ అర్థస్ఫూర్తి కలుగుతోంది. అలాగే వ్యవస్థ, దాని అనుల్లంఘనీయమైన శక్తులూ వ్యక్తి ఆశల్నీ ఆశయాల్నీ భగ్నం చేస్తున్నాయి—అనే ప్రతిపాదన ద్వారా మరొక తరహా అర్థస్ఫూర్తి కలిగించవచ్చు. కాని సమాజం మారుతున్న నేటి పరిస్థితుల్లో అలా ప్రతిపాదించటానికి 'వ్యవస్థ' కటువంటి స్వరూపమూ, శక్తీ లేదు! పోతే, 'అజ్ఞాతశక్తి' మీద అసలే విశ్వాసంలేదని నేటి వాతావరణంలో, ఆ ప్రతిపాదనా చెయ్యబడటంలేదు! ఇక వీళ్ళు చిత్రించే వ్యక్తి వైఫల్యానికి కారణం ఏమిటి? పోనీ యిది యుగసంధి, అందువల్ల వ్యక్తి పాత కొత్తల మధ్య యిటూ అటూ తేలలేక ఈ వైఫల్యానికి, నిస్పృహకు, లోనౌతున్నాడు. అనే విషయాని మాత్రమే చెప్పదలచుకున్నారనుకుంటే ఆ వ్యక్తిలో ఒక చిత్తప్రవృత్తి, మనస్తత్వం, దాని పోకడ అంటూ స్పష్టం చెయ్యాలి కదా! అదేమీ లేకుండా నేటి సమాజాన్నీ, జీవన ధోరణినీ చిత్రిస్తున్నామంటూ కొన్ని సంఘటనల్ని గూర్చి వ్రాసే నవలలు చిన్నపిల్లలు గీసే పిచ్చిగీతల్లాగే ఉంటాయి!

'దిగంతాలకు' అనే పెద్ద పేరు పెట్టుకున్న ఈ నవల అలాగే ఉంది. ఇందులో కథానాయిక జయలక్ష్మి ఒక పెద్ద పిచ్చిగీత. ఆ గీతచుట్టూ అడ్డదిడ్డమైన గీతలు మిగతా పాత్రలు. సత్యమూర్తి అనే 'బ్రతకనేర్చినవాడి' పాత్రలో లీలగా ఒక స్వరూపం గోచరిస్తుంది. అదైనా వీళ్ళల్లో ప్రతిబింబంలా అప్పుడప్పుడూ చెదరిపోతూనే ఉంది! కథావస్తువులో, సంఘటనల్లో వాస్తవికత లేదు అనటానికి వీల్లేదు. కాని. కథాకథనంలో, పాత్రోన్మీలనంలో, జీవితాన్ని గూర్చి ఏవో కొన్ని 'వూహలు' కాకుండా ఒక దృక్పథాన్ని ఏర్పరచుకోలేకపోవటంలో, రచయిత వైఫల్యం కనిపిస్తోంది—ముఖ్యంగా కథ చెప్పటంలో, పాత్రపోషణలో కనీసం ఈ రెండూ చేతనైతే తప్ప నవల వ్రాయబూనుకోవటం పొరపాటే! ఈ శైలి చూడండి: "సృష్టికి ప్రాణమైన యౌవనం ఘనీభవించి, సౌందర్యాన్ని కప్పుకుంటే జయలక్ష్మి శరీరమైంది. ఇంతకాలం మండుతున్న యౌవనాన్ని కోర్కెలతో పీటముడి పెట్టి గుప్తంగా దాచుకుంది ఆ జవ్వని. రోజు రోజుకూ శరీరం తనమీద పగతీర్చుకుంటూ హింసిస్తున్నది. ఆ పైశాచిక ఆనందంలో, అది క్షణక్షణానికీ మత్తెక్కి, కఠినమై, క్రూరనాగులాగ బుసలు కొడుతూంది .... ఆకాశం పగిలేలా ఏడవాలనిపిస్తుంది. భూమి బ్రద్దలయ్యేలా నవ్వాలనిపిస్తుంది. ఆద్యంతాలు లేని సృష్టి రహస్యాన్ని దాచుకున్న ఆకలి అడవిమంటలా ఆమెను దహించివేస్తోంది. అలాగే ఉద్రేకాల ఉరవడిలో ఉక్కిరిబిక్కిరియై, అచేతనయై, నిద్రాదేవిని కౌగలించుకుంది. జయలక్ష్మి. కన్నీటితో పునీతమైన దివ్యకుసుమం జయలక్ష్మి!" జయలక్ష్మి యౌవన సహజమైన కోర్కెలతో సతమతమౌతోంది అనటానికి యింత హంగామా! పోతే ఆ చివరి వాక్యానికి అర్థమేమిటో మరి! 5 వ అధ్యాయంలో ఇంత ఉద్రిక్త పరిస్థితిలో ఉన్న కథానాయికకు, పాపం, 19 వ అధ్యాయం దాకా పెళ్ళికాదు! పెళ్ళి అయినా ఆమె బావుకున్నది ఏమీలేదు! "వైవాహిక జీవితంలో ఈనాడు దిగంతాలకు చిలవలు పలవలుగా ప్రాకే అనేక అయోమయ పరిస్థితులనూ స్త్రీల అగాధ మనస్తత్వాలనూ" ఈ నవల చిత్రిస్తోందని అట్టమీద ప్రచురణకర్తల ప్రకటన! అయోమయ పరిస్థితులను వ్యాఖ్యానించలేని ఈ రచనలో పరిస్థితుల అయోమయత్వం కంటె రచయిత అయోమయత్వమే ఎక్కువగా కనిపిస్తోంది.

నయనతార

(కథలసంపుటి. రచయిత: శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య, ప్రతులకు: విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ—2, పు:లు 174. మూల్యం: రు. 3.)

ఇదివరకు పత్రికల్లో ప్రచురించబడిన కథలే యిప్పుడు ఒక సంపుటి రూపంలో వచ్చాయి—నయనతార, పేరయ్యబావి, కోశాధిపతి, భయం, మిస్. భారతి బి. ఏ., ఎగిరిపోయిన చిలక, నలుపూ—తెలుపూ, మళ్ళీ మొదలైన కథ, వన్‌వే ట్రాఫిక్. కథ చెప్పటంలో, సంఘటనల్ని సహజంగా చిత్రించటంలో రచయిత మంచి సమర్థుడు. ఈ కథల్లో హృదయాన్ని విశాల పరచి, తోటి మానవులపట్ల సానుభూతిని పెంపొందించే గుణమే ఎక్కువగా ఉంది. చమత్కారం ద్వారా, శిల్పం ద్వారా లేక సిద్ధాంతాల ద్వారా మేధకు పని కల్పించే కథలు కావివి. నిత్య జీవితాన్ని మామూలు కళ్ళతో చూస్తున్నట్లే ఉంటూ హృదయంలో నూతన చైతన్యాన్ని అనుభవిస్తాడు సహృదయుడైన పాఠకుడు. వృద్ధులు, పసిపిల్లలు, కష్టజీవులు, అంధులైన బిచ్చగాళ్ళు, ఉస్సురనే మధ్యతరగతివాళ్లూ ఈ కథల్లో కనిపిస్తారు. వాళ్ళ ఆలోచనలతో జీవితాలతో మనకు పరిచయం కల్పిస్తాడు రచయిత, అంతే! పాఠకుణ్ణి ఏదో వింత చూపించి చకితుణ్ణి చేయాలనీ, నిస్పృహతో విషాదంతో అతని హృదయం బ్రద్దలుకొట్టాలనీ ఈ రచయిత ఉద్దేశంకాదు. ఉదాహరణకు 'కోశాధిపతి' కథలో ఆ గుమాస్తా రెండు లక్షల డబ్బు ఫ్యాక్టరీలో అందరికీ బట్వాడా చేస్తున్న విషయం రచయిత విపులంగా చెప్పుకుపోతుంటే, ఇందులో డబ్బు ఎవరైనా దొంగిలిస్తారో, తనే అవసరాలకు తీసుకుంటాడో, ఈ గుమాస్తా ఎన్ని కష్టాలకు గురి అవుతాడో, అతని కుటుంబం ఏంగతి పట్టుతుందో అనే ఉత్కంఠ కలుగుతుంది—మామూలు కథల ధోరణినిబట్టి. కాని తీరా చూస్తే, అలాంటిదేమీ జరగదు! ఇంటికి ఆలస్యంగా, అలసిపోయి వచ్చి తృప్తిగా నా చేతిద్వారా రెండు లక్షల డబ్బు ఎంతోమందికి ఇవ్వబడింది కదా, నేను

'కోశాధిపతిని' అనుకునే ఆ గుమాస్తా అమాయకత్వాన్నీ, దాని సౌందర్యాన్నీ మనకు గోచరం చెయ్యటమే రచయిత ఉద్దేశ్యం! 'ఎగిరిపోయిన సిలక' కథలో గంగి మరణానికి కారణభూతుడైన గోపాలం వంటి పాత్రను కూడా దోషిగా దుష్టునిగా చిత్రించలేదు రచయిత. గోపాలం ప్రవర్తన సామాన్యంగా సహజంగా ఉంది. 'వలుపూ—తెలుపూ' కథలో రంగు అగ్గిపుల్లల పెట్టె దొంగిలించి పరుగెత్తుతున్న బీదబాలుడు కన్నడి ప్రవర్తనలో ఎంత సహజత్వమూ అమాయకత్వమూ ఉన్నదో, వాణ్ణి పట్టుకొని ఆ అగ్గిపెట్టె లాక్కుని, 'దొంగ' అంటూ వాణ్ణి దూషించి, ఎదురైన ముసలాయన తోక్యంవల్ల కన్నణ్ణి వదలిపెట్టి కూడా సణుగుతూ వెళ్లిపోయే ధనవంతుల యింటి నౌకరు ప్రవర్తనలోనూ అంతే సహజత్వమూ, మానవత్వమూ వ్యక్తం అవుతోంది! మిగిలింది జాలీ, ప్రేమా! రచయిత తన హృదయంలోని జాలీ, ప్రేమా ఈ కథల ద్వారా యితరులతో పంచుకోగలుగుతున్నాడు అనటంలో అతిశయోక్తి లేదు.

—ఆర్. ఎస్.

సమగ్ర ఆంధ్రసాహిత్యం

మొదటి సంపుటం—చాళుక్య యుగం. పుటలు : 254, మూల్యం : 5—00. రెండవ సంపుటం—కాకతీయ యుగం. పుటలు : 270. వెల : 5—00. మూడవ సంపుటం—పద్మనాయక యుగం. పుటలు : 270. వెల : 5—00.

"పన్నెండు సంపుటాల్లో సమగ్రాంధ్ర సాహిత్యం ప్రజానీకానికి పరిచయం చేద్దామనే సంకల్పంతో" శ్రీ ఆరుద్ర ఈ సాహిత్య చరిత్ర రచనకు పూనుకున్నారు. మొదటి సంపుటం చాళుక్య యుగంలో తెలుగుభాష పుట్టుపూర్వాలు తెలిపే ఆదిమ యుగం, చాళుక్య యుగం, నన్నయభట్టు, పావులూరి మల్లన, నన్నెచోడుడు, వేములవాడ భీమకవి, మల్లియరేచన, మల్లికార్జున పండితారాధ్యుడు—అనే ఎనిమిది ప్రకరణా లున్నాయి. దీనికి శ్రీ వేటూరి శివరామశాస్త్రిగారు పీఠిక వ్రాశారు.

రెండవ సంపుటం కాకతీయ యుగంలో పేరు తెలియని కొందరు కవులను తెలిపే కాకతీయ యుగం, మంత్రి భాస్కరుడు, భాస్కరునికేతన, యథావాక్కుల అన్నమయ్య, క్షేమేంద్రుడు, తిక్కన సోమయాజి, ఆంధ్రభోజుడు, అప్పన మంత్రి, శివదేవయ్య, మూలఘటిక కేతన, బద్దెన, కమలనాభామాత్యుడు—బయ్యెన, మంచన, పాల్కురికి సోమనాథుడు, చక్రపాణి రంగనాథుడు, మారన, అథర్వణాచార్యుడు—అనే పదిహేడు ప్రకరణా లున్నాయి. దీనికి శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారు పీఠిక వ్రాశారు.

మూడవ సంపుటం పద్మనాయక యుగంలో సర్వజ్ఞ సింగ భూపాలుడు, విశ్వేశ్వరకవి, జాయప, పశుపతి పండితుడు, నాగనాథుడు, బొమ్మకంటి అప్పయామాత్యుడు, శాకల్య మల్లిభట్టు, శాకల్య అయ్యలార్యుడు మొదలయినవారిని తెలిపే పద్మనాయక యుగం, భాస్కర రామాయణకవులు, శరభాంకుడు, కృష్ణమాచార్యుడు, రావిపాటి తిప్పన్న, పెద్దయామాత్యుడు, విమ్మపూడి అమరేశ్వరుడు, ఎఱ్ఱాప్రెగ్గడ, నాచన సోముడు, శ్రీ గిరికవి, గోన బుద్ధ రాజు, కాచ భూపతి— విట్ఠలరాజు—అనే ప్రకరణా లున్నాయి. ఈ సంపుటానికి శ్రీ శివశంకరస్వామి పీఠిక వ్రాశారు. "రచయిత హృదయం ఏదో గమనించడం ముఖ్యం. ఆయన దానిని ఏవిధముగా నిర్వహించినాడు, అది సమంజసము ఉన్నదా లేదా అని సమీక్ష చేయడం సరసంగా ఉంటుంది. ఇందులో అవి లేవు; ఇవిలేవు; ఇవి ఎక్కువగా ఉన్నవి, ఇవి న్యూనముగా ఉన్నవి— అని విమర్శించడం న్యాయుము కాదు. ఈ విధానమునుబట్టి ఈ సంపుటిని పరిశీలిస్తే రచయిత తలపెట్టిన లక్ష్యం నెరవేరినట్టు తోస్తుంది" అని శివశంకరస్వామి పీఠికలో వ్రాశారు. మొదటి సంపుటానికి శ్రీ పి. వి. రాజమన్నారుగారు వ్రాసిన ప్రవేశికే తక్కిన సంపుటాలకూ అనువర్తించింది.

"వేయి సంవత్సరాలపాటు వేవిధాలుగా పూచి, కాచి, సరిసరి పరిమళించిన నవరసాలనూ నవనవమైన నవకంతో, నేవళంతో తేనెవాక లూరించిన తెలుగు సాహిత్యాన్ని సార్వజనికోపకారకంగా సర్వులకూ సులభావగాహంగా పన్నెండు సంపుటాలలోకి ఇమిడికగా కుదించి తెలుగు మహాజనులకు అందింపబూనుకొన్నాము" అంటున్నారు ప్రచురణకర్తలు ఎం. శేషాచలం అండ్ కంపెనీ (మద్రాసు, మచిలీపట్నం, సికింద్రాబాద్) వారు. (ఈ మూడు సంపుటాల సమగ్ర విమర్శ వచ్చే భారతి సంచికలో ప్రచురితమవుతుంది.)

అభాగిని

పరకట్న పిశాచి కారణంగా వృద్ధుని పాలబడిన ఒక సుందర యువతి విషాదగాథ చిత్రించే చిన్న కావ్యమిది. రచయిత : శ్రీ చౌడూరి గోపాలరావు. వెల : 0—75. ప్రాప్తిస్థానం : సరోజినీ ప్రచురణలు, మహబూబ్‌నగర్.

గొడగూచి

పాల్కురికి సోమనాథుని పుణ్యాన మనకు పురాణకాలపు ప్రహ్లాదుని తలపించే గొడగూచి కథ తెలిసింది. శ్రీ వేదాంతం కాశీనాథం బసవపురాణంలోని అగొడగూచి కథ ఆధారంగా ఈచిన్న కావ్యం అలతి యలతి మాటలతో ముచ్చటగా రచించారు. వెల రు. 1—25. ప్రాప్తిస్థానం : సరసకవన సదనము, వేములవాడ, కరీంనగర్ జిల్లా.

జాతీయ ప్రగతి గీతములు

రచయిత : శ్రీ ముదిగొండ శంకరశాస్త్రి. పుటలు : 24. వెల : 0—50. ప్రాప్తిస్థానం : రచయిత, 8/1007, జయప్రకాశ్‌నారాయన్‌రోడ్, వరంగల్.

ఉషోబాల

గేయ సంపుటి. పుటలు : 16; వెల: 0—25 పైసలు. నవ్యసాహిత్యసమితి ప్రచురణ, ఊటుకూరు, వయా కొడవలూరు, నెల్లూరుజిల్లా.

రమణి

స్నేహపీఠం ఎనిమిదవ కుసుమం. చిన్న నవల. రచయిత : శ్రీ కాట్రగడ్డ లక్ష్మీనరసింహారావు. పుటలు : 40; వెల : రూపాయి. ప్రాప్తిస్థానం : స్నేహపీఠం, అమీనాపేట, ఏలూరు.

కావ్య సుమాంగి

ఖండకావ్య సంపుటి. రచయిత : శ్రీ ఆవుల పురుషోత్తం. పుటలు : 28; వెల : ఒక రూపాయి. ప్రాప్తిస్థానం : శ్రీ ఆవుల పురుషోత్తం, ఉపాధ్యాయుడు, మామిళ్లగూడెంవీధి, ఖమ్మం.

బలి

శ్రీ రవీంద్రుని వంగ నాటికకు అనువాదం. అనువాదకుడు : శ్రీ ఎస్. ఆర్. కె. శర్మ. పుటలు : 48; వెల:రూపాయి. ప్రాప్తిస్థానం : ది ఓరియంటల్ పవర్ ప్రెస్, తెనాలి.

లవలీ దళాలు

ఖండ కావ్య సంపుటి. రచయిత : శ్రీ కాళూరి వేంకట నరసింగరావు. పుటలు : 98; వెల : 2—00. ప్రాప్తిస్థానం: శ్రీ కాళూరి వేంకట నరసింగరావు, ఎడ్వకేట్, జానకీప్రసాదం, డాబా గార్డెన్స్, విశాఖపట్టణం—4.

అన్వేషణ

ఖండకావ్య సంపుటి. రచయిత : శ్రీ కాళూరి వేంకట నరసింగరావు. పుటలు : 82; వెల : 1—50. ప్రాప్తిస్థానం : శ్రీ కాళూరి వేంకట నరసింగరావు, అడ్వొకేట్, జానకీప్రసాదం, డాబా గార్డెన్స్, విశాఖపట్టణం—4.

విద్యాతపస్వి

ఇది పుట్టినది మొదలు గిట్టేవరకు విద్యా సేవకే జీవితం అంకితం చేసిన అమెరికా మహనీయుడు శ్రీ బూకర్ టి. వాషింగ్టన్ జీవిత చరిత్ర. రచయిత : శ్రీ ఎం. వి. రాజగోపాలకృష్ణస్వామి పుటలు : 90. వెల : 1—50. ప్రాప్తిస్థానం : శ్రీ గోదా గ్రంథమాల, శ్రీమన్నారాయణపురం, ఉల్లిపాలెంపోస్ట్, దివి తాలూకా, కృష్ణాజిల్లా.

సత్కథా మంజరి

చతుర్థ సంపుటం రచయిత : శ్రీ పురాణపండ రాధాకృష్ణమూర్తి. పుటలు : 104. మూల్యం : ఒక రూపాయి. ప్రాప్తిస్థానం : అధ్యాత్మ ప్రచార సంఘము, విక్రమహాలు, రాజమండ్రి. దీనిలో సంభవామి యుగే యుగే, సత్యాన్న ప్రమదితవ్యం, ఘనుడెవడు, అష్టావక్ర మహర్షి, గర్వభంగం, రామరాజ్య మహిమ, ధర్మరాజ్యము, ఉపదేశము, సత్సాంగత్య మహిమ అనే కథలున్నాయి.

జాతీయ ప్రగతిగీతములు

గేయ సంపుటం. రచయిత : శ్రీ ముదిగొండ శంకర శాస్త్రి. పుటలు : 24; వెల : 0—50. ప్రాప్తిస్థానం : శ్రీ ముదిగొండ శంకరశాస్త్రి, 8/7, జయప్రకాశ్‌నారాయణరోడ్డు, వరంగల్.

శ్రీల శ్రీ వల్లిమలై స్వామిగళ్

శ్రీ డి. ఎం. పరులేకర్, శ్రీ ఎస్. శ్రీనివాసన్ (బొంబాయి) శ్రీ వల్లిమలై స్వామిగళ్ ను గురించి ఇంగ్లీషులో వ్రాసిన రెండువ్యాసాలు, ఆఖరున రోమన్ దేవనాగరి లిపులలో స్వామిగళ్ అష్టోత్తరశతనామావళి ఉన్నాయి. పుటలు: 40. వెల : తెలియదు. ప్రాప్తిస్థానం: శ్రీల శ్రీ వల్లిమలై స్వామిగళ్ జ్ఞాన సభా, రేవతి, ఫస్ట్ రోడ్, చెంబూర్, బొంబాయి—71.

గులాబీ బాలలు

పిల్లల నవల. రచయిత: శ్రీ తంగెళ్ల పాండురంగశర్మ. పుటలు: 68. వెల: 1—50. ప్రాప్తిస్థానం: శర్మ పబ్లికేషన్స్, 10—70, పార్క్ రోడ్, విజయవాడ—1

మధుశాల

ఉమర్‌ఖయ్యాము రుబాయతులకు అనువాదము సరళ పద్యకావ్యం. రచయిత: శ్రీ తాడూరి గోపాలరావు. పుటలు: 40. వెల: 0—75. ప్రాప్తిస్థానం: సరోజినీ ప్రచురణలు, మహబూబ్‌నగర్.

మైథిలి

రామాయణ అయోధ్యాకాండము, పద్యకావ్యము. రచయిత: శ్రీ చల్లా లక్ష్మీనారాయణశాస్త్రి. పుటలు : డెమ్మీ 60. వెల: 1 రూపాయి. ప్రాప్తిస్థానం: లక్ష్మీనారాయణ గ్రంథమాల, 24, ఏ. తాండవరాయగ్రామణివీధి, తండియార్పేట, మద్రాసు—21.

వైదిక దినచర్య

శ్రీమద్దయానందమహర్షి ప్రదర్శిత సంధ్యాగ్నిహోత్రాదులు. సంకలనకర్త: పండిత గోపదేవశాస్త్రి, దార్శనిక్. పుటలు: 98. వెల: 0—50. ప్రాప్తిస్థానం : వైదికధర్మ ప్రచారసమితి, కర్నూలు—ఆంధ్రప్రదేశ్.

శివజ్ఞానచింతామణి

రచయిత : శ్రీ ముదిగొండ శంకరశాస్త్రి. 30 పేజీలు. ద్వాదశాచార్యాదిస్తుతి, శివస్తుతి, శివమహిమ, శివజ్ఞానము, శివక్షేత్రములు, అని విడి విడిగా విభజించి చక్కని శైలిలో పద్యములు రచింపబడినవి. వెల: 75 పైసలు. ప్రతులకు: శ్రీ ముదిగొండ శంకరశాస్త్రి, నెం. 80 1007, జయప్రకాశ్ నారాయణరోడ్, వరంగల్.

విషాదాంతం

సాంఘిక నాటిక : రచన : శ్రీ రాంబాబు, 21 పేజీలలో క్లుప్తంగా నాల్గే నాల్గు పాత్రలతో సులభమైన సంభాషణలతో ఒకే ఒక సెటుతో ప్రదర్శించుటకు బాగుగా ఉన్నది. వెల: 0—75 పైసలు. ప్రతులకు : శ్రీ రాంబాబు, ఆయుర్వేద వైద్యవిద్వాన్, కళింగపట్నం.

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at The Andhra Patrika Press 6 & 7, Thambu Chetty Street, Madras-1
Editor : S. Sambhu Prasad.